# బాలల
# పోతన భాగవతము

రచన

**డా. అద్దంకి శ్రీనివాస్**

ప్రకాశకులు

చల్లా సాంబిరెడ్డి
B.A., LL.B.

అధ్యక్షులు

శ్రీపావని సేవాసమితి

హైదరాబాదు

# బాలల పోతన భాగవతము

రచన : డా. అద్దంకి శ్రీనివాస్

ఇమెయిల్ : draddanki@gmail.com

ప్రథమ ముద్రణ : 2018

ప్రతులు : 1000

హక్కులు : ప్రకాశకులవి

**ప్రకాశకులు**

**అధ్యక్షులు : చల్లా సాంబిరెడ్డి**
**శ్రీపావని సేవా సమితి**
ఇం.నెం. : 3-6-499ఎ,
రోడ్ నెం. 7, హిమాయత్‌నగర్
హైదరాబాదు - 500 029.
sripavanisevasamithi@gmail.com

**ముద్రణ :**

**వై.వి. రెడ్డి ప్రింటర్స్ & బైండర్స్,**

దిల్‌సుఖ్‌నగర్, హైదరాబాద్ - 500 036.

సెల్ : 9391015317

yvr.postpresssolutions@gmail.com

వెల : అమూల్యం

# ముందుమాట

పిల్లలూ! మీకు ఒక సంగతి చెబుతాను. జాగ్రత్తగా వినండి. 'భగవంతుడు' అనే మాట మీరు వినే ఉంటారు కదా! దేవుడినే భగవంతుడు అంటారు. 'అన్ని శక్తులూ, సంపదలూ కలవాడు' అని ఈ మాటకు అర్థం. ఆ భగవంతుడికి సంబంధించిన కథ భాగవతం. ఇది ఒక పురాణం.

భగవంతుడైన శ్రీమహావిష్ణువు పాలసముద్రం మధ్యలో ఉంటాడు. ఆదిశేషుడు అనే ఒక పాముపై పవ్వళించి ఉంటాడు. అతడికే శ్రీహరి అనీ, శ్రీమన్నారాయణుడు అనీ, గోవిందుడు అనీ ఇలా ఎన్నో పేర్లు. అతడే అధర్మం పెరిగి ధర్మం బలహీనమైనప్పుడు ధర్మానికి బలం చేకూర్చటానికి వైకుంఠాన్ని విడిచిపెట్టి, భూలోకానికి వస్తుంటాడు. ఇలా రావడాన్నే 'అవతారం' అంటారు. ఇలాంటి అవతారాల గురించి వివరించే పురాణమే భాగవతం.

శ్రీహరి అవతారాల గురించే కాదు. ఈ సృష్టి ఎలా ప్రారంభమైంది? ఎవరెవరు ఎలా పుట్టారు? మానవుడు ఎలా పుట్టాడు? మొదలైన ఎన్నో విశేషాలను భాగవతం మనకు అందిస్తుంది.

మానవుడు ఎలా జీవించాలి? భగవంతుణ్ణి ఎలా పూజించాలి? జీవితాన్ని ఎలా సఫలంచేసుకోవాలి? మొదలైనవాటినీ వివరిస్తుంది.

మానవుడిగా పుట్టిన ప్రతి ఒక్కడూ భగవంతుడిపట్ల భక్తిని కలిగి ఉండాలి. ఆ భక్తి జ్ఞానాన్ని ఇస్తుంది. అదే శక్తిగా మారి అందరినీ సంస్కరిస్తుంది. లోకానికి మంచి చేస్తుంది. ఇలాంటి మంచి మంచి ఉపయోగాలు ఉన్న భాగవతాన్ని అందంగా, సరళసుందరంగా మీకు అందించాలని తపించిన శ్రీ పావని సేవాసమితి అధ్యక్షులు శ్రీ చల్లా సాంబిరెడ్డి తాతగారికి కృతజ్ఞతలు చెబుదాం. వారికి మనమంతా ఋణపడి ఉంటాం. ఈ పుస్తకాన్ని చదివి, ఇందులోని నీతిని పాటిస్తే వారి ఋణం కొంతైనా తీరుతుంది. మరింక ఆలస్యం ఎందుకు? వడివడిగా భాగవతంలోనికి అడుగులు వేద్దామా! రండి!

మీ

**అద్దంకి శ్రీనివాస్**

# శరణాగతి

ఉ. ఎవ్వనిచే జనించు జగ

మెవ్వనిలోపల నుండు లీనమై

యెవ్వనియందు డిందుఁ బర

మేశ్వరుఁ డెవ్వఁడు మూలకారణం

బెవ్వఁ డనాదిమధ్యలయుఁ

డెవ్వఁడు సర్వము దానయైన వాఁ

డెవ్వఁడు వాని నాత్మభవు

నీశ్వరునే శరణంబు వేఁడెదన్

– (భాగవతము 8–73)

**భావం:** ఈ జగత్తు ఎవరివల్ల జన్మిస్తోందో, ఎవరిలోపల కలసిపోయి ఉంటోందో, ఎవరిలో ఐక్యమైపోతోందో, పరమేశ్వరుడు ఎవడో, మూల కారణం ఎవడో, మొదలూ, నడుమా, తుదీ లేనివాడు ఎవడో, అంతా తానే అయినవాడు ఎవడో అటువంటి వాణ్ణి, తనంతట తానే పుట్టిన ఈశ్వరుణ్ణే నేను శరణువేడుకొంటాను.

# బాలల
# పోతన భాగవతము

## పరిచయం

భాగవతం 'పురాణ తిలకం'. ఎన్నో రచనలు చేసినప్పటికీ వేదవ్యాస మహర్షికి మనశ్శాంతి కలగలేదు. భాగవతాన్ని రచించాక అది లభించింది. ఈ పురాణాన్ని వ్యాస మహర్షి తన కుమారుడైన శుకమహర్షికి చెప్పాడు. అతడు పరీక్షిత్తుకు చెప్పాడు. ఆ తరువాత ఎందరో ఎందరికో చెప్తూ వస్తున్నారు.

చెప్పినవారికీ, విన్నవారికీ ఎంతో మేలును చేకూరుస్తుంది పవిత్రమైన ఈ భాగవత పురాణం. దీనిని తెలుగులోకి మధురంగా అనువాదం చేశాడు 'బమ్మెర పోతన' అనే మహాకవి.

తే.గీ. **చేతులారంగ శివునిఁ బూజింపఁడేని**
**నోరు నొవ్వంగ హరికీర్తి నుడువఁడేని**
**దయయు సత్యంబు లోనుగాఁ దలఁపఁడేని**
**గలుగ నేటికిఁ దల్లుల కడుపు చేటు.** (1-14)

చేతులారా శివుణ్ణి పూజించని వాడూ, నోరారా హరిని కీర్తించనివాడూ, దయ, సత్యంలాంటి గుణాలను పాటించనివాడూ జన్మించటం ఎందుకు? అటువంటివాడి పుట్టుక తల్లులకు కడుపు చేటు (నిష్ఫలం).

కం. **పలికెడిది భాగవతమఁట!**
**పలికించు విభుండు రామభద్రుండఁట! నేఁ**
**బలికిన భవహర మగునఁట!**
**పలికెద వేఱొండుగాథఁ బలుకఁగ నేలా?** (1-18)

'పలికేది భాగవతమట! పలికించేవాడు శ్రీరాముడేనట! నేను పలికితే నాకు ముక్తి లభిస్తుందట! అలాంటప్పుడు వేరే కథ నేనెందుకు చెప్పాలి? కల్పవృక్షం లాంటి ఈ భాగవతాన్ని రచించి నా జీవితాన్ని చరితార్థం చేసుకొంటాను' అని ప్రారంభించాడు బమ్మెర పోతనామాత్యుడు.

# స్కంధం - 1

## కథాప్రారంభం

**అ**దుగో నైమిశారణ్యం!

అక్కడ చెట్లన్నీ ఫలాలతో, పుష్పాలతో కళకళలాడుతూ ఉంటాయి. మహర్షులకు ఆటపట్టై అలరారే ఆ నైమిశారణ్యంలోని వింతలు అన్నీ ఇన్నీ కావు.

క్రూరజంతువులు సాధుజంతువుల్ని చంపవు. కనీసం హింసించనైనా హింసించవు. అక్కడ మహర్షుల ప్రభావం ఏమోగానీ జ్ఞానంలేని జంతువులుకూడా జాతివిరోధాన్ని మాని ఈశ్వరుణ్ణే ధ్యానం చేస్తున్నట్లు కనిపిస్తాయి.

అక్కడ మహర్షులు – ఎప్పుడూ తపస్సు చేస్తూ ఉంటారు. భగవంతుడి కథల్ని చెప్పుకొంటూ, యజ్ఞయాగాదులు నిర్వహిస్తూ, మంచిమార్గంలో దైవచింతనతో జీవిస్తూ ఉంటారు. అందుకే పరమపవిత్రమైన ఆ నైమిశారణ్యాన్ని చూడడానికి ఎక్కడెక్కడినుండో సందర్శకులు తరలివస్తూ ఉంటారు.

ఒకసారి శౌనకుడు మొదలైన మహర్షులంతా కలసి అక్కడ ఒక యాగం తలపెట్టారు. ఆ యాగం పేరు దీర్ఘసత్రం. ఇది వెయ్యి సంవత్సరాలు జరుగుతుంది. దానిని చూడటానికి జనం తండోపతండాలుగా వస్తున్నారు.

వచ్చినవారిలో 'సూతుడు' కూడా ఉన్నాడు. ఇతడు ఒక మహర్షి. నిజానికి ఇతడి అసలు పేరు ఉగ్రశ్రవసుడు. ఇతడి తండ్రి రోమహర్షణుడు. కానీ ఇతడిని అందరూ 'సూతుడు' అని పిలుస్తారు.

సూత మహర్షి గొప్ప వక్త. బాగా చదువుకున్నాడు. ఎంతో వినయం. ఎప్పుడూ శ్రీహరిని కీర్తిస్తూనే ఉంటాడు. శౌనకాది మహర్షులు సూతమహర్షిని గౌరవించి ఇలా అడుగుతున్నారు–

'సూతమహర్షీ! మా అదృష్టంకొద్దీ నువ్వు మా దగ్గరకి వచ్చావు. నీలాంటి మహానుభావుడు అందుబాటులో ఉన్నప్పుడే సందేహాలు తీర్చుకోవాలి. మాదో సందేహం. **కలియుగంలో మానవులు సోమరిపోతులు, మందమతులు. ఎంతోకాలం జీవించలేరు. భయంకరమైన రోగాలు వారిని పట్టిపీడిస్తాయి. మంచి పనులు**

**చేయరు. ఎవరికీ మనశ్శాంతి ఉండదు. ఇలాంటి కలికాలంలో అందరికీ శాంతి కలగాలంటే ప్రజలకు శ్రీహరి కథల్ని వినడం తప్ప వేరే దారిలేదు.**

శ్రీహరిని గురించిన మాటలే వాక్కుకు అలంకారం. అవే సకల పాపాలకూ గొడ్డలిపెట్టులాంటివి. అవి మనసుకు ఆనందం కలిగిస్తాయి. సముద్రాన్ని దాటాలనుకొనే వారికి మంచి నావికుడు దొరికినట్లు మాకు నువ్వు దొరికావు. కాబట్టి మాకు ఆ గోవిందుడి కథామృతాన్ని ప్రసాదించు.'

సూత మహర్షి ప్రారంభించాడు.

## శ్రీహరి అవతారాలు

'మహర్షులారా! శ్రీమన్నారాయణుడు లోకరక్షణ కోసం ఎన్నో అవతారాలు ఎత్తాడు. వాటిలో 1.కౌమార, 2.వరాహ, 3.నారద, 4.నరనారాయణ, 5.కపిల, 6. దత్తాత్రేయ, 7. యజ్ఞ, 8. ఉరుక్రమ, 9. పృథు, 10. మత్స్య, 11.కూర్మ, 12.ధన్వంతరి, 13. మోహినీ, 14. నరసింహ, 15. వామన, 16.పరశురామ, 17. వేదవ్యాస, 18. శ్రీరామ, 19. బలరామ, 20. శ్రీకృష్ణ, 21. బుద్ధావతారాలు, అనేవి ఏకవింశతి (21) అవతారాలుగా ప్రసిద్ధిని పొందాయి. అలాగే అధర్మం మితిమీరినప్పుడు శ్రీమన్నారాయణుడే 'విష్ణుయశుడు' అనే బ్రాహ్మణుడికి 'కల్కి' అనే పేరుతో జన్మిస్తాడు.

నిజానికి ఆ దేవదేవుడికి అసలు పుట్టుక అన్నదే ఉండదు. ఏ కర్మలూ అంటుకోవు. తన విలాసం కోసమే ఈ లోకాల్ని సృష్టిస్తాడు. పరిపాలిస్తాడు. తనలోనే కలుపుకుంటాడు. భాగవతం అంటే ఈ భగవానుడి లీలలే. లోకకల్యాణం కోసం వ్యాసుడు దీనిని రచించి తన కుమారుడైన శుకయోగిచేత చదివించాడు. శుకయోగి పరీక్షిత్తుకు వినిపించాడు.

**కలిదోషం అనే చిమ్మచీకటి కమ్ముకొని దారి తెలియక అలమటించే జనులకు భాగవతం వెలుగునిచ్చే సూర్యుడులాంటిది'** అన్నాడు సూత మహర్షి.

వెంటనే శౌనకుడు– "మునీంద్రా! శుక మహర్షి గొప్పవాడని విన్నాం. అతడికి బంగారమూ–మట్టీ, స్త్రీ–పురుషుడు ఇలా ఏ తేడాలూ తెలియనే తెలియవట! అన్నింటిలోనూ పరమాత్మనే దర్శిస్తాడట!

ఒకసారి శుక మహర్షిని వెతుక్కొంటూ అతడి తండ్రి వేదవ్యాసుడు అడవుల్లోంచి వెళ్తున్నాడట! అక్కడ ఒక సరస్సులో కొందరు దేవతా స్త్రీలు బట్టలు లేకుండా స్నానం చేస్తున్నారట! ముందు శుక మహర్షి అటువైపు వచ్చాడట! వాళ్ళు అతడిని పట్టించుకోనేలేదు. తరువాత వ్యాసుడు వచ్చాడట! వ్యాసుడిని చూసి వాళ్ళు కంగారుపడి బట్టలు కట్టుకున్నారట! దానికి ఆశ్చర్యపోయిన వ్యాసుడు –

'నేను ముసలివాణ్ణి. నా కొడుకు నవయౌవనంలో ఉన్నాడు. అతణ్ణి చూసి అస్సలు పట్టించుకోని మీరు నన్ను చూసి ఇలా కంగారు పడుతున్నారు. ఎందుకు?' అని అడిగాడట!

దానికి వాళ్ళు 'మునీంద్రా! నీ కొడుక్కి స్త్రీ–పురుష భేదం తెలియదు. నీకు తెలుసు' అన్నారట!

ఆ శుకమహర్షి ఎక్కడా స్థిరంగా ఉండడట. ఆవు పొదుగు నుండి పాలు పితకడానికి ఎంత సమయం పడుతుందో అంత సమయమే అతడు గృహస్థుల దగ్గర ఉంటాడట. అడగనిదే ఏదీ చెప్పడట. అడిగితే చెప్పకుండా వెళ్ళనే వెళ్ళడట. అతడు నిలిచిన ప్రాంతం పుణ్యతీర్థమట! ఆ మహర్షి గురించి చెప్పవూ!" అని అడిగాడు.

దానికి సూతమహర్షి ఇలా ప్రారంభించాడు. "మహర్షులారా! అది మూడవది అయిన ద్వాపరయుగం ముగిసే సమయం. ఆ మహాయుగంలో ఉపరిచర వసువుకు సత్యవతి జన్మించింది. ఈమెకే 'వాసవి' అని మరో పేరు. ఈమెకూ పరాశరుడు అనే మహర్షికీ ఒక పుత్రుడు జన్మించాడు. అతడే వేదవ్యాసుడు. విష్ణుమూర్తి పదిహేనో అవతారం.

## నారద మహర్షి రాక

వేదవ్యాసుడు వేదాల్ని నాలుగు భాగాలుగా చేశాడు. ఇతిహాసాల్నీ, పురాణాల్నీ రచించాడు. వీటిని ఆయన శిష్యులు ప్రచారం చేశారు. ఇంత చేసినా వ్యాసుడికి ఏదో చెప్పలేని వెలితి. దానికి కారణం భగవంతుని గొప్పతనాన్ని వర్ణించే గ్రంథం ఏదీ రచించకపోవటమే అని ఆయన గుర్తించాడు. అదే సమయంలో వచ్చాడు నారద మహర్షి. ఇలా అంటున్నాడు.

'వ్యాసమహర్షీ! నేను పూర్వం ఒక దాసీపుత్రుణ్ణి. మా యజమానులు నన్ను ఋషులకు సేవకుడిగా నియమించారు. వాళ్ళు నాకు 'నారాయణమంత్రం' ఉపదేశించారు. నా తల్లి పాము కరిచి చనిపోయింది. అడవిలో ఒక రావిచెట్టు క్రింద శ్రీహరిని ధ్యానిస్తూ కూర్చున్నాను. మనస్సులో ఆ స్వామి రూపం. కళ్ళు తెరిచి చూశాను. ఆ రూపం కనిపించలేదు. ఇంతలో...

'నారదా! ఎందుకు నీకీ వృథా ప్రయాస. నువ్వు నన్ను వచ్చే జన్మలో చూడగలవు. అప్పుడు నువ్వు నా ప్రియభక్తుడివి అవుతావు' అని ఒక దివ్యవాక్కు వినిపించింది.

అప్పటి నుండీ శ్రీహరినే స్మరిస్తూ శరీరాన్ని విడిచిపెట్టాను. అంతలో ప్రళయం వచ్చింది. సముద్రం మధ్యలో శ్రీహరి శయనించి ఉన్నాడు. ఆ శ్రీహరి నాభికమలంలో ఉన్న బ్రహ్మదేవుడు నిద్రలో ఉన్నాడు. అతడి ఊపిరి ద్వారా లోపలికి ప్రవేశించాను. అలా కొన్ని వేల యుగాలు గడిచిపోయాయి. బ్రహ్మదేవుడు మేల్కొని సృష్టి ప్రారంభించాడు. మరీచినీ, నన్నూ ఇంకా కొందరు మహర్షుల్నీ సృష్టించాడు.

ఇదుగో! నా వీణ. దీని పేరు మహతి. దీనిని మీటుతూ శ్రీహరినే గానం చేస్తుంటాను. యాగాలూ జపాలూ ఎన్ని చేసినా లభించని మనశ్శాంతి శ్రీహరిని స్మరిస్తే లభిస్తుంది. నువ్వు భాగవతాన్ని రచించు. నీ మనసు కుదుటపడుతుంది' అని చెప్పి నారదుడు వెళ్ళిపోయాడు.

వేదవ్యాసుడు బదరీవనంలో ఉన్న 'శమ్యాప్రాసం' అనే తన ఆశ్రమంలో కూర్చొని భక్తితో భాగవతాన్ని రచించాడు. మొదట శుక మహర్షి దానిని పఠించాడు. తరువాత పరీక్షిత్తుకు శుకమహర్షే స్వయంగా వినిపించాడు. ఎందుకో తెలుసా!! వెయ్యి వేదాల్ని చదివినా లభించని మోక్షం ఒక్క భాగవతాన్ని చదివితే సులభంగా లభిస్తుంది. శ్రద్ధగా వినండి.

## అశ్వత్థామ అవమానం

అది కురుక్షేత్ర సంగ్రామం. అశ్వత్థామ ఉపపాండవుల తలలు నరికి వారిని సంహరించాడు. అది తెలిసి పాండవులు భగ్గుమన్నారు. ద్రౌపది విలవిలలాడిపోయింది. అర్జునుడు అశ్వత్థామను బంధించి తెచ్చి, ద్రౌపది కాళ్ళదగ్గర పడవేశాడు. శ్రీకృష్ణుడితోసహా అందరూ అశ్వత్థామను చంపెయ్యమన్నారు.

**భయపడ్డవాణ్ణి, మతిస్తిమితంలేనివాణ్ణి, నిద్రలో ఉన్నవాణ్ణి, మద్యపానం చేసినవాణ్ణి, పారిపోతున్నవాణ్ణి, శరణు వేడినవాణ్ణి, స్త్రీలనూ చంపటం అధర్మం.** అందుకే ద్రౌపది అతణ్ణి చూసి–

## ద్రౌపది కరుణ

'గురుపుత్రా! ఎంత పని చేశావయ్యా! అభం శుభం తెలియని నా పుత్రుల్ని పొట్టనపెట్టుకున్నావే! ఇదేనా నీ వీరత్వం? నిద్రపోతున్న అమాయకుల్ని చంపుతావా?' అంటూ శ్రీకృష్ణార్జునుల్ని చూసి – 'ఇతడిని చంపితే ఇతడి తల్లి ఎంతగా తల్లడిల్లిపోతుందో! నేను అర్థంచేసుకోగలను. నేనూ తల్లినే! వద్దు! ఇతణ్ణి చంపితే మనకు బ్రహ్మహత్యాపాతకం చుట్టుకుంటుంది' అంది.

ఆమె మాటల్లో ఒకవైపు బాధ. మరోవైపు జాలి.

ద్రౌపది మాటలు భీముడికి నచ్చలేదు. వీరావేశంగా అశ్వత్థామ మీదికి వచ్చాడు. ద్రౌపది అడ్డుపడింది. శ్రీకృష్ణుడి సూచనపై అశ్వత్థామ తల గొరిగి తలలో మెరుస్తున్న చూడామణిని లాక్కొని పంపారు పాండవులు.

* * *

అయినవాళ్ళందరినీ సంహరించామే అన్న బాధ ధర్మరాజును వెంటాడుతోంది. అంపశయ్య మీద ఉన్న భీష్ముడి దగ్గరకు వెళ్ళాడు. అతడి వెంట శ్రీకృష్ణుడూ, తక్కిన పాండవులూ, కొందరు మహర్షులూ కూడా ఉన్నారు. భీష్ముడు తాను లేవలేని స్థితిలో ఉండి కూడా ఎవరిని ఎలా గౌరవించాలో అలా గౌరవించాడు. పాండవుల్ని చూసి–

## భీష్ముడి హితోపదేశం

'నాయనలారా! మీరు మంచివాళ్ళై ఉండి, శ్రీకృష్ణుడి అండ ఉండి కూడా ఎన్ని ఇబ్బందులు పడ్డారో పాపం! ఇదే కాల మహిమ. ఇదంతా విష్ణుమాయ. ఆ పరమాత్మ ఎప్పుడు ఏం చేస్తాడో ఎవరికి ఎరుక? సాక్షాత్తూ శ్రీమన్నారాయణుడే సామాన్యుడిలా మీ వెంట తిరుగుతున్నాడు. ఆత్మీయులైన భక్తులకు అందుబాటులో ఉండటం ఆ స్వామికి అలవాటు. ఇప్పుడు చూడండి! ఆ దేవదేవుడే స్వయంగా నా దగ్గరికి వచ్చాడు. నేను పూర్వ జన్మలో ఎంత పుణ్యం చేశానో ఏమో!' అన్నాడు. పాండవులకు

నీతులూ, ధర్మాలూ వివరంగా చెప్పాడు.

ఇంతలో ఉత్తరాయణ పుణ్యకాలం సమీపిస్తోంది. భీష్ముడికి తాను కోరినప్పుడే మరణించే వరం ఉంది. అందుకే గోపాలుడి ముఖాన్నే చూస్తూ, ప్రాణాలను విడిచిపెట్టాడు. ధర్మరాజు భీష్ముడికి అంత్యక్రియలు నిర్వహించాడు.

## ద్వారకా ప్రయాణం

పనులన్నీ పూర్తయ్యాయి. ఇక ద్వారకా నగరానికి బయలుదేరాడు శ్రీకృష్ణ పరమాత్మ.

సరిగ్గా అదే సమయంలో అర్జునుడి కోడలు, నిండు చూలాలు అయిన ఉత్తర, గర్భంలో భరించరాని వేదనతో శ్రీకృష్ణుడి చెంతకు వచ్చి, తననీ, తన గర్భంలో ఉన్న శిశువునూ కాపాడమంటూ కాళ్లపై పడింది. శ్రీకృష్ణుడు ఆమెకు కలిగిన బాధ అశ్వత్థామ ప్రయోగించిన బ్రహ్మాస్త్రం వల్లనే అని గ్రహించాడు. వెంటనే అత్యంత సూక్ష్మరూపంలో ఆమె గర్భంలో ప్రవేశించి, గర్భంలోని శిశువుకు ఒక తేజోమూర్తిగా కనిపించాడు. ఆ శిశువుకు కలిగిన బాధను నివారించాడు. ఉత్తర సంతోషించింది. కుంతీదేవి తనవారికి అడుగడుగునా ఎదురయ్యే ఆపదలను అన్నింటినీ నివారిస్తూ, తమను ఆదుకొంటున్న శ్రీకృష్ణుణ్ణి స్తుతించింది –

శా. **శ్రీకృష్ణా! యదుభూషణా! నరసఖా! శృంగారరత్నాకరా!**
**లోకద్రోహినరేంద్రవంశదహనా! లోకేశ్వరా! దేవతా**
**నీకబ్రాహ్మణగోగణార్తిహరణా! నిర్వాణసంధాయకా!**
**నీకున్ మ్రొక్కెదఁ ద్రుంపవే భవలతల్ నిత్యానుకంపానిధీ!** (1–200)

'శ్రీకృష్ణా! యదువంశానికి అలంకారమైనవాడా! నరుడికి స్నేహితుడా! శృంగార సముద్రుడా! లోకద్రోహులైన రాజవంశాల్ని సంహరించినవాడా! లోకేశ్వరా! అందరి ఆర్తినీ పోగొట్టేవాడా! మోక్షాన్ని ప్రసాదించేవాడా! దయానిధీ! నీకు నమస్కరిస్తాను. నా ఈ సంసారం అనే తీగల్ని త్రుంచవయ్యా!' అని పదేపదే వేడుకొంది. శ్రీకృష్ణుడు ఆనందించాడు. ఆపైన ఆయన రథం ద్వారకవైపు సాగిపోయింది.

అదిగో ద్వారక! శ్రీకృష్ణుడి రాక కోసం అందంగా ముస్తాబయింది. నల్లనయ్య రానే వచ్చాడు. వచ్చి అందరికీ ఆనందాన్ని కలిగించాడు. నగరం నగరమే శ్రీకృష్ణుడి

పాదాల దగ్గర మోకరిల్లింది.

శ్రీకృష్ణుడు నేరుగా తన తల్లిదండ్రుల నివాసానికి చేరుకున్నాడు. అక్కడ దేవకీదేవికీ తక్కిన తల్లులకూ నమస్కరించాడు. అక్కణ్ణుంచి ఒకేసారి అనేక రూపాలతో తన అంతఃపుర కాంతలందరిదగ్గరికీ వెళ్ళి, వాళ్ళనూ ఆనందింపజేశాడు.

* * *

కొన్నాళ్ళకు ఉత్తర కుమారుణ్ణి కన్నది. తల్లి గర్భంలో ఉండగా తను చూసిన దేవుడు ఈ లోకమంతా వ్యాపించి ఉన్నాడని పరీక్షగా చూస్తున్నాడట ఆ బాలుడు. అందుకే అతడికి 'పరీక్షిత్తు' అని పేరు వచ్చింది. ధర్మరాజు తన మనుమడికి జాతకర్మలు జరిపించి 'విష్ణురాతుడు' అని పేరుపెట్టాడు.

## విదురుడి హితవు

తీర్థయాత్రలకు వెళ్ళిన విదురుడు తిరిగి వచ్చి, ఆ విశేషాల్ని ధృతరాష్ట్రుడు మొదలైనవాళ్ళకు చెప్పాడు. అప్పటికే యాదవులు నశించారు. కానీ ఆ విషయం చెప్పి ధర్మరాజును బాధపెట్టదలచుకోలేదు.

ఒకరోజు రాత్రి విదురుడు ధృతరాష్ట్రుడి వద్దకు వచ్చి 'రాజా! కాలం ఎంతటివారినైనా నాశనం చేస్తుంది. నీ పరిస్థితే చూడు. నువ్వు ఎవరికి హాని చేశావో ఆ పాండవుల దగ్గరే ఇప్పుడు దిక్కులేక కుక్కిన పేనులా ఉండవలసి వచ్చింది. ఇలా ఎంతకాలం? శరీరం అశాశ్వతమని తెలుసుకో' అన్నాడు.

ధృతరాష్ట్రుడు విదురుడి మాటల్లోని సత్యాన్ని గ్రహించాడు. తన భార్య గాంధారిని తీసుకొని విదురుడితో కలసి హిమాలయాలకు వెళ్ళిపోయాడు.

తెల్లవారింది. రోజులాగే ధృతరాష్ట్రుడికి నమస్కరించడానికి వచ్చిన ధర్మరాజుకు అక్కడ ఎవరూ కనిపించలేదు. విదురుడూ లేడు. సరిగ్గా అప్పుడే అక్కడికి నారద తుంబురులు వచ్చారు.

'ధర్మరాజా! ఈ విశ్వం మొత్తం ఈశ్వరుడి అధీనంలో ఉంటుంది. ఆ పరాత్పరుడే అనేక రూపాలలో ఉంటాడు. ఒక జంతువుకు మరో జంతువు ఆహారం. తినేదీ, తినబడేదీ పరమాత్మే. అతడు చేసే ప్రతి పనికీ ఒక అర్థం, పరమార్థం ఉంటుంది. నీ తల్లిదండ్రుల గురించి బాధపడకు. వాళ్ళు హిమాలయాలలో ఉన్నారు. సరిగ్గా

నేటికి ఐదోరోజున వాళ్ళు పరమాత్మలో ఐక్యం అవుతారు. విదురుడు తీర్థయాత్రలకు వెళ్ళిపోతాడు' అని చెప్పి వెళ్ళిపోయారు.

తరువాత ధర్మరాజుకు కొన్ని అపశకునాలు కనిపించాయి. శ్రీకృష్ణుడు ఎలా ఉన్నాడో తెలుసుకొని రమ్మని అర్జునుణ్ణి ద్వారకకు పంపించాడు.

అర్జునుడు వెళ్ళి దుఃఖంతో తిరిగి వచ్చాడు. అతడి ముఖంలో నెత్తురు చుక్క లేదు. కళ్ళు ధారాళంగా వర్షిస్తున్నాయి. ఏమైందో ధర్మరాజుకు అర్థం కాలేదు. భీముడూ అక్కడే ఉన్నాడు. ఆందోళనగా చూస్తూ-

'అర్జునా! ఎందుకలా ఉన్నావు? ఏమయ్యింది?

కం. **ఓడితివో? శత్రువులకు**
**నాడితివో? సాధుదూషణాలాపములం**
**గూడితివో? పరసతులను**
**వీడితివో? మానధనము వీరుల నడుమన్.** (1-354)

కం. **తప్పితివో? యిచ్చెదనని**
**చెప్పితివో? కపటసాక్షి, చేసిన మేలుం**
**దెప్పితివో? శరణార్థుల**
**రొప్పితివో? ద్విజుల బసుల రోగుల సతులన్.** (1-355)

కం. **అడిచితివో? భూసురులను**
**గుడిచితివో? బాలవృద్ధ గురువుల వెలిగా**
**విడిచితివో? యాశ్రితులను**
**ముడిచితివో? పరుల విత్తముల లోభమునన్.** (1-356)

శత్రువులకు ఓడిపోయావా? మంచివాళ్ళను దూషించావా? పరస్త్రీలను కలిశావా? అభిమానం పోగొట్టుకున్నావా? ఇస్తానని చెప్పి మాట తప్పావా? దొంగ సాక్ష్యం ఇచ్చావా? చేసిన మేలును దెప్పిపొడిచావా? శరణువేడిన వాళ్లనుగానీ, బ్రాహ్మణులనుగానీ, నోరులేని మూగజీవాల్నిగానీ, రోగుల్నిగానీ, స్త్రీలనుగానీ కోపంతో నిందించావా? బ్రాహ్మణుల్ని కొట్టావా? బాలవృద్ధగురువులకు పెట్టకుండా నువ్వే తిన్నావా? నమ్మినవాళ్ళను విడిచిపెట్టావా? లోభంతో ఇతరుల సంపదలను

అపహరించావా?' అని కంగారుగా ఏవేవో అడుగుతున్నాడు ధర్మరాజు.

అర్జునుడు వెక్కివెక్కి ఏడుస్తూ 'రాజా! ఏమని చెప్పను? ఎలా చెప్పను? మనల్ని అన్నీ తానై నడిపించిన శ్రీకృష్ణుడు, ప్రాణానికి ప్రాణమైన మన గోపాలుడు మనల్ని విడిచిపెట్టి వెళ్ళిపోయాడు' అంటూ బావురుమన్నాడు ఒక్కసారిగా.

ధర్మరాజు హతాశుడైపోయాడు. కాళ్ళ క్రింద భూమి కంపించినట్లయింది.

అర్జునుడూ విలపిస్తున్నాడు. ఇంతలో శ్రీకృష్ణుడు బోధించిన గీతాసారం గుర్తుకు వచ్చింది. దుఃఖాన్ని దిగమింగుకున్నాడు. బుద్ధిని వాసుదేవుడి పాదాలపై కేంద్రీకరించాడు.

యాదవులు మరణించటం, శ్రీకృష్ణుడు తన అవతారాన్ని చాలించటం తెలుసుకున్న కుంతి కూడా భక్తితో పరమాత్మధ్యానం చేస్తూ సంసారబంధాలు తెంపుకొని శరీరాన్ని విడిచిపెట్టింది. ముల్లును ముల్లుతోనే తొలగించి, తరువాత రెండు ముళ్ళనీ కాల్చివేసే నేర్పరిలాగా పరమాత్మ– లోకకంటకులైన దుష్టులను అంతమొందించేందుకు తానూ దేహాన్ని ధరించి పనిముగిశాక శరీరాన్ని విడిచిపెట్టాడు. నాటకం అయిపోయాక నటుడు పాత్రను విడిచి తన సొంత రూపంలో కనిపిస్తాడు. పరమాత్మ కూడా అంతే! ఇప్పుడు శ్రీకృష్ణావతారం సమాప్తం అయింది. ఇదే కలియుగానికి నాంది.

* * *

## పరీక్షిత్తు పట్టాభిషేకం

ధర్మరాజు పరీక్షిత్తుకు రాజ్యం అప్పగించి శరీరాన్ని విడిచిపెట్టాడు. సోదరులూ క్రమంగా అతడిని అనుసరించారు. ద్రౌపది కూడా విష్ణుపదాన్ని చేరుకుంది. విదురుడు ప్రభాసతీర్థంలో శరీరాన్ని విడిచిపెట్టాడు.

పరీక్షిత్తు 'ఇరావతి' అనే కన్యను పెళ్ళాడాడు. చక్కగా రాజ్యపాలన చేస్తున్నాడు. కొన్నాళ్ళకు జైత్రయాత్రకు బయలుదేరాడు. దారిలో ఒక విచిత్రమైన పరిస్థితి ఎదురయ్యింది అతడికి.

కలిపురుషుడు ఒక గోవృషభాల జంటను (ఒక ఆవును, ఒక ఎద్దును) కాలితో తన్నుతున్నాడు. వాడు రాజచిహ్నాలతో శూద్రుడి వేషంలో ఉన్నాడు. ఎద్దురూపంలో ఉన్నది ధర్మదేవుడు. ఆవు రూపంలో ఉన్నది భూమాత. ధర్మదేవుడు ఒంటికాలిపై కుంటుతూ నడుస్తున్నాడు.

'మూగప్రాణుల్నీ అమాయిక జీవుల్నీ హింసించేవాళ్ళను రాజు శిక్షించాలి. అలా చేయని రాజుగారి ఆయువు, ఐశ్వర్యం... ఇవన్నీ వృథా'. అందుకే పరీక్షిత్తు కలిపురుషుణ్ణి శిక్షించాడు. తన రాజ్యంలో ప్రవేశించడానికి వీలు లేదని శాసించాడు.

కలి ప్రాధేయపడ్డాడు. 'నేను ఎక్కడ ఉండాలో నువ్వే చెప్పు' అని వేడుకొన్నాడు. దానికి పరీక్షిత్తు– **'ఓయీ, కలీ! ప్రాణిహింస, స్త్రీవ్యసనం, జూదం, మద్యపానం అనే నాలుగు స్థానాలిస్తున్నాను' అన్నాడు. కలి ఇంకా ఇమ్మని కోరగా బంగారం (అంటే అవసరాన్ని మించిన అధిక సంపద) చేర్చుకోవటం వల్ల వచ్చే అసత్యం, మదం, కామం, హింస, శత్రుత్వం అనే స్థానాలు కూడా ఇచ్చి 'హరిభక్తుల జోలికి వెళ్ళకు' అని శాసించాడు, ధర్మదేవుడు కోల్పోయిన తపస్సు, శౌచం, దయ అనే మూడు పాదాలనూ అతడికి తిరిగి ప్రసాదించాడు.**

మునులారా! ఒకరోజు పరీక్షిత్తు వేటకు వెళ్ళాడు. అలసిపోయి దగ్గరలో ఉన్న ఒక ఆశ్రమానికి చేరుకున్నాడు. అక్కడ ఒక మహర్షి కళ్ళు మూసుకొని ధ్యానంలో కూర్చొని ఉండటం కనిపించింది. అతణ్ణి చూసి పరీక్షిత్తు, దాహంతో నీళ్ళు ఇమ్మని వేడుకున్నాడు. మహర్షి ఉలకలేదు, పలకలేదు. అది అవమానంగా భావించి, చచ్చిన పామును ఆ మహర్షి మెడలో వేసి వెళ్ళిపోయాడు పరీక్షిత్తు.

ఆ మహర్షి పేరు శమీకుడు. అతడి కొడుకు శృంగి. శృంగి జరిగినదంతా తెలుసుకొని – 'నా తండ్రిని అవమానించిన వాడు సరిగ్గా వారం రోజుల్లో 'తక్షకుడు' అనే సర్పంవల్ల మరణిస్తాడు' అని శపించాడు.

శమీకుడు శాంతమూర్తి. 'పరీక్షిత్తు దేశానికి రాజు. అతడు చేసిన చిన్న తప్పుకు అంత శిక్ష ఏమిటి? సరే! ఇది విధి నిర్ణయం. కాబట్టి ఈ సంగతిని రాజుగారికి తెలియజేయండి' అని తన శిష్యుల్ని పంపాడు.

పరీక్షిత్తు పశ్చాత్తాపంతో తన పుత్రుడు జనమేజయుడికి రాజ్యం అప్పగించి ప్రాయోపవేశానికి సిద్ధపడ్డాడు. ఆ వార్త తెలిసి పరీక్షిత్తును చూడాలని ఎందరో వస్తున్నారు. అత్రి, విశ్వామిత్ర, మైత్రేయ, భృగు, వసిష్ఠ, పరాశర, చ్యవన, భరద్వాజ, పరశురామ, దేవల, గౌతమ, కశ్యప, కషవ, కణ్వ, కలశసంభవ, వ్యాస, పర్వత, నారదాది మహర్షులూ విచ్చేశారు.

అంతలో ఒక అవధూత అక్కడికి వేంచేశాడు. చూడచక్కని రూపం. ముఖంలో దివ్యమైన కాంతి. ఒంటిమీద ఒక్క నూలుపోగైనా లేదు. అతడే శుక మహర్షి. ఎవరినీ ఏదీ అడగడు. ఎవరినీ నిందించడు. ఎవరితోనూ ఏ సంబంధమూ పెట్టుకోడు.

పరీక్షిత్తు అతడి పాదాల చెంత కూర్చొని 'యోగిపుంగవా! నాకు ముక్తిమార్గం ప్రసాదించు' అని అభ్యర్థించాడు వినయంగా నమస్కరిస్తూ.

# స్కంధం - 2

**శు**క మహర్షి చుట్టూ చూశాడు. ఒక చిరునవ్వు నవ్వి – 'మహారాజా! నువ్వు గొప్ప భక్తుడివి. కాబట్టి నీకు భాగవతం వినిపిస్తాను విను. దీన్ని వినటంవల్ల సంసారభయాలు తొలగిపోతాయి. మోక్షం కోరేవారికి తప్పక మోక్షం లభిస్తుంది.' అంటూ ప్రారంభించాడు.

## ఖట్వాంగుడి కథ

'మహారాజా! పూర్వం 'ఖట్వాంగుడు' అనే రాజు ఉండేవాడు. అతడు గొప్ప వీరుడు. రాక్షసుల బారి నుండి దేవతల్ని రక్షించి పిదప వారి ద్వారా తనకు ఒక్క ముహూర్తకాలం మాత్రమే ఆయువు ఉందని తెలుసుకున్నాడు. ఆపైన ఆలస్యం చేయలేదు. వెంటనే రాజ్యానికి వచ్చి సర్వమూ త్యజించి గోవిందనామాన్ని కీర్తించి, మొదటి రెండు ఘడియల్లోనే మోక్షాన్ని పొందాడు.

రాజా! నీకు ఏడు రోజుల సమయం ఉంది. నీవు కూడా భగవంతుడిపై దృష్టిపెట్టు.

కం. **హరిమయము విశ్వ మంతయు**
**హరి విశ్వమయుండు, సంశయము పనిలే దా**
**హరిమయము గాని ద్రవ్యము**
**పరమాణువు లేదు వంశపావన! వింటే.** (2-17)

ఆ శ్రీహరి అంతటా ఉన్నాడు. విశ్వమంతా ఆయనలోనే ఉంది. ఇందులో ఎంతమాత్రం సందేహం లేదు. ఆయన లేని వస్తువు పరమాణువంత కూడా లేదు. హరిని తెలుసుకొంటే ఏదైనా సాధ్యమే. తెలుసుకోకపోతే అంతా అసాధ్యమే. పూర్వం

బ్రహ్మదేవుడు కూడా సృష్టి చేయాలని కొన్ని సంవత్సరాలు నానాయాతనలు పడ్డాడు. అతడికి సాధ్యం కాలేదు. శ్రీహరిని ధ్యానించాడు. లోకాల్ని సృష్టించే మెళకువ తెలిసింది. జ్ఞానం లేనివాడు సుఖాల కోసం ప్రాకులాడుతాడు. జ్ఞాని అలా కాదు. వివేకంతో ప్రవర్తిస్తాడు.

కం. **రక్షకులు లేని వారల**
**రక్షించెద ననుచుఁ జక్రి రాజైయుండన్**
**రక్షింపు మనుచు నొక నరు**
**నక్షముఁ బ్రార్థింపనేల? యాత్మజ్ఞులకున్.** (2–22)

ఏ రక్షణా లేనివాళ్ళను నేను రక్షిస్తానని చక్రి రాజుగా ఉంటే ఎవరినో ప్రార్థించడం దేనికి? అందుకే ఆ భగవంతుణ్ణే ధ్యానిస్తూ జ్ఞాని ఆనందాన్ని పొందుతాడు. కాబట్టి భక్తిమార్గమే మోక్షం పొందడానికి సులభమైనది.

విష్ణుభక్తిలేనివాడు పశువుతో సమానం. అతడి చెవులు చెవులు కావు. కొండ గుహలు. శ్రీహరిని స్తుతించనివాడి నాలుక నాలుక కాదు. కప్ప నాలుక. ఆ దేవదేవుణ్ణి చూడని కన్నులు కన్నులు కావు. నెమలి కన్నులు.

రాజా! పూర్వం సాక్షాత్తూ శ్రీమన్నారాయణుడే బ్రహ్మదేవుడికి బోధించిన విజ్ఞానాన్ని నేను నారదుడి ద్వారా తెలుసుకున్నాను. దానిని నీకూ బోధిస్తాను' అంటూ మొదలుపెట్టి ప్రపంచం ఎలా పుడుతుందో దానిని భగవంతుడు ఎలా రక్షిస్తాడో ఎలా లయం చేస్తాడో అంతా వివరంగా చెప్పాడు.

ఆ తరువాత 1. వరాహ, 2. సుయజ్ఞ, 3. కపిల, 4. దత్తాత్రేయ, 5. సనకాది చతుష్టయ, 6. నరనారాయణ, 7. ధ్రువ, 8. పృథు, 9. ఋషభ, 10. హయగ్రీవ, 11. మత్స్యాది లీలావతారాలనూ వివరించాడు.

## బ్రహ్మతపస్సు

'రాజా! బ్రహ్మదేవుడు తాను పుట్టిన పద్మంలో కూర్చొని ఇక సృష్టిని మొదలుపెట్టాలని అనుకొన్నాడు. ఇంతలో 'తప తప' (తపస్సు చెయ్యి – తపస్సు చెయ్యి) అనే శబ్దం వినిపించింది. తపస్సు చేశాడు. శ్రీహరి ప్రత్యక్షమయ్యాడు. అలాగే వైకుంఠమూ సాక్షాత్కరించింది. ఆ వైకుంఠంలో–

'కేశవుడికంటే గొప్ప దైవం లేదు' అని చిలుకలు పలుకుతున్నాయి. 'ఈ జగమంతా విష్ణుమయం' అని గోరువంకలు నినదిస్తున్నాయి.

అక్కడే కొందరు దివ్యమైన ఆభరణాలతో వెలిగిపోతూ వైకుంఠనాథుణ్ణి సేవిస్తూ ఉన్నారు. ఆ స్వామి పట్టుపీతాంబరాలూ, పంచాయుధాలూ ధరించి ఉన్నాడు. వక్షఃస్థలంపై లక్ష్మీదేవి. అతడి పాదంలో గంగ. సూర్యచంద్రులే అతడి కళ్ళు. ఆ కళ్ళనిండా కరుణ. శేషుడు ఆయనకు శయ్య. గరుడుడు వాహనం. అలాంటి స్వామి బ్రహ్మదేవుడికి ప్రత్యక్షమై వరం కోరుకోమన్నాడు.

అప్పుడు బ్రహ్మ 'స్వామీ! నాకు ఎన్నడూ అహంకారం కలగకుండా ఉండేలా అనుగ్రహించు' అన్నాడు.

'తథాస్తు' అని శ్రీహరి వెళ్ళిపోయాడు.

తర్వాత బ్రహ్మదేవుడు సృష్టిని ప్రారంభించాడు. కొన్నాళ్ళ తర్వాత తపస్సు చేశాడు. ఆ సమయంలో నారద మహర్షి వచ్చి బ్రహ్మదేవుడికి సేవలు చేశాడు. దానికి ఆనందించిన బ్రహ్మదేవుడు నారద మహర్షికి భాగవతాన్ని అనుగ్రహించాడు. నారదుడు ఆ భాగవతాన్ని వ్యాస మహర్షికి చెప్పాడు. వ్యాసుడు నాకు చెప్పాడు. నేను నీకు చెప్తున్నాను' అంటూ మొదట శ్రీమన్నారాయణుడి విరాట్ స్వరూపాన్ని ఎంతో విపులంగా పరీక్షిత్తుకు చెప్పాడు" అన్నాడు సూతమహర్షి. మళ్ళీ ఇలా ప్రారంభించాడు.

# స్కంధం - 3

"**మ**హర్షుల్లారా! శుక మహర్షి ఇలా చెప్తున్నాడు: 'రాజా! విదురుడు తీర్థయాత్రలు ముగించుకొని ధర్మరాజు వద్దకు వచ్చాడు. ధర్మరాజు విశేషాలు చెప్పమని విదురుణ్ణి ప్రార్థించాడు.

## విదురుడి తీర్థయాత్ర

సాక్షాత్తూ యమధర్మరాజే విదురుడిగా జన్మించాడు. అందుకే మొదటినుండీ విదురుడు కౌరవుల తప్పుల్ని ఖండిస్తూనే వచ్చాడు. దుర్యోధనుడు అతణ్ణి రాజ్యం నుంచి వెళ్ళగొట్టాడు. అందుకే తీర్థయాత్రలకు వెళ్ళి, మైత్రేయ మహర్షిని కలుసుకొని

వేదాంత విషయాలు నేర్చుకొన్నాడు. అతడు ప్రభాస తీర్థంలో ఉన్నప్పుడు పాండవులు జయించారన్న వార్త తెలిసింది. తరువాత యమునా తీరానికి వెళ్ళి శ్రీకృష్ణుడి బాల్యస్నేహితుడైన ఉద్ధవుణ్ణి కలుసుకొని అందరి యోగక్షేమాల గురించి అడిగాడు. ఉద్ధవుడు విచారంగా–

'విదురా! ఏం చెప్పమంటావు? యముడు అనే కాలనాగు బుసకొట్టడంతో యాదవులు సర్వనాశనం అయ్యారు. శ్రీకృష్ణుడు అనే సూర్యభగవానుడు అస్తమించాడు' అన్నాడు మెల్లగా.

విదురుడు రాయిలా ఉండిపోయాడు. మళ్ళీ ఉద్ధవుడే ఇలా అంటున్నాడు.

'మహర్షుల శాపంవల్ల యాదవులు చాలామంది మరణించారు. శ్రీకృష్ణుడు కళ్ళు మూసుకొని ఒక చెట్టుక్రింద కూర్చున్నాడు. నన్ను దగ్గరకు రమ్మని 'ఉద్ధవా! నువ్వు బదరీవనానికి వెళ్ళు' అని ఆజ్ఞాపించి, తానూ ఎటో వెళ్ళిపోయాడు.

నేను అంతా వెతికాను. చివరికి ఒక రావిచెట్టు క్రింద ఆ పరమాత్మను చూశాను. అప్పుడే మైత్రేయ మహర్షి అక్కడకు వచ్చాడు. ఆ మహర్షి వింటూ ఉండగానే శ్రీకృష్ణుడు నన్ను చూసి

'ఉద్ధవా! పూర్వ జన్మలో వసుబ్రహ్మలు చేసిన సత్రయాగంలో నువ్వూ ఒక వసువుగా ఉన్నావు. అప్పుడు నా పాదభక్తి తప్ప మరేమీ కోరలేదు నువ్వు. అందుకే నీకు మళ్ళీ జన్మలేదు. నేను ఇంతకు ముందు బ్రహ్మదేవుడికి ఉపదేశించిన దివ్యజ్ఞానాన్ని నీకూ ఉపదేశిస్తాను' అని నాకు ఉపదేశించాడు.

విదురుడు అంతా విన్నాడు. శ్రీకృష్ణుడు మరణించాడని తెలిసి తట్టుకోలేక పోతున్నాడు. ఎలాగో నిగ్రహించుకొని 'ఉద్ధవా! ఆ దివ్యజ్ఞానాన్ని నాకూ ఉపదేశించవయ్యా!' అన్నాడు.

ఉద్ధవుడు సరేనంటూ తాను చెప్పగలిగినంత చెప్పి 'విదురా! ఇంకా కావాలంటే నువ్వు మైత్రేయ మహర్షిని ఆశ్రయించు' అని తాను బదరికాశ్రమంవైపు సాగిపోయాడు.

## మైత్రేయమహర్షి

తరువాత విదురుడు దివ్యతీర్థాలలో స్నానం ఆచరిస్తూ మైత్రేయ మహర్షిని కలుసుకొన్నాడు. అతడి ద్వారా సృష్టి జ్ఞానాన్నీ, పరమాత్మ స్వరూపాన్నీ తెలుసుకున్నాడు.

'ఆకాశంలోని చందమామ నీటిలో కనిపిస్తూ ఉంటుంది. నీరు కదలితే నీటిలోని చందమామ కూడా కదలినట్లు అనిపిస్తుంది. కానీ అసలు చందమామ కదలుతుందా! కదలదు. అలాగే **కర్మలనేవి జీవుడికే ఉంటాయి కానీ పరమాత్మకు ఉండవు. ఆ కర్మలు ఏర్పడటానికి కారణం అవిద్య. భగవంతుడిపై భక్తి ఉంటే అవిద్య తొలగిపోతుంది. బంధాలు వీడిపోతాయి. మోక్షం లభిస్తుంది'.**

ఇలా భగవంతుడి తత్త్వాన్ని వివరించి చెప్పాడు మైత్రేయుడు.

మనుచక్రవర్తుల గురించీ, దేవతల గురించీ, పద్నాలుగు లోకాల గురించీ, త్రిగుణాల గురించీ, ఆశ్రమ ధర్మాల గురించీ, వేదాల గురించీ, కాలస్వరూపం గురించీ, తపోదానాల గురించీ బ్రహ్మదేవుడి పుట్టుక గురించీ, సృష్టి గురించీ వివరించాడు. ఆ తరువాత తిరిగి కాలాన్ని గూర్చి ఇలా చెప్పటం ప్రారంభించాడు.

## కాలస్వరూపం

'విదురా! కాలానికి కర్త ఆ పరమాత్మే. అంతే కానీ కాలం ఆ పరమాత్మకు కర్త కాదు. అటువంటి దేవదేవుడి ఆజ్ఞను అనుసరించి బ్రహ్మదేవుడు మొదట 'స్వాయంభువుడు' అనే మనువును సృష్టించి అతణ్ణి ప్రజావృద్ధి చేసి భూమిని పాలించుమన్నాడు. అప్పటికే భూమి సముద్రంలో మునిగిపోయింది. దానిని ఎలా వెలుపలకు తేవాలా అని ఆలోచిస్తుంటే బ్రహ్మదేవుడి ముక్కుపుటాల నుండి 'యజ్ఞవరాహ స్వామి' ఆవిర్భవించాడు.

## వరాహావతార కథ

మొదట బొటనవేలంత ఉన్న వరాహమూర్తి తరువాత బ్రహ్మాండమంత పెరిగిపోయాడు. ఆ వరాహం ఘుర్ఘుర్‌మంటుంటే ఆ ధ్వనికి లోకం వణకిపోయింది. దిక్కులు అల్లల్లాడిపోయాయి.

ఆ వరాహం భీకరమైన విన్యాసాలు చేస్తూ సముద్రంలోనికి దూకి, భూమిని పైకి ఎత్తి, తన కోరపై ఉంచుకొని, బయటకు వచ్చింది. భూమిని నీటిపై యథాప్రకారం ఉంచింది. ఈ వరాహమే యజ్ఞస్వరూపం. యజ్ఞానికి కావలసినవన్నీ దీనినుండే పుట్టుకొచ్చాయి.

'విదురా! హిరణ్యాక్ష హిరణ్యకశిపులనే ఇద్దరు రాక్షస సోదరులు దితికి జన్మించారు. వీరి తండ్రి కశ్యప ప్రజాపతి. వీరిజన్మకు ఒక కారణం ఉంది.

## జయవిజయులు

ఒకసారి సనకసనందనాది మహర్షులు నలుగురు శ్రీహరి దర్శనం కోసం వైకుంఠానికి వెళ్ళారు. అక్కడ శ్రీహరి ద్వారపాలకులు జయవిజయులు వీళ్ళను లోపలికి వెళ్ళకుండా అడ్డుకున్నారు. మహర్షులకు కోపం వచ్చింది. 'అహంకారంలో మమ్మల్ని అడ్డుకున్న మీరు భూలోకంలో పుట్టి రాక్షసుల్లా ప్రవర్తించండి' అని శపించారు.

జయవిజయులు మన్నించమని వేడుకొన్నారు. ఇంతలో– శ్రీమన్నారాయణుడు బయటకు వచ్చాడు.

'మునిపుంగవులారా! వీళ్ళు నా ద్వారపాలకులు. వీళ్ళు తప్పు చేస్తే నేనూ చేసినట్లే. అయితే మీ శాపం ప్రకారం వీళ్ళు భూమిపై పుట్టి, పాపఫలాన్ని అనుభవించి, త్వరగా నా సన్నిధికి చేరుకొనే అవకాశాన్ని కల్పించండి' అని వేడుకున్నాడు. అదే పరమాత్మ గొప్పతనం.

ఆ శాపంవల్ల జయవిజయులే హిరణ్యాక్ష హిరణ్యకశిపులుగా, రావణ కుంభకర్ణులుగా, శిశుపాల – దంతవక్త్రులుగా పుట్టారు. స్వామిని ద్వేషించారు. స్వామి చేతుల్లోనే మరణించి, తిరిగి వైకుంఠాన్ని చేరుకున్నారు. అదుగో! అలా జన్మించినవాళ్ళే ఈ హిరణ్యాక్ష హిరణ్యకశిపులు. వీళ్ళు లోకాల్ని పట్టిపీడించసాగారు.

హిరణ్యాక్షుడు అష్టదిక్పాలకుల పైకి దండెత్తాడు. స్వర్గాన్ని అల్లకల్లోలం చేశాడు. సముద్రంపై పడ్డాడు. అక్కడ వరుణుడి రాజధాని 'విభావరి' అనే పురం ఉంది. దాన్ని ఆక్రమించుకొన్నాడు. అప్పుడు వరుణుడు అతణ్ణి మెల్లగా శ్రీహరి మీదికి ఉసిగొల్పి, దారి చూపించాడు.

హిరణ్యాక్షుడు రసాతలానికి వెళ్ళి అక్కడ ఉన్న యజ్ఞవరాహ మూర్తితో తలపడ్డాడు. కన్నుల్లోంచి నిప్పులు కురిపిస్తూ విజృంభిస్తున్న వరాహమూర్తిని చూడగానే హిరణ్యాక్షుడికి ప్రాణం పోయినంతపనయ్యింది. కానీ ధైర్యం తెచ్చుకొని వీరోచితంగా పోరాడాడు. వరాహమూర్తి ఆ రాక్షసుణ్ణి వెంటనే చంపలేదు. చంపకుండా కాస్త ఆటపట్టించి తరువాత సంహరించాడు.

'హిరణ్యాక్షుడు స్వామి ముఖాన్నే చూస్తూ మరణించాడు. ఇది నూటికో కోటికోగానీ దొరకని అదృష్టం' అని బ్రహ్మాది దేవతలు ఆశ్చర్యపోయారు.

బ్రహ్మ సకలదేవగణాలనూ సమస్త ప్రాణులనూ సృష్టించాడు.

## కపిలావతార కథ

బ్రహ్మదేవుడు సృష్టించిన కర్దమ మహర్షి పదివేల దివ్య సంవత్సరాలు తపస్సు చేసి శ్రీహరిని మెప్పించాడు. తరువాత స్వాయంభువ మనువు కుమార్తె – దేవహూతిని వివాహం చేసుకున్నాడు.

దేవహూతి కర్దమమహర్షికి అత్యంత భక్తి శ్రద్ధలతో సేవలు చేసి చిక్కిపోయింది. కర్దముడు ఆమెకు దివ్యదృష్టినీ, దివ్యభోగాలనూ, ఒక విమానాన్ని బహుమానంగా ఇచ్చాడు. ఆమెతో బిందుసరస్సులో స్నానం చేయించి ఆమె పూర్వ సౌందర్యాన్ని ఆమెకు వచ్చేలా చేశాడు.

కొంతకాలానికి ఆమె కడుపు పండింది. తొమ్మిదిమంది కుమార్తెలు జన్మించారు. ఆ తరువాత మళ్ళీ గర్భం ధరించింది. సాక్షాత్తూ శ్రీమన్నారాయణుడే 'కపిలుడు' అనే పేరుతో జన్మించాడు. బ్రహ్మదేవుడి ఆదేశం మేరకు కుమార్తెలందరికీ మహర్షులతో వివాహాలు జరిపించిన కర్దమ మహర్షి శ్రీహరిపైనే తన మనసును లగ్నంచేసి పరమపదాన్ని పొందాడు.

తన కుమారుడు సామాన్యుడు కాదనీ, జీవకోటికి తత్త్వజ్ఞానం ఉపదేశించటానికే కపిలుడై జన్మించాడనీ బ్రహ్మ చెప్పిన మాటలను గుర్తుకు తెచ్చుకొని, తన పతికి చేసినట్లు తనకూ తత్త్వోపదేశం చెయ్యమని తనయుడిని ప్రార్థించింది దేవహూతి. అప్పుడు, దేవహూతికి కపిల మహర్షి ఇలా చెప్పటం ప్రారంభించాడు–

**'అమ్మా! నన్నే ధ్యానించినవారికి మనస్సు ప్రసన్నం అవుతుంది. సుఖదుఃఖ ప్రభావం వారిపై పడదు. ఇది తెలిసినవాళ్ళు సదా నన్ను కొలుస్తారు. తెలియని వాళ్ళు బాధలు పడుతూనే ఉంటారు. ఎవరి పనిని వాళ్ళు చేయాలి. పవిత్రంగా ఉండాలి. నన్ను సేవించేవారినీ అర్చించాలి. ఆహారాన్ని మితంగా తీసుకోవాలి. అహింసనూ, సత్యాన్నీ పాటించాలి. కావలసినంతవరకే సంపాదించాలి. పరుల సొమ్ము కోసం పాకులాడకూడదు. ఇంద్రియాల్ని అదుపులో ఉంచుకోవాలి. సుఖదుఃఖాల్లో**

**ఒకేలా ఉండాలి. కర్మఫలాన్ని అనుభవించే వరకే సంసారం ఉంటుంది. పొగకంటే అగ్ని ఎలా వేరుగా ఉంటుందో ఆత్మ కూడా పరమాత్మతో కలియక వేరుగా ఉంటుంది. ఇదే ఆత్మస్వరూపం.**

కదలిక లేని జీవులకంటే కదలిక ఉన్న జీవులు శ్రేష్ఠమైనవి. వాటిలో ఉత్తమమైనవారు మానవులే. మానవులలో అందరికంటే ఉత్తములు ఎవరో తెలుసా? అన్ని ధర్మాల్నీ విడిచిపెట్టి నన్ను మాత్రమే శరణు కోరేవాళ్ళు. అటువంటి పరమ భాగవతులు ఎంచుకొనే మార్గమే భక్తియోగం' అంటూ కపిలాచార్యుడు ఆమెకు పిండోత్పత్తిక్రమం గురించీ, గర్భంలో ఉన్న జీవుడు పడే వేదన గురించీ చెప్పి, మానవులు ఆచరించవలసిన ఆచారాలను గురించీ ఇలా చెప్తున్నాడు–

**'అమ్మా! మానవుడు చెడ్డపనులు చేయటానికి కారణం అజ్ఞానం. సత్యం, శౌచం, దయ, ధైర్యం, మౌనం, బుద్ధి, ఓర్పు, సిగ్గు, కీర్తి, శాంతం మొదలైనవి ఉత్తమ గుణాలు. ఇవి చెడు సావాసాలవల్ల నశించిపోతాయి. స్త్రీవ్యామోహం అన్నింటికంటే పెద్ద దోషం. అన్ని అనర్థాలకూ ఇదే కారణం. నన్ను సేవించేవాళ్ళకి ఈ దుర్గుణం అంటుకోదు.**

**దేహంపై మమకారాన్ని విడిచిపెట్టాలి. గృహస్థుగా ఉంటూ ధర్మార్థకామాల కోసం పాటుపడాలి. దీనివల్ల దేవతలు ఆనందిస్తారు. పితృకర్మలు చేసిన మానవులు చంద్రలోకానికి వెళ్తారు. పుణ్యం నశించాక మళ్ళీ జన్మిస్తారు. కర్మలన్నింటినీ విడిచిపెట్టిన వాళ్ళు మాత్రమే శ్రీహరి పదాన్ని పొందుతారు. వీళ్ళకు మళ్ళీ జన్మ ఉండదు.**

దేవహూతి ఆనందంతో ఆయనకు నమస్కరించింది. కపిలాచార్యుడు వెళ్ళిపోయాక తపస్సు చేసి మోక్షాన్ని పొందింది. ఆవిడ మోక్షం పొందిన ప్రదేశానికే 'సిద్ధపదం' అని ప్రసిద్ధి వచ్చింది.

# స్కంధం - 4

'విదురా! స్వాయంభువ మనువుకు శతరూప ద్వారా ఆకూతి, దేవహూతి, ప్రసూతి అని ముగ్గురు కుమార్తెలూ; ప్రియవ్రతుడు, ఉత్తానపాదుడు అనే పేర్లుగల ఇద్దరు కుమారులూ జన్మించారు.

ఆకూతి భర్త 'రుచి' అనే ప్రజాపతి. ఇతడు చాలా గొప్పవాడు. సాక్షాత్తూ ఆ శ్రీమన్నారాయణుడే 'యజ్ఞుడు' అనే పేరుతో వీళ్ళిద్దరికీ కొడుకుగా పుట్టాడు. ఈ అవతారంలో జగన్మాత అయిన లక్ష్మీదేవి 'దక్షిణ' అనే పేరుతో జన్మించింది. వీరి సంతానమే తుషితులు అనే దేవగణం.

ప్రియవ్రతుడూ ఉత్తానపాదుడూ ప్రసిద్ధులై ఈ వంశాన్ని పెంపొందింపజేశారు. ఇక కర్దమ ప్రజాపతి పుత్రికలు కూడా బ్రహ్మర్షులను వివాహం చేసుకొని ఆ వంశాల్ని విస్తరింపజేశారు.

## దక్షుడి యాగం

దక్షప్రజాపతికి 16 మంది పుత్రికలు. వీళ్ళు తమ సంతానంతో సృష్టిని విస్తరింపజేశారు. వారిలో సతీదేవి అని ఒక సాధ్వీమణి ఉంది. ఆమె పరమేశ్వరుడి భార్య.

ఒకసారి సత్రయాగానికి దక్షప్రజాపతి వచ్చినప్పుడు శివుడు లేచి నిలబడి ఆయనను గౌరవించలేదట. 'నాకు అల్లుడై ఉండి కూడా శివుడు నన్ను గౌరవించలేదు' అని భావించి కోపంతో శివుణ్ణి నిందించాడు దక్షప్రజాపతి. అప్పటి నుండి వీళ్ళిద్దరి మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమంటోంది.

ఇదిలా ఉంటే కొన్నాళ్ళ తర్వాత దక్షుడు ఒక యాగాన్ని తలపెట్టాడు. అందరినీ ఆహ్వానించాడు. శివుణ్ణి పిలవలేదు. కానీ సతీదేవికి వెళ్ళాలని ఉంది. అందుకే ఇలా అడుగుతోంది శివుణ్ణి.

కం. **అనఘా! విను లోకంబున**
**జనకుని గేహమునఁ గలుగు సకలసుఖంబుల్**
**దనయలు జని సంప్రీతిన్**
**గనుఁగొన కేరీతి నిల్చుఁ గాయము లభవా !** (4-66)

పుణ్యాత్ముడా! పుట్టింట్లో కలిగే సుఖాల్ని కూతుళ్ళు కనులారా చూసి ఆనందించకుండా ఉండగలరా?

కం. **అనయము పిలువక యుండన్**
**జన ననుచిత మంటివేని జనకగురు సుహృ**
**జ్జననాయక గేహములకు**
**జనుచుందురు పిలువకున్న సజ్జను లభవా!** (4-67)

తండ్రి, గురువు, మిత్రుడు, రాజు మొదలైనవాళ్ళ ఇళ్ళకు పిలువకపోయినా సజ్జనులు వెళ్తారు. నువ్వు నాకు నీ శరీరంలో సగభాగం ఇచ్చి గౌరవించావు. ఇప్పుడు నా మాటను కూడా గౌరవించు' అంది శివుడితో.

**'పార్వతీ! విద్య, తపస్సు, ధనం, వయస్సు, రూపం, కులం, సజ్జనులకు ఉంటే అవి గుణాలవుతాయి. అవే దుర్జనులకు ఉంటే దోషాలు అవుతాయి. అలాంటి వాళ్ళు బంధువులే అయినా వాళ్ళ ఇంటికి వెళ్ళకూడదు. వెళ్తే అవమానం తప్పదు.** నేను నమస్కారం చేయలేదని దక్షుడికి కోపం. సర్వాంతర్యామి అయిన పరమాత్మకే నమస్కారం చేయాలి కానీ శరీరంపై మమకారం, అహంకారం ఉన్న వాళ్ళకు కాదు. అందుకే నేను దక్షుడికి నమస్కరించలేదు' అని మౌనం వహించాడు శివుడు.

సతీదేవి దక్షయాగానికి వెళ్ళింది. తల్లీ, అక్కా-చెల్లెళ్ళు ఆమెను ఆదరించారు కానీ దక్షుడు ఆదరించలేదు. అయినా సతీదేవి శాంతంగానే 'అయ్యా! పరమ శివుణ్ణి లోకమంతా కొలుస్తోంది. నీలాంటి **అధములకు మంచివాళ్ళ సుగుణాలు కనిపించవు. మధ్యములు ఇతరుల్లో ఉన్న చెడ్డగుణాల్ని గుర్తిస్తారు కానీ బయటకు చెప్పరు. ఉత్తములు ఇతరులలో ఉన్న చెడ్డ గుణాలను సైతం మంచి గుణాలుగానే స్వీకరిస్తారు.** నేను నీ కుమార్తెనైనందుకు సిగ్గుపడుతున్నాను' అంటూ యోగాగ్నిని పుట్టించుకొని ఆ అగ్నిలోనికి దూకి ప్రాణత్యాగం చేసింది.

నారదుడి ద్వారా ఈ వార్త విన్న శివుడు తన జటాజూటంలోని ఒక జడను విసిరి నేలపై కొట్టాడు. దాని నుండి వీరభద్రుడు ఆవిర్భవించి, దక్షయాగాన్ని ధ్వంసం చేశాడు. దక్షుడి తలను ఖండించి హోమగుండంలో విసిరివేశాడు.

బ్రహ్మదేవుడు వచ్చి శివుణ్ణి శాంతించమని వేడుకొన్నాడు. శివుడు కనికరించి దక్షుడితోసహా మరణించినవాళ్ళందరినీ తిరిగి బ్రతికించాడు.

ఇప్పుడు దక్షుడిలో మునుపటి అహంకారం లేదు. శివుణ్ణి స్తుతించాడు. యాగాన్ని

పూర్తిచేశాడు. వీరభద్రుడివల్ల యాగానికి కలిగిన దోషానికి పరిహారంగా 'విష్ణుయాగం' చేశాడు. సతీదేవి మళ్ళీ హిమవంతుడికీ మేనకకూ పార్వతిగా జన్మించి తిరిగి శివుణ్ణే వివాహమాడింది.

## ధ్రువుడి చరిత్ర

స్వాయంభువ మనువు పుత్రులలో ఒకడైన ఉత్తానపాదుడికి ఇద్దరు భార్యలు. పెద్ద భార్య సునీతి. చిన్న భార్య సురుచి. ఇతడికి చిన్న భార్యంటేనే ఎక్కువ ఇష్టం. సునీతి కొడుకు ధ్రువుడు. సురుచి కొడుకు ఉత్తముడు.

ఒకరోజు ఉత్తముడు తండ్రి ఒళ్ళో కూర్చొని ఉన్నాడు. అది చూశాడు ధ్రువుడు. తనూ తండ్రి ఒళ్ళో కూర్చోవాలని దగ్గరకు వెళ్ళాడు. అప్పుడు అతడి సవతి తల్లి సురుచి వచ్చి 'నా కడుపున పుట్టినవాడికే ఈ అవకాశం. నీకు లేదు. నీకూ ఇది దక్కాలంటే వెళ్ళు. వెళ్ళి ఆ విష్ణుమూర్తిని ధ్యానించు పో!' అని కసిరింది.

ధ్రువుడు తన తల్లి సునీతి అనుమతితో ఇల్లు విడిచి బయలుదేరాడు. దారిలో నారద మహర్షి కనిపించి 'నాయనా! పంతాలకు పోవటం మంచిది కాదు. నువ్వా! ముక్కుపచ్చలారని పసిబాలుడివి. వెనక్కి తిరిగి వెళ్ళు. **సుఖానికీ దుఃఖానికీ రెండింటికీ కారకుడు ఆ భగవంతుడే. ఈ విషయం తెలిసినవాడే జ్ఞాని. గుణవంతుణ్ణి చూసి సంతోషించాలి. గుణహీనుణ్ణి చూసి జాలిపడాలి. తనతో సమానమైనవాడితోనే స్నేహం చేయాలి. బాలుడివైన నీవిలా అడవులకు పోవటం తగదు'** అన్నాడు. ధ్రువుడు మనసు మార్చుకోలేదు.

'నిన్ను చూస్తుంటే ముచ్చటేస్తుంది. పట్టిన పట్టు విడిచిపెట్టేలా లేవు. సరే! ఇక్కడికి దగ్గరలో యమునానది ఉంది. ఆ నదీతీరంలో ఒక అద్భుతమైన వనం ఉంది. దాని పేరు మధువనం. అక్కడికి వెళ్ళి తపస్సు ప్రారంభించు. అది శ్రీహరికి నెలవు' అంటూ **'ఓం నమో భగవతే వాసుదేవాయ'** అన్న ద్వాదశాక్షరీ మంత్రాన్ని ఉపదేశించి వెళ్ళిపోయాడు.

* * *

ధ్రువుడు తీవ్ర తపస్సు ప్రారంభించాడు. దేవతలంతా ఆ తపస్సుకు భయపడి విష్ణుమూర్తిని శరణుజొచ్చారు. విష్ణుమూర్తి ప్రత్యక్షమై ధ్రువుడిపై అనురాగ వర్షాన్ని

కురిపిస్తూ 'నాయనా! ధ్రువకుమారా! నీ దీక్ష అమోఘం. నీకు ధ్రువమండలాన్ని ప్రసాదిస్తున్నాను. 60 వేల సంవత్సరాల తర్వాత అది నీకు లభిస్తుంది. అన్ని గ్రహాలు నీ మండలం చుట్టూ తిరుగుతూ ఉంటాయి. అన్నింటికంటే ఎత్తులో ఉండే నీ మండలం ప్రళయకాలంలో కూడా అలాగే ఉంటుంది' అని ఆశీర్వదించి వెళ్ళిపోయాడు.

రాజా! శ్రీహరిని ఆశ్రయించినవాళ్ళ వైభవానికి లోటు ఏముంటుంది? తరువాత ధ్రువుడు పెరిగి పెద్దవాడై 'భ్రమి' అనే కన్యను పెళ్ళిచేసుకొని రాజ్యాన్ని చక్కగా పరిపాలిస్తున్నాడు. అతడికి ఇద్దరు కొడుకులు పుట్టారు. వాళ్ళు కల్పుడు, వత్సరుడు. ధ్రువుడి తమ్ముడు ఉత్తముడు ఒకనాడు వేటకు వెళ్ళి ఒక యక్షుడి చేతిలో మరణించాడు. కొడుకును వెతుక్కుంటూ వెళ్ళి సురుచి కూడా దావాగ్నిలో చిక్కి మరణించింది. అప్పటికే తండ్రి ఉత్తానపాదుడు తపస్సు కోసం అడవులకు వెళ్ళిపోయాడు. తన సోదరుణ్ణి మట్టుపెట్టిన యక్షులపైకి ధ్రువుడు దండెత్తి చాలామందిని సంహరించాడు.

అప్పుడు అతడి తాత– స్వాయంభువమనువు అక్కడకు వచ్చి 'నాయనా! ధ్రువా! నీ తమ్ముడు ఒక్కడిని చంపారన్న కోపంతో ఇంతమందిని చంపడం న్యాయంకాదు. శ్రీహరి భక్తులు జీవహింస చేయరు. **మనకంటే గొప్పవాడిపట్ల సహనం, సమానమైనవాడిపట్ల స్నేహం, తక్కువ వారిపట్ల దయ, ఇతర ప్రాణులపట్ల సమభావం ఉండాలి. అటువంటివాడినే భగవంతుడు అనుగ్రహిస్తాడు'** అని చెప్పి యక్షనాయకుడైన కుబేరుడితో ధ్రువుడికి సంధిచేశాడు.

ధ్రువుడు 26 వేల సంవత్సరాలు రాజ్యపాలన చేసి, శ్రీమన్నారాయణుడు పంపిన ఒక దివ్యవిమానంలో తల్లి సునీతితో సహా విష్ణుపదాన్ని చేరుకున్నాడు. ఇదే వంశంలో కొన్ని తరాల తర్వాత 'వేనుడు' అనే లోక కంటకుడు జన్మించాడు.

## వేనుడు

వేనుడి తండ్రి అంగరాజు. తల్లి సునీథ. వేనుడి దుండగాలను భరించలేక అంగరాజు ఇల్లు విడిచి వెళ్ళిపోయాడు. వేనుడే రాజు అయ్యాడు. వాడి అఘాయిత్యాలను భరించలేక మహర్షులు హుంకరించారు. అంతే! వేనుడి ప్రాణాలు గాలిలో కలసిపోయాయి.

**రాజులేని రాజ్యం చోరులకూ జారులకూ నిలయమైపోతుంది.** రాజుకోసం మునులు ఆ వేనుడి తొడను మథించారు. అందులో నుంచి నల్లగా భీకరంగా ఉన్న ఒక పొట్టి వేటగాడు వచ్చాడు. వాడు పుట్టీపుట్టగానే 'నేను ఏం చేయాలి?' అని అడిగాడు. మహర్షులు 'కూర్చో' (నిషీద) అన్నారు. అందుకని వాడు నిషాదుడు అయ్యాడు. ఈసారి మహర్షులు వేనుడి హస్తాల్ని మథించారు. అందులో నుండి ఒక అవతార పురుషుల జంట ఆవిర్భవించి భార్యభర్తలయినారు. ఆ జంటే పృథుచక్రవర్తి, అర్చి. పృథుచక్రవర్తి చేతిలో చక్రాలూ, పాదాలలో శుభరేఖలూ ఉన్నాయి.

## పృథుచక్రవర్తి చరిత్ర

తరువాత పృథువు చక్రవర్తి అయ్యాడు. వందిమాగధులు అతణ్ణి స్తుతిస్తుంటే వారితో ఇలా అన్నాడు– 'నాలో ఏ మహిమా లేదు. ఇదంతా శ్రీహరి అనుగ్రహమే! మీరు కీర్తించవలసినది ఆ శ్రీమన్నారాయణుణ్ణే. నన్ను కాదు. **గొప్పవాళ్ళు ఆత్మస్తుతినీ పరనిందనూ అసహ్యించుకుంటారు సుమా!'** అన్నాడు. అదీ పృథుచక్రవర్తి సంస్కారం.

ఒకసారి తీవ్రమైన అనావృష్టి వచ్చింది. ప్రజలకు తిండిలేదు. దానికి కారణమైన భూదేవిని దండించాలని పృథువు బయలుదేరాడు. భూమి ఆవు రూపాన్ని ధరించి పారిపోయింది. రాజు వెంటపడ్డాడు.

అప్పుడు భూదేవి **'రాజా! తేనెటీగ చాకచక్యంగా పువ్వు నుండి తేనెను ఆస్వాదిస్తుంది. దేనికైనా ఒక పద్ధతి ఉంటుంది. ఎంత విద్వాంసుడైనా ఇష్టం వచ్చినట్లు ప్రవర్తిస్తే ఫలితం పొందలేడు.** పూర్వం బ్రహ్మదేవుడు నాలో ఉంచిన ఓషధులను దుర్జనులు పీల్చి పిప్పి చేశారు. ఒకవైపు యజ్ఞయాగాదులు లేవు. నాకు ఆదరణే కరవయింది. మిగిలిన కొద్దో గొప్పో ఓషధుల్ని నేను మింగివేశాను. అవి నాలో జీర్ణించుకుపోయాయి. వాటిని నువ్వు తిరిగి పొందాలంటే 'దోహనక్రియ' చేపట్టాలి. అప్పుడు నా పొదుగు నుండి వాటిని పొందవచ్చు' అని చెప్పింది.

పృథువు ఆమె చెప్పినట్లుగా మనువును దూడగా చేసి, తానే పాలు పితికేవాడి అవతారం ఎత్తి పితికాడు. ఓషధులు లభించాయి. జనులంతా సంతోషించారు. ఆ తర్వాత మహర్షులూ దేవగణాలూ ఎవరికి కావలసినవాటిని వాళ్ళు భూమి నుండి పిండుకున్నారు.

పృథువు 99 యాగాలు పూర్తి చేశాడు. నూరో యాగం కూడా మొదలయ్యింది. యాగాశ్వాన్ని విడిచిపెట్టాడు. దాన్ని ఇంద్రుడు రెండుసార్లు అపహరించాడు. పృథువు కుమారుడు రెండుసార్లు ఇంద్రుణ్ణి ఓడించి ఆ అశ్వాన్ని తిరిగి తీసుకువచ్చాడు. అందువల్ల అతడికి 'జితాశ్వుడు' అనే పేరు వచ్చింది. 99 యాగాలు చేసిన ఫలం మాత్రమే పృథుచక్రవర్తికి లభించింది.

యజ్ఞభోక్త శ్రీమన్నారాయణుడే ఇంద్రుణ్ణి వెంటబెట్టుకొని వచ్చి 'రాజా! సజ్జనులకు శరీరంపై అభిమానం ఉండదు. అందుకే వాళ్ళు ఎవరికీ ద్రోహం తలపెట్టరు. నువ్వు తొందరపడి ఇంద్రుణ్ణి శిక్షిస్తే ఇప్పటివరకూ నువ్వు సంపాదించుకొన్న పుణ్యమంతా పోతుంది. శరీరం, ఆత్మ ఒకటి కాదు. ఇది తెలిస్తే శరీర గుణాలు ఆత్మకు అంటుకోవు. స్వధర్మాన్ని ఆచరిస్తూ ఏ కోరికా లేకుండా నిత్యం నన్నే సేవించేవాడి మనసెప్పుడూ ప్రశాంతంగా ఉంటుంది. కాబట్టి సుఖదుఃఖాలను ఒకేలా చూడు.

**రాజుకు ప్రజారక్షణ ప్రథమ కర్తవ్యం. ప్రజలు చేసిన పుణ్యంలో ఆరోవంతు రాజుకు దక్కుతుంది. పరిపాలన సరిగ్గా చేయని రాజుకు ప్రజలు చేసిన పాపాలు చుట్టుకుంటాయి. యాగాలు, తపస్సులూ చేసినా నేను వశం కాను. కాని సజ్జనులకు వశమౌతాను' అని చెప్పి వెళ్ళిపోయాడు.**

* * *

పృథువు ఒకరోజు తన సభాసదుల్ని ఉద్దేశించి **'మహానుభావులారా! ప్రజలు చేసే మంచి పనులే రాజుకు రక్ష. ధనం మీద వ్యామోహంతో రాజు పన్ను వసూలు చేయకూడదు. అలా చేస్తే ప్రజలు చేసిన పాపాలు రాజుకే సంక్రమిస్తాయి. మీరూ మంచి పనులే చేయండి. అన్ని కర్మల్నీ వాసుదేవుడికే అర్పించండి.** అదే మీరు నాకు చేసే మేలు' అన్నాడు.

సరిగ్గా అదేసమయానికి సనకాది మహర్షులు అక్కడికి విచ్చేసి ముక్తిమార్గాన్ని ఉపదేశించారు. ఆ మార్గంలో సాధన చేసి పృథుచక్రవర్తి ముక్తిని పొందాడు. అతడి భార్య కూడా అతణ్ణే అనుసరించింది.

పృథువు తర్వాత జితాశ్వుడు రాజు అయ్యాడు. ఇతడి భార్య శిఖండిని. వీరికి పావకుడు, పవమానుడు, శుచి అనే పేర్లతో త్రేతాగ్నులే పుత్రులుగా జన్మించారు.

## ప్రాచీనబర్హి

ఈ వంశంలోనే 'బర్హిష్మదుడు' అనే గొప్ప రాజు ఉండేవాడు. అతడు తూర్పుదిక్కున కొనలు కలిగిన దర్భల్ని భూమండలమంతా పరిచి 'ప్రాచీనబర్హి'గా పేరుపొందాడు. ఇతడి భార్య శతధృతి. వీరికి 'ప్రచేతసులు' అని పదిమంది పుత్రులు.

తండ్రి ఆజ్ఞపై ప్రచేతసులు ప్రజాసృష్టి కోసం తపస్సుకు బయలుదేరారు. దారిలో 'రుద్రుడు' కన్పించి నారాయణ స్తోత్రాన్ని ఉపదేశించాడు. దీనికే యోగాదేశ స్తోత్రమనీ పేరు.

ప్రచేతసులు పదివేల సంవత్సరాలు ఆ స్తోత్రాన్ని పఠిస్తూ నీటి మధ్యలో ఉండి తపస్సు చేశారు. సాక్షాత్తూ శ్రీమన్నారాయణుడి అనుగ్రహాన్ని పొంది, తపస్సు చాలించి బయటకు వచ్చారు. చుట్టూ చూశారు. ఎక్కడ చూసినా చెట్లే. కాలు మోపే వీలు లేదు. కోపం వచ్చింది. తమ ముఖాలనుండి అగ్నితో కూడిన గాలుల్ని సృష్టించారు. ఆ వేడికి చెట్లు మలమల మాడిపోతున్నాయి.

అప్పుడు బ్రహ్మదేవుడే వచ్చి వాళ్ళను శాంతింపజేశాడు. చెట్లన్నీ వచ్చి తమ పుత్రిక అయిన మారిషను వీరికి సమర్పించాయి. బ్రహ్మదేవుడి ఆజ్ఞతో వాళ్ళు మారిషను వివాహం చేసుకున్నారు. ఆ మారిషయందు దక్షుడే వీరికి పుత్రుడుగా జన్మించాడు.

అక్కడ ప్రాచీనబర్హికి జ్ఞానమార్గం చూపాలని నారదుడే స్వయంగా విచ్చేశాడు. అతడికి పురంజనుడు అనే రాజు కథను ఉదాహరణగా చెప్పి ఇలా అన్నాడు:

**'రాజా! ఈ సంసారం తొలగిపోవాలంటే వాసుదేవుడి పాదాలే దిక్కు. భాగవతుల్ని సేవించాలి. భగవంతుడి కథల్ని వినాలి.'**

ప్రాచీనబర్హి ఆ మార్గంలోనే సాధన చేసి విముక్తిని పొందాడు" అన్నాడు సూతమహర్షి.

మైత్రేయుడి మాటలు విన్న విదురుడూ, శుక మహర్షి బోధనల ద్వారా పరీక్షిన్మహారాజూ, సూత మహర్షి మాటలకు శౌనకాది మహర్షులూ పులకించిపోతున్నారు.

# స్కంధం - 5

"**శౌ**నకాది మహర్షులారా! శుక మహర్షి ఇలా చెబుతున్నాడు. 'రాజా! ప్రియవ్రతుడు విశ్వకర్మ కుమార్తె అయిన బర్హిష్మతిని పెళ్ళాడాడు. వీళ్ళకు పదిమంది పుత్రులు, ఒక కుమార్తె కలిగారు. మరో భార్య ద్వారా ముగ్గురు కుమారుల్ని పొందాడు ప్రియవ్రతుడు. వాళ్ళు ఉత్తముడు, తామసుడు, రైవతుడు.

ప్రియవ్రతుడు ఒకసారి సూర్యుడికి అవతల ఉండే చీకటిని రూపుమాపాలని రథంపై బయలుదేరాడు. ఆ రథచక్రాల రాపిడికి గాడిపడి సప్తసముద్రాలు ఏర్పడ్డాయి. వాటి మధ్య భాగంలోని భూములే సప్తద్వీపాలయ్యాయి. అవే జంబూ, ప్లక్ష, శాల్మలీ, కుశ, క్రౌంచ, శాక, పుష్కర ద్వీపాలు.

వాటిలో జంబూద్వీపం లక్ష యోజనాల విస్తీర్ణం కలది. ఇవి ఒకదానికంటే ఒకటి రెట్టింపు వైశాల్యంలో ఉంటాయి. ఈ ద్వీపాల మధ్యలో ఉప్పు, చెరకు, మద్యం, నెయ్యి, పాలు, పెరుగు, మంచినీటి సముద్రాలు ఉన్నాయి. ఒక ద్వీపంతో ఇంకో ద్వీపం కలసిపోకుండా ఉండేందుకే ఈ సముద్రాలు ఏర్పడ్డాయి. ఇది ఒక అద్భుతం.

ప్రియవ్రతుడు తన మొదటి ఏడుగురు కుమారులకూ ఒక్కొక్క ద్వీపాన్ని ఇచ్చాడు. కుమార్తెను భార్గవుడికి ఇచ్చి వివాహం చేశాడు. చివరికి అన్నీ విడిచి ముక్తిని పొందాడు. ఇతడి వంశం క్రమంగా వృద్ధి చెందింది. ఇతడి వంశంలోనే 'నాభి' అనే చక్రవర్తి ఉన్నాడు. అతడి భార్య మేరుదేవి. వీరికి శ్రీమన్నారాయణుడే పుత్రుడిగా అవతరించాడు. పేరు ఋషభుడు.

## ఋషభావతార కథ

ఋషభుడికి రాజ్యాన్ని అప్పగించి తాను బదరికాశ్రమానికి వెళ్ళిపోయాడు నాభి చక్రవర్తి. ఋషభుడి భార్య ఇంద్రుడి కుమార్తె జయంతి. వీరికి భరతుడు మొదలైన వందమంది పుత్రులు జన్మించారు. ఇతడి పేరుమీదనే అప్పటిదాకా అజనాభం అనే పేరు కల వర్షం భరతవర్షంగా ప్రసిద్ధికెక్కింది.

భరతుడు తన సోదరుల్లో తొమ్మిదిమందిని తొమ్మిది ప్రాంతాలకు ప్రధానులుగా నియమించాడు. ఆ ప్రాంతాలకూ వారివారి పేర్లమీదనే ప్రసిద్ధి లభించింది. తక్కిన

సోదరులూ అన్నగారి మాటను జవదాటని ఉత్తములు. ఋషభుడు ఒకరోజు తన కొడుకులతో–

**'నాయనలారా! కామానికి లొంగితే నానా కష్టాలు పడాలి. తపస్సు వల్లనే సుఖమూ, ఆనందమూ లభిస్తాయి. కోరికలకు దూరంగా ఉండండి. తపస్సుకు దగ్గరవ్వండి. దీనుల్ని, వృద్ధుల్ని రక్షించండి. స్త్రీ వ్యామోహం– సంసారాన్ని నరకం చేస్తుంది. సజ్జన సాంగత్యం– మోక్షానికి బాటలు వేస్తుంది.**

**శరీరం అశాశ్వతం! దానికోసం పాపాలు చేయకండి. నిశ్చలమైన భక్తి, కోరికలు లేకపోవటం, సహనం, సహానుభూతి, జ్ఞానం, తపస్సు, సత్కథాశ్రవణం, కీర్తనం, సమబుద్ధి, నిరహంకారం, యోగం, కర్తవ్యనిష్ఠ, శ్రద్ధ, బ్రహ్మచర్యం, మొదలైనవి ముక్తిమార్గాలు. ఇవి అందరికీ తెలియవు. తెలిసినవాడు చెప్పాలి.** వీటిని మీరు ఆచరించండి. మీ అన్న భరతుడు చెప్పినట్లు నడుచుకోండి' అంటూ రాజ్యాన్ని భరతుడికి అప్పగించి వెళ్ళిపోయాడు. కొన్నాళ్ళు జడుడిలా, చెవిటివాడిలా, మూగవాడిలా, పిచ్చివాడిలా తిరుగుతూ కాలం గడిపాడు. మరి కొన్నాళ్ళు కొండ చిలువలా పడి ఉన్నాడు. చివరికి పరబ్రహ్మంలో ఐక్యమైపోయాడు.

## భరతుడి చరిత్ర

భరతుడి భార్య– విశ్వరూపుడి పుత్రిక అయిన 'పంచజని'. వీళ్ళకు ఐదుగురు పుత్రులు. వేదోక్తంగా కర్మల్ని ఆచరిస్తూ యాభైలక్షల సంవత్సరాలు రాజ్యపాలన చేసి చివరికి పుత్రులకు రాజ్యాన్ని అప్పగించి పులహాశ్రమానికి వెళ్ళాడు భరతుడు. ఒకరోజు నీటిలో నిలబడి సంధ్యావందనం చేస్తున్నాడు. నిండు చూలాలుగా ఉన్న ఒక జింక వచ్చి ఆ నదిలోనే నీళ్ళు తాగుతోంది. అంతలో సింహగర్జన. విని భయంతో ఒక్క గెంతు గెంతింది ఆ జింక. అంతే! దాని గర్భంలో నుండి పిల్ల జారి నీటిలో పడింది. జింక చచ్చి పోయింది. భరతుడు జాలితో ఆ జింకపిల్లను తన ఆశ్రమానికి తీసుకువెళ్ళాడు.

అప్పటినుండీ దాని ఆలనా పాలనా చూడటంతోనే సరిపోయేది భరతుడికి. క్రమంగా తపస్సు, అనుష్ఠానం అన్నీ అటకెక్కేశాయి. ఒకసారి ఆ జింకపిల్ల కనిపించకుండా పోయింది. తల్లడిల్లిపోయాడు భరతుడు. చివరికి తిరిగి వచ్చింది. అప్పటికిగానీ భరతుడి మనస్సు కుదుటపడలేదు. ఈ విధంగా ఆ జింకనే తలుచుకుంటూ

మరణించాడు. తరువాత జన్మలో తానూ జింకగా పుట్టాడు. పూర్వజన్మ జ్ఞానం వల్ల మళ్ళీ పులహాశ్రమానికి చేరుకున్నాడు. అక్కడ ఆ జింకశరీరాన్ని విడిచిపెట్టాడు.

తరువాత జన్మలో ఒక బ్రాహ్మణుడికి జన్మించాడు. హరిభక్తి అలవడింది. నిత్యం శ్రీహరినే ధ్యానిస్తూ ఉంటే అతడిని చూసి అందరూ పిచ్చివాడేమోననుకున్నారు. కొంతకాలానికి తండ్రి మరణించాడు. సవతి సోదరుల దగ్గరే ఇతడు ఉండేవాడు. వాళ్ళు ఇతణ్ణి రాచిరంపాన పెట్టేవాళ్ళు. భరతుడికి ఎంతమాత్రం బాధ కలిగేది కాదు. సోదరులు ఇతణ్ణి పొలానికి కాపలాపెట్టారు.

వీళ్ళు ఉంటున్న రాజ్యానికి రాజు వృషలుడు. ఇతడికి సంతానం లేదు. ఎవరినైనా భద్రకాళికి బలి ఇస్తే సంతానం కలుగుతుందని ఎవరో చెప్పారు. భటుల్ని పంపించి ఎవరినైనా తీసుకురమ్మని పంపాడు.

ఆ భటులు ఈ భరతుణ్ణి పట్టుకొని తీసుకువచ్చి బలి ఇవ్వబోయారు. అంతలో కాళికాదేవి ప్రత్యక్షమయ్యింది. భరతుడి ముఖంలోని బ్రహ్మతేజస్సు చూసి వణికిపోయింది. రాజుపైనా అతడి పరివారంపైనా విరుచుకుపడింది. ఎక్కడివాళ్ళు అక్కడ పారిపోయారు.

భరతుడు ఇంటికి తిరిగివచ్చి యథాప్రకారం పొలానికి కాపలా ఉంటున్నాడు. కొంతకాలం తర్వాత సింధు దేశపు రాజు 'రహూగణుడు' కపిల మహర్షిని కలిసి అతడి నుండి తత్త్వజ్ఞానం పొందాలని పల్లకిపై అటువైపు వెళ్తున్నాడు. ఆ పల్లకి బోయీలు ఈ భరతుడిచేత పల్లకి మోయించారు. పల్లకిని సరిగా మోయడం లేదని రాజు భరతుణ్ణి నిందించాడు.

అప్పుడు భరతుడు 'రాజా! నాకు ఇవేవీ పట్టవు. నన్ను ఏమన్నా ప్రయోజనం లేదు. రాజునన్న అహంకారంతో నువ్వు నన్ను నిందిస్తున్నావు' అన్నాడు.

రాజు పల్లకి దిగి అతడి కాళ్ళపై పడ్డాడు. 'మహానుభావా! నన్ను అనుగ్రహించడానికి మారువేషంలో వచ్చిన కపిల మహర్షివా? ఎందుకిలా సంచరిస్తున్నావు' అని అడిగాడు.

'రాజా! పొయ్యిమీద పెట్టిన కుండ వేడెక్కుతుంది. ఆ వేడివల్ల అన్నం ఉడుకుతుంది. అలాగే జీవుడు శరీరాన్ని ఆశ్రయించి సంసారంలో శిక్షను అనుభవిస్తాడు. శ్రీహరిని సేవిస్తే దాని నుండి విముక్తి.

గుణాలు ఉన్నంతకాలం ధర్మాధర్మాలు పుడుతూనే ఉంటాయి. గుణాలు నశిస్తేనే

ముక్తి. అందుకే ముందు మనస్సును బంధించాలి. దానికి ఆయుధం హరిభక్తి.

ఫలానికి మూలం కర్మ. దానికి కారణం సంసారం. సంసారంలో మనస్సు చిక్కుకొని తిరుగుతున్నంతసేపూ తత్త్వం బోధపడదు.

నీకు అహంకారం ఉంది. ప్రజల్ని బెదిరిస్తున్నావు. కాబట్టి నీకు పూజార్హత లేదు. పెద్దలను సేవించినవాడు సంసార మోహంలో పడడు. మోక్షాన్ని పొందుతాడు.

**ఈ సంసారం ఒక పెద్ద అడవి. కామం క్రోధం మొదలైనవి దొంగలు. ఇంద్రియాలకు వశమైన మానవుల్ని ఈ దొంగలు పట్టి పీడిస్తారు. దాచుకున్న పుణ్యం అనే ధనాన్ని దోచుకుంటారు. భార్యాపుత్రులు తోడేళ్ళలాంటివాళ్ళు. అడవిలో కొరివి దెయ్యాన్ని చూసి నిప్పు అని భ్రమపడినట్లు ధనం కోసం మానవుడు అందరి చుట్టూ తిరుగుతాడు. తాపత్రయాలు, కక్షలు, కార్పణ్యాలు ముళ్ళై గుచ్చుకుంటాయి.** కాబట్టి రాజా! జ్ఞానం అనే ఖడ్గంతో ఈ ముళ్ళదారిని సరిచేసుకోవాలి' అన్నాడు భరతుడు.

రాజుకు జ్ఞానోదయం అయింది.

భరతుడి వంశంలోనే 'గయుడు' విష్ణుభక్తుడిగా ఉత్తముడిగా పేరుతెచ్చుకున్నాడు. ప్రియవ్రతుడి వంశంలో చివరివాడు విరజుడు. ఇతడూ ఉత్తముడని పేరుతెచ్చుకున్నాడు' అంటూ శుక మహర్షి ఇంకా భూగోళం గురించీ 'ఖగోళం గురించీ' నరక లోకం గురించీ పూసగుచ్చినట్లు వివరించాడు.

# స్కంధం - 6

**సూ**త మహర్షి ఇలా అన్నాడు – "మునులారా! పరీక్షిత్తు కోరికపై శుక మహర్షి ఇలా చెప్తున్నాడు. 'రాజా! తెలివైన వైద్యుడు రోగానికి కల మూలకారణాన్ని గమనించి, వైద్యం చేస్తాడు. అప్పుడు రోగం తగ్గిపోతుంది. అలాగే మానవుడు పాపాలకు ఏది కారణమో దాన్ని అంతం చేసుకోవాలి' అన్నాడు. పరీక్షిత్తు దీర్ఘంగా ఆలోచిస్తూ–

'మహర్షీ! తెలిసికూడా తన స్వభావ దోషంవల్ల పాపంచేసే మూఢుడికి పాపపరిహారం ఉంటుందా?' అని అడిగాడు.

**'ఎంతటి పాపకృత్యాలు చేసినవాడైనా శ్రీమన్నారాయణుడి పేరు భక్తితో కాని,**

**తెలియక కాని పలికితే చాలు, అది వాడి పాపాలను దహించివేస్తుంది. ఇందుకు, అజామిళ వృత్తాంతమే ఉదాహరణ'** అంటూ శుక మహర్షి ఇలా ప్రారంభించాడు.

## అజామిళుడి కథ

'రాజా! పూర్వం కన్యాకుబ్జం అనే నగరంలో 'అజామిళుడు' అనే పేరుగల ఒక బ్రాహ్మణుడు ఉండేవాడు. ఇతడికి లేని చెడ్డ గుణం లేదు. కటిక దరిద్రుడు. పదిమంది కొడుకులు. ఆ కొడుకులలో చిట్టచివరివాడి పేరు నారాయణుడు. వాడంటే అజామిళుడికి ఎంతో ఇష్టం. చివరి ఘడియల్లో ఉన్న అజామిళుడు కొడుకుపై వ్యామోహంతో 'నారాయణా! నారాయణా! అని పిలుస్తున్నాడు.

యమకింకరులు వచ్చారు. అజామిళుడు వణకిపోయాడు. ఒకప్రక్క కొడుకుపై మమకారం, 'నారాయణ! నారాయణ!' అని అంటూనే ఉన్నాడు. యమకింకరులు పాశం వేసి అతడి ప్రాణాలు గుంజుతున్నారు. ఇంతలో విష్ణుదూతలు వచ్చి అడ్డుపడ్డాడు.

యమకింకరులు వినయంగా 'అయ్యా! వేదాలలో చెప్పిన విధంగా అందరూ ఆచరించేదే ధర్మం. వేదాల్లో చెప్పనిది ఏదైనా అధర్మమే! ఆ ధర్మం నారాయణ స్వరూపం. సమస్త ప్రాణులకూ వాటివాటి కర్మలనుబట్టి శిక్షలు ఉంటాయి. ఇప్పుడు మీరు ఈ క్రమానికి అడ్డుతగిలారు. **లోకంలో జనులు మూడు రకాలుగా ఉంటారు. కొందరు శాంతమూర్తులు. వీరిది ధర్మమార్గం. మరికొందరు ఘోరమైన స్వభావంకల వాళ్ళు. వీళ్ళది అధర్మమార్గం. ఇంకొందరు మూర్ఖులు. వీళ్ళు అటూ ఇటూ కాకుండా ఉంటారు.** ఈ అజామిళుడు పూర్వజన్మలో కొన్ని మంచి పనులు చేశాడు. అందుకే ఈ జన్మలో ఉత్తముడిగా పుట్టాడు. కానీ ఏం లాభం? మొదట మంచివాడే. తరువాత కామానికి లొంగిపోయాడు. అందుకే నరకానికి తీసుకుపోతున్నాం' అన్నారు.

అప్పుడు విష్ణుదూతలు నవ్వుతూ 'అన్నీ తెలిసినవాడు ఏది చేస్తే దాన్నే లోకం అనుసరిస్తుంది. ధర్మరాజైన యముడి అనుచరులు అయివుండి మీరే ఇలా చేస్తే ఎలా? అజామిళుడు ఎన్నో పాపాలు చేశాడు. నిజమే! కానీ చివరి దశలో శ్రీహరి నామాన్ని పలికి పుణ్యాత్ముడు అయ్యాడు. **హరినామస్మరణ వల్ల మోక్షం కలుగుతుంది. ఏ రకంగా చేసినా ఫలితం వచ్చి తీరుతుంది' అన్నారు.**

యమకింకరులకు కనువిప్పు కలిగింది. అజామిళుడి బంధనాలు తొలగించి, విష్ణుదూతలకు నమస్కరించి, వెళ్ళిపోయారు. అజామిళుడు ఊపిరి పీల్చుకొన్నాడు. విష్ణుదూతలకు నమస్కరించాడు. వాళ్ళు వైకుంఠానికి వెళ్ళిపోయారు. తరువాత అజామిళుడు బుద్ధి తెచ్చుకుని శ్రీహరినే ధ్యానిస్తూ ముక్తిని పొందాడు.

**హరిభక్తుల మాటలు నాశనం లేని పుణ్యాల మూటలు. ముక్తి అనే కాంత విహరించే తోటలు. అరిషడ్వర్గం చొరబడని అరుదైన కోటలు.**

* * *

యమకింకరులు వెళ్ళి జరిగినదంతా యమధర్మరాజుకు చెప్పారు. అప్పుడు యముడు తన సేవకులతో 'ఇకనుండి హరిభక్తుల జోలికి వెళ్ళకండి. హరిభక్తులు కానివాళ్ళను మాత్రం రెక్కలు విరచిమరీ ఇక్కడికి తీసుకురండి' అని ఆజ్ఞాపించాడు.

'రాజా! యథాలాపంగా స్మరించినందుకే అజామిళుడు మోక్షాన్ని పొందాడే! మరి ఇష్టంగా ఆ శ్రీహరిని ధ్యానిస్తే ఎంత ఫలితం వస్తుందో వేరే చెప్పాలా?'

ప్రచేతసులకూ మారిష అనే కన్యకూ దక్షుడే తిరిగి జన్మించాడని చెప్పాను కదా! ఆ దక్షుడు సుర-గరుడ- ఉరగ-యక్ష-కిన్నర-కింపురుషాది గణాలను, పర్వతాలను, నదులను, వృక్షాలను సృష్టించాడు. అయినా తృప్తి కలగలేదు. తపస్సు చేశాడు. శ్రీమన్నారాయణుడు ప్రత్యక్షమయ్యాడు. అప్పుడు దక్షుడు 'హంసగుహ్యస్తవ రాజం' అనే స్తోత్రంతో శ్రీహరిని స్తుతించాడు. తరువాత శ్రీహరి ఆజ్ఞమేరకు పంచజన ప్రజాపతి కుమార్తె 'అసిక్ని'ని వివాహం చేసుకొన్నాడు. వీళ్ళకు పదివేల మంది హర్యశ్వులు అనే పేరుగల పుత్రులు కలిగారు. వీళ్ళు సంసారం వద్దన్నారు. మోక్షం కోసం ప్రయత్నిస్తామని వెళ్ళిపోయారు. వీళ్ళకి ఈ ఆలోచన కలిగించినది నారద మహర్షి. ఈసారి దక్షుడు 'శబళాశ్వులు' అనే కొన్ని వేల మంది పుత్రుల్ని పొందాడు. వాళ్ళనూ నారదుడు అదే బాట పట్టించాడు. ఇలా చేసినందుకు దక్షుడికి నారదుడిపై కోపం వచ్చింది. 'నువ్వు లోకసంచారం చేస్తూ ఉంటావు' అని నారదుణ్ణి శపించాడు.

తనను శపించినా నారదుడు అతణ్ణి ఏమీ అనలేదు. తాను బాధపడనూలేదు. అంతటి శాంతమూర్తి నారద మహర్షి.

దక్ష ప్రజాపతి ఈసారి 60 మంది పుత్రికల్ని పొందాడు. వాళ్ళందరినీ పెంచి పెద్దచేసి, వివాహాలు జరిపించాడు. వీళ్ళ ద్వారానే సమస్త గణాలూ పుట్టాయి.

కశ్యపుడి భార్యలలో వినత, కద్రువ, పతంగి, యామిని మొదలైన వాళ్ళు న్నారు. వినతకు అనూరుడు, గరుత్మంతుడూ జన్మించారు. అనూరుడు సూర్యుడికి రథసారథి అయ్యాడు. గరుత్మంతుడు శ్రీమహావిష్ణువుకు వాహనం అయ్యాడు. కద్రువకు నాగులు, పతంగికి పక్షులు, యామినికి మిడతలు సంతానం. దనువుకు దానవులూ, తిమికి జలచరాలూ, అరిష్టకు గంధర్వులూ సంతానం.

దనువు సంతానం 18 మంది దానవులు. వారిలో స్వర్భానువు ఒకడు. ఇతడికి సుప్రభ అనే కుమార్తె ఉంది. ఈమెను 'నముచి' పెళ్ళి చేసుకున్నాడు. ఆ పదునెన మండుగురు దానవులలో వృషపర్వుడొకడు. ఆతనికి శర్మిష్ఠ అనే కుమార్తె ఉంది. ఆమెను యయాతి మహారాజు పెళ్ళిచేసుకున్నాడు.

పురాణ పురుషుడైన శ్రీమన్నారాయణుడే అదితికి పుత్రుడై జన్మించాడు. ఇంకా అదితికి 12 మంది పుత్రులు జన్మించారు. వారిలో వామనుడు ఒకడు. ద్వాదశ ఆదిత్యులలో ఒకడైన వివస్వంతుడికి (సూర్యుడికి) సంజ్ఞాదేవియందు మనువు, యముడు, యమున, అశ్వినీదేవతలు కలిగారు. ఛాయాదేవియందు శనైశ్చరుడు, సావర్ణి అనే పుత్రులూ, తపతి అనే కుమార్తె కలిగారు. తపతి సంవరణుణ్ణి వివాహమాడింది. అదితి పుత్రుడైన అర్యముడికీ అతడి భార్య మాతృకకూ చర్షణులు పుట్టారు. వీరి ద్వారా మనుష్య జాతి విస్తరించింది.

## నారాయణ కవచం

దేవేంద్రుడు అధికార గర్వంతో ఒకసారి బృహస్పతిని గౌరవించలేదు. దానికి బృహస్పతికి కోపం వచ్చింది. వెళ్ళిపోయాడు. ఇదే తగిన సమయమని దానవులు దేవతలపై దండెత్తారు.

'గురువును గౌరవించకపోవడమే ఈ అనర్థానికి కారణం. త్వష్టప్రజాపతి కుమారుడైన విశ్వరూపుణ్ణి గురువుగా ఉండమని అభ్యర్థించండి' అని బ్రహ్మదేవుడు దేవతలకు సలహా ఇచ్చాడు.

దేవతలు వెళ్ళి విశ్వరూపుణ్ణి ప్రార్థించారు. దానికి విశ్వరూపుడు 'నేను మీకు

ఆచార్యుడిగా ఉంటే నా తేజస్సు తగ్గిపోతుంది. అయినా అంగీకరిస్తున్నాను. గురువు ప్రత్యేకంగా ధనాన్ని కూడబెట్టవలసిన అవసరం లేదు. శిష్యులే గురువుకు తరగని ధనం.' అంటూ వారిని అనుగ్రహించాడు. శుక్రాచార్యుడు తన విద్యద్వారా దానవులకు సంపాదించిపెట్టిన స్వర్గసంపదకన్నా రెట్టింపు ఐశ్వర్యం దేవతలకు వచ్చేలా చేసి ఇంద్రుడికి నారాయణ కవచాన్ని ఉపదేశించాడు.

పూర్వం ఈ స్తోత్రాన్ని పఠించి 'కౌశికుడు' అనే బ్రాహ్మణుడు శరీరాన్ని విడిచిపెట్టాడు. అతడి అస్థిపంజరం పైనుండి విమానంలో చిత్రరథుడు అనే గంధర్వుడు వెళ్తున్నాడు. అకస్మాత్తుగా అతడి విమానం ఆగిపోయి నేలకు ఒరిగిపోయింది. అప్పుడు వాలఖిల్యముని వచ్చి 'విష్ణుభక్తుల అస్థికలను సైతం ఎవరూ దాటి వెళ్ళలేరు. ఇవిగో! కౌశికుడి అస్థికలు. వీటిని తీసుకువెళ్ళి సరస్వతీ నదిలో కలుపు' అని చెప్పాడు. చిత్రరథుడు అలాగే చేసి తన లోకానికి వెళ్ళిపోయాడు.

విశ్వరూపుడికి మూడు తలలు. అవి సుర, సోమ, అన్నాలను స్వీకరిస్తాయి. విశ్వరూపుడికి తల్లి రచన. ఆమె రాక్షసుల సోదరి. అందుకే ఆ విశ్వరూపుడు యజ్ఞభాగంలో కొంత రహస్యంగా రాక్షసులకు ఇచ్చేవాడు. అది తెలిసి ఇంద్రుడు అతడి తలల్ని ఖండించాడు. దానివల్ల ఇంద్రుడికి బ్రహ్మ హత్యాపాతకం చుట్టుకుంది.

## వృత్రాసురుడి కథ

విశ్వరూపుడి తండ్రి త్వష్ట. ఇంద్రుడిపై పగబట్టి ఒక మారణహోమం చేశాడు. అందులో నుంచి ఒక భీకరుడు పుట్టుకొచ్చాడు. అతడే వృత్రాసురుడు. అతడు దేవతలను హింసించటం మొదలుపెట్టాడు.

వృత్రాసురుణ్ణి సంహరించాలంటే ఒక ఆయుధం కావాలి. అందుకోసం దేవతలు దధీచిని ఇలా ప్రార్థించారు– 'మహర్షీ! యాచకులకు దయ ఉండదు. అందుకే మేము నీ శరీరాన్ని యాచిస్తున్నాం. ప్రసాదించు' అన్నారు.

దధీచి మహాదాత. ఆయన దేవతల ప్రార్థనను మన్నించి వెంటనే ప్రాణం విడిచిపెట్టాడు. అప్పుడు ఆ మహర్షి ఎముకలతో విశ్వకర్మ చేసిన వజ్రాయుధాన్ని ధరించి ఇంద్రుడు వృత్రాసురుడితో తలపడ్డాడు.

* * *

నర్మదా నదీతీరం. యుద్ధం భయంకరంగా సాగుతోంది. దేవతల ధాటికి తట్టుకోలేక దానవులు పారిపోవడానికి సిద్ధపడుతున్నారు. అప్పుడు వృత్రాసురుడు– **'దానవ వీరులారా! పుట్టిన ప్రతి జీవీ గిట్టక తప్పదు. అయితే యుద్ధంలో కానీ, యోగసాధన చేస్తూ గానీ మరణించటమే మంచిది'** అంటూ వాళ్ళకు ధైర్యాన్ని నూరిపోశాడు. తాను వీరోచితంగా పోరాడుతూ– 'ఇంద్రా! మేలు చేసిన గురువునే పొట్టనపెట్టుకున్న నీకంటే పాపాత్ముడు ఎవరుంటారు? నీలాంటి కృతఘ్నుడి మాంసాన్ని కాకులూ, గద్దలూ, నక్కలూ కూడా ముట్టుకోవు. ఇంకా ఆలోచిస్తావెందుకు? రా! ఆ వజ్రాయుధాన్ని నాపై ప్రయోగించు. విష్ణువు తేజస్సు అందులో ఉంది. అది నన్ను సంహరిస్తుంది. విష్ణుదేవుడు ఎక్కడ ఉంటే అక్కడే విజయం' అన్నాడు.

ఇంద్రుడు వజ్రాయుధంతో వృత్రాసురుడి చేయి నరికిపారేశాడు. అయినా ఒంటిచేత్తో ఒక పెద్ద గుదియను తీసుకొని వృత్రాసురుడు ఇంద్రుణ్ణి ఒక్కటి వేశాడు. దెబ్బకు ఇంద్రుడు మూర్ఛపోయాడు.

ఇంద్రుడు తేరుకున్నాక వృత్రాసురుడు 'ఇంద్రా! రా, ఆయుధం తీసుకో! చేతిలో ఆయుధం లేనివాణ్ణి నేను సంహరించను. ఇదంతా విష్ణుమాయ, గెలుపు ఆ స్వామిదే. అది తెలియక గెలుపుకు కారణం మేమేనని లోకులు విర్రవీగుతూ ఉంటారు. నన్నే చూడు, ఒక చెయ్యి విరిగినా నిన్ను చంపాలని చూస్తున్నాను. అయితే చంపేదీ చచ్చేదీ ఆ ఆదినారాయణుడే!' అన్నాడు.

ఇంద్రుడు ఆ రాక్షసుడి మరో చెయ్యి నరికాడు. అయినా వృత్రాసురుడు గర్జిస్తూ ఇంద్రుణ్ణి మింగేశాడు. నారాయణ కవచం రక్షణలో ఉన్నందువల్ల ఇంద్రుడు క్షేమంగా అతడి పొట్టలో నుంచి బయటపడి, వాడి తలను వజ్రాయుధంతో నరికాడు. వృత్రాసురుడు కుప్పకూలిపోయాడు.

వృత్రాసురుణ్ణి చంపటంవల్ల ఇంద్రుడికి మళ్ళీ బ్రహ్మహత్యాపాతకం చుట్టుకుంది. అది ఈసారి భీకరమైన రూపంలో ఇంద్రుడి వెంట పడింది. ఇంద్రుడు ఈశాన్య దిక్కున ఉన్న మానస సరోవరంలోని ఒక తామర తూడులో దాక్కున్నాడు. అది శివుడి రాజ్యం. అందుకే ఆ పాతకం అక్కడికి వెళ్ళలేకపోయింది.

ఇంద్రుడు లేని ఈ సమయంలో వైవస్వతమను వంశపు రాజైన నహుషుడు ఇంద్ర పదవిని పొందాడు. అయితే అతడు శచీదేవిని తనకు భార్యగా ఉండమని

ఆజ్ఞాపించాడు. అప్పుడు ఆమెకు బృహస్పతి ఒక ఉపాయం చెప్పాడు. దాని ప్రకారం ఆమె నహుషుడితో 'నువ్వు సప్తర్షులే బోయీలై మోస్తున్న పల్లకిలో కూర్చొని వచ్చి నన్ను చేపట్టు' అని చెప్పింది.

అధికార మదం, స్త్రీ వ్యామోహం కల నహుషుడు సప్తర్షుల్ని బోయీలుగా చేసుకున్నాడు. దానికి ఆ మహర్షులు ఆగ్రహించి అతణ్ణి కొండచిలువగా మారిపొమ్మని శపించారు. కొంతకాలం తరువాత దేవేంద్రుడు తిరిగి వచ్చాడు. ఇన్నాళ్ళూ శ్రీహరినే కొలుస్తూ ఉండటంవల్ల అతడి పాపం పోయింది.

రాజా! వృత్రాసురుడు పూర్వజన్మలో 'చిత్రకేతువు' అనే రాజు. సంతానం కోసం పుత్రకామేష్టి చేసి తన భార్య 'కృతద్యుతి' ద్వారా ఒక పుత్రుణ్ణి పొందాడు. అయితే కృతద్యుతి సవతులు అసూయతో ఆ బాలుడికి విషంపెట్టి చంపేశారు. ఈ దంపతులు కన్నీరు మున్నీరుగా విలపిస్తుంటే అక్కడికి అంగిరస మహర్షి వచ్చి ఇలా అన్నాడు –

**'రాజా! ఈ లోకంలో ఏదీ శాశ్వతం కాదు నాయనా! అన్నీ దుఃఖానికి హేతువులే. శ్రీహరి భక్తి ఒక్కటే శాశ్వతమైన సుఖాన్ని ప్రసాదిస్తుంది.** నీకూ ఈ కుమారుడికీ ఏ సంబంధమూ లేదు; అని నారాయణ మంత్రాన్ని ఉపదేశించాడు. చిత్రకేతువు నారాయణుణ్ణి ఆరాధించి విద్యాధర చక్రవర్తిత్వాన్నీ, ఒక దివ్య విమానాన్నీ పొందాడు. కొన్నాళ్ళ తర్వాత ఆ విమానంపై విహరిస్తూ ఒకసారి కైలాసానికి వెళ్ళి, నిండు కొలువులో శివుడు పార్వతీదేవిని కౌగిలించుకొని ఉండటాన్ని చూసి, అవహేళన చేశాడు. పార్వతీ దేవి ఆగ్రహించి ఇతణ్ణి రాక్షసుడివై పుట్టమని శపించింది. మౌనంగా నమస్కరించి చిత్రకేతువు అక్కణ్ణుంచి వెళ్ళిపోయాడు.

అప్పుడు శివుడు పార్వతీదేవితో 'దేవీ! చూశావా! ఇతడు నిజమైన విష్ణుభక్తుడు. అందుకే అంత నిర్లిప్తంగా ఉన్నాడు. విష్ణుభక్తులు అంతటా శ్రీహరినే దర్శిస్తారు. అందువల్ల వారికి సుఖదుఃఖాలు, హెచ్చుతగ్గులూ ఉండవు' అని ప్రశంసించాడు.

ఆ చిత్రకేతుడే ఈ వృత్రాసురుడు. అందుకే ఇతడికి అంత జ్ఞానం.

* * *

## మరుత్తులు

రాజా! ఒకసారి దితి ఇంద్రుణ్ణి సంహరించగల పుత్రుణ్ణి ప్రసాదించమని కశ్యప ప్రజాపతిని వేడుకుంది. కశ్యపుడి ఆదేశంపై 'పుంసవన వ్రతం' ప్రారంభించింది. కొన్నాళ్ళకి గర్భాన్ని ధరించింది. ఈ సంగతి తెలిసి ఇంద్రుడు దితికి సేవచేసే నెపంతో ఆమె దగ్గర చేరాడు.

ఒకరోజు 'దితి' వ్రతం చేసి అలసిపోయింది. అది సంధ్యాసమయం. భోజనం చేసి కాళ్ళూ చేతులూ కడుక్కోకుండా నిద్రపోయింది. దాంతో వ్రతభంగం అయింది.

ఇదే అదనుగా ఇంద్రుడు ఆమె గర్భంలోనికి ప్రవేశించి లోపలి శిశువును వజ్రాయుధంతో ఏడు ముక్కలుగా నరికాడు. ఆ ముక్కలు ఏడుపు మొదలుపెట్టాయి. ఇంద్రుడు 'మా రుద, మా రుద' (అనగా ఏడవవద్దు, ఏడవవద్దు) అంటూ మళ్ళీ ఒక్కో ముక్కనూ ఏడు ముక్కలుగా నరికాడు. మొత్తం 49 ముక్కలు 49 మంది బాలురుగా మారిపోయారు.

జరిగిన ఘోరం తెలుసుకొని దితి తల్లడిల్లిపోయింది. ఇంద్రుడిపై ఆగ్రహించింది. ఇంద్రుడు ఆమె పాదాలపై పడ్డాడు. 'తల్లీ! నీ వ్రత ప్రభావం చాలా గొప్పది. అందుకే ముక్కలుగా నరికినా నీ పుత్రులు దివ్యపురుషులై ప్రకాశిస్తున్నారు. ఆ పరంధాముణ్ణి అర్చిస్తే ఏ కీడూ రాదు. వీళ్ళు ఇకనుండి మరుద్గణాలుగా వర్ధిల్లుతారు' అంటూ వాళ్ళను తీసుకొని స్వర్గానికి వెళ్ళిపోయాడు.

# స్కంధం - 7

**ప**రీక్షిత్తు మహారాజుకు ఒక సందేహం కలిగింది.

విష్ణుమూర్తి దృష్టిలో అందరూ సమానమే కదా! దేవతలకు మేలు చెయ్యడం కోసం అతడు రాక్షసుల్ని వెదికి మరీ చంపుతున్నాడు. దానివల్ల ఆయనకు ఒరిగిందేమిటి?

సందేహాన్ని శుక మహర్షి ముందు ఉంచాడు.

శుకయోగీంద్రుడిలా అన్నాడు – 'రాజా! ఇప్పుడు నీకు వచ్చిన సందేహమే ఒకసారి మీ తాత ధర్మరాజుకూ వచ్చింది. అకారణంగా పక్షపాతబుద్ధితో హరి ఎవ్వరినీ ద్వేషించటం గాని, ప్రేమించటంగాని ఉండదు. వారి స్వభావాన్ని బట్టే

ఆయన వారిని నశింపజేయడమో కాపాడటమో జరుగుతుంది. రాజసూయ యాగంలో ధర్మరాజు శ్రీకృష్ణుడికి అర్ఘ్యం ఇచ్చి సత్కరించాడు. అది సహించలేని శిశుపాలుడు శ్రీకృష్ణుణ్ణి దూషించాడు. కొంతసేపు సహించిన శ్రీకృష్ణుడు చక్రంతో శిశుపాలుడి తలను ఖండించాడు. అందరూ చూస్తుండగా శిశుపాలుడి శరీరం నుండి ఒక జ్యోతి బయటకు వచ్చి శ్రీకృష్ణ పరమాత్మలో ఐక్యమైపోయింది. అది చూసి ఆశ్చర్యపోయిన ధర్మరాజు అక్కడే ఉన్న నారద మహర్షిని అడిగాడు. దానికి నారదమహర్షి ఇలా పలికాడు.

'ధర్మరాజా! **కామంతో గోపికలు, భయంతో కంసుడు, వైరంతో శిశుపాలాది రాజులు, సంబంధంతో వృష్ణివంశీయులు, ప్రేమతో మీరు, భక్తితో మేము విష్ణుమూర్తిని కొలుస్తున్నాం. ఎవరైనా సరే! ఏ మార్గంలో ధ్యానం చేసినా శ్రీహరిని పొందవచ్చు.** ఈ శిశుపాలుడూ, ఇతడి సోదరుడైన దంతవక్త్రుడూ ఎవరో కాదు. శ్రీహరి ద్వారపాలకులైన జయవిజయులు. సనకసనందనాది ఋషుల శాపానికి గురై ఇలా జన్మించారు. అందుకే శిశుపాలుడి ఆత్మ శ్రీకృష్ణుడిలో ఐక్యమయింది' అన్నాడు నారదుడు. తరువాత ధర్మరాజు కోరికపై ప్రహ్లాద చరిత్ర ప్రారంభించాడు.

## ప్రహ్లాద చరిత్ర

'రాజా! హిరణ్యకశిపుడు శ్రీహరిపై కక్షతో దేవగణాల్ని హింసించటం మొదలుపెట్టాడు. హిరణ్యాక్షుడి మరణంతో దితి పుత్రశోకంతో అలమటించింది. ఆమెను హిరణ్యకశిపుడు ఇలా ఓదార్చాడు: **'అమ్మా! ఈ సంసారంలో ఎవరూ ఎక్కువ కాలం ఉండరు. చలివేంద్రంలోనికి వచ్చి దాహం తీర్చుకొని వెళ్ళిపోయే బాటసారుల్లా వస్తూ పోతూ ఉంటారు.** నీ కుమారుడు వీరుడు. అందుకే వీర స్వర్గాన్ని అలంకరించాడు. ఆయుష్షు తీరిపోతే ఎంతటివాళ్ళైనా మరణించాల్సిందే!' అన్నాడు హిరణ్యకశిపుడు. దితి కొంత తెప్పరిల్లింది.

తర్వాత హిరణ్యకశిపుడు బ్రహ్మదేవుణ్ణి ఉద్దేశించి ఘోరమైన తపస్సు చేసి గాలి, నేల, అగ్ని, నీళ్ళు, ఆకాశం, దిక్కులు, రాత్రి, పగలు, చీకటి, వెలుగు, జలచరాలు, రాక్షసులు, మృగాలు, సర్పాలు, ఆదిత్యులు, నరులు, అస్త్రాలు, శస్త్రాల చేతనూ ఇంకనూ ఎక్కడా, ఎవరిచేతా, వేటివల్లా మరణం రాకుండా వరాన్ని పొందాడు.

రాజా! హిరణ్యకశిపుడికి నలుగురు కొడుకులు. వారిలో ప్రహ్లాదుడు పెద్దవాడు.

అతడు చాలా గొప్పవాడు. అన్ని ప్రాణుల్నీ తనలాగే చూస్తాడు. పెద్దలంటే వినయం. పరస్త్రీని కన్నెత్తైనా చూడడు. తల్లిలా భావిస్తాడు. రూపం, విద్య, ఐశ్వర్యం ఇలా అన్నీ ఉన్నా అహంకారం అతడికి లేనేలేదు. సంపదలపై ఆశలేదు. అసలు ఏ కోరికా లేదు. నిరంతరం హరినే స్మరిస్తూ ఉంటాడు. శత్రువులైన దేవతలు కూడా అతణ్ణి కీర్తిస్తారు. ఏ పనిచేస్తున్నా నిరంతరం శ్రీహరి పాదాలనే ధ్యానిస్తూ ఉంటాడు. ఆ ధ్యాసలో పడి ఈ లోకాన్నే మర్చిపోతాడు.

శా. **పానీయంబులు ద్రావుచుం గుడుచుచున్ భాషించుచున్ హాస లీ**
**లానిద్రాదులు సేయుచున్ దిరుగుచున్ లక్షించుచున్ సంతత**
**శ్రీనారాయణపాదపద్మ యుగళీ చింతామృతాస్వాద సం**
**ధానుండై మఱచెన్ సురారిసుతుఁ డేతద్విశ్వమున్ భూవరా!** (7-123)

ప్రహ్లాదుడి ప్రవర్తన వింతగా అనిపించింది తండ్రికి. 'రాక్షసుల బుద్ధులు ఒక్కటి కూడా రాలేదు వీడికి. పోనీ, చదువు చెప్పిస్తే దారిలోనికి వస్తాడేమో!' అనుకొని తన కుమారుణ్ణి పిలిచి 'నాయనా!

కం. **చదువని వాఁ డజ్ఞుండగుఁ**
**జదివిన సదసద్వివేక చతురత గలుగుం**
**జదువఁగవలయును జనులకుఁ**
**జదివించెద నార్యులొద్దఁ జదువుము తండ్రీ!** (7-130)

చదువు లేనివాడు అజ్ఞాని అవుతాడు. చదువుకొంటే మంచీ చెడూ తెలుస్తాయి. నిన్ను పెద్దల దగ్గరపెట్టి చదివిస్తాను. చదువుకో!' అంటూ తమ కులగురువైన శుక్రాచార్యుడి పుత్రులైన చండుడినీ, అమర్కుడినీ పిలిపించి, ప్రహ్లాదుణ్ణి అప్పగించాడు.

కొన్ని రోజుల తరువాత కొడుకును పిలిచి దగ్గరకు తీసుకొని ముద్దు చేస్తూ 'నాయనా! ఎలా ఉన్నావురా? నీ చదువు ఎంతవరకూ వచ్చింది? ఏమేమి నేర్చుకొన్నావు? చెప్పు?' అని అడిగాడు.

ప్రహ్లాదుడు వినయంగా- 'నాన్నగారూ! **'ఇల్లు' అనేది ఒక చీకటి నుయ్యి. అందులో పడి అందరూ నశిస్తూ ఉంటారు. అలాకాక ఈ సృష్టి మొత్తం దేవదేవుడి దివ్యకళామయమే నన్న సత్యాన్ని గ్రహించి అడవులలో తపస్సు చేసుకొంటూ ఉండటమే మంచిది' అన్నాడు.**

హిరణ్యకశిపుడికి నోట మాట రాలేదు. వీడేమిటి? ఈ మాటలేమిటి? పిల్లలకేమి తెలుసు? పెద్దలు ఏం చెబితే అదే చెప్తారు. ఎవరో – కానిమాటలు నూరిపోసినట్టున్నారు. అని మనసులో అనుకొని 'ప్రహ్లాదా! ఏమిటీ మాటలు? ఎవరు నేర్పించారు? ఆ శ్రీహరి మన రాక్షసులకు కీడు చేశాడు. మనకు శత్రువు' అన్నాడు కొంచెం కర్కశంగా.

అప్పుడు ప్రహ్లాదుడు గురువులవైపు చూస్తూ ఇలా పలికాడు **'అజ్ఞానులు మాయలో పడి పరమాత్మను తెలుసుకోలేరు. జ్ఞానులైనవాళ్ళు శ్రీహరిని తప్ప ఇతరుల్ని ఊహించుకోలేరు. నేనూ అంతే! ఇనుము అయస్కాంతానికి ఎలా అతుక్కుంటుందో నా మనస్సూ శ్రీహరిపై అలాగే లగ్నమయింది.**

సీ. **మందార మకరంద మాధుర్యమునఁ దేలు**
**మధుపంబు వోవునే మదనములకు?**
**నిర్మల మందాకినీ వీచికలఁ దూఁగు**
**రాయంచ సనునె తరంగిణులకు?**
**లలిత రసాల పల్లవ ఖాదియై చొక్కు**
**కోయిల సేరునే కుటజములకు?**
**బూర్ణేందు చంద్రికా స్ఫురిత చకోరకం**
**బరుగునే సాంద్ర నీహారములకు?**

తే.గీ. **అంబుజోదర దివ్యపాదారవింద**
**చింతనామృతపాన విశేష మత్త**
**చిత్తమేరీతి నితరంబుఁ జేర నేర్చు?**
**వినుతగుణశీల! మాటలు వేయునేల?** (7–150)

ఆచార్యా! మందార పువ్వులలోని తేనెను ఆస్వాదించే తుమ్మెద ఉమ్మెత్త పువ్వుల దగ్గరికి వెళ్తుందా? ఆకాశ గంగలో విహరించే రాజహంస చిన్నచిన్న వాగులవైపు వెళ్తుందా? లేత మామిడిచివుళ్ళను తింటూ పరవశించే కోకిల కొండ మల్లెపువ్వుల వద్దకు వెళ్తుందా? ఆ శ్రీహరి పాదాలను చింతించటం అనే అమృతాన్ని త్రాగి మత్తెక్కిన మనస్సు వేరే వాటివైపు వెళ్తుందా? వెళ్ళదు కాక వెళ్ళదు' అన్నాడు.

'డింభకా! ఏమిటా మాటలు? శత్రువును కీర్తిస్తావా? మేం చెప్పినది చెప్పకుండా కుతర్కాలు చేస్తావా? దైత్యులు అనే చందనవనంలో పుట్టిన ముళ్ళచెట్టులా ఉన్నావే! ఇక దండిస్తే గానీ దారిలోకి రావు' అంటూ హిరణ్యకశిపుడి వైపు తిరిగి 'రాజా! మమ్మల్ని మన్నించు. మేము చెప్పినదొక్కటి! వీడు చెప్తున్నది వేరొకటి. మాకు మరో అవకాశం ఇవ్వు' అని హిరణ్యకశిపుడి అనుమతితో ప్రహ్లాదుణ్ణి తీసుకువెళ్ళారు గురువులు. ఇంకా శ్రద్ధ పెట్టారు. వివిధ శాస్త్రాలను బోధిస్తున్నారు.

రోజులు గడుస్తున్నాయి. కొన్నాళ్ళ తర్వాత మళ్ళీ హిరణ్యకశిపుడి వద్దకు తీసుకువచ్చారు. ముందుగానే హెచ్చరించారు. పరువు తియ్యవద్దని, బతిమిలాడుకున్నారు. ఏం చెప్పి ఏం లాభం? శ్రీహరినే ధ్యానిస్తూ తనని తాను మరచిపోయే ప్రహ్లాదుడు తన సహజమైన ధోరణిని మార్చుకుంటాడా?

హిరణ్యకశిపుడు ఆప్యాయంగా 'ఏదీ నువ్వు చదివిన శాస్త్రాలలోంచి ఒక్క పద్యం చదివి అర్థం చెప్పు నాయనా' అని అడిగాడు. ప్రహ్లాదుడు వినయంగా-

కం. **చదివించిరి నను గురువులు**
**చదివితి ధర్మార్థ ముఖ్య శాస్త్రంబులు నేఁ**
**జదివినవి గలవు పెక్కులు**
**చదువులలో మర్మమెల్లఁ జదివితిఁ దండ్రీ!** (7-166)

'తండ్రీ! నన్ను గురువులు చదివించారు. నేనూ ఎన్నో శాస్త్రాలు చదివాను. అయితే ఆ చదువులలో మర్మం తెలుసుకున్నాను. చెబుతాను విను.

మ. **తనుహృద్భాషల సఖ్యమున్ శ్రవణమున్ దాసత్వమున్ వందనా**
**ర్చనముల్ సేవయు నాత్మలో నెఱుకయున్ సంకీర్తనల్ చింతనం**
**బను నీ తొమ్మిది భక్తిమార్గముల సర్వాత్మున్ హరిన్నమ్మి స**
**జ్జనుఁడై యుండుట భద్రమంచుఁ దలఁతున్ సత్యంబు దైత్యోత్తమా!**
(7-167)

రాజా! త్రికరణశుద్ధిగా సఖ్యం, శ్రవణం, దాస్యం, వందనం, అర్చన, సేవ, ఆత్మనివేదన, సంకీర్తన, చింతన అనే తొమ్మిది భక్తిమార్గాల ద్వారా ఆ శ్రీహరిని నమ్మి కొలుస్తూ కాలం గడపటమే మంచిది. మంచిగా హరిభక్తి లేని వారి సంసారం

గుడ్డివాడికి చంద్రోదయం చూపించినట్లు, చెవిటివాడి ముందు శంఖం ఊదినట్లు.

సీ. **కమలాక్షు నర్చించు కరములు కరములు**
**శ్రీనాథు వర్ణించు జిహ్వ జిహ్వ**
**సురరక్షకునిఁ జూచు చూడ్కులు చూడ్కులు**
**శేషశాయికి మ్రొక్కు శిరము శిరము**
**విష్ణు నాకర్ణించు వీనులు వీనులు**
**మధువైరి దవిలిన మనము మనము**
**భగవంతు వలగొను పదములు పదములు**
**పురుషోత్తముని మీఁది బుద్ధి బుద్ధి**

తే.గీ. **దేవదేవుని జింతించు దినము దినము**
**చక్రహస్తునిఁ బ్రకటించు చదువు చదువు**
**కుంభినీధవుఁ జెప్పెడి గురుఁడు గురుఁడు**
**తండ్రిఁ హరిఁ జేరు మనియెడి తండ్రి తండ్రి!** (7-169)

ఆ విష్ణుమూర్తిని అర్చించే చేతులే చేతులు. వర్ణించే నాలుకే నాలుక. చూసే చూపులే చూపులు. నమస్కరించే శిరస్సే శిరస్సు. వినే చెవులే చెవులు. ధ్యానించే మనస్సే మనస్సు. ప్రదక్షిణం చేసే పాదాలే పాదాలు. స్మరించే బుద్ధే బుద్ధి. చింతించే రోజే రోజు. చదివే చదువే చదువు. బోధించే గురువే గురుడు. తండ్రీ! ఆ శ్రీహరిని చేరుమని చెప్పే తండ్రే తండ్రి!

అతడి సేవకు ఉపయోగపడని శరీరమూ ఒక శరీరమేనా? అది గాలితో నింపిన తోలు తిత్తి. అతణ్ణి పొగడని నోరూ నోరేనా? అది ధమధమలాడే ఢక్క. హరిపూజ చేయని చేయీ ఒక చేయేనా? చెట్టు కొమ్మతో చేసిన తెడ్డు. అతణ్ణి చూడని కన్నులూ కన్నులేనా? శరీరం అనే గోడకు పెట్టిన రెండు రంధ్రాలు. విష్ణు భక్తి లేని పండితుడూ ఒక పండితుడేనా? రెండు కాళ్ళ పశువు.

**హరిదాస్యం అనే పెనుగాలి లేకుండా ఈ సంసారం అనే మేఘాలు విడిపోతాయా? శ్రీహరి స్తుతి అనే సూర్యకాంతి లేకుండా ఆపదలు అనే చీకట్లు నశిస్తాయా?**

ప్రహ్లాదుడు ధాటిగా చెప్తున్నాడు. హిరణ్యకశిపుడి కోపం తారాస్థాయికి చేరుకుంది. పళ్ళు పటపటా కొరుకుతూ ఆచార్యులను చూసి– 'నమ్మి పిల్లవాణ్ణి అప్పగిస్తే ఇదా మీరు చేసే నిర్వాకం? ఈ పాపం ఊరికే పోదు. **చెడ్డ పనులు చేసేవాళ్ళను రోగాలు పీక్కుతిన్నట్లు మిమ్మల్నీ ఈ పాపం పీడిస్తుంది'** అని అరిచాడు.

'దానవనాథా! ఇందులో మా తప్పేమీ లేదు' అన్నారు వాళ్ళు దీనంగా.

ఈసారి హిరణ్యకశిపుడు ప్రహ్లాదుణ్ణే నిలదీశాడు. దానికి ప్రహ్లాదుడు–

**'తండ్రీ! సంసారంలో పడి అలమటించేవాళ్ళకు హరిభక్తి ఒకపట్టాన కలుగుతుందా? విష్ణుభక్తుల పాదధూళిని తలపై ధరించే పుణ్యాత్ములు మాత్రమే శ్రీహరిని దర్శించగలరు. 'ఈ సంసారం ఒక సముద్రం. భార్యాపుత్రులు తిమింగిలాలు. మదమూ, క్రోధమూ అనేవి కెరటాలు. ఈ సముద్రాన్ని దాటాలి అంటే ఒక నావ కావాలి. ఆ నావ శ్రీహరిపై లగ్నమైన బుద్ధి. దీనితో తప్ప సొంత తెలివితో ఈ సముద్రాన్ని దాటటం అసంభవం'** అన్నాడు.

హిరణ్యకశిపుడు ఉలిక్కిపడ్డాడు. ప్రహ్లాదుణ్ణి ఉరిమురిమి చూశాడు. మంత్రుల్ని ఇలా ఆదేశించాడు–

'వీడు నా కడుపున పుట్టిన శత్రువు. వేలెడంత లేడు. నాకే నీతులు చెప్తున్నాడు. కులద్రోహి. వీణ్ణి సంహరించి వంశాన్ని కాపాడుతాను. శరీరంలో ఏదైనా ఒక అవయవం పాడైపోతే వైద్యుడు దాన్ని తొలగించి మిగిలిన శరీరాన్ని రక్షిస్తాడు. నేనూ అదే చేస్తాను. వెళ్లండి. వీణ్ణి తీసుకువెళ్ళి వధించండి. ఎంతమాత్రం కనికరం చూపకండి. ఇది నా ఆజ్ఞ' అన్నాడు భీకరంగా అరుస్తూ.

* * *

రాక్షసులు ఎంత హింసిస్తున్నా ప్రహ్లాదుడు శ్రీమన్నారాయణుణ్ణి నుతిస్తాడేగానీ కంటతడి పెట్టడు. భయం లేదు. తండ్రిని పల్లెత్తు మాటైనా అనడు. ఎవరికీ చెప్పడు. ఎవరినీ శరణు కోరడు. దీనికంతటికీ కారణం అతడి మనస్సు పూర్తిగా పరమాత్మపై లగ్నం కావటమే. అందుకే హిరణ్యకశిపుడు చేసిన ప్రయత్నాలన్నీ విఫలమయ్యాయి. ఏనుగులతో తొక్కించమన్నాడు. పాములతో కరిపించమన్నాడు. అగ్నిలోనికి తోసెయ్యమన్నాడు. సముద్రంలోకి విసిరెయ్యమన్నాడు. కొండలమీద

నుండి దొర్లించమన్నాడు. రాక్షసులు అలాగే చేశారు. కానీ ఏ ఒక్క ప్రయత్నమూ ఫలించలేదు.

ఆచార్యులు వచ్చారు. మరోసారి ప్రహ్లాదుణ్ణి మార్చే ప్రయత్నం చేస్తామని తీసుకువెళ్ళి, వివాహం అయినవారికి చెప్పే శాస్త్రాలు చెప్తున్నారు. అవేమీ తనకు మేలు చేయవని అతడికి తెలుసు. ఇలా లాభంలేదని గురువులు లేనప్పుడు రాక్షస బాలురందరినీ పోగుచేసి వాళ్ళకీ హరిభక్తిని రుచిచూపించాడు ప్రహ్లాదుడు. ఇది తెలిసిన గురువులు లబోదిబోమంటూ వచ్చి హిరణ్యకశిపుడి దగ్గర మొరపెట్టుకున్నారు.

హిరణ్యకశిపుడి సహనం పూర్తిగా నశించింది. 'దుర్మార్గుడా! నన్ను చూసి ముల్లోకాలూ గడగడలాడిపోతాయి. నువ్వెంత? నీ శ్రీహరి ఎంత? నీ పిచ్చి ముదిరి పాకాన పడింది. నిన్ను చంపితే ఎవడ్రా నీకు దిక్కు? అన్ని దిక్కులూ నావే. ఎవరి బలం చూసుకొని విర్రవీగుతున్నావు?చెప్పు' అని అరిచాడు రోషంగా. దానికి ప్రహ్లాదుడు–

కం. **బలయుతులకు దుర్బలులకు**
**బలమెవ్వఁడు నీకు నాకు బ్రహ్మాదులకున్**
**బలమెవ్వఁడు ప్రాణులకును**
**బలమెవ్వండట్టి విభుడు బలమసురేంద్రా!** (7–264)

'రాజా! బలవంతులకు, బలహీనులకు, నీకు, నాకు, అన్ని ప్రాణులకూ ఎవడు బలమో నాకూ అతడే బలం. ఆ బలం శ్రీహరి. ఆ దిక్కు శ్రీమన్నారాయణుడు. అతడే అంతటా ఉన్నాడు. అయినా తండ్రీ! నువ్వు లోకాలన్నీ చిటికెలో గెలిచావు. కానీ నీలోనే ఉన్న ఆరుగురు శత్రువుల్ని గెలవలేకపోతున్నావు. ఇంద్రియాలు అనే ఆ ఆరుగురినీ గెలిచావంటే ఈ లోకంలో నీకు శత్రువు అంటూ ఎవడూ ఉండడు' అన్నాడు. ఆ మాటలు – అగ్నికి ఆజ్యం పోసినట్లు హిరణ్యకశిపుడి కోపాన్ని రెట్టింపు చేశాయి.

'నాతోనే వాదిస్తావా? నాతో సమానుడైనవాడు ఈ లోకంలోనే లేడు. నా సోదరుణ్ణి చంపిన శ్రీహరి కోసం నేను అంతటా వెతికాను. ఎక్కడా లేడు. నీకు తెలిస్తే చెప్పు? అతడు ఎక్కడ ఉన్నాడు? ఎలా ఉంటాడు? ఏం చేస్తుంటాడు? ఇప్పుడు నీ సంగతీ ఆ విష్ణుమూర్తి సంగతీ తేల్చేస్తాను' అన్నాడు. దానికి ప్రహ్లాదుడు–

'తండ్రీ! సముద్రంలో, గాలిలో, ఆకాశంలో, భూమిపై, అగ్నిలో, దిక్కుల్లో, పగళ్ళలో, రాత్రులలో, సూర్యచంద్రుల్లో, ఓంకారంలో, త్రిమూర్తులలో, ఇలా అంతటా ఆ ఈశ్వరుడు తానై ఉంటే ఇక్కడా అక్కడా వెదకటం ఎందుకు?

కం. **ఇందుఁ గలఁ డందు లేఁడని**
**సందేహము వలదు చక్రి సర్వోపగతుం**
**డెందెందు వెదకి చూచిన**
**నందందే కలఁడు దానవాగ్రణి! వింటే!** (7-275)

'రాజా! ఇందులో ఉన్నాడనీ, అందులో లేడనీ సందేహం వద్దు. శ్రీహరి అంతటా ఉన్నాడు. ఎక్కడ వెతికితే అక్కడే ఉంటాడు. విన్నావా?'

లేడు! లేడు! లేడు! గట్టిగా అరుస్తూ భయపెట్టాడు హిరణ్యకశిపుడు.

ఆ సమయంలో విష్ణువు నరసింహుడి రూపంలో స్థావర (కదలని) జంగ మా (కదిలే) లన్నింటిలోనూ అంతర్గతుడుగా కొలువుతీరి ఉన్నాడు.

'ఓరీ! డింభకా! అయితే నీ చక్రినీ గిక్రినీ ఈ స్తంభంలో చూపించు' అంటూ తన అరచేత్తో ఆ స్తంభాన్ని కొట్టాడు హుంకరిస్తూ హిరణ్యకశిపుడు.

వెంటనే బీటలువారిన ఆ స్తంభంలోనుంచి ఒక దివ్య తేజస్సు బయటకు దూకింది. అదే నారసింహావతారం.

సగం మనిషి, సగం సింహం. హిరణ్యకశిపుడు భయపడి, ఎలాగో ధైర్యం కూడగట్టుకొని తలపడ్డాడు.

నరసింహస్వామి అమాంతంగా రాక్షసుణ్ణి ఒడిసిపట్టుకొని తన తొడపై పెట్టుకొని వాడి రొమ్మును గోళ్లతో చీల్చి ప్రేవులు మెళ్ళో వేసుకున్నాడు. హిరణ్యకశిపుడు మరణించాడు.

చంపింది పూర్తిగా నరుడూ, మృగమూ కాని రూపం. సమయం రాత్రీ కాదు పగలూ కాదు. సంధ్యవేళ. ప్రదేశం లోపలా కాదు బయటా కాదు. గుమ్మంపైన. ఆకాశంలో కాదూ భూమీ మీదా కాదు. తొడలమీద. ఆయుధాలు ప్రాణం ఉన్నవీ కావు, లేనివీ కావు. గోళ్ళు. ఇలా ఆ రాక్షసుణ్ణి సంహరించి, అతని వరబలం

ఎందుకూ కొరగాకుండా చేశాడు నరసింహస్వామి.

తక్కిన రాక్షసులందరినీ సుదర్శన చక్రం మట్టుపెట్టింది. నరసింహస్వామి అక్కడే సింహాసనంపై కూర్చొని ఉన్నాడు. ఎవరూ దగ్గరకు వెళ్ళే సాహసం చేయలేకపోయారు. బ్రహ్మదేవుడి ప్రార్థనతో లక్ష్మీదేవి స్వామి దగ్గరకు వెళ్ళాలని వచ్చింది. కానీ ఆ ఉగ్రస్వరూపాన్ని చూసి భయపడింది. అప్పుడు బ్రహ్మదేవుడు 'ప్రహ్లాదా! శ్రీహరి నీ కోసమే అవతరించాడు. నీ విన్నపాన్నే అతడు మన్నిస్తాడు. వెళ్ళు, స్వామిని స్తుతించి శాంతింపచేయి' అన్నాడు.

ప్రహ్లాదుడు నిర్భయంగా వెళ్ళాడు. నారసింహుడు తన హస్తంతో ప్రహ్లాదుడి తల నిమిరాడు. ప్రహ్లాదుడు పులకించి ఇలా స్తుతించాడు–

'దేవా! నిన్ను మెప్పించే సాధనం భక్తి ఒక్కటే. నీ భీకర రూపాన్ని చూసి నేను ఎంతమాత్రం భయపడటంలేదు. కానీ సంసారం అనే దావాగ్నిని చూసి వణకిపోతున్నాను. **ఒక బాలుణ్ణి తలిదండ్రులు ఎలా రక్షిస్తారో, రోగిని ఔషధం ఎలా కోలుకొనేలా చేస్తుందో, సముద్రంలో మునిగిపోతున్న వారిని నావ ఎలా ఒడ్డుకు చేరుస్తుందో నువ్వూ భక్తుల్ని అలాగే రక్షిస్తావు.**

'ఉగ్రనారసింహుడి ముఖంలో చిరునవ్వు. 'ప్రహ్లాదా! నువ్వు దానవ చక్రవర్తివై ఒక మన్వంతర కాలంపాటు సకల భోగాలు అనుభవించి నన్ను చేరుకుంటావు. నువ్వు నా భక్తుడివి కావటంవల్ల నీ తండ్రి కూడా తన ముందు ఏడు తరాలతో ఉత్తమ గతుల్ని పొందుతాడు' అని నారసింహస్వామి అంతర్ధానమయ్యాడు.

రాజా! పవిత్రమైన ప్రహ్లాద చరిత్రను విన్నవారికీ చదివినవారికీ పుణ్యలోకాలు లభిస్తాయి. ఆ శ్రీహరి ఎల్లప్పుడూ తన భక్తుల్ని కంటికి రెప్పలా కాపాడుతూనే ఉంటాడు. అందుకు ఉదాహరణగా నీకు మరో కథ చెబుతాను విను.

## త్రిపురాసుర సంహారం

పూర్వం రాక్షసులకు మయుడు – ఇనుము, వెండి, బంగారాలతో చేసిన మూడు పురాలను నిర్మించి ఇచ్చాడు. ఈ పురాలు ఒకచోట నుండి మరోచోటికి ప్రయాణించగలవు. ఆ పురాలపై సంచరిస్తూ దానవులు దేవతల్ని హింసించటం మొదలుపెట్టారు.

దేవతలంతా వెళ్ళి పరమశివుణ్ణి ఆశ్రయించారు. శివుడు ఒక దివ్యమైన బాణాన్ని సంధించాడు. ఆ బాణాగ్ని జ్వాలలలో పడి రాక్షసులు మరణిస్తున్నారు. అయితే మయుడు తన యోగబలంతో ఒక సిద్ధరసకూపాన్ని తయారు చేశాడు. ఆ కూపంలో పడవేస్తే చచ్చిన రాక్షసులు బతికి బయటకు వస్తున్నారు.

తన బాణం వ్యర్థం కావటంతో పరమశివుడు మనస్తాపం చెందాడు. ఇది తన భక్తుడైన శివుడికి జరిగిన అవమానం. దాన్ని పోగొట్టాలని శ్రీ మహావిష్ణువు తనే ఒక అందమైన ఆవు రూపాన్ని ధరించాడు. బ్రహ్మదేవుడు దూడగా మారి వచ్చాడు. ఈ ఆవూ దూడా వెళ్ళి సిద్ధకూపంలో ఉన్న రసాన్ని త్రాగివేశాయి. తరువాత విష్ణుమూర్తి శివుడికి యుద్ధపరికరాలన్నీ సమకూర్చాడు. అప్పుడు శివుడు మూడు పురాలనూ కాల్చివేశాడు. అలా ఆ మూడు పురాలలో నివసించే రాక్షసులంతా సంహరించబడ్డారు.' నారదుడు ఇలా విష్ణుదేవుని పరాక్రమవిధానాలు వివరించి, ధర్మరాజుతో ఇలా అన్నాడు.

**"ధర్మరాజా! సత్యం, సమదృష్టి, విచక్షణ, శౌచం, క్షమ, దయ, దానం, ఇంద్రియ నిగ్రహం, సేవ, బ్రహ్మచర్యం, అహింస మొదలైన వాటిని అన్ని వర్ణాలవారూ తప్పనిసరిగా పాటించాలి. బ్రాహ్మణులు కులాచారాల్ని పాటిస్తూ జపహోమ దానాదులతో పవిత్రంగా జీవించాలి. దానం ఇవ్వటం, పుచ్చుకోవటం రెండూ బ్రాహ్మణులకు విధులే. బ్రాహ్మణ విధుల్లో దానం తీసుకోవటం తప్ప తక్కినవాటిని అన్నింటినీ క్షత్రియులు పాటించాలి. ధర్మబద్ధంగా రాజ్యపాలన చేయాలి. వ్యవసాయం, వాణిజ్యం, పశుపాలన, వైశ్యుల ధర్మాలు. చౌర్యం లేకుండా ఉండటం, శుచిగా ఉండటం, స్తుతించటం, యజమానుల్ని నిష్కపటంగా సేవించటం, మంత్రం చెప్పకుండా పంచయజ్ఞాలను నిర్వహించటం, పండితుల్ని గౌరవించటం, గోరక్షణ, న్యాయంగా జీవించటం చతుర్థ వర్ణానికి చెందిన వాళ్ళు పాటించవలసిన ధర్మాలు.**

**గృహిణి ఇంటిని చక్కదిద్దాలి. ఎప్పుడూ కళకళలాడుతూ ప్రియంగా మాట్లాడుతూ, సత్యాన్ని పాటిస్తూ భర్త మనసును ఆకర్షించాలి. భర్తను దైవంగా భావిస్తూ సేవించే భార్యామణికి వేరే వ్రతాలూ, తపస్సులూ అవసరంలేదు. జాతి మాత్రంచేతనే వర్ణమును నిర్ణయించకూడదు. గుణంచేతనే నిర్ణయించాలి"**, అంటూ వర్ణాశ్రమ ధర్మాలూ చెప్పాడు.

## అజగర మహర్షి

రాజా! మహాభక్తుడైన ప్రహ్లాదుడు చక్రవర్తియై రాజ్యపాలన చేస్తూ లోకసంచారానికి వెళ్ళి సహ్యపర్వత సానువుల్లో అజగర మహర్షిని దర్శించాడు. ఆ మహర్షి ఒక కొండచిలువలా పడి ఉన్నాడు. అయినా ముఖంలో దివ్యతేజస్సు. చేతులు జోడించి 'స్వామీ! తమరు ఎవరు? ఎందుకిలా ఉన్నారు?' అని అడిగాడు. దానికా మహర్షి-

'ప్రహ్లాదా! కర్మబంధాల నుండి విముక్తి పొందాలని ఇలా పడి ఉన్నాను. తేనెటీగలు కూడబెట్టిన తేనె పరులపాలు అవుతుంది. లోభుల ధనమూ అంతే. దొరికినదాన్నే తింటూ పెద్ద పాము కూడా కదలకుండా పడి ఉండి చిరకాలం జీవిస్తుంది. తేనెటీగ, కొండచిలువలు నాకు గురువులు. నాకు ఏది దొరికితే అదే తింటాను. ఏది లభిస్తే అదే కట్టుకుంటాను. ఎవరిని ఏదీ అడగను. దొరకలేదని బాధపడను. ఎవరినీ నిందించను. ఎవరినీ స్తుతించను. ఎప్పుడూ నిశ్చింతగా, తృప్తిగా ఉండడానికి ప్రయత్నిస్తాను' అన్నాడు. అంతా విన్న ప్రహ్లాదుడు ఆ మహర్షికి సాదరంగా నమస్కరించి వెళ్ళిపోయాడు.

**'ధర్మరాజా! ప్రతి పనినీ భగవంతుడికే అర్పిస్తూ, నిత్యం భగవంతుణ్ణే స్మరిస్తూ, ఇతరులకు సహాయం చేస్తూ, అతిథుల్ని ఆదరిస్తూ పరమ పదాన్ని చేరుకోవచ్చు. శ్రీహరి సజ్జనులలోనే ఉంటాడు. ఆ సజ్జనుల్ని సేవిస్తే పుణ్యక్షేత్రాలను దర్శించిన ఫలం లభిస్తుంది. బ్రహ్మాండం అనే వృక్షానికి మూలం ఆ శ్రీమహావిష్ణువే. కాబట్టి శ్రీమన్నారాయణుడికి సంతర్పణ చేస్తే సమస్త ప్రాణులకూ చేసినట్లే. అతడి మహిమను తెలియజేసే గురువు సామాన్యుడు కాడు.**

శరీరమే రథం. బుద్ధి దానికి సారథి. ఇంద్రియాలు గుర్రాలు. మనస్సు పగ్గం. ప్రాణాలు పదీ ఇరుసులు. ధర్మాధర్మాలు రథచక్రాలు. అహంకారి అయిన జీవుడే రథికుడు. కాబట్టి ఈ శరీరం అనే రథాన్ని మానవుడు అదుపులో ఉంచుకోవాలి.

వేదాలు మనకు రెండు మార్గాలను చూపిస్తున్నాయి. 1. ప్రవృత్తి మార్గం, 2. నివృత్తి మార్గం. మొదటిది పునర్జన్మను కలిగిస్తే రెండోది మోక్షాన్ని అందిస్తుంది. వీటిని అర్థం చేసుకున్నవాడు మోహాలకు లొంగిపోడు. కాబట్టి **సంసారంలో ఉంటూ కూడా నిశ్చలమైన భక్తితో శ్రీహరినిగానీ, శ్రీహరిభక్తుల్నిగానీ సేవిస్తే విముక్తి లభిస్తుంది.'** అన్నాడు నారదుడు.

# స్కంధం - 8

"మహర్షులారా! పరీక్షిత్తు కోరికపై శుకమహర్షి ఇలా చెప్పటం ప్రారంభించాడు.

'రాజా! స్వాయంభువ మనువు పరిపాలించిన మన్వంతరమే మొట్టమొదటిది. రెండో మన్వంతరానికి చక్రవర్తి స్వారోచిషుడు. ఈ మన్వంతరంలోనే విష్ణుమూర్తి 'విభుడు' అనే పేరుతో అవతరించాడు. ఉత్తముడు మూడో మనువు. ఈ మనువు కాలంలో విష్ణువు ధర్ముడికి సూనృత అనే భార్య ద్వారా 'సత్యసేనుడు'గా అవతరించి దుష్టశిక్షణ గావించాడు.

## గజేంద్ర మోక్షం

రాజా! అది నాలుగో మనువైన తామసుడి కాలం. క్షీరసాగరం మధ్యలో ఒక అందమైన పర్వతం ఉంది. దాని పేరు త్రికూటం. దానికి మూడే శిఖరాలు. వాటిలో ఒకటి బంగారం. రెండు వెండి. మూడోది ఇనుము. ఎంతో అందంగా ఉండే ఆ పర్వతంపై దేవతలు విహరిస్తూ ఉంటారు. అక్కడ జంతువులన్నీ ఒక ఎత్తు. ఏనుగులు ఒక ఎత్తు. ఒక్కో ఏనుగూ దిగ్గజాల్ని తలదన్నేలా ఉంటుంది. ఎంతో దర్పంతో మదించి ఉండే ఆ ఏనుగులు ఒకసారి అడవిలో విహారానికి బయలుదేరాయి.

ఆ ఏనుగుల సమూహంలో ఒక గజరాజు తన ప్రియురాళ్లతో కలసి మందనుండి విడిపోయాడు. దారి తప్పాడు. ఒకటే దాహం. దగ్గర్లోనే ఒక అందమైన సరస్సు కనిపించింది. గజరాజు తక్కిన ఏనుగులతో సహా అందులోనికి చొరబడ్డాడు.

కడుపు నిండా నీళ్ళు తాగి, ఒకదానిపై ఒకటి నీళ్ళు చిమ్ముకొంటూ సేదతీరుతున్నాయి ఏనుగులన్నీ. ఇంతలో ఒక మొసలి చటుక్కున ఈ గజరాజు కాలు పట్టుకుంది. గజేంద్రుడు ఆ పట్టు తప్పించుకొని తొండంతో ఒక్కటి వేశాడు దాన్ని. దెబ్బకి ఆ మొసలి చచ్చిన పాములా నీళ్లలో పడింది. కానీ వెంటనే తేరుకొని ఈసారి గజేంద్రుడి ముందరికాళ్ళు పట్టుకుంది. దంతంతో పొడిచాడు గజేంద్రుడు. మొసలి కోపంతో గజేంద్రుడి తోకను కరచింది.

ఏనుగును మొసలి సరస్సులోనికి ఈడుస్తుంటే, మొసలిని ఏనుగు గట్టుమీదికి లాగుతోంది. ఆడు ఏనుగులు ఏమీ చేయలేక గజేంద్రుణ్ణి విడిచి రాలేక నిస్సహాయంగా చూస్తూ ఉండిపోయాయి.

మొసలికి నీరు స్థానబలం. కాబట్టి అంతకంతకూ దాని బలం పెరుగుతోంది. గజేంద్రుడి బలం తగ్గిపోతోంది. ఆ మొసలి రెండు పాదాలనూ నేలపై అదిమిపట్టింది. గాలిని బంధించింది. ఒక యోగీంద్రుడిలా స్థిరంగా ఏకాగ్రతతో ఏనుగు పాదాన్ని గట్టిగా పట్టుకుంది. సంసారంలో చిక్కుకొనే మానవుడి పరిస్థితిలాగే ఉంది గజేంద్రుడి స్థితి. శక్తినంతా కూడదీసుకొని మరీ గజేంద్రుడు పోరాడుతున్నాడు. వెయ్యి సంవత్సరాలు గడిచాయి. యుద్ధం సాగుతూనే ఉంది.

గజేంద్రుడు ఆలోచనలో పడ్డాడు. దీన్ని ఎలా గెలవటం? నాకు దిక్కు ఎవరు? ఇన్నాళ్ళూ ఎంత వైభవంగా గడిపాను! బుద్ధి గడ్డితిని ఇలా వచ్చాను. ఇప్పుడు అనుభవిస్తున్నాను. భగవంతుడా! నా కష్టం తీరేదెలా?

ఉ. **ఎవ్వనిచే జనించు జగ మెవ్వని లోపలనుండు లీనమై**
**యెవ్వనియందు డిందుఁ బరమేశ్వరుఁ డెవ్వఁడు మూలకారణం**
**బెవ్వఁ డనాదిమధ్యలయుఁ డెవ్వఁడు సర్వముఁ దానయైన వాఁ**
**డెవ్వఁడు వాని నాత్మభవు నీశ్వరు నే శరణంబు వేఁడెదన్.** (8-73)

ఈ జగము ఎవరివల్ల పుడుతోంది? ఎవరిలో ఉంటోంది? ఎవరిలో కలుస్తోంది? పరమేశ్వరుడు ఎవడు? మూలకారణం ఎవడు? మొదలూ నడుమా తుదీ లేనివాడు ఎవడు? అంతా తానే అయినవాడు ఎవడు? తనంతట తానే పుట్టినవాడూ ఈశ్వరుడూ అయిన ఆ పరమాత్మనే నేను శరణు వేడతాను.

కం. **కలఁడందురు దీనులయెడ**
**కలఁడందురు పరమయోగిగణముల పాలన్**
**కలఁడందు రన్ని దిశలను**
**కలఁడు కలండనెడివాఁడు గలఁడో లేఁడో!** (8-86)

అందరూ ఉన్నాడు ఉన్నాడు అనే భగవంతుడు అసలు ఉన్నాడో లేడోనన్న సందేహం కూడా వచ్చిందతడికి. అయినా స్థిరమైన భక్తితో-

శా. **లావొక్కింతయు లేదు, ధైర్యము విలోలంబయ్యెఁ, బ్రాణంబులున్**
**ఠావుల్ దప్పెను, మూర్ఛ వచ్చె, తనువున్ డస్సెన్, శ్రమం బయ్యెడిన్,**
**నీవే తప్ప నితః పరం బెఱుగ, మన్నింపందగున్ దీనునిన్**
**రావే ఈశ్వర! కావవే వరద! సంరక్షింపు భద్రాత్మకా!** (8-90)

'ఓ ఈశ్వరా! నా ఒంట్లో శక్తి లేదు. ధైర్యం అసలే లేదు. ప్రాణాలు పోతున్నాయి. మూర్ఛ వచ్చింది. చాలా కష్టంగా ఉంది. నువ్వు తప్ప నాకు వేరే దిక్కులేదు. వెంటనే వచ్చి ఈ దీనుణ్ణి రక్షించు' అని దీనాతిదీనంగా వేడుకున్నాడు.

అతడి ఆర్తనాదం తక్కిన దేవతలకూ వినిపించింది. కానీ వాళ్ళెవరికీ విశ్వం అంతటా వ్యాపించి ఉండే గుణం లేదు. అంటే వారు ఒక సమయంలో ఎక్కడో ఒక్కచోటే ఉండగలరు. కాబట్టి వారు గజేంద్రుడు రక్షణ కోరింది తమను కాదని గ్రహించారు. అందుకే వాళ్ళు గజేంద్రుణ్ణి కాపాడడానికి ముందుకు రాలేక పోయారు.

మ. **అల వైకుంఠ పురంబులో నగరిలో నా మూలసౌధంబు దా**
**పల మందారవనాంతరామృత సరః ప్రాంతేందుకాంతోప లో**
**త్పల పర్యంక రమావినోదియగు నాపన్నప్రసన్నుండు వి**
**హ్వలనాగేంద్రము 'పాహి పాహి' యనఁ గుయ్యాలించి సంరంభియై.** (8-95)

వైకుంఠపురంలో ఒక అంతఃపురం ఉంది. దాని లోపల ఒక ప్రధాన భవనం, దాని లోపల మందారవనం, అందులో అమృత సరస్సు. ఆ ప్రక్కనే చంద్రకాంత శిలావేదిక. దానిపై ఉంది ఒక కలువపూల పానుపు. దానిపై కూర్చొని లక్ష్మీదేవితో సరదాగా కబుర్లు చెప్తున్నాడు స్వామి. అప్పుడు ఆ లక్ష్మీదేవి చీర కొంగు ఆయన చేతిలో ఉంది. దానిని అలాగే పట్టుకొని గజేంద్రుడి ఆర్తనాదం వినగానే ఉన్నపళంగా బయలుదేరాడు శ్రీహరి.

మ. **సిరికిం జెప్పఁడు శంఖచక్ర యుగముం జేదోయి సంధింపఁ డే**
**పరివారంబును జీరఁ డభ్రగపతిం బన్నింపఁ డాకర్ణికాం**
**తరధమ్మిల్లముఁ జక్కనొత్తఁడు వివాదప్రోత్థిత శ్రీకుచో**
**పరిచేలాంచలమైన వీడఁడు గజప్రాణావనోత్సాహియై.** (8-96)

లక్ష్మీదేవికి చెప్పలేదు. శంఖచక్రాల్ని ధరించలేదు. ఎవరినీ పిలవలేదు. గరుడ వాహనాన్ని ఎక్కలేదు. కనీసం లక్ష్మీదేవి చీర కొంగునైనా విడిచిపెట్టలేదు. పరుగుపరుగున బయలుదేరాడు హరి. హరి వెనుక సిరి. ఆమె వెనుక పరివారం. వారి తరువాత గరుడుడు, వెనుక పంచాయుధాలు, నారదుడు, విష్వక్సేనుడు ఇలా వైకుంఠంలో ఉన్న ఆబాలగోపాలమూ కదిలింది.

లక్ష్మీదేవికి మనసులో ఆందోళన. ఏం జరిగిందోనని. అడుగుదామని ముందుకు వెళ్తోంది. కానీ భయం. వెనక్కి వస్తోంది.

విష్ణుమూర్తి గబగబా ఆ సరస్సును చేరుకొని తన సుదర్శన చక్రాన్ని ప్రయోగించాడు. వెళ్ళి ఆ చక్రం మొసలి తలను ఖండించివేసింది.

చిక్కి శల్యమైన గజేంద్రుడు బతుకు జీవుడా అంటూ బయటపడ్డాడు. గజేంద్రుణ్ణి ప్రేమగా నిమిరి సరస్సు నుంచి బయటకు తీసుకువచ్చాడు శ్రీహరి. ఆయన స్పర్శతో ఆ గజేంద్రుడికి తాపమంతా చల్లారింది.

రాజా! నిజానికి ఈ గజేంద్రుడు 'ఇంద్రద్యుమ్నుడు' అనే చక్రవర్తి. ఈ మొసలి 'హూహూ' అనే గంధర్వుడు. దేవలుడు అనే మహర్షి శాపంవల్ల ఇదుగో ఇలా మొసలిగా ఉన్నాడు. ఇప్పటికిగానీ అతడికి విముక్తి లభించలేదు. ఇక ఇంద్రద్యుమ్నుడు అగస్త్య మహర్షిని గౌరవించకపోవటంవల్ల అతడి శాపానికి గురై ఏనుగుగా పుట్టాడు. అతడి పరివారమూ ఏనుగుల సమూహంగా పుట్టింది.

రాజా! ఆ తరువాత శ్రీహరి – 'లక్ష్మీ! నేను అలా చెప్పా పెట్టకుండా వెళ్తుంటే నీకేమనిపించింది? **నన్ను నమ్ముకున్నవాళ్ళు కష్టంలో ఉంటే వాళ్ళను వెంటనే రక్షిస్తాను. నన్ను గుర్తుంచుకున్నవాళ్ళను నేను గుర్తుంచుకుంటాను. నన్ను మర్చిపోయినవాళ్ళని నేనూ మర్చిపోతాను కదా!'** అన్నాడు.

అప్పుడు లక్ష్మీదేవి – 'స్వామీ! నాకు మీ పాదాలను ధ్యానించటం తప్ప వేరే ఆలోచన ఉంటుందా? దీనుల ఆర్తిని వినటం వాళ్ళను రక్షించటం మీకే చెల్లింది. మీరు దీనులకు అధీనులై ఉంటారు కదా!' అని కొనియాడింది.

రాజా! ఎవరు ఈ కథను భక్తిశ్రద్ధలతో వింటారో, చదువుతారో వారికి ఎల్లప్పుడూ శుభమే జరుగుతుంది.

తరువాత రైవతుడు అనే చక్రవర్తి ఐదో మనువై భూమిని చక్కగా పాలించాడు. ఈ కాలంలోనే శ్రీహరి శుభ్రుడికీ, ఆయన భార్య వికుంఠకూ వైకుంఠుడు అనే పేరుతో అవతరించాడు. వైకుంఠలోకాన్ని సృష్టించాడు.

ఆరో మనువు – చాక్షుషుడు. ఇతడి కాలంలోనే క్షీరసాగర మథనం జరిగింది.

## క్షీరసాగర మథనం

దుర్వాస మహర్షి శాపంవల్ల దేవతల ఐశ్వర్యం పోయింది.

శ్రీమహావిష్ణువు సూచనపై దేవేంద్రుడు బలిచక్రవర్తిని సేవిస్తూ క్షీరసాగర మథనానికి రాక్షసుల్ని ఒప్పించాడు. దేవతలూ రాక్షసులూ కదిలారు. మందర పర్వతాన్ని పెకలించారు. కానీ దాన్ని ఎత్తలేక చతికిలపడ్డారు. అప్పుడు శ్రీహరి అక్కడికి వచ్చాడు. ఒక బంతిని చేతితో కదిల్చినట్లుగా మందర పర్వతాన్ని కదిపాడు. గరుడుడిని పిలిచి దాన్ని క్షీరసాగరందాకా తెప్పించాడు. దేవదానవులు వాసుకిని (సర్పరాజు) ప్రార్థించారు. ఇప్పుడు మందర పర్వతం కవ్వం అయితే వాసుకి కవ్వపు తాడు. వాసుకిని రాక్షసులు తోకవైపు, దేవతలు తలవైపు పట్టుకున్నారు. అది అవమానంగా భావించిన రాక్షసులు మేము తలవైపే ఉంటామన్నారు.

మథనం ప్రారంభమయింది. అలా మొదలయ్యిందో లేదో మందరం బుడబుడమని మునిగిపోయింది. అప్పుడు శ్రీమన్నారాయణుడే కూర్మరూపాన్ని ధరించి సముద్రం అడుక్కి వెళ్ళి పర్వతాన్ని వీపుపై ఉంచుకొని పైకి ఎత్తాడు. పర్వతం లేచింది. జై శ్రీమన్నారాయణ! జై శ్రీమన్నారాయణ! అన్న నినాదాలు మిన్నుముట్టాయి. పర్వతం సముద్రంలో గుబగుబలాడుతూ తిరుగుతోంది. అటు రాక్షసులూ ఇటు దేవతలూ ఉత్సాహంగా చిలుకుతున్నారు. అట్టహాసాలు, కేకలు, హెచ్చరికలు. వీటితో దిక్కులు పిక్కటిల్లిపోతున్నాయి. వాళ్ల వేగానికి సముద్రం అల్లకల్లోలమైపోతోంది. అందరూ చూస్తుండగానే సముద్రంలోంచి హాలాహలం పుట్టుకొచ్చింది. దేవదానవులు హడలిపోయారు. దేవతలు ఈశ్వరుణ్ణి శరణు వేడారు.

శివుడు పరమ దయామయుడు. 'కష్టంలో ఉన్నవాళ్ల కష్టాన్ని తీర్చటం ప్రభువుల విధి. ఆయన లోకహితం కోరి, హాలాహలం మింగటానికి సిద్ధమై ఆ విషయం పార్వతికి చెప్పాడు.

కం. **పరహితము సేయు నెవ్వఁడు**
**పరమహితుం డగును భూతపంచకమునకున్**
**బరహితమె పరమధర్మము**
**పరహితునకు నెదురులేదు పర్వేందుముఖీ!** (8-235)

**పరహితం చేసేవాడే పంచభూతాలకూ హితుడు. పరహితమే శ్రేష్ఠమైన ధర్మం. పరహితం కోసం పాటుపడేవాడికి ఎదురే లేదు.** ఏమంటావు పార్వతీ!' అన్నాడు.

పార్వతీదేవి సరేనంది.

కం. **మ్రింగెడు వాడు విభుండని**
**మ్రింగెడిదియు గరళమనియు మేలని ప్రజకున్**
**మ్రింగుమనె సర్వమంగళ**
**మంగళసూత్రంబు నెంత మది నమ్మినదో!** (8–241)

మింగేవాడు తన భర్త అనీ మింగబోయేది హాలాహలమనీ మింగితే లోకానికి మంచి జరుగుతుందనీ తెలుసు. తెలిసే సర్వమంగళ (పార్వతీదేవి) అంగీకరించింది. ఆ తల్లికి తన మంగళసూత్రం గట్టిదన్న నమ్మకం.

శివుడు ఆ గరళాన్ని కొద్దిపాటి ఫలరసంలా మ్రింగి కంఠంలోనే ఉంచాడు. ఎందుకంటే పొట్టలో లోకాలు ఉన్నాయి కాబట్టి.

మళ్ళీ మథనం ప్రారంభమయ్యింది. ఈసారి వరుసగా సాగరంలోంచి కామధేనువు, ఉచ్చైశ్శ్రవం, ఐరావతం, కల్పవృక్షం పుట్టాయి. తరువాత అప్సరసలు, చంద్రుడు, లక్ష్మీదేవి పుట్టారు. లక్ష్మీదేవి విష్ణువును వరించింది. తరువాత 'వారుణి 'పుట్టింది. దానిని రాక్షసులు తీసుకున్నారు. ఆ తరువాత చేతిలో అమృతభాండంతో దివ్యకాంతులు వెదజల్లుతూ ధన్వంతరి ఆవిర్భవించాడు. దానికోసం దేవదానవుల్లో యుద్ధం మొదలయ్యింది.

అప్పుడు శ్రీమన్నారాయణుడు 'మోహిని' అవతారం ధరించాడు. మోహిని దేవతల్నీ, రాక్షసుల్నీ విడిగా రెండు వరుసల్లో కూర్చోబెట్టింది. రాక్షసులకు ఒయ్యారాల్ని ఒలకబోస్తూ, దేవతలకు అమృతాన్ని ధారబోసింది. అది గమనించాడు రాహువు. దేవతల వరుసలో కూర్చొని అమృతాన్ని త్రాగడం మొదలుపెట్టాడు. సూర్యచంద్రులు మోహినికి సైగ చేశారు. అంతే! మోహిని ఆదేశం, సుదర్శనుడి ఆగమనం వెంటవెంటనే జరిగాయి. రాహువు తల తెగి క్రింద పడింది. కానీ అమృతం త్రాగిన కారణంగా అది మరణించలేదు. మొండెం మాత్రం నేలకూలింది.

రాక్షసులు పట్టరాని కోపంతో దేవతలపై విరుచుకు పడ్డారు. తన మీదకు వచ్చిన కాలనేమి, సుమాలి, మాల్యవంతుడు అనే రాక్షసుల్ని శ్రీహరి వధించాడు. బలాసురుణ్ణీ, పాకాసురుణ్ణీ, నముచినీ ఇంద్రుడు వధించాడు. ఇంతలో నారద

మహర్షి వచ్చి ఇరుపక్షాలకు సర్దిచెప్పి యుద్ధాన్ని విరమించేలా చేశాడు.

రాక్షసులు బలిచక్రవర్తితో కలిసి పడమటి కొండవైపుకు చేరుకున్నారు. శుక్రాచార్యుడు మృతసంజీవిని విద్య ద్వారా రాక్షసుల్ని తిరిగి బతికించాడు.

రాజా! ఇప్పుడు ఏడో మనువు వైవస్వతుడి కాలం. ఎనిమిదో మనువు సావర్ణి. అతడి తరువాత దక్షసావర్ణి, బ్రహ్మసావర్ణి, ధర్మసావర్ణి, దేవసావర్ణి, ఇంద్రసావర్ణి వరుసగా మనువులవుతారు.

ఎంతటి చక్రవర్తులయినా శ్రీమన్నారాయణుడికి లోబడి ఉండవలసిందే. దీనికి ఉదాహరణగా నీకు వామనావతార కథ చెప్తాను విను.

## వామన చరిత్ర

బలిచక్రవర్తి శుక్రాచార్యుడి దయవల్ల 'విశ్వజిత్' యాగం చేసి శక్తిమంతమైన ఆయుధాలు సంపాదించి దేవతల్ని జయించాడు.

అదితి కశ్యపుడి ఆదేశంతో 'పయోభక్షణం' అనే వ్రతం ఆచరించింది. ఆ వ్రత ఫలంగా శ్రీహరి ఆ దంపతులకు ఒక శుభ ముహూర్తంలో చతుర్భుజాలతో, పంచాయుధాలతో అవతరించాడు. తరువాత స్వామి ఆ రూపాన్ని విడిచి వామనుడి రూపాన్ని ధరించాడు. సరిగ్గా ఉపనయనం చేసే వయస్సు. అందుకే కశ్యప ప్రజాపతి ఆ ఉత్సవాన్ని నిర్వహించాడు. అందరూ మనసారా దీవించారు.

బయలుదేరాడు వామనమూర్తి. నర్మదా నదిని దాటాడు. బలి అక్కడ యాగం చేస్తున్నాడు. అటువైపు బుడిబుడి అడుగులు వేశాడు. దారిలో కొందరిని పలకరిస్తూ, కొందరితో కలిసి వేదం చదువుతూ, కొందరితో చర్చిస్తూ, బిత్తర చూపులు చూస్తూ, నవ్వుతూ, నవ్విస్తూ సాగిపోతూ యాగవాటికను చేరుకొన్నాడు.

రాజును చూడగానే చెయ్యెత్తి ఆశీర్వదించాడు. అతడి తేజస్సు చూసిన బలిచక్రవర్తి అతిథిమర్యాదలు ఘనంగా చేసి 'ఓ పొట్టి వడుగా! ఎంత ముద్దు వస్తున్నావో! అసలు నువ్వు ఎవరు? ఎక్కడ ఉంటావు? ఇక్కడికి ఏ పనిమీద వచ్చావు? నీ రాకవల్ల నేనూ, నా జన్మ, నా వంశం ధన్యమయ్యాయి. చెప్పు. నీకేం కావాలి? మంచిమంచి వస్త్రాలా? మాడలా? ఫలాలా? ఉద్యానవనాలా? ఆవులా? గుర్రాలా? రత్నాలా? రథాలా? విందులా? భవనాలా? కన్యలా? ఏనుగులా? పోనీ బంగారమా?

రాజ్యం కావాలా? ఇంకేమైనానా? ప్రేమగా అడిగాడు.

వామనమూర్తి సమాధానంగా 'రాజా! నేను అంతటా తిరుగుతూ ఉంటాను. నా అంతట నేనే మరొకరి ఆజ్ఞకు లోబడక వర్తిస్తూ ఉంటాను. నాకు రాని విద్యంటూ లేదు. నాకెవ్వరూ లేరు. నేను అందరివాణ్ణి. పైగా ఒంటరిని. ఇంతకుముందు ఐశ్వర్యం ఉండేది. ఇప్పుడు లేదు. మంచివాళ్ళు ఎక్కడ ఉంటే నేనూ అక్కడే! నువ్వు సామాన్యుడివి కావు. గొప్ప దాతవు.

తే.గీ. **ఒంటివాడ నాకు నొకటి రెండడుగులు**
**మేర యిమ్ము సొమ్ము మేర యొల్లఁ**
**గోర్కి దీర బ్రహ్మకూఁకటి ముట్టెద**
**దానకుతుకసాంద్ర! దానవేంద్ర!** (8–566)

'దానవరాజా! నేను ఒంటరిని. నాకు ఒకటి రెండడుగులు (మూడడుగులు) నేల చాలు. దానిని దానంగా ఇవ్వు. ఇప్పుడు నువ్వు అడిగినవేవీ నాకు అవసరం లేదు. ఈ కోర్కె తీర్చు. అదే నాకు బ్రహ్మానందం' అన్నాడు.

బలిచక్రవర్తి ఆశ్చర్యపోయాడు. నచ్చచెప్పాలని చూశాడు కానీ వామనుడు మరేమీ కోరలేదు. పైగా ఇలా అన్నాడు – 'రాజా! నేనా బ్రహ్మచారిని. నాకు గొడుగో, జంధ్యమో, కమండలమో, ముంజియో, దండమో కావాలిగానీ అవన్నీ నాకెందుకు? వడుగునైన నేనెక్కడ? ఏనుగులు, గుర్రాలు, స్త్రీలు మొదలైనవన్నీ ఎక్కడ? పైగా అవన్నీ నా నిత్యకృత్యాలకు ఆటంకాలు. నేను అడిగిన మూడడుగుల నేలను కాదనకుండా ఇవ్వవయ్యా! అదే నాకు బ్రహ్మాండంతో సమానం.

కం. **వ్యాప్తిం బొందక వగవక**
**ప్రాప్తంబగు లేశమైనఁ బదివే లనుచుం**
**దృప్తిం జెందని మనుజుఁడు**
**సప్తద్వీపముల నయినఁ జక్కంబడునే?** (8–574)

**పేరాశకు పోకుండా, ఐశ్వర్యం లేదే అని చింతించకుండా, తనకు తానుగా లభించింది కొంచెమే అయినా దాన్నే పదివే లనుకొని తృప్తిపడనివాడు సప్తద్వీపాలు లభించినా తృప్తి పడగలడా? నువ్వే చెప్పు? రాజా! ఈ ఆశ అనేది ఉంది చూశావూ?**

**అది చాలా పొడవు. దానికి అంతం లేదు. మహామహా చక్రవర్తులు సైతం ఆశకు దాసులైపోయారు. తృప్తిని పొందినవాడే పరమ పూజ్యుడు. అతడికి ఎప్పుడూ సుఖమే. తృప్తి లేకపోవటమే సంసారానికి హేతువు. తృప్తి ఉంటే తేజస్సూ పెరుగుతుంది.** నువ్వు రాజువి కాబట్టి నీ దగ్గర ఉన్నవన్నీ అడగటం భావ్యం కాదు. నాకు తగినదే నేను అడుగుతున్నాను. అది ఇవ్వు చాలు!' అన్నాడు.

అప్పుడక్కడికి శుక్రాచార్యుడు వచ్చాడు. వచ్చి 'రాక్షసరాజా! ఇతడు సాక్షాత్తు శ్రీమన్నారాయణుడు. జాగ్రత్త!

తే.గీ. **వారిజాక్షులందు వైవాహికములందుఁ**
**బ్రాణవిత్తమాన భంగమందు**
**జకిత గోకులాగ్ర జన్మరక్షణమందు**
**బొంకవచ్చు నఘము వొంద దధిప!** (8-585)

స్త్రీల విషయంలో, వివాహం సందర్భంలో, ప్రాణానికిగానీ, ధనానికిగానీ, గౌరవానికిగానీ భంగం కలిగే పరిస్థితుల్లోనూ, అలాగే గోబ్రాహ్మణులను రక్షించే సందర్భంలో అసత్యం ఆడవచ్చు. దానివల్ల పాపం కలుగదని శాస్త్రం చెబుతోంది. నువ్వు గొప్ప దాతవే! కాదనను. ఈ దానం ఇచ్చి నీ వంశ నాశనాన్ని నువ్వే కోరి తెచ్చుకోవద్దు. నా మాట విను. ఈ పొట్టివాడు మూడడుగుల నేలను తీసుకొని త్రివిక్రముడై బ్రహ్మాండాన్ని ఆక్రమిస్తాడు' అని హితవు పలికాడు.

అంతా విన్నాడు బలిచక్రవర్తి. విని 'గురువర్యా! ఏమంటున్నారు? **ఆడిన మాటను తప్పమంటున్నారా? అంతకంటే పాపం మరొకటి ఉందా? భూమాత ఎవర్నైనా భరిస్తుందిగానీ మాట తప్పినవాణ్ణి మాత్రం భరించనుగాక భరించను అని చెప్పలేదూ! రైతుకు మంచి పొలం, విత్తనాలు దొరకటం ఎంత కష్టమో దాతకు తగిన ధనమూ, పాత్రుడైన యాచకుడూ దొరకటం అంతే కష్టం.**

శా. **కారే రాజులు? రాజ్యముల్ గలుగవే? గర్వోన్నతిం బొందరే!**
**వారేరీ? సిరి మూటగట్టుకొని పోవం జాలిరే? భూమిపైఁ**
**బేరైనం గలదే? శిబిప్రముఖులుం బ్రీతిన్ యశఃకాములై**
**యీరే కోర్కులు? వారలన్ మఱచిరే యిక్కాలమున్? భార్గవా!** (8-590)

భార్గవా! ఎందరో చక్రవర్తులు. వాళ్ళంతా రాజులు కారూ? వాళ్ళకు రాజ్యాలు లేవూ! గర్వంతో విర్రవీగలేదా? వాళ్ళందరూ ఇప్పుడు ఎక్కడ? వెళ్ళేటప్పుడు సిరినేమైనా మూటగట్టుకుపోగలిగారా? కనీసం వాళ్ళ పేరైనా నిలబడిందా? ఎవరో కొందరు శిబిచక్రవర్తిలాంటి వాళ్ళ పేర్లు తప్ప. ఎందుకు? వాళ్ళు కీర్తిని కోరి అడిగినవాళ్ళకు లేదనకుండా ఇచ్చారు కాబట్టి. ఇప్పటికీ వారిని లోకం మరచిపోలేదే. ఎన్ని యాగాలు చేస్తే శ్రీహరి దర్శనం లభిస్తుంది? అంతటి శ్రీమన్నారాయణుడు నాలాంటి సామాన్యుడి దగ్గర చేయి చాచాడంటే అంతకంటే భాగ్యం వేరే ఉంటుందా? లక్ష్మీదేవి కొప్పుమీదా శరీరం మీదా భుజాల మీదా ఇలా నడయాడిన ఆ శ్రీహరి దివ్యహస్తం ఇప్పుడు కింద ఉండటం, నా చెయ్యి పైన ఉండటం నాకు మేలుకాదా? రాజ్యం గీజ్యం శాశ్వతమా? ఈ శరీరం ఏమైనా అపాయం లేనిదా? గురువర్యా! నాకు నరకం గాని, బంధనం కాని ఏదైనా రానీ! భూమి నశించనీ, దుర్మరణం కలగనీ, వంశనాశనం కానీ, ఏమైనా సరే! ఎవ్వరు వచ్చినా సరే! నా నాలుక అబద్ధం ఆడదు.

శుక్రాచార్యుడికి సహనం నశించింది. 'నువ్వు త్వరలోనే పదవీ భ్రష్టుడివి అవుతావు' అని శపించాడు. అయినా బలిచక్రవర్తి చలించలేదు.

ఆ.వె. **బ్రతుకవచ్చుఁగాక బహుబంధనములైన**
**వచ్చుఁగాక లేమి వచ్చుఁగాక**
**జీవధనము లైనఁ జెడుఁగాక పడుఁగాక**
**మాట దిరుగలేరు మానధనులు.** (8-598)

బ్రతికినా, బంధనాలు ఏర్పడినా, ఐశ్వర్యం పోయినా, ప్రాణం పోయినా సరే! మానధనులు ఆడిన మాటను తప్పరు.

బలిచక్రవర్తి తన భార్య వింధ్యావళితో కలిసి మంత్రపూర్వకంగా జలధార వదులుతూ మూడడుగుల నేలను ధారపోస్తున్నాడు. శుక్రాచార్యుడు కమండలంలో దూరి నీటి ధారకు అడ్డుపడ్డాడు. అది గమనించిన వామనుడు ఒక దర్భతో ఆ కమండలం రంధ్రంలో పొడిచాడు. అది శుక్రాచార్యుడి కంట్లో గుచ్చుకొని అతడి ఒక కన్ను పోయింది.

వామనుడు 'బలిచక్రవర్తీ! నువ్వు ఇచ్చిన ఈ మూడడుగులతో ముల్లోకాలనూ ఇచ్చినట్లే సుమా!' అన్నాడు నవ్వుతూ. బలిచక్రవర్తికి అర్థం కాలేదు. ఆశ్చర్యపోయాడు.

'ఏమిటీ పొట్టివడుగు మాటలు? ఇలాంటి బుద్ధులు ఇతడు పుడుతూ నేర్చుకున్నాడా? పుట్టకముందే నేర్చుకున్నాడా? అమ్మో! ఇతడి పొట్టలో ఇంకెన్ని మాయలున్నాయో!' అనుకున్నాడు. వామనుడు క్రమంగా పెరుగుతున్నాడు.

శా. **ఇంతింతై వటుఁడింతయై మఱియుఁ దానింతై నభోవీథిపై**
**నంతై తోయదమండలాగ్రమున కల్లంతై ప్రభారాశిపై**
**నంతై చంద్రుని కంతయై ధ్రువునిపై నంతై మహర్వాటిపై**
**నంతై సత్యపదోన్నతుండగుచు బ్రహ్మాండాంత సంవర్ధియై.** (8–622)

వటుడు ఇంతింతగా పెరుగుతూ క్రమంగా ఆకాశాన్నీ, మేఘ మండలాన్నీ, పాలపుంతను, చంద్రుణ్ణీ, ధ్రువుణ్ణీ దాటి, మహర్లోక సత్యలోకాలను దాటిపోయి బ్రహ్మాండమంత పెరిగిపోయాడు.

అలా వామనుడు పెరుగుతుంటే ఆకాశంలో ఉన్న సూర్యుడు మొదట వామనుడికి గొడుగులా ఉన్నాడు. ఆ తరువాత శిరోరత్నంలా, చెవిపోగులా, కంఠాభరణంలా, భుజకీర్తిలా, చేతి కంకణంలా, మొలత్రాడు గంటలా, కాలి అందెలాగా, పాదపీఠంలా ప్రకాశించాడు.

అలా పెరిగిన వామనుడు ఒక అడుగుతో పైలోకాల్నీ, మరో అడుగుతో కింది లోకాల్నీ ఆక్రమించాడు. బ్రహ్మాండం పటపటలాడింది. త్రివిక్రముడు మళ్ళీ వామనమూర్తిగా బలిచక్రవర్తి ముందు నిలిచి – 'రాజా! మూడో అడుగుకు చోటు ఎక్కడ? చూపిస్తావా? నరకానికి పోతావా?' అన్నాడు.

అప్పుడు బలిచక్రవర్తి ధైర్యంగా తన శిరస్సును చూపిస్తూ – **'మహానుభావా! మృత్యువు నాకు నేస్తమా? యముడు చుట్టమా? ఈ సేవకులు నిజమైనవాళ్ళేనా? కాదు. అందరూ ఎప్పుడో ఒకప్పుడు మరణించవలసిందే. తుచ్ఛమైన ఈ శరీరం కోసం సత్యం, దానం, దయ, ధర్మం మొదలైనవాటిని విడిచిపెట్టటం అవివేకం. చుట్టాలు దొంగలు. కొడుకులది ఋణానుబంధం. స్త్రీలు సంసారానికి కారకు రాళ్ళు. ధనం శాశ్వతం కాదు. శరీరం చంచలం. మిగిలినవాళ్ళందరూ ఏదో ఒక అవసరం కోసం వచ్చేవాళ్ళే. ఆయువు క్షణక్షణానికీ క్షీణించి పోతూ ఉంటుంది. ఐశ్వర్యం చేజారిపోతుంది. అందుకే మా తాత ప్రహ్లాదుడు నిన్ను సేవించి ధన్యుడయ్యాడు. నీ అంతట నువ్వే నా దగ్గరకు యాచకుడిగా రావటం నా పుణ్యంకాక మరేమిటి?'**

అన్నాడు.

గరుడుడు వామనరూపి అయిన విష్ణుమూర్తి ఆదేశానుసారం బలిచక్రవర్తిని వరుణపాశంతో బంధించాడు.

అంతలో ప్రహ్లాదుడు అక్కడికి వచ్చాడు. స్వామిని దర్శించి పులకించిపోయాడు. వరుణపాశంలో బందీగా ఉన్న తన భర్తను చూసి వింధ్యావళి కంటతడి పెట్టుకుని 'స్వామీ! నువ్వు కోరినదల్లా ఇచ్చాడు కదా? అయినా ఏమిటిది?' అని అడిగింది. అప్పుడు వామనుడు **'నేను ఎవరిని అనుగ్రహించాలనుకొంటానో వాళ్ళ ఐశ్వర్యాన్ని ముందు హరిస్తాను.** నీ భర్త పుణ్యాత్ముడు. ఇతడికి ఇంక ఏ దుఃఖమూ అంటదు. సుతల లోకంలో హాయిగా ఉంటాడు. నేనే స్వయంగా రక్షిస్తాను' అంటూ బలిచక్రవర్తిని సుతలానికి వెళ్ళమని ఆజ్ఞాపించాడు.

రాజా! తరవాత విష్ణుమూర్తి ఆజ్ఞప్రకారం శుక్రాచార్యుడు, ఆ యాగాన్ని పూర్తిచేశాడు. అలా దేవేంద్రుడికి తమ్ముడిగా పుట్టి ఉపేంద్రుడై అన్నగారికి ఐశ్వర్యాన్ని తిరిగి ప్రసాదించాడు వామనమూర్తియైన శ్రీహరి. ఇలాంటి సోదరుడు ఉంటే ఎలాంటి అన్నగారికైనా తీరని కోర్కెలంటూ ఉంటాయా?

## మత్స్యావతార కథ

రాజా! ఇవన్నీ శ్రీహరి లీలలు నాయనా! పూర్వ కల్పాంతంలో 'సత్యవ్రతుడు' ద్రవిడ దేశానికి రాజుగా ఉండేవాడు. అతడు ఒకరోజు నదిలోనికి దిగి తర్పణం వదలడం కోసం దోసిట్లోకి నీళ్ళు తీసుకున్నాడు. ఆ నీళ్ళలో ఒక చేప. దానిని మళ్ళీ నీళ్ళలో విడిచిపెట్టాడు రాజు. అప్పుడా చేప 'రాజా! ప్రాణభయంతో నీ చేతుల్లోకి వచ్చాను. నువ్వేమో రక్షించకుండా నమ్మివచ్చిన నన్ను మళ్ళీ నట్టేట్లో ముంచేశావు. ఇది నీకు భావ్యమా?' అని నిలదీసింది.

రాజు దయతో దానిని తన కమండలంలో వేసి ఇంటికి తీసుకువెళ్ళాడు. మరునాడు చూసేసరికి ఆ చేప కమండలం పట్టనంతగా పెరిగిపోయింది. దాన్ని తీసి ఒక తొట్టెలో ఉంచాడు. కాస్సేపటికే ఆ తొట్టె కూడా ఇరుకైపోయింది. ఈసారి దాన్ని ఒక మడుగులో ఉంచాడు. అదీ సరిపోలేదు దానికి. ఆ తరువాత సరస్సులో ఉంచాడు. అదీ పట్టలేదు. ఇక చివరికి ఆ చేపను సముద్రంలో వదిలాడు. అప్పుడా

చేప – 'ఏమయ్యా! రాజా! ఇంతకాలం నన్ను కాపాడినవాడివి ఇప్పుడు సముద్రంలో వదిలేస్తావా? ఇక్కడ నన్ను ఏ మొసలో తినివేస్తే ఏంకాను?' అని నిలదీసింది. ఆ రాజుకు అర్థమయ్యింది. 'స్వామీ! ఏమిటి ఈ రూపం? ఇందులోని పరమార్థం ఏమిటి? అని అడిగాడు చేతులు జోడిస్తూ. అప్పుడు శ్రీమహావిష్ణువు–

'రాజా! ఇది కల్పాంతం. ప్రళయం రాబోతోంది. నేటికి సరిగ్గా ఏడో రోజున సముద్రంలో ఒక నావ వస్తుంది. అప్పుడు నువ్వు ఓషధుల్ని తీసుకొని దానిని అధిరోహించు. నేను మత్స్యరూపంలో ఆ నావను రక్షిస్తాను' అని అదృశ్యమైపోయాడు.

ప్రళయం వచ్చింది. బ్రహ్మదేవుడు నిద్రలోనికి జారుకున్నాడు. అప్పుడు అతడి ముఖాల నుండి వేదాలు వెలువడ్డాయి. వాటిని తీసుకొని 'హయగ్రీవుడు' అనే రాక్షసుడు పారిపోయాడు. అప్పుడు శ్రీమన్నారాయణుడు ఆ రాక్షసుణ్ణి చంపి వేదాలను తెచ్చి బ్రహ్మదేవుడికి ఇచ్చాడు. అలాగే సత్యవ్రతుడికి చెప్పినట్లుగా ఆ నావనూ సంరక్షించాడు.

ఈ సత్యవ్రతుడే వివస్వంతుడికి (సూర్యుడికి) వైవస్వతుడు అనే పేరుతో పుట్టి విష్ణువు దయవల్ల ఈ కల్పంలో ఏడవమనువు అయ్యాడు.

# స్కంధం - 9

**రా**జా! దక్షుడి కుమార్తె అదితికీ కశ్యప ప్రజాపతికీ 'ఆదిత్యుడు' అనే కుమారుడు జన్మించాడు. అతడే సూర్యభగవానుడు. ఇతడికి సంజ్ఞ అనే భార్య ద్వారా 'శ్రాద్ధ దేవుడు' (వైవస్వతుడు) అనే పుత్రుడు జన్మించాడు. ఇతడే పూర్వజన్మలో సత్యవ్రతుడు. ఇతడు శ్రీహరి అనుగ్రహం వల్ల మనువు అయ్యాడు. ఇతనికి శ్రద్ధ అనే భార్య యందు ఇక్ష్వాకుడు మొదలైన పదిమంది పుత్రులు కలిగారు. వీరిలో పృషధ్రుడు అనే ఒక పుత్రుడికి ఒక వింత పరిస్థితి ఎదురయ్యింది. చెప్తాను, విను.

పృషధ్రుడు తండ్రి ఆజ్ఞపై ఆవులను మేపడానికి అడవికి వెళ్ళాడు. అప్పుడు ఒక పెద్దపులి ఆవులపై పడింది. పృషధ్రుడు పులిపై కత్తి దూశాడు. అప్పుడక్కడ చీకటిగా ఉండటంచేత పొరపాటున పులికి బదులు ఆవు తల తెగి కింద పడిపోయింది. ఆ సంగతి తెలిసి వసిష్ఠ మహర్షి ఇతణ్ణి శూద్రుడివి కమ్మని శపించాడు. 'ఎవరినీ ఏమీ యాచించకుండా దొరికినదానితోనే సంతృప్తిని పొంది, ఇంద్రియాల్ని జయించి

శ్రీహరిని ధ్యానం చేస్తే నీకు విముక్తి కలుగుతుంది' అని శాపవిమోచనం కూడా అనుగ్రహించాడు.

రాజా! వైవస్వత మనువు మరో కుమారుడు శర్యాతి. ఇతడి కుమార్తె సుకన్య. ఒకసారి చ్యవనమహర్షి ఆశ్రమప్రాంతానికి తండ్రితో వెళ్లినప్పుడు అక్కడ ఒక పుట్టను చూచింది. ఆ పుట్టలో రెండు జ్యోతులు ప్రకాశిస్తూ కనిపించాయి. వాటిని మిణుగురుపురుగు లనుకొని ఒక కర్రతో పొడిచింది. కానీ అవి చ్యవన మహర్షి కళ్ళు. అతడి కళ్ళ నుండి రక్తం కారింది. ఆ తప్పుకు ప్రాయశ్చిత్తంగా సుకన్యను చ్యవన మహర్షికే ఇచ్చి పెళ్ళి చేశాడు శర్యాతి. శర్యాతి కొడుకు ఆనర్తుడు. ఇతడి పుత్రుడు రైవతుడు. రైవతుడి కొడుకు కకుద్మి. కుమార్తె రేవతి.

బ్రహ్మదేవుడి ఆదేశంతో రేవతిని బలరాముడికి ఇచ్చి వివాహం జరిపించాడు రైవతుడు. రాజా! వైవస్వత మనువు పుత్రులలో 'నాభాగుడు' అనే పుత్రుడు చాలా గొప్పవాడు. ఇతడి కుమారుడే అంబరీషుడు. ఇతడు మహాభక్తుడు.

## అంబరీషుడి కథ

అంబరీషుడు సమస్త భూమండలానికీ చక్రవర్తి. గొప్ప ఐశ్వర్యవంతుడు. అయినా ఏ అవలక్షణమూ అతడికి లేదు. ఎప్పుడూ శ్రీహరినే ధ్యానిస్తూ, విష్ణుభక్తుల్ని సేవిస్తూ కాలం గడుపుతూ ఉండేవాడు. అతడి మనస్సు ఎప్పుడూ శ్రీహరి పాదాల మీదే ఉండేది. చేసే ప్రతి పనినీ శ్రీహరికే సమర్పిస్తూ ఎంతో పవిత్రంగా జీవనం సాగిస్తున్నాడు. కాబట్టే శ్రీమన్నారాయణుడు తన సుదర్శన చక్రాన్ని అంబరీషుడికి రక్షణగా ఉండమని పంపించాడు.

ఒకసారి అంబరీషుడు ఏకాదశీ వ్రతాన్ని చేసి అతిథులందరికీ సంతర్పణ చేసి తాను కూడా పారణ చేయడానికి సిద్ధపడ్డాడు. సరిగ్గా అప్పుడు దుర్వాస మహర్షి అక్కడికి విచ్చేశాడు. అంబరీషుడు ఆ మహర్షినీ భోజనానికి ఆహ్వానించాడు.

దుర్వాసుడు స్నానం చేసి వస్తానని కాళిందీ నదికి బయలుదేరి వెళ్ళాడు. వెళ్ళిన మహర్షి వస్తేనా? అవతల, ద్వాదశి ఘడియలు మించిపోతున్నాయి. ఈలోగా పారణ చేయాలి. లేకపోతే వ్రతఫలం దక్కదు. పెద్దల సూచనమేరకు అంబరీషుడు తీర్థాన్ని మాత్రం స్వీకరించాడు. నీటిని పుచ్చుకుంటే దోషం ఉండదట. ఫలితం

దక్కుతుందట. దుర్వాసమహర్షి అనుకొన్నదానికంటె ఆలస్యంగా వచ్చాడు.

తాను వచ్చేవరకు రాజు వేచి ఉండలేదని అంబరీషుడిపై పట్టరాని కోపం వచ్చింది ఆ మహర్షికి. పెటపెటమని పళ్ళు కొరుకుతూ తన జడల్లో ఒకదాన్ని పెరికి నేలపై కొట్టాడు. దానినుండి 'కృత్య' (ఒక రాక్షసి) పుట్టింది. అది అంబరీషుడిపైకి వచ్చింది. రక్షణగా ఉన్న సుదర్శన చక్రం దానిని ఒక్క క్షణంలోనే నామరూపాలు లేకుండా చేసి దుర్వాసుడి వెంటపడింది.

దుర్వాసుడు ఎక్కడికి వెళ్తే అక్కడికి వస్తోంది ఆ సుదర్శన చక్రం. ఏం చేయాలో పాలుపోక దుర్వాసుడు బ్రహ్మదేవుణ్ణి ఆశ్రయించాడు. బ్రహ్మదేవుడు నా వల్ల కాదన్నాడు. శివుడి కాళ్ళు పట్టుకున్నాడు. శివుడూ సహకరించలేనన్నాడు. చివరికి శ్రీ మహావిష్ణువునే శరణు వేడాడు.

'మహర్షీ! నేను భక్తులకు అధీనుడనై ఉంటాను. నా భక్తులు బలమైన తీగలతో ఒక మత్తగజాన్ని బంధించినట్లు నన్ను భక్తి అనే లతలతో బంధిస్తుంటారు. నేను ఆ బంధనాల్లో చిక్కుకొని ఎటూ వెళ్ళలేను.

నా భక్తులకు దిక్కు నేనే! కాబట్టి నా భక్తుడు ఎక్కడకు వెళ్తే నేనూ అక్కడికే వెళ్తాను. ఎలాగో తెలుసా? ఆవు వెనక పరిగెత్తే కోడెలాగా.

ఆ.వె. **తనువు మనువు విడిచి తనయుల చుట్టాల**
**నాలి విడిచి సంపదాలి విడిచి**
**నన్నె కాని యన్యమెన్నడు నెఱుఁగని**
**వారి విడువ నెట్టివారినైన.** (9-121)

**అందరినీ, అన్నింటినీ విడిచిపెట్టి నేను తప్ప వేరే ఇంకేమీ తెలియని వాళ్ళను - వాళ్ళు ఎలాంటివాళ్ళైనా నేను విడిచిపెట్టను. మంచివారి హృదయం నాదే! నేనే వాళ్ళ హృదయం. తపస్సు, విద్య, సద్బ్రాహ్మణులకు ముక్తిని కలిగిస్తాయి. అవే చెడ్డవారికి కీడును కలిగిస్తాయి. మంచివారిలో నా తేజస్సు ఉంటుంది. ఆ తేజస్సే సాధువుల్ని బాధించేవారిని శిక్షిస్తుంది.** కాబట్టి నిన్ను రక్షించవలసినవాడు అంబరీషుడే. వెళ్ళు, అతణ్ణే ఆశ్రయించు' అన్నాడు శ్రీహరి. దుర్వాస మహర్షి గత్యంతరం లేక వచ్చి అంబరీషుడి కాళ్ళపై పడ్డాడు. అంబరీషుడు దయామయుడు. సుదర్శనస్వామిని

శాంతింపజేశాడు.

'రాజా! నాకు పెద్ద ఉపకారం చేశావు. నా తప్పు మన్నించావు. నీ భక్తి, కరుణ, వినయం, పెద్దలపట్ల నీకుగల గౌరవం సాటిలేనివి. నీ కీర్తి చిరస్థాయిగా నిలిచిపోతుంది' అని ఆశీర్వదించి, ఆతిథ్యం స్వీకరించి తృప్తిగా వెళ్ళిపోయాడు దుర్వాస మహర్షి.

## ఇక్ష్వాకువంశం

రాజా! ఇక ఇక్ష్వాకువంశం. మనుచక్రవర్తికి ఇక్ష్వాకువు జన్మించాడు. ఇతడే సూర్యవంశానికి రాజు అయ్యాడు. ఇతడికి వందమంది పుత్రులు. వారిలో వికుక్షి, నిమి, దండకుడు ప్రముఖులు.

ఇక్ష్వాకు మహారాజు అష్టక శ్రాద్ధం చేయాలని సంకల్పించాడు. అందుకు కొంత మాంసం కావాలి. దానికోసం వికుక్షి అడవికి వెళ్ళాడు. ఒక కుందేలును చంపి దాని మాంసాన్ని కొంత తాను తిని, మిగిలినదాన్ని యాగం కోసం తీసుకువచ్చాడు.

ఎంగిలి మాంసం తెచ్చినందుకు కోపంతో తండ్రి వికుక్షిని తన రాజ్యంలో ఉండవద్దన్నాడు. వికుక్షి దేశం విడిచి వెళ్ళిపోయాడు. ఇక్ష్వాకుడు యోగమార్గంలో శరీరాన్ని త్యజించాడు. కుందేలు మాంసం తిన్నందువల్ల వికుక్షికి శశాదుడు అని పేరు వచ్చింది.

వికుక్షి కుమారుడు పురంజయుడు. రాక్షసుల్ని సంహరించడం కోసం శ్రీమన్నారాయణుడు పురంజయుడిలో ఆవహించి ఉన్నాడు. ఇంద్రుడు ఆంబోతుగా మారాడు. ఆ ఆంబోతు కకుత్స్థము (మూపు) మీద ఎక్కి పురంజయుడు రాక్షసుల్ని సంహరించాడు. అందుకే ఇతడికి అమరేంద్ర వాహనుడు, కకుత్స్థుడు అనే పేర్లు వచ్చాయి.

పురంజయుడి కుమారుడు అనేనసుడు. ఇతడి కుమారుడు పృథువు. కొన్ని తరాల తర్వాత ఈ వంశంలోనే కువలయాశ్వుడు జన్మించాడు. ఇతడు బృహదశ్వుడి కుమారుడు. ఇతడి 21 వేల మంది కుమారులలో ముగ్గురు తప్ప అందరూ ధుంధుడు అనే రాక్షసుడివల్ల మరణించారు. అలా మిగిలినవాళ్ళు దృఢాశ్వుడు,

కపిలాశ్వుడు, భద్రాశ్వుడు.

దృఢాశ్వుడి వంశంవాడైన యువనాశ్వుడు తన వందమంది భార్యలతో యజ్ఞం చేశాడు. ఆ యజ్ఞ ఫలంగా ఇతడికి 'మాంధాత' అనే కుమారుడు జన్మించాడు.

మాంధాత చాలా గొప్ప చక్రవర్తి. అనేక యాగాలు చేశాడు. శ్రీహరిని మెప్పించాడు. అతడి భార్య బిందుమతి. పురుకుత్సుడు, అంబరీషుడు, ముచుకుందుడు కుమారులు. వీళ్ళేకాక 50 మంది పుత్రికలు.

సౌభరి అనే మహర్షి ఈ కన్యలను వివాహం చేసుకున్నాడు. కొంతకాలానికి సంసారబంధంలో చిక్కుకున్న ఆ మహర్షి తపస్సు మొత్తం వ్యర్థమయింది. ఆయనకు జ్ఞానోదయమైంది. తప్పు తెలుసుకొని మళ్ళీ ఘోరమైన తపస్సు చేసి ముక్తిని పొందాడు. అతడి భార్యలూ అతడినే అనుసరించారు.

మాంధాత రెండో కొడుకు పురుకుత్సుడు నాగకన్య అయిన నర్మదను పెళ్ళి చేసుకున్నాడు. ఇతడి వారసుడే సత్యవ్రతుడు. సత్యవ్రతుడికే త్రిశంకుడు అని పేరు. విశ్వామిత్ర మహర్షి ప్రభావంతో ఇతడు బతికి ఉండగానే స్వర్గానికి వెళ్ళాడు. దేవతలు ఇతణ్ణి రానివ్వలేదు. విశ్వామిత్రుడు ఇతణ్ణి ఆకాశంలోనే నిలిపాడు. ఇతడి కొడుకే హరిశ్చంద్రుడు. సత్యనిష్ఠకు మెచ్చి విశ్వామిత్రుడు అతడికి దివ్య జ్ఞానాన్ని బోధించాడు.

రాజా! ఈ వంశంలోనే 'సగరుడు' అనే చక్రవర్తి ఉండేవాడు. ఇతడి తండ్రి బాహుకుడు. ఇతడు కడుపులో ఉండగా సవతి తల్లులు ఇతడి తల్లికి విషం పెట్టారు. ఆ విషం (గరం) ఇతడిని ఏమీ చేయలేకపోయింది. పైగా విషంతో పాటుగా జన్మించి 'సగరుడు' అనే ప్రసిద్ధిని పొందాడు. ఇతడికి సుమతి, కేశిని అని ఇద్దరు భార్యలు. సుమతికి 60 వేలమంది పుత్రులు. వీళ్ళకే సగరపుత్రులని పేరు.

రాజా! సగరుడు అశ్వమేధ యాగం చేస్తూ యాగాశ్వాన్ని విడిచిపెట్టాడు. ఆ అశ్వాన్ని ఇంద్రుడు అపహరించగా దాని కోసం వెదుకుతూ వెళ్ళారు సగర పుత్రులు. ఆ అశ్వం పాతాళలోకంలో కపిల మహర్షి పక్కనే ఉంది. ఆ మహర్షే ఈ అశ్వాన్ని దాచిపెట్టాడని అతడిపైకి దూకారు వీళ్ళంతా. ఆ మహర్షి కోపాగ్నికి బలై భస్మమైపోయారు.

సగరుడి మరో భార్య కేశినికి అసమంజసుడు అనే కుమారుడు ఉన్నాడు. అతడి కొడుకు అంశుమంతుడు. తన మనుమడైన అంశుమంతుణ్ణి యాగాశ్వం కోసం పంపించాడు సగరుడు. అంశుమంతుడు పాతాళానికి వెళ్ళి కపిల మహర్షిని మెప్పించి అశ్వాన్ని తీసుకువచ్చాడు. సగరుడు యాగం పూర్తి చేశాడు. గంగాజలం సగర పుత్రుల భస్మంపై ప్రవహిస్తే వారికి శాపవిమోచనం కలుగుతుందని కపిల మహర్షి చెప్పాడు. అంశుమంతుడి కుమారుడు దిలీపుడు. దిలీపుడి కుమారుడు భగీరథుడు సగర పుత్రులకు శాపవిమోచనం కలిగించాడు.

రాజా! భగీరథుడి తర్వాత ఈ వంశంలో చెప్పుకోదగిన చక్రవర్తి సుదాసుడు. ఒకరోజు సుదాసుడు వేటకు వెళ్ళి అక్కడ ఒక రాక్షసుణ్ణి సంహరించి, అతడి తమ్ముణ్ణి విడిచిపెట్టాడు. వాడు పగబట్టి ఇతడి దగ్గరే వంటవాడిగా చేరాడు. ఒకరోజు వసిష్ఠ మహర్షికి నరమాంసాన్ని వండి వడ్డించాడు. దానికి ఆగ్రహించిన వశిష్ఠుడు రాజును రాక్షసుడిగా పుట్టమని శపించాడు. రాజు కూడా వసిష్ఠుణ్ణి శపించడానికి చేతిలోనికి నీళ్ళు తీసుకున్నాడు. కానీ అతడి భార్య వద్దని వారించింది. చేతిలో ఉన్న మంత్రించిన నీళ్ళను ఎక్కడ పోయాలో తెలియక తన పాదాలపైనే చల్లుకొని కాళ్లు నల్లబడగా కల్మాషపాదుడిగా ప్రసిద్ధి చెందాడు.

'రాజా! ఈ సూర్యవంశంలోనే ఖట్వాంగుడు, రఘువు, అజుడు లాంటి ఎందరో మహారాజులు జన్మించారు. ఈ అజమహారాజు కుమారుడు దశరథుడు. దశరథుడి పుత్రుడే శ్రీరామచంద్రుడు. సాక్షాత్తూ శ్రీమన్నారాయణుడే శ్రీరాముడిగా అవతరించాడు. ధర్మాన్ని ఆచరించి చూపడానికే తాను సామాన్యుడిగా జీవించాడు. లోకకంటకుడైన రావణాసురుణ్ణి సంహరించి సీతాదేవిని చేపట్టాడు. కానీ అదే ధర్మంకోసం నిండుగర్భిణిగా ఉన్న ఆమెను అడవుల్లో విడిచిపెట్టాడు. సీతాదేవి వాల్మీకి మహర్షి ఆశ్రమంలో తలదాచుకొని ఇద్దరు పండ్లంటి బిడ్డల్ని ప్రసవించింది. వాళ్ళ పేర్లు కుశలవులు. వాళ్ళు పెరిగి పెద్దవాళ్ళై శ్రీరామాయణాన్ని గానం చేస్తూ శ్రీరామచంద్రుడి వద్దకు వచ్చారు. వాళ్ళను చూసి శ్రీరాముడు –

ఆ.వె. **చిన్నియన్నలార! శీతాంశుముఖులార!**
**నళినదళవిశాలనయనులార!**
**మధుర భాషులార! మహిమీఁద నెవ్వరు**

**దల్లి దండ్రి మీకు ధన్యులార!** (9-353)

నాయనలారా! చంద్రబింబంలాంటి ముఖాలతో తామరరేకుల్లాంటి విశాలమైన నేత్రాలతో ఉన్నారే! మధురంగా మాట్లాడుతున్నారే! అసలు మీరు ఎవరు? మిమ్మల్ని కన్న తల్లిదండ్రులెవరు? అని అడిగాడు! అంత మనోహరంగా ఉన్నారు ఆ పిల్లలు.

మరునాడు వాల్మీకి మహర్షి సీతాదేవిని, కుశలవులను శ్రీరామునివద్దకు తీసుకొని వచ్చాడు. 'శ్రీరామా! ఈ సీతాదేవి పతివ్రత. ఈమెను స్వీకరించు.' అన్నాడు. సీతాదేవి కుశలవుల్ని శ్రీరాముడికి అప్పగించి శ్రీరాముణ్ణే ధ్యానిస్తూ భూమిలోకి వెళ్ళిపోయింది. ఇదీ పరమపావనమైన సీతారాములగాథ!' అంటూ సంగ్రహంగా చెప్పి తరువాత సూర్యవంశంలో జన్మించిన తరువాతి చక్రవర్తుల గురించీ, భవిష్యత్తులో జన్మించబోయే రాజుల గురించి విపులంగా చెప్పాడు శుక మహర్షి.

పరీక్షిన్మహారాజు చంద్రవంశం గురించి చెప్పమని అడిగాడు.

'రాజా! బ్రహ్మదేవుడి కుమారుడైన అత్రిమహర్షి క్రీగంటి చూపు నుండి చంద్రుడు పుట్టాడు. ఇతడి కుమారుడు బుధుడు. బుధుడికి ఇలాకన్య ద్వారా పురూరవుడు జన్మించాడు. ఈవిధంగా చంద్రవంశం వృద్ధి చెందింది.

## పరశురాముడి కథ

ఒకసారి హైహయ వంశానికి చెందిన 'కార్తవీర్యార్జునుడు' అనే చక్రవర్తి జమదగ్ని మహర్షి వద్ద ఉన్న హోమధేనువును అపహరించాడు. ఆ విషయం తెలుసుకొని పరశురాముడు తన గండ్రగొడ్డలితో కార్తవీర్యార్జునుడి శిరస్సును ఖండించి, హోమధేనువును తెచ్చి తన తండ్రికి సమర్పించాడు.

పరశురాముడు చేసిన పనికి జమదగ్ని బాధపడ్డాడు. 'నాయనా! సహనంతో ఉండటమే మన ధర్మం. సహనమే అన్ని ధర్మాలకూ మూలం. ఈ ఓర్పు వల్లనే పరమాత్మ మనల్ని బ్రహ్మస్థానంలో నిలబెట్టాడు.

కం. **క్షమ గలిగిన సిరి గలుగును**
**క్షమ గలిగిన వాణి గలుగు సౌఖ్యము లెల్లన్**
**క్షమ గలుగఁ దోన కలుగును**

**క్షమ గలిగిన మెచ్చు శౌరి సదయుఁడు దండ్రీ!** (9-463)

క్షమ ఉంటే సంపదలు, విద్య, సమస్త సుఖాలూ వెంటవెంటనే లభిస్తాయి. దయామయుడైన శ్రీహరి కూడా మెచ్చుకొనేది క్షమకలవాళ్ళనే. ఒక దేశానికి రాజైనవానిని సంహరించడం మంచిది కాదు. అది బ్రహ్మహత్యాపాతకం కంటే ఘోరమైన పాపం. పాపపరిహారం కోసం పుణ్యతీర్థాలను సేవించు' అని ఆజ్ఞాపించాడు. పరశురాముడు వెళ్ళి, పుణ్యతీర్థాలు సేవించి వచ్చాడు.

జమదగ్ని భార్య రేణుకాదేవి. ఒకనాడు ఆమె నీటికోసం గంగానదికి వెళ్ళింది. రావటానికి ఆలస్యం అయింది. దానికి కోపగించిన జమదగ్ని ఆమెను సంహరించమని తన పుత్రుల్ని ఆజ్ఞాపించాడు. ఒక్క పరశురాముడు తప్ప తక్కిన పుత్రులు తల్లిని చంపడానికి నిరాకరించారు. తన మాటను కాదన్న పుత్రుల్నీ, తల్లినీ కూడా వధించమని పరశురాముణ్ణి ఆదేశించాడు ఆయన.

పరశురాముడు తన తల్లినీ, సోదరుల్నీ వధించాడు. తండ్రిని మెప్పించి, అతడి ద్వారా వరాన్ని పొంది, మరణించిన వాళ్ళందరినీ బ్రతికించాడు. జమదగ్నికి మరణించిన వాళ్ళను బ్రతికించే శక్తి ఉంది. అది పరశురాముడికి తెలుసు. అందుకే తండ్రి చెప్పిన పని చేసి, అతణ్ణి ప్రసన్నుణ్ణి చేసుకొని మళ్ళీ తనవాళ్ళను బ్రతికించుకొన్నాడు. రాజా! పరశురాముడు చేశాడు కదా అని మనం మన సోదరుల్నీ, తల్లినీ వధించకూడదు.

కొంతకాలం తర్వాత కార్తవీర్యార్జునుడి పుత్రులు పరశురాముడు లేని సమయం చూసి జమదగ్నిని సంహరించారు. పరశురాముడి తల్లి 21 సార్లు పరశురాముణ్ణి పిలిచింది. అందుకే తరువాత పరశురాముడు 21 సార్లు భూమండలాన్ని చుట్టివచ్చి దుర్మార్గులైన క్షత్రియులందరినీ సంహరించాడు. ఆ రాజుల రక్తంతో 'శమంత పంచకం' అనే ప్రదేశంలో తొమ్మిది మడుగులు ఏర్పడ్డాయి. క్షత్రియుల్ని సంహరించిన తర్వాత పరశురాముడు యాగం చేసి తండ్రితలను మొండేనికి అతికించాడు. అలా శరీరాన్ని పొందిన జమదగ్ని తన తపోబలంతో సప్తర్షి మండలంలో చేరి, ఏడో మహర్షియై ప్రకాశించాడు. తరువాత పరశురాముడు శాంతించి మహేంద్ర పర్వతంపై తపస్సు చేసుకొంటూ కాలం గడిపాడు. ఇతడే తరువాత మన్వంతరాలలో సప్తర్షులలో ఒకడౌతాడు. ఇదంతా శ్రీహరి లీలలో ఒక భాగమే.

## విశ్వామిత్రుడు

ఇక కుశాంబుడి కుమారుడైన గాధికి విశ్వామిత్రుడు అనే పుత్రుడు జన్మించాడు. ఇతడు బ్రహ్మర్షి. ఇతడికి 101 మంది పుత్రులు. ఆ సమయంలోనే భృగువంశంలో జన్మించిన 'అజీగర్తుడు' అనే బ్రాహ్మణుడు ఉండేవాడు. అతడి పుత్రుడైన శునశ్శేపుడు హరిశ్చంద్రుడి యాగానికి 'బలిపశువు' అయ్యాడు. కన్న తలిదండ్రులే ఇతణ్ణి హరిశ్చంద్రుడికి అమ్మివేశారు. చివరికి దేవతల అనుగ్రహంవల్ల బ్రతికి బయటపడ్డాడు. ఇతడంటే విశ్వామిత్రుడికి చాలా ఇష్టం. శునశ్శేపుణ్ణి అన్నగా అంగీకరించమని తన పుత్రుల్ని కోరాడు విశ్వామిత్రుడు. అలా అంగీకరించని వాళ్ళని మ్లేచ్ఛుల్లో పుట్టమని శపించాడు కూడా! వారిలో మధుచ్ఛందుడు మొదలైన 50 మంది పుత్రులు తండ్రి మాటను మన్నించారు. అప్పటి నుండి విశ్వామిత్రుడి వంశంలో రెండు శాఖలు ఏర్పడ్డాయి.

## యయాతి చక్రవర్తి

పురూరవుడి వంశం దినదిన ప్రవర్ధమానమయింది. నహుషుడు పురూరవుడి మనుమడు. నూరు యాగాలు చేసి ఇంద్రపదవిని పొందాడు. నహుషుడి కుమారులలో యయాతి చక్రవర్తి ఒకడు. ఇతడు శుక్రుడి పుత్రిక అయిన దేవయానినీ, వృషపర్వుడి కుమార్తె అయిన శర్మిష్ఠనూ పెళ్ళాడాడు.

తను పెట్టిన నియమాన్ని అతిక్రమించి శరిష్ఠను పెళ్ళాడినందుకు శుక్రాచార్యుడు యయాతిని ముసలివాడివి కమ్మని శపించాడు. శాపాన్ని సడలించమని యయాతి శుక్రుడిని వేడుకున్నాడు. ఎవరైనా తన యౌవనాన్ని ఇతడికి ఇచ్చి, ఇతడి వృద్ధాప్యాన్ని తాను స్వీకరిస్తే ఇతడి ముసలితనం పోతుందని చెప్పాడు శు క్రాచార్యుడు. దేవయాని పుత్రులైన యదుతుర్వసులు తమ యౌవనం తండ్రికి ఇవ్వటానికి ముందుకు రాలేదు. అందుకు శర్మిష్ఠ ముగ్గురు పుత్రులలో చిన్నవాడైన పూరుడు ఒక్కడే పితృభక్తి కలవాడవటంవల్ల అంగీకరించి -

కం. **పనుపక చేయుదు రధికులు**
**పనిచిన మధ్యములు పొందు పఱతురు తండ్రుల్**
**పనిచెప్పి కోరి పనిచిన**

**ననిశము మాఱాడు పుత్రులధములు తండ్రీ!** (9-559)

'నాన్నగారూ! తండ్రి చెప్పక ముందే అవసరాన్ని గుర్తించి పనిచేసిపెట్టేవాళ్ళు ఉత్తమ పుత్రులు. చెప్పిన తర్వాత మాత్రమే చేసేవాళ్ళు మధ్యములు. చెప్పిన పని చేయకుండా ఎదురు చెప్పేవాళ్ళు అధములు. అంటూ తండ్రి ముసలితనాన్ని తాను సంతోషంగా స్వీకరించాడు. యయాతి నవయౌవనంతో సకల భోగాలు అనుభవించాడు. ధారగా నెయ్యి పోస్తున్నా అగ్ని తృప్తి చెందనట్లు కామసుఖాలు ఎంతగా అనుభవించినా తృప్తి కలగదని యయాతికి భగవదనుగ్రహం చేత తెలియసాగింది. తాను ఒక స్త్రీ (దేవయాని) కారణంగా వంచనకు గురి అయ్యానని గ్రహించి, ఆయన బంధాలన్నీ తెంపుకొని, పరమాత్మనే ధ్యానిస్తూ చివరికి తపస్సు చేసి ముక్తిని పొందాడు.

తరువాత పూరుడు చక్రవర్తి అయ్యాడు. ఇతడి ద్వారా వంశం వృద్ధి చెందింది. ఈ వంశంలోనే రైభ్యుడు అనే చక్రవర్తికి దుష్యంతుడు జన్మించాడు. ఈ దుష్యంతుడు కణ్వాశ్రమంలో ఉన్న శకుంతలను గాంధర్వ పద్ధతిలో పెళ్ళిచేసుకున్నాడు. వీళ్ళ పుత్రుడు భరతుడు. దుష్యంతుడి తర్వాత భరతుడు చక్రవర్తి అయ్యాడు. ఇతడే భరతవంశానికి వంశకర్త. ఇతని పుత్రుడు భరద్వాజుడు. గొప్ప దాతగా ప్రసిద్ధి చెందిన రంతిదేవుడు కూడా ఈ వంశంలోనివాడే. అతడి చరిత్ర చెబుతాను విను.

## రంతిదేవుడి చరిత్ర

రాజా! రంతిదేవుడు మహాదాత. అతడు తన సంపదనంతా దీనులకు దానంచేసి పేదవాడు అయ్యాడు. కొన్ని రోజులు తినడానికి ఏమీ దొరకలేదు. కుటుంబం ఆకలికి అలమటించింది. అలాంటి స్థితిలో ఒకరోజు అతడికి కొద్దిగా పాయసం, నీళ్ళు, నెయ్యి మొదలైనవి లభించాయి. వాటిని తిని ప్రాణం నిలుపుకోవాలని వాళ్ళు సిద్ధపడుతుంటే ఒక బ్రాహ్మణుడు, శూద్రుడు, కుక్కల గుంపుతో మరొకడు వరుసగా ఒకరి తర్వాత ఒకరు వచ్చారు. వాళ్ళందరికీ ఆ పదార్థాలను దానం చేశాడు. ఇక మిగిలినవి నీళ్ళే. వాటిని కూడా రంతిదేవుడు దానం చేస్తూ-

ఉ. **అన్నము లేదు కొన్ని మధురాంబువు లున్నవి, ద్రావుమన్న రా**
**వన్న శరీరధారులకు నాపదవచ్చిన వారియాపదల్**
**గ్రన్నన మాన్చి వారికి సుఖంబులు సేయుటకంటె నొండు మే**

**లున్నదె? నాకు దిక్కు పురుషోత్తముఁ డొక్కడ సుమ్ము పుల్కసా!**
(9-648)

'ఓ అన్నా! పుల్కసా! నా వద్ద అన్నం లేదు. కొన్ని తియ్యటి నీళ్ళు మాత్రమే ఉన్నాయి. రా! త్రాగు. తోటివారికి ఆపదవస్తే ఆ ఆపదను తీర్చి సుఖం కలిగించి పంపటంకంటే మేలు ఇంకేదైనా ఉంటుందా? ఇక నాకు దిక్కు ఆ పురుషోత్తముడే!' అన్నాడు. రాజా! బ్రహ్మాది దేవతలే అలా మారువేషాల్లో వచ్చి రంతిదేవుణ్ణి పరీక్షించారు.

ఈ వంశంలోనే 'దివోదాసుడు' అనే రాజు ఉండేవాడు. ఇతనికి అహల్య సోదరి. ఈమె గౌతముణ్ణి వివాహం చేసుకుంది. వీరికి శతానందుడు జన్మించాడు. ద్రుపదుడు ఇతడి సంతతివాడే. ద్రుపదుడి కుమారుడు ధృష్టద్యుమ్నుడు. కుమార్తె ద్రౌపది. సంవరణుడు అనే రాజు సూర్యపుత్రిక అయిన తపతిని వివాహం చేసుకున్నాడు. వీరికి పుట్టినవాడే కురుచక్రవర్తి. ఇతడి పేరుమీదే కురువంశం వృద్ధిలోనికి వచ్చింది. తరువాత ఇతడి వంశంలోనే బృహద్రథుడు అనే రాజుకు రెండు విడి విడి ముక్కలుగా ఒక కుమారుడు జన్మించాడు. ఆ రెండు ముక్కలను జర అనే రాక్షస స్త్రీ కలపటంవల్ల ఆ బాలుడు జరాసంధుడు అని పేరుపడ్డాడు. ఈ వంశంలోనే ప్రతీపుడు అనే రాజుకు దేవాపి, శంతనుడు, బాహ్లికుడు అనే ముగ్గురు కుమారులు కలిగారు. ఈ శంతను మహారాజుకీ, గంగాదేవికి భీష్ముడు జన్మించాడు.

శంతనుమహారాజుకీ దాశకన్య అయిన సత్యవతికీ చిత్రాంగదుడు, విచిత్ర వీర్యుడు అనే పేర్లు గల పుత్రులు జన్మించారు. ధృతరాష్ట్రుడు, పాండురాజు ఈ వంశంలోనివాళ్ళే. ధృతరాష్ట్రుడి కుమారులు కౌరవులు, పాండురాజు కుమారులు పంచ పాండవులు. పాండవుల భార్య ద్రౌపది. ద్రౌపదికి ఆ ఐదుగురి ద్వారా ఐదుగురు కుమారులు కలిగారు. వారు క్రమంగా ప్రతివింధ్యుడు, శ్రుతసేనుడు, శ్రుతకీర్తి, శతానీకుడు, శ్రుతకర్ముడు అనేవారు. వీరు కాక ధర్మరాజుకు పౌరవతి అనే ఆమెయందు దేవకుడు, భీముడికి హిడింబియందు ఘటోత్కచుడును, కాళియందు సర్వగతుడును, అర్జునుడికి ఉలూపి అనే నాగకన్య యందు ఇరావంతుడు, చిత్రాంగద వల్ల బభ్రువాహనుడు, సుభద్రవల్ల నీ తండ్రి అభిమన్యుడు జన్మించారు. నకులుడికి, కూడా 'కరేణుమతి' అనే భార్యవల్ల నిరమిత్రుడు అనే కొడుకు, సహదేవుడికి 'విజయ' అనే భార్యవల్ల సుహోత్రుడు అనే కొడుకు జన్మించారు.

యదు వంశానికి చెందిన రాజు ఉగ్రసేనుడు. ఇతడి కొడుకు కంసుడు. దేవకుడు ఉగ్రసేనుడి సోదరుడు. ఇతడికి ఏడుగురు కుమార్తెలు. వారిలో దేవకి కూడా ఉంది. ఈ ఏడుగురినీ వసుదేవుడే పెళ్ళి చేసుకున్నాడు.

వసుదేవుడి తండ్రి శూరుడు. ఇతడి కుమార్తె పృథ. శూరుడు తన మిత్రుడైన కుంతిభోజుడికి సంతానం లేకపోవటంవల్ల తన కుమార్తె పృథను దత్తత ఇచ్చాడు కాబట్టి పృథ 'కుంతి' అయ్యింది. ఆమె వసుదేవుని సోదరి. పాండవుల తల్లి. ఈమె చెల్లెలు శ్రుతదేవ. శ్రుతదేవ భర్త వృద్ధశర్మ. వీరి కుమారుడే దంతవక్త్రుడు. పృథకు మరో సోదరి అయిన శ్రుతశ్రవస దమఘోషుణ్ణి పెళ్ళాడింది. వీళ్ళ కుమారుడే శిశుపాలుడు.

రాజా! వసుదేవుడికి రోహిణి ద్వారా బలరాముడు మొదలైన ఎనిమిదిమంది కుమారులు, పౌరవి అనే భార్య ద్వారా సుభద్రుడు మొదలైన 12 మంది కుమారులు జన్మించారు. చివరిగా దేవకి గర్భంలో ఎనిమిదో కుమారుడిగా శ్రీకృష్ణుడు జన్మించాడు. తరువాత దేవకికి సుభద్ర అనే కుమార్తె కూడా జన్మించింది.

లోకంలో ధర్మం నశించి, పాపం పెరిగినప్పుడు శ్రీహరి అవతరిస్తాడు. మంగళకరమైన ఆ శ్రీహరి కీర్తి అనే గంగాజలాన్ని కొంతైనా సేవిస్తే సమస్త కర్మలూ నశిస్తాయి.

# స్కంధం - 10

**రా**జా! పూర్వం కొందరు దానవులు తామే రాజులమంటూ భూమిని ఆక్రమించారు. బ్రహ్మదేవుడు భూమినీ దేవతలనూ వెంటబెట్టుకొని శ్రీ మహావిష్ణువు సందర్శనానికి బయలుదేరాడు. అప్పుడు బ్రహ్మదేవుడికి ఒక దివ్య వాక్కు వినబడింది. అది విని ఆయన మహానందంతో– 'దేవతలారా! బయలుదేరండి! మీరంతా మీమీ అంశలతో భూమిపై యాదవ కులంలో జన్మించండి. శ్రీహరి వసుదేవుడికి పుత్రుడిగా జన్మించి భూభారం తొలగించబోతున్నాడు' అన్నాడు.

* * *

అది మథురానగరం. ఆ నగరానికి రాజు శూరసేన మహారాజు. ఆ రాజు

కుమారుడే వసుదేవుడు. వసుదేవుడి ఇల్లాలు దేవకీదేవి. దేవకుడు అనే రాజుగారి ముద్దులపట్టి. ఈ దేవకుడికి ఒక అన్నగారు ఉన్నాడు. అతడు ఉగ్రసేన మహారాజు. అతడి కొడుకు కంసుడు. పెళ్ళి కాగానే వసుదేవుడు దేవకీదేవితో రథంపై బయలుదేరాడు. కంసుడే రథం నడుపుతున్నాడు.

ఇంతలో అకస్మాత్తుగా అశరీరవాణి 'ఓరీ, కంసుడా! నీ ఈ ముద్దుల చెల్లెలికి అష్టమగర్భంలో పుట్టబోయేవాడే నిన్ను సంహరిస్తాడు' అంది.

కంసుడు ఉలిక్కిపడ్డాడు. మరో ఆలోచన లేకుండా చెల్లెలి కొప్పు పట్టుకొని కత్తి పైకి ఎత్తాడు. పక్కనే ఉన్న వసుదేవుడు –

'అయ్యయ్యో! బావా! ఆదరించాల్సిన ఆడబడుచును చంపుకుంటావా? అందరూ కర్మల్నిబట్టి నడుచుకోవాలి. అలాంటప్పుడు తప్పులెన్నడం దేనికయ్యా! ఇతరుల్ని హింసించటం మంచిది కాదు. తన మేలు కోసం ఎదుటివాళ్ళను బాధపెడితే ఆ పాపం ఊరికే పోతుందా?! అనుభవించక తప్పదు. నీకు చేతులెత్తి నమస్కరిస్తున్నా! ఈమెను రక్షించు. శిక్షించకు' అంటూ చెప్పిచూశాడు.

కంసుడు వింటేనా?! అతడిలో జాలి ఏ కోశానా లేదు. పైగా చూపుల్లో క్రోధం. వసుదేవుడు ఎలాగైనా అతణ్ణి ఆపాలని ఆత్మబలంతో గట్టిగా నిలబడ్డాడు. కంసుడు చేస్తున్నదానికి గుండె రగిలిపోతోంది. అయినా కోపగించడానికి ఇది సమయం కాదు. అందుకే ఓర్చుకొని– 'బావా! ఈమెకు పుట్టిన కొడుకుల్ని పురిట్లోనే నీకు అప్పగిస్తాను. వాళ్ళను చంపు. అప్పుడు నీకు ఏ సమస్యా ఉండదు' అన్నాడు అనునయంగా. కంసుడు కత్తి దించాడు. చరచరా అక్కణ్ణుంచి వెళ్ళిపోయాడు.

పరీక్షిన్మహారాజా! సత్యంపైనే స్థిరమైన మనస్సు కలవాడికి కష్టమైన పని అంటూ ఏదీ ఉండదు. అందుకే వసుదేవుడు తనకు కొడుకు పుట్టగానే తీసుకువెళ్ళి కంసుడికి అప్పగించాడు. కానీ కంసుడు 'వసుదేవా! నాకు వీడితో పనిలేదు. అష్టమ గర్భంలో పుట్టినవాడిని పుట్టగానే వధిస్తాను' అన్నాడు.

రోజులు గడుస్తున్నాయి. ఒకరోజు నారద మహర్షి కంసుడి వద్దకు వచ్చి– 'కంసరాజా! నీవు రాక్షసుడవు. శ్రీహరి దేవకీ గర్భంలో పుడుతున్నాడట! దుష్ట రాక్షసుల్ని సంహరించడానికే ఈ అవతారమట! జాగ్రత్త నాయనా!' అని చెప్పిపోయాడు.

కంసుడు కలతచెంది దేవకీదేవికి అప్పటికే పుట్టిన ఆరుగురు కుమారులనూ వెంటనే చంపివేశాడు.

శ్రీకృష్ణుడు ఎప్పుడు పుడతాడా అని కంసుడు ఎదురుచూస్తున్నాడు. ఆ శ్రీహరితో వైరసంబంధం వల్లనే అయినా అన్నీ విడిచి, అన్నింటినీ మరచి అతణ్ణే ధ్యానిస్తున్నాడు.

కం. **తిరుగుచుఁ గుడుచుచుఁ ద్రావుచు**
**నరుగుచుఁ గూర్చుండి లేచు చనవరతంబున్**
**హరిఁ దలఁచి తలఁచి జగ మా**
**హరిమయమని తలఁచెఁ గంసుఁ డాఱని యలుకన్.** (10-1-85)

కంసుడు - ఏ పని చేస్తున్న శ్రీహరినే తలుస్తున్నాడు, అలా తలచి తలచి అంతా హరిమయమేనని భావిస్తూ, తీరని కోపంతో వెంటనే దేవకీ వసుదేవుల్ని పట్టి బంధించాడు. అంతటితో ఆగలేదు. యదు, భోజ, అంధకాది దేశాలను పాలిస్తున్న తన తండ్రి ఉగ్రసేనుణ్ణి తెచ్చి చెరసాలలోనికి తోసివేశాడు. సింహాసనాన్ని తానే హస్తగతం చేసుకున్నాడు.

పరీక్షిన్మహారాజా! రాజ్యకాంక్ష అంతటిది మరి! రాజ్యం కోసం ఎంతకైనా తెగిస్తారు. ఎవరినైనా చంపుతారు. చివరికి తల్లిదండ్రుల్ని, తోడబుట్టినవాళ్ళనీ, బంధుమిత్రుల్నీ మట్టుపెడతారు.

దేవకీదేవి సప్తమగర్భంలో 'ఆదిశేషుడు' అనే విష్ణుతేజస్సు పెరుగుతోంది. అప్పుడు యోగమాయ దేవకీదేవి గర్భంలోని శేషతేజాన్ని తీసి రోహిణీదేవి గర్భంలో ప్రవేశపెట్టింది. కొన్ని నెలలకు రోహిణీదేవి గర్భంలో ఉజ్జ్వల కాంతితో, ఒక కుమారుడు ఉద్భవించాడు. తరువాత విష్ణుతేజం దేవకీదేవి గర్భంలో ప్రవేశించింది.

## శ్రీకృష్ణావతార ఘట్టం

లోకాలన్నీ ఆనందపారవశ్యంలో తేలియాడుతున్నవేళ అర్ధరాత్రి దేవకీదేవి గర్భం నుండి నారాయణుడు అవతరించాడు. పున్నమ చంద్రుడి ముఖంతో శంఖచక్ర గదాపద్మాలను ధరించి, తామరపువ్వులాంటి కన్నులతో వెలిగిపోతున్న ఆ దివ్యమంగళ స్వరూపాన్ని చూసి దేవకీవసుదేవులు ఉబ్బితబ్బిబైపోయారు.

'అమ్మా! పూర్వం నువ్వు 'పృశ్ని' అనే మహాపతివ్రతవు. ఈ వసుదేవుడు 'సుతపుడు' అనే ఒక ప్రజాపతి. అప్పుడు నేను 'పృశ్నిగర్భుడు' అనే పేరుతో మీకు జన్మించాను. రెండో జన్మలో మీరు అదితి-కశ్యపులయ్యారు. అప్పుడు వామనుడిగా పుట్టాను. మీ సంతానంగా ఇది నాకు మూడో జన్మ. ఇదే చివరి జన్మ' అని పసిపిల్లవాడిగా మారిపోయాడు శ్రీమన్నారాయణుడు. అక్కడ వ్రేపల్లెలో అదే సమయానికి నందుడి భార్య యశోదాదేవి గర్భంలో యోగమాయ జన్మించింది.

విష్ణుమాయవల్ల వసుదేవుడి సంకెళ్ళు తెగిపోయాయి. తలుపులకు వేసిన తాళాలు ఊడిపోయాయి. ద్వారాలు అవే తెరుచుకున్నాయి. వసుదేవుడు చప్పుడు చేయకుండా బందిఖానాలోంచి బయటపడ్డాడు.

వసుదేవుడు అప్పుడే పుట్టిన బాలుణ్ణి తీసుకొని చీకట్లో ముందుకు సాగిపోతున్నాడు. ఆదిశేషుడు పగడలు విప్పార్చి గొడుగుపట్టాడు. మధ్యలో యమునానది. పరవళ్ళు తొక్కుతోంది. అయినా వెంటనే దారి ఇచ్చింది. వ్రేపల్లె చేరుకొని యశోదాదేవి ప్రక్కలో ఈ బాలుణ్ణి పడుకోబెట్టి, అక్కడ ఉన్న బాలికను తెచ్చి దేవకీదేవి ప్రక్కలో పడుకోబెట్టాడు. విష్ణుమాయ తొలగిపోయింది. బిడ్డపుట్టిన వార్త విన్న కంసుడు ఉన్నపళంగా వచ్చి ఆ బిడ్డ కాళ్ళు పట్టుకొని లాగాడు. వెంటనే ఆ బిడ్డ రివ్వున ఆకాశంలోనికి దూసుకొనిపోయి, ఎనిమిది చేతులతో ఆయుధాలు ధరించి కనిపించి- 'కంసా! నిన్ను సంహరించే మహావీరుడు సరిగ్గా నేను పుట్టిన సమయానికే పుట్టి వేరేచోట పెరుగుతున్నాడు' అంది.

కంసుడి తల తిరిగిపోయింది. శాంతంగా దేవకీ వసుదేవుల్ని చూసి- 'నన్ను మన్నించండి. ఇదంతా నా కర్మ. అదే నన్ను నడిపిస్తోంది. చంపడానికిగానీ చావడానికిగానీ ఎవరూ కర్తలు కారు. శాంతించండి' అంటూ వాళ్ళ పాదాలపై పడ్డాడు.

తరువాతరోజు కంసుడు మంత్రులతో సమావేశమయ్యాడు. గోవులు, బ్రాహ్మణులు, వేదాలు, ఓరిమి, కారుణ్యం, సత్యం, యాగం, తపస్సు, దమం, శ్రద్ధ, శాంతి - ఇవన్నీ విష్ణువు శరీరాలే. కాబట్టి వీటన్నింటినీ అంతం చేస్తే అతడికి నిలువ నీడ ఉండదన్నారు మంత్రులు. కంసుడు వాళ్ళ మాటలకు తలూపాడు. రాక్షసులు సాధువుల్ని హింసించటం మొదలుపెట్టారు. కానీ వారి బలం క్రమంగా క్షీణించింది.

పరీక్షిన్మహారాజా! **పూజ్యులైనవారిని బాధిస్తే కీర్తి, ఐశ్వర్యం, ధర్మం, ఆయువు**

**ఒకటేమిటి? సమస్తమూ నాశనమైపోతాయి.**

ఇక్కడిలా ఉంటే అక్కడ వ్రేపల్లెలో ఒకటే సందడి. గోకులం మొత్తం బాలుణ్ణి చూడటానికి ఉత్సాహంగా బయలుదేరింది.

ఇంక గోపవనితలైతే – 'అహా! ఏ నోము ఫలమో! వీనులవిందుగా ఒక చల్లని కబురు చెవుల్లో పడిందమ్మా! మన యశోద ఒక మగబిడ్డను కన్నదట! చూసివద్దాం! రండమ్మా!' అంటూ యశోద ఇంటికి పరుగు తీశారు. తమ శక్తికొలదీ తెచ్చిన కానుకలను ఇచ్చి శ్రీకృష్ణుడిని చూసి ఆనందించారు. అక్కడితో ఆగలేదు. ఆ పాపడికి తలకు నూనె అంటి, పసుపు పూసి, స్నానం చేయించి 'హరిరక్ష' అంటూ నీళ్ళు చుట్టూ తిప్పి చల్లి, ఉయ్యాలలో పడుకోబెట్టి –

కం. **జోజో కమలదళేక్షణ!**
**జోజో మృగరాజమధ్య! జోజో కృష్ణా!**
**జోజో పల్లవకరపద!**
**జోజో పూర్ణేందువదన! జోజో యనుచున్.** (10–1–190)

జోలపాడారు.

## పూతన

కంసుడు పూతన అనే ఒక రాక్షసిని పంపాడు. అది ఒక అందమైన స్త్రీగా మారి యశోద ఇంట్లోకి ప్రవేశించింది. మంచంపై ఉన్న శ్రీకృష్ణుడిని చూసింది. యశోదా, రోహిణీ వద్దు వద్దు అంటున్నా వినకుండా తన పాలు ఇచ్చింది.

బాలకృష్ణుడు పాలతోపాటూ, ఆమె శరీరంలోని శక్తినీ పీల్చి పిప్పి చేశాడు. పూతన తల్లడిల్లిపోయింది. రెక్కలు విరిగిపడ్డ పర్వతంలా నేలపై కూలిపోయింది. ఆ రాక్షసి శరీరంపై పాకుతూ ఆడుకొంటున్నాడు శ్రీకృష్ణుడు. గోపికలు పరుగున వచ్చి పిల్లవాణ్ణి ఎత్తుకొని, వీపుపై చరిచి, ఆవు తోకతో దిష్టి తీశారు. గోధూళినీ, గోమూత్రాన్నీ బాలుడిపై చల్లారు. రక్షలు కట్టారు.

నందుడు పూతన శరీరాన్ని దహనం చేస్తుంటే అగరు పరిమళం వచ్చిందట! ఎందుకో తెలుసా? ఆ శ్రీకృష్ణుడు పాలతో పాటు విషాన్నీ, శరీర మాలిన్యాన్నీ పీల్చివేశాడు కాబట్టి. శ్రీకృష్ణుడు ఆ రాక్షసి మీద కాళ్ళూ చేతులూ వేసి పాలు

తాగాడు కదా! దానివల్ల అంత క్రూరరాక్షసికి కూడా పరమపదం లభించింది తెలుసా?! ఒకే ఒక్కసారి, అదీ విషంతో నిండిన పాలు ఇచ్చిన ఆ పూతనకే స్వర్గం ఇచ్చాడంటే మరి ఎంతో ప్రేమగా రోజూ పాలిచ్చి పెంచిన ఆ యశోదకు ఏమిస్తాడో?!

రాజా! కొన్నాళ్ళకు శ్రీకృష్ణుడు బోర్లాపడ్డాడు. అందుకని ఆ రోజు యశోద పెద్ద వేడుక చేసింది. బాలకృష్ణుడికి పాలుపట్టి నిద్రపుచ్చింది. కొంతసేపటికి ఆకలివేసిందో ఏమో నిద్రలేచాడు. తల్లి పాలిండ్ల కోసం తడిమాడు. దొరకలేదు. కోపం వచ్చింది. కాళ్ళు ఆడిస్తూ ఆ కోపాన్ని ప్రదర్శించాడు. ఆ పాదాలలో దివ్యరేఖలు. ప్రక్కనే ఉన్న ఒక బండిని ఒక్క తన్ను తన్నాడు. అంతే! ఆ బండి పైకి ఎగిరింది. కిందపడి ముక్కలు ముక్కలైపోయింది. ఆ రూపంలో దాగి ఉన్న శకటాసురుడు నశించాడు.

## తృణావర్తుడు

ఒకరోజు ఏమైందోగానీ తన ఒళ్ళో ఉన్న బాలకృష్ణుడు పర్వతమంత బరువు పెరిగిపోయాడు. యశోద మోయలేకపోయింది. అందుక్కారణం తృణావర్తుడు అనే రాక్షసుడు. ఇతణ్ణి పంపింది కంసుడే! వాడు సుడిగాలిలా వచ్చి బాలుణ్ణి ఆకాశంలోనికి తీసుకొనిపోయాడు. లేగ కనిపించని ఆవులా ఉంది యశోద పరిస్థితి.

పైన శ్రీకృష్ణుడు తన రెండు చేతులతో ఆ రాక్షసుడి మెడను పట్టుకొని వేళ్ళాడసాగాడు. ఇక ఆ రాక్షసుడి పని అయిపోయింది. పట్టుతప్పి బాలుడితో సహా కిందపడ్డాడు. వెంటనే వాడి ప్రాణాలు గాల్లో కలిసిపోయాయి. **సమబుద్ధికల సజ్జనుడికి సమయానికి రక్షణ లభిస్తుంది. దుర్జనుడు ఎంత కట్టుదిట్టమైన రక్షణలో ఉన్నా శిక్ష తప్పదు.**

## గర్గమహర్షి

ఒకనాడు గర్గమహర్షి నందుని ఇంటికి విచ్చేశాడు. 'మహాత్మా! మీలాంటి మహాత్ములు ఊరికే రారు. మీలాంటివాళ్ళు మాలాంటి అల్పుల ఇళ్ళకు వచ్చారంటే అది ఎంతో శుభం' అన్నాడు నందుడు గర్గమహర్షికి నమస్కరిస్తూ.

గర్గమహర్షి రోహిణీ దేవి కుమారుడికి రాముడు, సంకర్షణుడు, బలుడు అనీ, యశోద కుమారుడికి శ్రీకృష్ణుడు, వాసుదేవుడు అనీ నామకరణం చేసి వెళ్ళిపోయాడు.

* * *

## బాల్య క్రీడలు

రాజా! రామకృష్ణులు ఒకసారి మోకాళ్ళ మీద లేచి నిలబడతారు. ముందుకు తూలుతూ, బుడిబుడి నడకలు వేస్తూ తల్లి కొంగు పట్టుకొని లాగుతూ ఉంటారు. ఆవుదూడల తోకలు మెలిపెడతారు. బురదలో పొర్లాడతారు. వచ్చీ రాని ముద్దుమాటలు, చిందులు, కేరింతలు– ఆకాశంలో దేవతలకు ఆనందాన్ని కలిగిస్తుంటే లోకంలోని దుర్మార్గులకు వారి చేష్టలు దడపుట్టిస్తున్నాయి.

బాలకృష్ణుడు అందరినీ ఒక ఆట ఆడిస్తాడు. తానూ దాగుడుమూత లాడతాడు. ఉయ్యాల లూగుతాడు. బంతులు ఎగురవేస్తాడు. అతని ఆగడాలకు తట్టుకోలేక గోపికలు యశోద దగ్గరకి వచ్చారు.

## గోపికల ఫిర్యాదు

‘అమ్మా! యశోదా! ఒకప్రక్క పిల్లలకు పాలు లేవని బాలింతలు మొరపెడుతూ ఉంటే నీ కొడుకు లేగదూళ్ళ త్రాళ్ళు విప్పి ఆవుల దగ్గరకి వదులుతున్నాడమ్మా!

పడతీ! నీ బిడ్డడు మా కడవలలో ఉన్న మంచి కాగిన పాలు తీసుకువెళ్ళి ఆ పడుచులకు పోసి దొరికిన కుండను దొరికినట్లుగా పగలగొట్టేశాడు.

ఓ తల్లీ! మీ పాపడు మా ఇళ్ళలో దూరి పాలకోసం వెతుకుతాడు. దొరక్కపోతే విసురుగా పసిబిడ్డల్ని తొక్కుకుంటూ తోసుకుంటూ వచ్చేస్తున్నాడమ్మా!

మొన్నటికి మొన్న నీకేమో ఆడుకోవడానికని చెప్పి ఓ ఇంట్లో దూరి పెరుగు త్రాగి వెళ్ళిపోయాడు. వెళ్ళేవాడు వెళ్లకుండా నిద్రపోతున్న కోడలి మూతికి పెరుగు రాసి మరీ పోయాడు. ఇక చూడు! అత్తగారు వచ్చి కోడలిని చితక్కొట్టిందంటే నమ్ము!

నీ సుపుత్రుడు ఇంకా ఏం చేశాడో తెలుసా?! ఒకరి ఇంట్లోకి జొరబడి ఘుమఘుమలాడే నెయ్యి కాస్తా త్రాగి, ఆ కడవను తెచ్చి ఇంకొకరి ఇంట్లో పడేశాడు.

నిద్రపోయిన నా కొడుకు జుట్టును లేగదూడ తోకకు కట్టి దాన్ని వీథుల్లోకి తోలాడమ్మా! ఎంత దొడ్డ వారి బిడ్డలైతే మాత్రం మరీ ఇంత అల్లరా!

ఇక నా కొడుకుకైతే బలవంతంగా బానెడు వెన్న పట్టించాడమ్మా నీ కొడుకు.

వాడికి ఊపిరాడితే ఒట్టు. కావాలంటే తెచ్చి చూపిస్తాను.

ఇలా గోపికలందరూ ఒక్కొక్కరూ చెప్పారు. తరువాత అందరూ కలసి– 'మీరు ప్రభువులే కావచ్చు. ఇలా బిడ్డల్ని పేదవాళ్ల కొంపలమీదికి ఉసిగొల్పుతారా ఎవరైనా?

కం. **ఓయమ్మ! నీ కుమారుఁడు**
**మా యిండ్లను బాలు బెరుగు మననీఁడమ్మా!**
**పోయెద మెక్కడి కైనను**
**మాయన్నల సురభులాన! మంజులవాణీ!** (10-1-329)

ఓ అమ్మా! మంజులవాణీ! నీ సుపుత్రుడు మా ఇళ్లలోని పాలూ పెరుగూ ఉండనివ్వడు. కాబట్టి మేము ఎక్కడికైనా వెళ్ళిపోతాం. మా అన్నల మీదా ఆవుల మీదా ఒట్టు' అంటూ మూకుమ్మడిగా ఏకరువు పెట్టారు.

యశోద వారి మాటల్ని కొట్టిపడేసింది.

## విశ్వదర్శనం

ఒకరోజు బలరాముడు 'అమ్మా! శ్రీకృష్ణుడు మట్టి తింటున్నాడు' అని చెప్పాడు. వెంటనే వెళ్ళి యశోద శ్రీకృష్ణుని పట్టుకుని నిలదీసింది. దానికి శ్రీకృష్ణుడు గడుసుగా– 'అమ్మా! మన్ను తినడానికి నేనేమైనా చిన్నపిల్లవాణ్ణా! ఆకలితో ఉన్నానా? లేక వెర్రివాణ్ణా! వీళ్ళ మాటలు నమ్మకు. నన్ను నీతో కొట్టించాలనే అలా చెప్తున్నారు. కావాలంటే నా నోరు వాసన చూడు' అంటూ నోరు తెరచి చూపించాడు. అప్పుడా బాలకృష్ణుడి నోట్లో విశ్వమంతా కనిపించింది యశోదకి. అది చూసి–

మ. **కలయో! వైష్ణవమాయయో! ఇతర సంకల్పార్థమో! సత్యమో**
**తలపన్ నేరక యున్నదాననొ! యశోదాదేవిగానో! పర**
**స్థలమో! బాలకుఁడెంత! యీతని ముఖస్థంబై యజాండంబు ప్ర**
**జ్వలమైయుండుట కేమి హేతువొ! మహాశ్చర్యంబు చింతింపఁగన్.**
(10-1-342)

ఇది కలా? విష్ణుమాయా! ఇంకేమైనానా? సత్యమా! నాకేమీ తెలియటంలేదే! అసలు నేను యశోదాదేవిని కానేమో! ఇది వేరేచోటా? ఈ పిల్లవాడెంత? ఇతడి ముఖంలో కనిపించే బ్రహ్మాండమెంత? దీనికి కారణం ఏమిటో! ఆశ్చర్యం. ఇది

నిజమే అయితే ఈ బాలుడు సాక్షాత్తూ శ్రీమన్నారాయణుడే అని నిశ్చయించుకొంది. భక్తితో స్తోత్రం చేసింది. శరణు వేడింది. అజ్ఞానాన్ని క్షమించమంది. అంతలోనే విష్ణుమాయ ఆమెను ఆవహించింది. తన కొడుకే అనుకొని ఒడిలోనికి తీసుకొని ప్రేమగా ముద్దుపెట్టుకుంది.

రాజా! ఈ నందుడు పూర్వం ద్రోణుడు అనే ఒక వసువు. భార్య ధర. విష్ణుమూర్తిని సేవించడం కోసం భూమిపై యశోదానందులుగా జన్మించారు.

ఒకరోజు యశోదాదేవి పెరుగు చిలుకుతోంది. అప్పుడే శ్రీకృష్ణుడు ఆమె పైట లాగుతూ 'పాలు కావాలి' అంటూ ఒకటే మారాం. ఆమె అలాగే పాలు ఇచ్చింది. ఈలోగా అక్కడ పొయ్యిమీద పాలు పొంగుకు వచ్చాయి. శ్రీకృష్ణుణ్ణి అలా దింపి వెళ్ళింది. దింపిందని కోపంతో శ్రీకృష్ణుడు ఒక రాయి విసిరి పెరుగు కుండ పగులగొట్టాడు. పగిలిన కుండలోని వెన్న తింటూ దొంగ ఏడుపు ఏడుస్తూ ఎటో వెళ్ళిపోయాడు.

యశోద తిరిగివచ్చి చూసింది. ఏడీ! శ్రీకృష్ణుడు? ఉంటేనా? పక్కవాళ్ళ ఇంట్లో ఉట్టిమీద ఉన్న వెన్న తీసి కోతికి తినిపిస్తున్నాడు. బెత్తం పట్టుకొని వెంటపడింది. శ్రీకృష్ణుడు పారిపోతున్నాడు. 'ఆగు, ఆగు' అంటూ అరుస్తూ పరిగెడుతోంది యశోద.

రాజా! మహామహా యోగీంద్రులకే చిక్కని ఈ పురుషోత్తముణ్ణి ఆ యశోద పట్టుకోవాలని పరుగు తీసిందయ్యా! ఎంత అదృష్టవంతురాలో కదా! మొత్తానికి యశోద గెలిచింది. పట్టుకుంది.

'ఎవరండీ వీరు! ఓహో! శ్రీకృష్ణులుగారా? ఎన్నడూ వెన్న అన్నదే చూడలేదట కదా పాపం! అసలు దొంగతనమంటే ఏమిటో కూడా తెలియదట! ఎన్నెన్ని వేషాలు? ఎన్నెన్ని తిరుగుళ్ళు? కుదు రెక్కణ్ణించి తేవాలమ్మా దొరగారికి?' అంటూ యశోద శ్రీకృష్ణుడిని రోటికి కట్టివేయాలనుకొని ఒక తాడు తెచ్చి చుట్టింది. కానీ అది సరిపోదే! రెండంగుళాలు తక్కువైంది. మరో తాడు జతచేసింది. మళ్ళీ రెండంగుళాలు తక్కువయింది. మరో ముక్క జోడించింది. అప్పుడూ అంతే! యశోద ఆశ్చర్యపోయింది. అలసిపోయింది కూడా. అయినా ప్రయత్నిస్తూనే ఉంది. తల్లి పడుతున్న కష్టాన్ని చూసి శ్రీకృష్ణుడు తానే తాడుకు సరిపడి కట్టుపడ్డాడు. రాజా! ఒక్క యశోదకే ఈ భాగ్యం దక్కింది. అది కేవలం భక్తివల్లనే.

సరే! యశోద శ్రీకృష్ణుడిని అలా రోటికి కట్టిపడేసి తన పనుల్లో తను మునిగిపోయింది. అల్లరి కృష్ణుడు ఊరికే ఉంటాడా? రోలు ఈడ్చుకొంటూ అక్కడ నున్న రెండు మద్దిచెట్ల మధ్యలో నుంచి వెళ్ళి రోటిదెబ్బతో వాటిని పడగొట్టాడు. నలకూబరుడు, మణిగ్రీవుడు అనే ఇద్దరు యక్షులు నారదుడి శాపంవల్ల మద్దిచెట్లుగా పడి అక్కడే ఉన్నారు. శాపం తీరగా ఆ ఇద్దరు యక్షులు ప్రత్యక్షమై శ్రీకృష్ణుడికి భక్తితో నమస్కరించి ఉత్తర దిక్కుకు వెళ్ళిపోయారు.

## బృందావనం

ఒకరోజు గోకులంలో పెద్దలందరూ సమావేశమైనారు. వారు గోకులంలో మాటిమాటికీ ఎదురౌతున్న ఉపద్రవాలు తలుచుకొని వణకిపోయారు. తామున్న ప్రాంతంలో ఏదో ఒక తీవ్రమైన రాక్షస ప్రభావం ప్రబలిందని భావించారు కాబట్టి ఇంక అక్కడ ఉండడం మంచిది కాదనీ, బృందావనానికి వెళ్ళిపోవాలనీ నిశ్చయించారు. ఆబాలగోపాలమూ బృందావనంవైపు అడుగులు వేసింది.

'మనమందరం వానరులమై వారధి కడదామా! మనమిప్పుడు మహర్షులమై తపస్సు చేద్దామా! గంధర్వుల్లాగా పాటలు పాడదామా! ఆడవేషాలు వేసుకొని అప్సరసల్లా నాట్యం చేద్దామా? అంటూ రకరకాలుగా ఆనందించసాగారు బలరామకృష్ణులు బృందావనంలో.

ఒకరోజు ఒక రాక్షసుడు కోడెదూడలా మారి శ్రీకృష్ణుడి వెంటపడ్డాడు. శ్రీకృష్ణుడు అది పసిగట్టి బలరాముడికి సైగచేశాడు. అతడు దాన్ని కాళ్ళూ తోకా పట్టుకొని వెలగ చెట్టుకేసి కొట్టి చంపేశాడు. ఆ రాక్షసుడి పేరు వత్సాసురుడు.

మరోసారి దూడల్ని తోలుకొని అడవికి వెళ్ళారు. తిరిగి వస్తూ ఉంటే ఒక భయంకరమైన కొంగ. పర్వతంలా ఉంది. వాడే బకాసురుడు. నోరు తెరిచి శ్రీకృష్ణుణ్ణి మింగాలని చూస్తే వాడి ముక్కును పట్టుకొని గడ్డిపరకను చీల్చినట్లు చీల్చిపారేశాడు శ్రీకృష్ణుడు.

## చల్దుల ఆరగింపు

ఒకరోజు అందరూ కలిసి వనభోజనాలకు వెళ్ళారు. కొమ్ముబూరలు, పిల్లనగ్రోవులు

ఊదుతూ, తుమ్మెదలతో కలసి ఝుంకారాలు చేస్తూ, నెమళ్ళ నాట్యంలో పదం కదుపుతూ, కోకిలల పాటల్లో గళం కలుపుతూ, హంసల్లా నడుస్తూ, కొంగల్లా ఒంటికాలిపై నిలబడుతూ, కోతుల్లా చెట్లు ఎక్కుతూ, కుప్పించి దూకుతూ ఆడుకొంటున్నారు.

పరీక్షిన్మహారాజా! మహామహాయోగులకు సైతం దొరకని శ్రీకృష్ణణ్ణి కౌగిలించుకొంటూ అతడితో చెట్టాపట్టాలు వేసుకొంటూ, నవ్వుతూ, హాస్యాలాడుతూ, ప్రేమిస్తూ, ప్రేమించబడుతూ ఆడుకున్నారంటే వాళ్ళ భాగ్యం ఏమని చెప్పను?

అప్పుడు అఘాసురుడు అనే మరో రాక్షసుడు వచ్చాడు. వీడు బకాసురుడి తమ్ముడు, కంసుడి సేవకుడు. కొండచిలువ రూపంలో పర్వతమంత ఆకారంతో పడుకున్నాడు. అదేదో గుహ అనుకుని అందరూ దాని నోట్లోకి ప్రవేశించారు. ఒక్కొక్కరినీ మింగుతోందా కొండచిలువ. అప్పుడు శ్రీకృష్ణుడు దాని కంఠబిలం దగ్గర చేరి తన శరీరాన్ని పెంచాడు. దానికి ఊపిరి ఆడలేదు. కడుపు పగిలి చచ్చింది. గోపాలురంతా బయటపడ్డారు. శ్రీకృష్ణుడు తన ఐదో ఏటనే ఈ అఘాసురుణ్ణి సంహరించాడు. అయితే ఈ విషయాన్ని శ్రీకృష్ణుడి ఆరోయేట (పౌగండ వయస్సులో) జరిగిందని గోపబాలకులు భావించారు' అన్నాడు శుకమహర్షి.

వెంటనే పరీక్షిత్తు 'మహాత్మా! మొదటి ఐదేళ్ల వయస్సును కౌమారం అంటారు కదా! తరువాత ఐదేళ్ళను 'పౌగండం' అంటారు. మరి ఐదో ఏట జరిగిన సంఘటన ఆరో ఏట జరిగిందని వాళ్ళు ఎలా అనుకున్నారు?' అని అడిగాడు.

'మహారాజా! మంచి ప్రశ్నే వేశావు. విను. 'శ్రీకృష్ణుడు అఘాసురుడి నుండి రక్షించిన గోవులతో, గోపాలురతో కలిసి ఇంటి ముఖం పట్టాడు. దారిలో ఒక అందమైన కొలను ఉంది. అక్కడే చల్దులు ఆరగిద్దాం అన్నాడు శ్రీకృష్ణుడు. శ్రీకృష్ణుడి చుట్టూ గోపాలురు కూర్చొని చల్దులు ఆరగించారు. వాళ్ళలో ఒకడు చేతివేళ్ళ మధ్యలో ఊరగాయ బద్దలు ఇరికించుకొని పక్కవాణ్ణి ఊరిస్తాడు. మరొకడు పక్కవాడి కంచంలోనిది చట్టుక్కున మింగేసి ఏదీ ఏమీ లేదే! అని నోరు చూపిస్తాడు. మరొకడు పందెం కట్టి మరీ ఐదారుగురు తినేంత చల్దిని లాగిస్తాడు. 'స్నేహమంటే ఇచ్చిపుచ్చుకోవటమే' అంటూ ఒక్కొక్కటీ తీసుకొంటూ బంతెనగుండ్లు ఆడతాడు ఇంకొకడు. ఒకడు నవ్వుతాడు. మరొకడు నవ్విస్తాడు. ఇంకొకడు ముచ్చట్లాడతాడు.

మరొకడు మురిసిపోతాడు. ఇదీ వాళ్ల ఇంపుగొలిపే చల్దులారగింపు.

శ్రీకృష్ణుడు లేచాడు. వేణువును నడుము దట్టీలో దోపాడు. కొమ్ము బూరనూ, చేతి కర్రనూ ఎడమ చంకలో ఇరికించి పట్టుకొని మీగడా, పెరుగూ కలిసి ఉన్న ఒక చల్దిముద్దను ఎడమచేతా, ఊరగాయ బద్దల్ని కుడిచేతి వేళ్ళ మధ్యా ఉంచుకొని, అందర్నీ నవ్విస్తూ ఆరగిస్తున్నాడు. ఇంతలో లేగదూడలు పచ్చిక మేస్తూ ఎటో వెళ్ళిపోయాయి. వాటికోసం శ్రీకృష్ణుడు బయలుదేరాడు. అరచేతిలో అన్నం ముద్ద అలాగే ఉంది. అడవంతా గాలిస్తున్నాడు.

ఈ పని చేసినవాడు బ్రహ్మదేవుడే. అతడే కావాలని ఆ గోవుల్నీ, గోపబాలకుల్నీ దాచి ఉంచాడు. అది గ్రహించిన శ్రీకృష్ణుడు గోవులుగా గోపబాలకుల్లా మారి ఆయా ఇళ్ళకు వెళ్ళాడు. ఇంతలో సంవత్సరకాలం గడిచిపోయింది. ఇది బ్రహ్మదేవుడికి ఒక త్రుటికాలం. బ్రహ్మదేవుడికి ఇదంతా విష్ణుమాయ అని తెలిసివచ్చింది. క్షమించమని శ్రీకృష్ణుణ్ణి వేడుకున్నాడు. తాను దాచినవాళ్ళందరినీ తిరిగి అడవిలో విడిచిపెట్టాడు. పాపం గోపబాలకులకు ఇదంతా ఏమీ తెలియదు. బ్రహ్మ తమను దాచిన కాలము సంవత్సరమైనా శ్రీకృష్ణుని మాయచేత అది కొద్ది కాలంగానే కనిపించింది. అందు చేతనే వారికి శ్రీకృష్ణుని వయసు ఆరేళ్లకు బదులు ఐదేళ్లే అనిపించింది. శ్రీకృష్ణుడి కోసమే చల్దులారగించకుండా ఎదురు చూస్తున్నారు. శ్రీకృష్ణుడి రాకతో వాళ్ళ ముఖాలు వికసించాయి. చల్దులారగించి అందరూ తిరిగి ఇళ్ళకు బయలుదేరారు.

ఒకసారి గోపబాలకులంతా ఆటపాటల్లో మునిగిపోయి ఉన్నారు. ఆ ప్రక్కనే ఓ తాటితోపు ఉంది. అందులో ధేనుకాసురుడు అనే రాక్షసుడు గాడిద రూపంలో ఉంటాడట! వాడు నరమాంస భక్షకుడట! అయినా పళ్ళకోసం అందరూ వెళ్ళారు. పళ్ళు పటపట కొరుకుతూ ఆ రాక్షసుడు వచ్చి బలరాముణ్ణి గుండెలపై వెనక కాళ్ళతో తన్నాడు. దాంతో బలరాముడు ఒక్కసారిగా ఆ గార్దభాసురుడి నాలుగు కాళ్ళూ ఒడిసిపట్టుకొని గిరగిర తిప్పి, చాచి నేలకేసి కొట్టి చంపేశాడు.

## కాళియ మర్దనం

ఒకరోజు కొందరు గోపాలకులు యమునా నదిలో దిగి నీళ్ళు త్రాగి ప్రాణాలు కోల్పోయారు. అందులో కాళియుడు అనే సర్పం ఉంది. శ్రీకృష్ణుడు చనిపోయిన వాళ్లందరినీ బతికించి మడుగులోనికి దూకాడు. కాళియుడు పైకి వచ్చి శ్రీకృష్ణుణ్ణి

తన శరీరంతో కట్టివేసి పడగలెత్తి కాటువేయటం మొదలుపెట్టాడు. శ్రీకృష్ణుడు కదలకుండా కట్టుపడిపోయాడు. అది చూసిన గోపబాలకులంతా గొల్లుమన్నారు. తనకోసం తనవాళ్ళు పడుతున్న దుఃఖాన్ని చూస్తే ముచ్చట వేసింది బాలకృష్ణుడికి. కొంచెం వేడుక చేద్దామనిపించింది. మెల్లగా శరీరాన్ని పెంచటం మొదలుపెట్టాడు. పట్టు బిగిస్తున్న కాళియుడికి ఒత్తిడి పెరుగుతోంది. అంత బలవంతుడైన కాళియుడు ఒళ్ళు హూనమై బాధను తట్టుకోలేకపోయాడు. చివరికి చేసేదేమీ లేక బలం చాలక శ్రీకృష్ణుడిని వదిలేశాడు. అతడలా వదలాడో లేదో గరుత్మంతుడు సర్పాన్ని పట్టినట్లు బాలకృష్ణుడు అతడి పడగలపైకి దూకాడు. ఆ పడగల మీది మణుల కాంతులు తన పాదకాంతులలో కలిసి ప్రకాశిస్తుంటే నాట్యం చేయడం ప్రారంభించాడు. కాళియుడు నోట్లోంచి రక్తం కక్కుకున్నాడు.

ఇంతలో కాళియుడి భార్యలైన నాగస్త్రీలు వచ్చి 'హే గోపాలకృష్ణా! మహానుభావా! పాహి! పాహి! అనుగ్రహించు. శరణు వేడుతున్నాం. మా భర్త ప్రాణాలను మాకు ప్రసాదించు' అని కాళ్ళా వేళ్ళా పడ్డారు. శ్రీకృష్ణుడు కరుణించాడు. కాళియుడూ భక్తితో శ్రీకృష్ణుడిని శరణు వేడాడు.

అప్పుడు శ్రీకృష్ణుడు – 'కాళియా! నువ్వూ, నీ భార్యలూ, నీ సంతానం అందరూ కలసి తక్షణం సముద్రంలోనికి వెళ్ళిపొండి. ఇంతకు ముందు రమణక ద్వీపంలో ఉన్న నువ్వు గరుత్మంతుడికి భయపడి కదా! ఈ మడుగులో దాక్కున్నావు. నీ పడగలపై ఉన్న నా పాదముద్రల్ని చూసి గరుడుడు నిన్నేమీ చేయడు' అని సెలవిచ్చాడు. కాళియుడు బాలకృష్ణుడికి నమస్కరించి వెళ్ళిపోయాడు.

బాలకృష్ణుడు మడుగులో నుంచి బయటకు వచ్చాడు. అందరికీ ఒకటే ఆనందం. పరమానందం. ఆ రాత్రి అందరూ యమునాతీరంలోనే ఉండిపోయారు. అదే రాత్రి అడవిలో పెద్ద కార్చిచ్చు పుట్టుకొచ్చింది. ఆ దావాగ్నిని ఒక్కపెట్టున తానే త్రాగివేశాడు శ్రీకృష్ణుడు.

## ప్రలంబాసురుడు

ప్రలంబుడు అనే రాక్షసుడు ఒక గోపబాలుడి వేషంలో వచ్చాడు. శ్రీకృష్ణుడు అది గమనించాడు. గోపబాలకులందర్నీ పిలిచి 'మిత్రులారా! ఇప్పుడు మనమో ఆట ఆడదాం. ఓడినవాళ్ళు గెలిచినవాళ్ళను వీపుపై మోయాలి. ఇదీ పందెం'

అన్నాడు. ఆ ఆటలో ప్రలంబాసురుడు ఓడిపోవడంతో వాడు బలరాముణ్ణి ఎక్కించుకోవలసి వచ్చింది. బలరాముడు క్రమక్రమంగా బరువు పెరిగి పిడికిళ్లతో గుద్దుతూ ఆ రాక్షసుడి తలను బద్దలు కొట్టి చంపేశాడు.

వర్ష ఋతువు వచ్చింది. ఉరుములు మెరుపులతో వరుణ దేవుడు కుంభవృష్టిని కురిపించాడు. శ్రీకృష్ణుడి దయవల్ల సముద్రుడు తనలో ఎంత నీరు వచ్చి చేరినా చెలియలికట్ట దాటలేదు. ఆ తరువాత శరదృతువు వచ్చింది. చల్లని వెన్నెలలో మురళీకృష్ణుడి వేణుగానం గోపికల గుండెల్లో వలపు పుట్టించింది. ఈ కాలంలోనే గోపకన్యలు కాళిందీ నది ఒడ్డున ఒక వ్రతం చేపట్టారు. రోజూ గౌరీపూజ చేస్తున్నారు.

## గోపికా వస్త్రాపహరణం

రోజూలాగే గోపికలు వేకువజామునే యమునానదీ తీరానికి చేరుకొన్నారు. అక్కడ తమ చీరల్ని విప్పి ఒకచోట ఉంచి నదిలోనికి దిగారు. శ్రీకృష్ణుడు తన గోపబృందాన్ని దూరంగా పెట్టి, ఒంటరిగా వచ్చి వాళ్ళ బట్టలు ఎత్తుకుపోయి ఒక కడిమిచెట్టు మీద కూర్చున్నాడు. 'శ్రీకృష్ణా! మా కోకలు ముట్టుకోవద్దు. మమ్మల్ని మన్నించు. మా మానం తియ్యవద్దు. మా వస్త్రాలు మాకు ఇవ్వవయ్యా బాబూ!' అని ప్రాధేయపడ్డారు. దానికి శ్రీకృష్ణుడు–

మీరు వ్రతదీక్షలో ఉండి కూడా, నగ్నంగా నదిలో స్నానం చేయటం వల్ల మీకు వ్రతఫలం చేజారిపోతున్నది. మీకా వ్రతఫలం దక్కాలంటే చేతులు పైకెత్తి నాకు నమస్కరించమన్నాడు. బాల్యంనుంచీ వారిలో ఒకడుగా మసలినవాడనీ, ఏడేళ్ల వయసువాడనీ వారు నిస్సంకోచంగా నదిబయటకు వచ్చి శ్రీకృష్ణుడికి నమస్కరించారు. వెంటనే శ్రీకృష్ణుడు వాళ్ళ బట్టల్ని వాళ్ళకు ఇచ్చి వ్రతభంగం కాకుండా రక్షించాడు.

* * *

## ముని భార్యల విందు

కాలం గడుస్తోంది. మళ్ళీ వేసవికాలం వచ్చింది. గోవులను మేపుతున్న గోపాలురు చెట్లనీడల్లో సేదతీరుతున్నారు. అప్పుడు కొందరు గోపబాలకులు ఇలా అన్నారు.

'ఈ చెట్లు చూడండి! ఎవరికీ కీడు తలపెట్టవు. ఎవరి జోలికీ పోవు. ఏకాంతంగా

ఉంటాయి. ఎండ, గాలి, వాన, మంచుల నుండి కాపాడతాయి. బెరళ్ళు, గంధం, జిగురు, బూడిద, చివుళ్ళు, తేనె, వేళ్ళు, పూలు, నీడ, పళ్ళు ఇచ్చి మనకు ఉపకారమే చేస్తాయి'

అవును! అవును! అని అందరూ మెచ్చుకున్నారు.

కొంతసేపటికి వారందరికీ కడుపుల్లో నకనకలు మొదలయ్యాయి. అక్కడే కొందరు బ్రాహ్మణులు 'ఆంగిరసం' అనే సత్రయాగం చేస్తున్నారు. అక్కడికి వెళ్తే ఆకలి తీరుతుంది. 'మీరంతా వెళ్ళండి. నా పేరు చెప్పండి' అని పంపాడు శ్రీకృష్ణుడు. గోపబాలకులు వెళ్ళి వాళ్ళను అర్థించారు. కానీ వాళ్ళు లేదు పొమ్మన్నారు. ఈసారి బ్రాహ్మణుల భార్యల దగ్గరకు పంపించాడు శ్రీకృష్ణుడు. కృష్ణుడు పంపాడని చెప్పగానే వాళ్ళు ఆదరించి, రకరకాల ఆహార పదార్థాలు తీసుకొని గోపబాలకులతో బయలుదేరారు. బ్రాహ్మణులందరూ వెళ్ళవద్దని వాళ్ళను అడ్డుకున్నారు. అయినా వాళ్ళా మాటలు లెక్కచేయలేదు. వచ్చారు. వాళ్ళు తెచ్చిన పదార్థాలన్నింటినీ మిత్రులతో కలసి ఆరగించాడు శ్రీకృష్ణుడు.

రాజా! కృష్ణార్పణం అంటూ ఎవరికో భిక్ష వేస్తేనే పరమపదం లభిస్తుందంటారే! మరి సాక్షాత్తూ ఆ పరబ్రహ్మస్వరూపుడే స్వయంగా భిక్ష స్వీకరిస్తే దానివల్ల కలిగే ఫలం మాటల్లో చెప్పగలమా!

వెనక్కి తిరిగి వెళ్ళారు మునిపత్నులు. బ్రాహ్మణులకు జ్ఞానోదయం అయింది. 'పరమేశ్వరుణ్ణి గుర్తించలేనివాడు ఎన్ని యజ్ఞాలు చేసినా వృథా' అని పశ్చాత్తాపంతో అలమటించారు.

## ఇంద్రయాగం - గోవర్ధన పర్వతపూజ

'వర్షానికి అధిపతి ఇంద్రుడు కాబట్టి ఇంద్రయాగం చేస్తే సకల శుభాలూ కలుగుతాయి' అన్నాడు నందుడు. దానికి శ్రీకృష్ణుడు అడ్డుతగిలి–

'మహారాజా! **కర్మమే అన్నింటికీ మూలం. కర్మవల్లనే ప్రాణులు పుడుతున్నాయి, పెరుగుతున్నాయి, నశిస్తున్నాయి. కాబట్టి జనులకు కర్మమే దేవత. అదే సుఖదుఃఖాలకు కారణం.** ఇందులో మహేంద్రుడి ప్రమేయం ఏముంది? ఇంద్రయాగానికి తెప్పించిన వస్తువులతో పిండివంటలు చేయించండి. అందరికీ సంతర్పణలు చేయండి.

బ్రాహ్మణులకు దానాలు సమర్పించండి. పశుపక్ష్యాదులకు సమృద్ధిగా ఆహారాన్ని అందించండి. పశువులకూ, పర్వతానికీ పూజలు చేద్దాం' అన్నాడు. అందరూ పూజించారు.

ఇంద్రుడికి పట్టరాని కోపం వచ్చింది. రాళ్ళవాన కురిపించాడు. మిన్ను విరిగి మీద పడినట్టుంది ఆ వాన. శ్రీకృష్ణుడు అక్కడే ఉన్న గోవర్ధన పర్వతాన్ని అవలీలగా తన చేత్తో ఎత్తి గొడుగులా పట్టుకున్నాడు. గోపాలకులందరూ ఆ కొండ కిందికి చేరారు.

ఏడురోజులు ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తూనే ఉంది. శ్రీకృష్ణుడు కొండగొడుగు పడుతూనే ఉన్నాడు.

దేవేంద్రుడికి కనువిప్పు కలిగింది. కామధేనువుతో వచ్చి నంద గోపాలుణ్ణి -

ఆ.వె. **వాసుదేవ! కృష్ణ! వరద! స్వతంత్ర! వి**
**జ్ఞానమయ! మహాత్మ! సర్వపుణ్య**
**పురుష! నిఖిలబీజభూతాత్మక! బ్రహ్మ!**
**నీకు వందనంబు నిష్కలంక!** (10-1-941)

అని స్తుతించి తిరిగి అమరావతికి వెళ్ళిపోయాడు.

## గోపికల రాక

అది శరత్కాలం. పండు వెన్నెల. బృందావనంలో నందగోపాలుడు యమునా తీరంలో మురళిపై అందమైన రాగం ఆలపిస్తున్నాడు. గోపికలు ఉన్నపళంగా అందరినీ మరచి, అన్నీ విడిచి, శ్రీకృష్ణుడి వద్దకు పరుగు పరుగున వచ్చారు.

పరీక్షిన్మహారాజా! ఇంతకు ముందు నీకు చెప్పానుకదా! **బంధుత్వమో, పగో, కోరికో, ఇష్టమో, ప్రాణభయమో, భక్తో ఏదైనా కానీ హరినే స్మరించిన వాళ్ళు మోక్షాన్ని పొందుతారు. అంతేకాదు; ఆ పరమ పురుషుడిని తాకితే చాలు ప్రాణులే కాదు రాళ్ళు రప్పలూ కొండలూ కోనలూ చెట్లూ పుట్టలూ కూడా ముక్తిని పొందుతాయి.**

తన కోసం తపిస్తూ వచ్చిన గోపికలను చూసి శ్రీకృష్ణుడు- 'ఎలా

ఉన్నారు? అంతా క్షేమమే కదా! అయినా ఇంత రాత్రి క్రూరమృగాలు తిరిగే ఈ అడవిలోకి ఇలా సాహసం చేసి రావచ్చునా? మీకోసం మీవాళ్ళు ఎంత కంగారు పడతారో తెలుసా?! నన్ను ధ్యానించండి, చాలు! మీ జీవితాలు ధన్యమవుతాయి. ఇక మీ మీ ఇళ్ళకు వెళ్ళిపోండి' అన్నాడు.

ఆ మాటలు విన్న గోపికలు పొంగుకు వస్తున్న దుఃఖంతో 'శ్రీకృష్ణా! మమ్మల్ని అనుగ్రహించు' అని వేడుకొన్నారు.

మొత్తానికి శ్రీకృష్ణుడు వాళ్ళను అనుగ్రహించాడు. తన సాంగత్యాన్ని ప్రసాదించాడు. గోపికలు చుట్టూ చేరి తనను కొలుస్తూ ఉంటే చుక్కల్లో చంద్రుడిలా వెలిగిపోయాడు. ఎవరికీ చిక్కని ఆ చిద్విలాసుడు గోపికలకు చిక్కినట్లే చిక్కి చటుక్కున మాయమైపోయాడు. అప్పుడు చూడాలి ఆ గోపకాంతల బాధ! విలవిలలాడిపోయారు. చిరుగుటాకుల్లా వణకిపోయారు. కనిపించిన చెట్టునూ పుట్టనూ అడుగుతున్నారు.

ఉ. **నల్లనివాఁడు పద్మనయనంబులవాఁడు కృపాసరంబు పైఁ**
**జల్లెడివాఁడు మౌళిపరిసర్పిత పింఛమువాఁడు నవ్వు రా**
**జిల్లెడు మోమువాఁడొకఁడు చెల్వల మానధనంబుఁ దెచ్చె నో**
**మల్లియలార! మీ పొదలమాటున లేఁడు గదమ్మ చెప్పరే?** (10-1-1011)

ఓ మల్లెలారా! నల్లనివాడు, తామర రేకుల్లాంటి కళ్ళవాడు, కరుణ చిలకరించేవాడు, తలపై పింఛం కలవాడు, నవ్వుముఖంవా డొకడు - మా గోపికల మానధనం కొల్లగొట్టి ఎక్కడో దాక్కున్నాడు. ఒకవేళ మీ పొదల్లో లేడు కదా! ఉంటే కాస్త చెప్పరూ! అంటూ- తపిస్తూ ఇసుక తిన్నెల్లో తిరుగుతున్నారు.

## గోపికా గీతలు

ఎట్టకేలకు కనిపించాడు శ్రీకృష్ణుడు. గోపికల ముఖాలు పద్మాల్లా వికసించాయి. చుట్టూ చేరారు. ఇలా అడుగుతున్నారు- 'నందనందనా! కొందరు తమను కొలిచినవారిని మాత్రమే అనుగ్రహిస్తారు. ఇంకొందరు కొలిచినా కొలవకపోయినా అనుగ్రహిస్తారు. మరికొందరుంటారు - వాళ్ళు కఠినాత్ములు. ఎవరినీ అనుగ్రహించరు. ఏమిటీ తేడాలు?'

చిన్నగా నవ్వాడు శ్రీకృష్ణుడు! 'బావుంది మీ సందేహం. మీరు నన్ను కఠినాత్ముడిగా జమకట్టినట్లు ఉన్నారు. నా కోసం అన్నీ వదులుకొని నాతో ఉండాలని మీరు తపిస్తున్నారు. కానీ అది ధర్మం కాదు. నేను లేనప్పుడు కూడా నన్ను భావించాలి. అది మీకు అలవాటు కావాలి. అందుకే నేను మీ మధ్య నుంచి అదృశ్యుడనయ్యాను. మిమ్మల్ని బాధించాలని కాదు సుమా! మీది అనన్య భక్తి. మీకు ఏమిచ్చినా ఋణం తీరదు.

## రాసక్రీడ

అప్పుడు శ్రీకృష్ణుడు 'రాసము' అనే క్రీడ ద్వారా ఆ గోపికలందరినీ తరింప చేయాలనుకొన్నాడు. ఈ క్రీడలో గోపికలందరూ గుండ్రంగా నుంచుంటారు. ప్రతి గోపిక ప్రక్కనా ఒక శ్రీకృష్ణుడుంటాడు. అంటే ప్రతి ఇద్దరు గోపికల మధ్యా ఒక శ్రీకృష్ణుడన్నమాట. ఏ గోపిక కాగోపిక శ్రీకృష్ణుడు నా ప్రక్కనే ఉన్నాడని మురిసిపోతూ ఉంటుంది. ఇదంతా శ్రీకృష్ణ లీలావిలాసం. ఇదే రాసక్రీడా రహస్యం.

## సుదర్శనుడు

పరీక్షిన్మహారాజా! ఇదిలా ఉంటే అక్కడ నందగోకులంలో మరో ఆపద వచ్చిపడింది. ఒక పెద్ద పాము ఊరిమీద పడి చివరికి నందమహారాజునే మింగాలని చూసింది. ఆ సర్పం ఎవరో కాదు. సుదర్శనుడు అనే ఒక విద్యాధరుడు. అందగాణ్ణన్న అహంకారంతో విమానమెక్కి తిరుగుతూ కురూపులైన అంగిరసుడి పుత్రుల్ని అవమానించాడు. ఇదుగో ఇలా శాపగ్రస్తుడయ్యాడు. శ్రీకృష్ణుడు వచ్చి ఆ సర్పాన్ని కాలితో తన్నాడు. సర్పాకారం పోయింది. సుదర్శనుడు దేవలోకానికి వెళ్ళిపోయాడు.

## శంఖచూడుడు

ఈసారి శంఖచూడుడు అనే ఒక యక్షుడు గోకులం మీద పడి శ్రీకృష్ణుడి రక్షణలో ఉన్న గోపకాంతలను అపహరించాలని చూశాడు. శ్రీకృష్ణుడు వాణ్ణి పట్టుకొని చంపి, వాడి తలపై ఉన్న మణిని తెచ్చి బలరాముడికి ఇచ్చాడు.

## వృషభాసురుడు

మరోసారి వృషభాసురుడు పర్వతశిఖరంలాంటి మూపురంతో భీకరంగా రంకెలు వేస్తూ నేలను గిట్టలతో కుళ్ళగించేస్తూ ఆలమందపై పడ్డాడు. శ్రీకృష్ణుడు సింహంలా

వాడిపై దూకి, వాడి రెండు కొమ్ములూ పట్టుకొని దూరానికి విసిరికొట్టాడు.

## కేశి

మరోసారి 'కేశి' అనే రాక్షసుడు గుర్రం రూపంలో వచ్చాడు. దాని నాలుగు కాళ్ళూ ఒడిసి పట్టి గిరిగిరా త్రిప్పి నాలుగు వందల మూరల దూరానికి విసిరికొట్టాడు శ్రీకృష్ణుడు. అయినా రెట్టించిన వేగంతో వచ్చిందా గుర్రం. దాని నోటిలోనికి తన చెయ్యి దూర్చి ఆ చేతిని పెద్దది చేసి దాన్ని చంపేశాడు శ్రీకృష్ణుడు.

## వ్యోమాసురుడు

తరువాత శ్రీకృష్ణుడు గోపబాలురతో కలసి 'దాగుడుమూతలు' ఆడుతుంటే 'వ్యోమాసురుడు' వచ్చి ఒక గోపాలుడిలా వాళ్ళలో కలసిపోయాడు. ఆ ఆటలో పిల్లల్ని మాయచేసి ఒక గుహలో దాచేస్తున్నాడా రాక్షసుడు. అది కనిపెట్టాడు శ్రీకృష్ణుడు. తోడేలుపైకి దూకే సింహంలా వానిపైకి దూకి సంహరించాడు కృష్ణుడు.

## అక్రూరుడి రాక

కంసుడు అక్రూరుణ్ణి పిలిపించాడు. బలరామకృష్ణుల్ని తాను చేస్తున్న ధనుర్యాగానికి తీసుకురమ్మన్నాడు. అప్పుడు అక్రూరుడు 'రాజా! నీ ఆజ్ఞ. కానీ లోకంలో కొందరు భగవంతుడి శక్తిని గుర్తించలేరు. అది వాళ్ళ కర్మ. అటువంటి వాళ్ళను ఎవరూ కాపాడలేరు' అని బృందావనం చేరుకున్నాడు. బలరామకృష్ణులు అతిథి మర్యాదలు చేశారు. తను వచ్చిన పని గురించి చెప్పాడు అక్రూరుడు. సరే! వస్తానన్నాడు శ్రీకృష్ణుడు.

అక్రూరుడు రథం నడుపుతున్నాడు. బలరామకృష్ణులు ఆ రథంపై మథురకు సాగిపోతున్నారు. దారిలో కాళిందీనది. అక్కడ ఆగింది రథం. అక్రూరుడు ఆ నదిలో దిగి స్నానం చేస్తున్నాడు. బలరామకృష్ణులు రథంలోనే ఉన్నారు. కానీ నీళ్ళలోనూ కన్పించారు. నీళ్ళలో మునిగాడు. లోపల ఆదిశేషుడు, ఆ శేషుడిపై శయనించి ఉన్న విష్ణుమూర్తి దర్శనమిచ్చారు. ప్రహ్లాదాది భక్తులూ లక్ష్మి, పుష్టి, తుష్టి, కీర్తి, కాంతి, ఇల, ఊర్జ, విద్య, అవిద్య, శక్తి, మాయ అనే తేజోమూర్తులు ఆయనను సేవిస్తున్నారు. అక్రూరుడు నమస్కరించి స్తుతించాడు. అంతలోనే ఆ విష్ణుమూర్తి మాయమయ్యాడు. అక్రూరుడు నీళ్ళనుండి బయటకు వచ్చి రథంలో

కూర్చున్నాడు. అప్పుడు శ్రీకృష్ణుడు – 'ఏం అక్రూరా! వెళ్ళి చాలాసేపయ్యిందే! ఆ నదీజలాల్లో ఏవైనా వింతలు కనిపించాయా' అన్నాడు. అక్రూరుడు నవ్వి 'స్వామీ! నీకు తెలియని వింతలా? నీలో లేని వింతలా' అంటూ రథం పోనిచ్చాడు.

## మథురానగర ప్రవేశం

శ్రీకృష్ణుడు నగర వీథుల్లో విహరిస్తున్నాడు. దారిలో బ్రాహ్మణులు బలరామకృష్ణుల్ని అర్చించారు. అటువైపు వచ్చిన ఒక సాలెవాడు మంచి బట్టలు తెచ్చి ఇచ్చాడు. దారిలో సుదాముడు అనే మాలాకారుడి ఇంటికి వెళ్ళారు. సుదాముడు సంతోషంగా పూమాలలు సమర్పించి – 'శ్రీకృష్ణా!

కం. **నీ పాద కమల సేవయు**
**నీ పాదార్చకుల తోడి నెయ్యమును నితాం**
**తాపార భూతదయయును**
**దాపసమందార! నాకు దయసేయఁగదే.** (10-1-1270)

నీ పాదకమలాల్ని సేవించే భాగ్యం, నీ పాదాల్ని అర్చించేవాళ్ళ స్నేహం, అపారమైన భూతదయా నాకు అనుగ్రహించు' అన్నాడు. అలాగేనంటూ శ్రీకృష్ణుడు రాజవీథిలోనికి దారితీశాడు. దారిలో ఒక గూని దాసి ఎదురువచ్చింది. ఆమె చేతిలో మైపూతలు ఉన్నాయి. ఆమె కంసుడి దాసి. మీకూ కావాలా? అంటూ కొన్ని మైపూతలు ఇచ్చింది. శ్రీకృష్ణుడు ఆ కుబ్జ వంకర్లను తీసేయాలనుకొన్నాడు. దాని మీగాళ్ళ మీద తన కాలితో నొక్కిపెట్టి రెండు చేతుల బొటనవేళ్ళను ఆమె గడ్డం క్రింద పెట్టి శరీరాన్ని పైకి సాగదీశాడు. ఆమె గూనె మాయం. అందమైన స్త్రీగా మారిపోయింది.

ధనుశ్శాలకు వెళ్ళాడు. అక్కడో పెద్ద విల్లు ఉంది. దాని దగ్గరకు వెళ్ళి అల్లెత్రాడు తగిలించి ఒక మత్తగజం చెరుకుగడను విరిచినట్లుగా దాన్ని విరిచేశాడు.

* * *

రాత్రి అయ్యింది. వెన్నెల వెలుగులో మథుర వెలిగిపోతోంది. ఆ రాత్రి తోటి గోపాలురతో కలసి ఆరుబయట పాలబువ్వలు తిని ఆనందించారు బలరామకృష్ణులు.

తెల్లవారింది. కంసుడు మల్లయుద్ధానికి రంగం సిద్ధంచేయించాడు. ఒక్కొక్కడు ఒక్కొక్క పర్వతమా అన్నట్లున్న చాణూరుడు, ముష్టికుడు, శలుడు, తోసలుడు

రంగంలోనికి దూకారు. ఒకవైపు కంసుడు, మరోవైపు నందాదులూ కూర్చున్నారు. గుండెలు పగిలేలా భేరీలు మ్రోగాయి.

## కువలయాపీడం

బలరామకృష్ణులు వాకిలి దగ్గరకు చేరుకున్నారు. అక్కడో మత్తగజం ఉంది. దాని పేరు కువలయాపీడం. దాన్ని మీదికి తోలుకొస్తున్నాడు మావటివాడు.

కట్టుకున్న పట్టుపుట్టాన్ని బిగించాడు శ్రీకృష్ణుడు. ఎగిరి తోక పట్టుకుని, అంతటి ఏనుగునీ గిరగిరా తిప్పి, దూరంలో పడేలా విసిరికొట్టాడు. అది యమపురికి చేరింది.

## కంసవధ

ఇక నేరుగా రంగంలోకి దూకారు బలరామకృష్ణులు. అప్పుడు చాణూరుడు శ్రీకృష్ణుడిని నానామాటలూ అంటూ బాగా రెచ్చగొట్టాడు. శ్రీకృష్ణుడు చాణూరుడితోనూ, బలరాముడు ముష్టికుడితోనూ తలపడ్డారు. జబ్బలు చరుస్తూ, వికటాట్టహాసం చేస్తూ యుద్ధం చేస్తున్నారు. చూసేవాళ్ళంతా ఊపిరి బిగపట్టి చూస్తున్నారు. కొద్దిసేపు ఒక ఆట ఆడించి వాళ్ళను సంహరించారు బలరామకృష్ణులు.

కంసుడికి ఒకప్రక్క అసహనం, కోపం. మరో ప్రక్క భయం. ఏం చేయాలో తోచలేదు. తన సైనికుల్ని పిలిచి 'అడుగో! నందుడు. ముందు అతణ్ణి చంపిపారెయ్యండి. ఈ కుర్రాళ్ళిద్దర్నీ తరిమికొట్టండి. ఆ తరువాత వసుదేవుణ్ణీ, నా తండ్రి ఉగ్రసేనుణ్ణీ మట్టుపెట్టండి' పిచ్చిగా కేకలు వేస్తూ అరుస్తున్నాడు.

అది విన్న శ్రీకృష్ణుడు కొదమసింహంలా కంసుడిమీదికి దూకాడు. జుట్టు పట్టుకొని రంగస్థలం మధ్యలోనికి విసిరివేశాడు. కిరీటం ఎగిరి ఒక ప్రక్కన పడింది, కంసుడు మరో ప్రక్కన పడ్డాడు. పౌరులు హాహాకారాలు చేస్తుంటే శ్రీకృష్ణుడు పైకి ఎగిరి కంసుడి మీదికి దూకాడు. అంతే! కంసుడు నెత్తురు కక్కుకొని మరణించాడు. అతడి ఎనిమిదిమంది తమ్ముళ్ళూ అదే బాటపట్టారు.

## ఉగ్రసేనుడి పట్టాభిషేకం

శ్రీకృష్ణుడు దేవకీవసుదేవుల్ని విడిపించి – 'మాకు జన్మనిచ్చారు కానీ మమ్మల్ని

పెంచి పెద్దచేసే ముద్దూముచ్చటకు మీరు నోచుకోలేదు. మాకూ ఆ అదృష్టం లేదు. **సామర్థ్యం ఉండీ తల్లిదండ్రుల్ని సేవించనివాడికన్నా దుష్టుడు ఉండడు! తల్లిదండ్రుల్ని, వృద్ధుల్ని, పసిబిడ్డల్ని, గురువులను, బ్రాహ్మణులను, సాధువులను, స్త్రీలను పోషించగల సామర్థ్యం ఉండి కూడా నిర్లక్ష్యం చేసేవాడు బతికినా చచ్చినవాడితో సమానం' అన్నాడు.**

దేవకీవసుదేవుల కళ్ళు చెమర్చాయి. బిడ్డల్ని దగ్గరకు తీసుకొని లాలించారు.

తరువాత ఉగ్రసేన మహారాజుగారికి యదు, వృష్ణి, భోజ, కుకుర, అంధక వీరులందరి సమక్షంలో పట్టాభిషేకం చేయించాడు శ్రీకృష్ణుడు. నందుడు మొదలైనవాళ్ళను బృందావనానికి పంపించాడు.

శ్రీకృష్ణబలరాములు మథురలోనే ఉన్నారు. వసుదేవుడు వాళ్ళకు ఉపనయనం చేయించి సాందీపని యొద్దకు విద్యాభ్యాసానికి పంపించాడు.

సాందీపని కాశిలో ఉన్నాడు. బలరామకృష్ణులు అక్కడికి వెళ్ళి వినయ విధేయతలతో ఆయనకు శుశ్రూషలు చేశారు. వేదవేదాంగాలు, ఉపనిషత్తులు, ధనుర్విద్య నేర్చుకొన్నారు. రోజుకో కళ చొప్పున అరవైనాలుగు కళల్లోనూ ఆరితేరారు. సాందీపని మహర్షి కుమారుడు పూర్వం ఎప్పుడో ప్రభాస తీర్థంలో మునిగిపోతే అతణ్ణి తెచ్చి గురుదక్షిణగా సమర్పించారు. తిరిగి మథురా నగరానికి చేరుకున్నారు.

## శ్రీకృష్ణుడి సందేశం

శ్రీకృష్ణుడికి గోపికలు గుర్తుకు వచ్చారు. 'ఈ శ్రీకృష్ణు డెప్పటికీ మీవాడే! మిమ్మల్ని ఎన్నటికీ విడిచిపెట్టడు. త్వరలోనే బృందావనానికి వస్తాడు' అనే సందేశాన్ని ఉద్ధవుడి ద్వారా పంపాడు.

ఉద్ధవుడు బృందావనానికి వెళ్ళాడు. శ్రీకృష్ణుడి మాటల్ని వారి చెవుల్లో వేసి వాళ్ళకు వీనులవిందు చేశాడు. దానికా గోపికలు– 'ఇప్పటిదాకా ఎలా తట్టుకున్నామో మాకే తెలియదు. ఇక మా వల్ల కాదు. నువ్వు రాకపోతే అంతే. మా ప్రాణాలు గాల్లో కలసిపోతాయి. శ్రీకృష్ణా! ఇక నీదే భారం!' అని జవాబు పంపారు.

మథురలో ఉన్న శ్రీకృష్ణుడు తానే స్వయంగా కుబ్జను అనుగ్రహించడానికి ఆమె ఇంటికి వెళ్ళాడు. అలాగే అక్రూరుడి ఇంటికీ బలరాముణ్ణి వెంటతీసుకొని

వెళ్ళి, అక్రూరుడిని హస్తినాపురానికి పంపాడు.

అక్రూరుడు వెళ్ళి అక్కడ పెద్దలందరినీ కలిశాడు. కొన్నాళ్ళు అక్కడే ఉండి అందరి మనస్తత్వాలూ గ్రహించాడు. ధృతరాష్ట్రుడికి హితబోధ చేసిమరీ వచ్చాడు.

## జరాసంధుడు

పరీక్షిన్మహారాజా! కంసుడికి అస్తి – ప్రాస్తి అని ఇద్దరు పట్టపురాణులున్నారు. వీళ్ళిద్దరూ జరాసంధుడి కుమార్తెలు. తన అల్లుణ్ణి చంపిన శ్రీకృష్ణుడిపై పగపట్టాడు జరాసంధుడు. తన 23 అక్షౌహిణుల సైన్యాన్ని తీసుకొని మథురపై దాడిచేశాడు.

దైవయోగంవల్ల ఆకాశంలోంచి రెండు దివ్యరథాలు మధురలో దిగాయి. వాని నిండా దివ్యమైన ఆయుధాలూ కవచాలూ ఉన్నాయి. ఆలస్యం చేయలేదు. బలరామకృష్ణులు చెరో రథం అధిరోహించారు. శ్రీకృష్ణుడి రథసారథి దారుకుడు వేగంగా జరాసంధుడివైపు రథాన్ని పోనిచ్చాడు. శ్రీకృష్ణుడు పాంచజన్యాన్ని పూరించాడు. శత్రుసైనికుల గుండెలు దద్దరిల్లిపోయాయి. ఇంతలో జరాసంధుడి సైన్యం యాదవ సైన్యంపై విరుచుకుపడింది. బలరాముడు రోకలిని ధరిస్తే శ్రీకృష్ణుడు తన విల్లును అందుకున్నాడు. ఇద్దరూ శత్రుసైన్యాన్ని చీల్చి చెండాడారు.

జరాసంధుడి రథం విరిగిపోయింది. గర్వం అణగిపోయింది. ప్రాణాలు పోయినంత పనీ జరిగింది. బలరాముడు సింహంలా దూకి, జరాసంధుణ్ణి పట్టుకోబోయాడు. కానీ శ్రీకృష్ణుడు 'ఇప్పుడే వద్దులే.. ఇతడివల్ల ఇంకా చాలామంది దుష్టుల్ని మనం వేటాడాలి. కొన్నాళ్ళు బతకనీ' అన్నాడు.

## కాలయవనుడు

పరీక్షిన్మహారాజా! కాలయవనుడు యాదవుల ఆగర్భ శత్రువు. అయితే యాదవుల చేతిలో మరణం లేకుండా ఇతడికి వరం కూడా ఉంది. అసలే క్రూరుడైన, కాలయవనుడికి నారదుడు బాగా నూరిపోశాడు. శ్రీకృష్ణుణ్ణి ఓడిస్తేనే నువ్వు నిజమైన వీరుడివని రెచ్చగొట్టాడు. ఆ మాటలు ఊరికే పోతాయా! సత్వరం తన మూడు కోట్ల మ్లేచ్ఛ సైన్యంతో కాలయవనుడు మధురపై విరుచుకుపడ్డాడు.

ప్రజల రక్షణ కోసం శ్రీకృష్ణుడు విశ్వకర్మను సముద్రంలో ఒక నగరాన్ని నిర్మించి ఇవ్వమని కోరాడు.

## ద్వారకా నగరం

విశ్వకర్మ దేవశిల్పి. సముద్రంలో పన్నెండు యోజనాల వైశాల్యంలో ఒక నగరాన్నీ, దాని చుట్టూ ఒక దుర్భేధ్యమైన కోటనీ నిర్మించి ఇచ్చాడు.

శ్రీకృష్ణుడు తన యోగశక్తితో మధురాపుర ప్రజలందరినీ ద్వారకకు తరలించి కాలయవనుడికి దొరక్కుండా పరుగు తీశాడు. వాడు వెంటపడ్డాడు. వాణ్ణి నానా తిప్పలూ పెట్టి చివరికి శ్రీకృష్ణుడు ఒక గుహలోకి వెళ్ళాడు. వాడూ వెళ్ళాడు. గుహ లోపల గాఢనిద్రలో ఉన్న ఒక పురుషుడు కనిపించాడు. అతడు శ్రీకృష్ణుడే అనుకున్నాడు కాలయవనుడు. ఆ పురుషుణ్ణి కాలితో తన్నాడు. అంతే! ఆ దివ్యపురుషుడు కన్ను తెరిచి చూడటం, కాలయవనుడు భస్మమైపోవటం ఏకకాలంలోనే జరిగిపోయాయి.

## ముచుకుందుడు

మహారాజా! అతడే ముచుకుందుడు. మాంధాత చక్రవర్తి కొడుకు. ఒకసారి దేవతల్ని రాక్షసుల బారి నుండి రక్షించి, వాళ్ళను తనకు మోక్షాన్ని ప్రసాదించమని వేడుకొన్నాడు.

అప్పుడు దేవతలు 'మహావీరా! నువ్వు మమ్మల్ని రక్షించడం కోసం చాలాకాలం ఇక్కడే ఉండిపోయావు. ఇప్పుడు భూమిపై నీ వాళ్ళెవరూ లేరు. అందరూ మరణించారు. ఎంతటివారైనా కాలం నుండి తప్పించుకోలేరు. మహాబలవంతుల కంటే కూడా కాలం ఇంకా బలమైనది. కాలస్వరూపుడు భగవంతుడే! నువ్వు కోరిన మోక్షాన్ని ప్రసాదించగలవాడు భగవంతుడైన శ్రీహరి ఒక్కడే. అదికాక మరేదైనా వరం కోరుకో' అన్నారు. అప్పుడు ముచుకుందుడు నిద్రను ప్రసాదించమన్నాడు. దేవతలు అనుగ్రహించారు. అప్పటి నుండీ ఇదుగో ఇలా ఈ గుహలో నిద్రపోతున్నాడు. ఇప్పుడు కాలయవనుడివల్ల మేల్కొన్నాడు. అప్పుడు శ్రీహరి సాక్షాత్కరించి 'ముచుకుందా! పూర్వం నువ్వు నన్ను ఆరాధించావు. అప్పుడు నువ్వు జీవహింస చేశావు. తపస్సు చేసి ఆ పాపాన్ని బాపుకో. తరువాత జన్మలో బ్రాహ్మణుడవై పుట్టి, అన్ని ప్రాణుల్నీ ప్రేమించి నన్ను చేరుకుంటావు' అని చెప్పి వెళ్ళిపోయాడు. తరువాత ముచుకుందుడు

బదరికాశ్రమానికి వెళ్ళి తపస్సు ప్రారంభించాడు.

## ప్రవర్షణ పర్వతం

మథురకు తిరిగివచ్చిన శ్రీకృష్ణుడు తరువాత తన నగరాన్ని ముట్టడించిన యవనుల్నీ మ్లేచ్ఛులనూ నాశనం చేశాడు. ఇంతలో జరాసంధుడు మళ్ళీ దండెత్తి వచ్చాడు. అప్పుడు శ్రీకృష్ణబలరాములు అడవుల్లోకి పారిపోయి 'ప్రవర్షణం' అని పేరుగల ఒక పర్వతంపైకి ఎక్కారు. జరాసంధుడు ఆ కొండకు నిప్పుపెట్టించాడు. కానీ బలరామకృష్ణులు చాకచక్యంగా శత్రువుల కళ్ళుగప్పి ద్వారకానగరానికి చేరుకున్నారు.

## రుక్మిణీ కల్యాణం

కం. **భూషణములు సెవులకు బుధ**
**తోషణము లనేక జన్మ దురితౌఘ విని**
**శ్శోషణములు మంగళతర**
**ఘోషణములు గరుడగమను గుణభాషణముల్.** (10-1-1685)

శ్రీహరి గురించిన మాటలు – చెవులకు అలంకారాలు అవుతాయి. పండితులకు సంతోషాన్ని కలిగిస్తాయి. అనేక జన్మలకు సంబంధించిన పాపాలను ఇంకిపోయేలా చేస్తాయి. మంగళ వాద్యాల్లా హాయిగా ఉంటాయి. కాబట్టి రాజా! విను.

విదర్భదేశానికి రాజధాని కుండినపురం. దానికి ప్రభువు భీష్మకుడు. అతడికి ఐదుగురు కుమారులు. ఒకే ఒక్క కూతురు. ఆమె పేరే రుక్మిణి. రుక్మి, రుక్మరథ, రుక్మబాహు, రుక్మకేశ, రుక్మనేత్రులనే అయిదుగురికీ ఈమె ఒక్కతే గారాబు చెల్లి.

రుక్మిణి అందాలబొమ్మ. ఆ బాలామణి చిన్ననాటినుండీ బొమ్మల పెళ్ళిళ్ళు చేసేది. పప్పుబియ్యాలు గిన్నెల్లో పోసి గుజ్జెనగూళ్ళు వండి వడ్డించేది. ఉద్యానవనాల్ని పెంచి పోషించేది. గోరువంకలకూ చిలుకలకూ మాటలూ, నెమళ్లకు నాట్యాలూ, హంసలకు నడకలూ నేర్పేది.

ఆ నోటా ఈ నోటా శ్రీకృష్ణుడి గురించి విని ఆమె అతడిని వలచింది.

శ్రీకృష్ణుడూ అంతే. రుక్మిణి గురించి విన్నాడు. ఎలాగైనా సరే, ఆమెను తన

ఇల్లాలిని చేసుకోవాలని నిశ్చయించుకున్నాడు. కానీ రుక్మి - తన చెల్లిని చేది దేశాధిపతి అయిన శిశుపాలుడికి ఇచ్చి పెళ్ళిచేయాలనుకున్నాడు. అందుకే రుక్మిణి తనే కొంత చొరవ తీసుకుని 'అగ్నిద్యోతనుడు' అనే బ్రాహ్మణుణ్ణి శ్రీకృష్ణుడి వద్దకు పంపింది.

అగ్నిద్యోతనుడు మెరుపు వేగంతో వెళ్ళి శ్రీకృష్ణుడి ముందు రుక్మిణీదేవి సందేశాన్ని ఆమె మాటల్లోనే ఇలా విన్నవించాడు-

'ఓ మంగళమూర్తీ! పురుష సింహమా! మదోన్మత్తుడైన శిశుపాలుడు - నిన్నే ఆరాధిస్తున్న నన్ను సొంతం చేసుకోవాలనుకొంటున్నాడు. వాడికి నీ ప్రతాపం తెలియదు. మరోమాట! నేను పూర్వం ఏమైనా నోములు నోచి ఉంటే, దేవబ్రాహ్మణులకు సేవలూ దానధర్మాలూ చేసి ఉంటే - నువ్వే నా భర్తవు అవుతావు.

ఉ. **అంకిలి సెప్ప లేదు, చతురంగ బలంబులతోడ నెల్లి యో**
**పంకజనాభ! నీవు శిశుపాలజరాసుతులన్ జయించి నా**
**వంకకు వచ్చి రాక్షస వివాహమునన్ భవదీయ శౌర్యమే**
**యుంకువ సేసి కృష్ణ! పురుషోత్తమ! చేకొని పొమ్ము వచ్చెదన్.**

(10-1-1708)

శ్రీకృష్ణా! పురుషోత్తమా! నీలాంటి వీరుడికి ఇక్కడ ఏ ఆటంకమూ లేదు. రేపే తరలిరా! చతురంగ బలంతో రా! ఈ శిశుపాలుడు, జరాసంధుడు మొదలైనవాళ్ళను గెలిచి, నా దగ్గరకు వచ్చి, నీ శౌర్యాన్నే కన్యాశుల్కంగా పెట్టి, రాక్షస వివాహ పద్ధతిలో నన్ను చేపట్టు. నన్ను అనుగ్రహించు. అనుగ్రహించలేదో నా ప్రాణాలు నీకే అర్పిస్తాను. ఇదే నా తుది నిర్ణయం. ప్రాణనాథా! నీ తీయటి మాటలు వినని చెవులూ, నిన్ను చూడని కళ్ళూ, నీకు దాస్యం చేయని జన్మ ఎందుకు? ఎన్ని జన్మలకైనా నాకు నువ్వే కావాలి' అని చెప్పి, తిరిగి తన మాటగా 'శ్రీకృష్ణా! ఆ రుక్మిణికి నువ్వూ, నీకు ఆ రుక్మిణీ ఈడూ జోడు. మా గురువుల మీద ఒట్టు. మీ ఇద్దరికీ వివాహం జరుగుతుంది. ఇంక ఆలస్యం ఎందుకు? నువ్వు నీ వాళ్ళతో కలసి బయలుదేరు.' అన్నాడు.

* * *

శైబ్యం, సుగ్రీవం, మేఘపుష్పం, వలాహకం అనే గుర్రాలను పూన్చిన రథంపై అగ్నిద్యోతనుడితో కలిసి విదర్భకు వస్తున్నాడు శ్రీకృష్ణుడు.

శిశుపాలుడూ అట్టహాసంగా బంధుమిత్రులతో కలిసి రుక్మిణిని వివాహం చేసుకోవడానికి కుండిన నగరానికి చేరుకున్నాడు. ఎక్కడెక్కడి నుంచో రాజులందరూ విచ్చేశారు.

శ్రీకృష్ణుడు విదర్భ దేశానికి వెళ్ళాడన్న వార్త బలరాముడికి తెలిసింది. తానూ సైన్యంతో బయలుదేరాడు.

ఒక ప్రక్క శిశుపాలుడితో పెళ్ళి ఏర్పాట్లు చకచకా జరుగుతుంటే మరోప్రక్క రుక్మిణీదేవికి లోపల ఆందోళన. ఏం జరుగుతుందో! శ్రీకృష్ణుడు వస్తాడో రాడో! రాకపోతే! ఆ మాట తలచుకోవడానికి కూడా ఆమెకు ధైర్యం చాలడంలేదు. ఇంతలో అగ్నిద్యోతనుడు వచ్చాడు. కమ్మని వార్తను ఆమె చెవిలో వేశాడు. రుక్మిణి ఆనందానికి అవధుల్లేవు.

* * *

రుక్మిణి అమ్మవారి ఆలయానికి బయలుదేరింది. చుట్టూ పరివారం. సైన్యం కాపలాగా వచ్చింది. అమ్మవారిని సేవించి–

ఉ. **నమ్మితి నా మనంబున సనాతనులైన యుమామహేశులన్**
**మిమ్ము, బురాణదంపతుల మేలు భజింతు గదమ్మ! మేటి పె**
**ద్దమ్మ దయాంబురాశివి గదమ్మ హరిం బతి సేయుమమ్మ నిన్**
**నమ్మినవారి కెన్నడును నాశము లేదు గదమ్మ ఈశ్వరీ!** (10–1–1744)

'అమ్మా గౌరీదేవీ! నువ్వూ నీ భర్త సనాతనులైన ఉమామహేశ్వరులు. మిమ్మల్ని పూజిస్తున్నాను. అమ్మా! నాకు మేలు కలిగించు. నీవు అందరికీ పూజనీయురాలివి. దయకు సముద్రంవంటిదానివి. నాకు శ్రీకృష్ణుణ్ణి భర్తగా చెయ్యమ్మా! నిన్ను నమ్మినవారికి ఎన్నటికీ నష్టం కలగదు కదా తల్లీ!' అని ప్రార్థించింది.

శ్రీకృష్ణుడు ఎప్పుడు వస్తాడా! అని నిరీక్షిస్తూ కాలినడకన తిరిగి వస్తోంది. దారిలో రథంపై వస్తూ కనిపించాడు శ్రీకృష్ణుడు.

అతణ్ణి చూడగానే రుక్మిణి మనసు పులకించింది. ఆమె నిరీక్షణ ఫలిచింది. అందరూ చూస్తుండగా శ్రీకృష్ణుడు రుక్మిణీదేవిని తన రథంపై ఎక్కించుకొన్నాడు. భూమ్యాకాశాలు దద్దరిల్లేలా పాంచజన్యం పూరించాడు. అది చూసిన శత్రువులందరూ చుట్టుముట్టారు. కానీ యాదవుల ధాటికి చెల్లాచెదురైపోయారు. జరాసంధుడూ పలాయనం చిత్తగించాడు. అది చూసి శిశుపాలుడు బిక్కమొహం వేశాడు. తక్కిన రాజులు అతణ్ణి ఓదార్చారు. 'శిశుపాలా! ఎలాగో బతికి బయటపడ్డావు. బతికుంటే బలుసాకు తిని బ్రతకవచ్చు. ప్రాణం ఉంటే భార్య దొరక్కపోదు. అన్నీ అనుకున్నట్లే జరగవు. మనమంతా ఈశ్వరుడి చేతిలో కీలుబొమ్మలం. సుఖదుఃఖాలు శాశ్వతం అనుకోకు'.

జరాసంధుడూ ఓదార్చాడు. 'శిశుపాలా! నేనెన్నిసార్లు (18 సార్లు) శ్రీకృష్ణుడి పైకి యుద్ధానికి వెళ్ళలేదూ. కానీ గెలిచింది మాత్రం ఒక్కసారే! మన చేతుల్లో ఏమీ లేదు. జయాపజయాలు దైవాధీనాలు. ఈ రోజు వాళ్ళది. మనకీ ఓ రోజు వస్తుంది. అప్పటిదాకా ఓపిక పట్టాలి' అన్నాడు.

కానీ రుక్మి శ్రీకృష్ణుణ్ణి అడ్డగించాడు. రుక్మిపై శ్రీకృష్ణుడు కత్తి దూశాడు. రుక్మిణి ప్రార్థనపై కోపం అణుచుకొని అతణ్ణి చంపకుండా గుండుచేసి పంపించాడు. బలరామకృష్ణులు రుక్మిణితో సహా ద్వారకానగరానికి చేరుకున్నారు. శ్రీకృష్ణుణ్ణి ఓడించకుండా కుండిన నగరానికి రానన్న రుక్మి 'భోజకటకం' అనే ఒక నగరాన్ని నిర్మించుకొని అక్కడే ఉండిపోయాడు.

## ప్రద్యుమ్న చరిత్ర

పరీక్షిన్మహారాజా! పరమేశ్వరుడి కంటిమంటలకు దగ్ధం అయిన మన్మథుడే ప్రద్యుమ్నుడు అనే పేరుతో రుక్మిణీశ్రీకృష్ణులకు జన్మించాడు.

శంబరాసురుడు అనే రాక్షసుడు ఒకడున్నాడు. వాడు ఈ రుక్మిణీ కృష్ణుల పుత్రుడు తనకు శత్రువని తెలిసికొని ఆ శిశువును అపహరించి, సముద్రంలో విసిరేశాడు. ఆ శిశువును ఒక పెద్ద చేప మింగింది. జాలరులు ఆ చేపను పట్టి, శంబరాసురుడికే కానుకగా సమర్పించారు. దైవలీలలు ఇలాగే ఉంటాయి. వంట వాళ్ళు ఆ చేపను కోసి దాని పొట్టలోంచి ఈ బాలుణ్ణి బయటకు తీశారు. వాళ్లలో మాయావతి అనే ఒక వనితకూడ ఉంది. ఆమె ఎవరో కాదు. సాక్షాత్తూ రతిదేవి.

మన్మథుడి భార్య. మన్మథుడు మళ్ళీ ఇలా పుడతాడని నారదుడు ఆమెకు ముందే చెప్పాడు. అందుకే ఇక్కడ నిరీక్షిస్తోంది. వంట వాళ్ళు తెచ్చి ఆ శిశువును మాయావతికి ఇచ్చారు. ఆమె ప్రేమగా పెంచింది.

ప్రద్యుమ్నుడు పెరిగి పెద్దవాడై శంబరాసురుణ్ణి యుద్ధానికి పిలిచి వాడి రాక్షస మాయలన్నింటినీ త్రిప్పికొట్టి సంహరించాడు.

అప్పుడు మాయావతి ఆకాశమార్గంలో ప్రద్యుమ్నుణ్ణి ద్వారకకు తీసుకువెళ్ళింది. నారద మహర్షి ద్వారా ప్రద్యుమ్నుడు రుక్మిణీకృష్ణుల కొడుకేనన్న విషయం అందరికీ తెలిసింది. ఆనందం వెల్లివిరిసింది.

## శమంతకమణి

పరీక్షిన్మహారాజా! సత్రాజిత్తు అనే ఒక రాజు ఉండేవాడు. ఇతడు 'నిమ్నుడు' అనే యాదవ చక్రవర్తికి కుమారుడు. ఇతడు సూర్యభక్తుడు. సూర్యుడు సత్రాజిత్తుకు 'శమంతకం' అనే ఒక మణిని ఇచ్చాడు. ఆ మణి రోజూ ఎనిమిది బారువుల బంగారాన్ని ఇస్తుంది. అంత గొప్ప మణి ఉగ్రసేన మహారాజువద్ద ఉంటే మంచిదనీ, రాజుగారికి ఇవ్వమనీ శ్రీకృష్ణుడు అడిగాడు. సత్రాజిత్తు ఇవ్వనన్నాడు.

రోజులు గడుస్తున్నాయి. ఒకరోజు సత్రాజిత్తు తమ్ముడు ప్రసేనజిత్తు ఆ మణిని కంఠంలో అలంకరించుకొని అడవికి వేటకు వెళ్ళాడు. అక్కడ ఒక సింహం అతణ్ణి చంపి ఆ మణిని తీసుకుపోయింది. ఆ సింహాన్ని భల్లూక రాజైన జాంబవంతుడు చంపి ఆ మణిని తీసుకొని వెళ్ళి తన కుమారుడికి ఆటవస్తువుగా ఇచ్చాడు.

శ్రీకృష్ణుడే ఆ మణికోసం తన తమ్ముణ్ణి చంపి ఉంటాడని ప్రచారం చేశాడు సత్రాజిత్తు. తనమీద పడిన ఈ అపనిందను తొలగించుకోవడం కోసం శ్రీకృష్ణుడు కొందరు పౌరుల్ని సాక్షులుగా తీసుకొని అడవికి వెళ్ళి, ఒక గుహలో శమంతకమణితో ఆడుకుంటున్న ఒక పిల్లవాణ్ణి చూశాడు. ఇంతలో హఠాత్తుగా జాంబవంతుడు వచ్చి శ్రీకృష్ణుడి మీదికి దూకాడు. యుద్ధం హోరాహోరీగా సాగింది. ఇరవై ఎనిమిది రోజులు అలా యుద్ధం చేస్తూనే ఉన్నారు. ఎవరూ తగ్గటం లేదు. చివరికి జాంబవంతుడు అలసిపోయాడు. శ్రీకృష్ణుడు పైచేయి సాధించాడు. అప్పుడర్థమయింది జాంబవంతుడికి. అతడు సాక్షాత్తూ శ్రీమహావిష్ణువేనని. భక్తితో నమస్కరించి స్తుతించాడు. శ్రీకృష్ణుడు

తనపై వచ్చిన అపవాదు గురించి చెప్పాడు. వెంటనే జాంబవంతుడు ఆనందంగా ఆ మణినీ, తన పుత్రికామణి జాంబవతినీ శ్రీకృష్ణుడికి సమర్పించాడు.

ద్వారకకు తిరిగి వచ్చాడు శ్రీకృష్ణుడు. జాంబవతీ దేవిని పరిగ్రహించి, సత్రాజిత్తును సభకు రప్పించి ఆ మణిని అప్పగించాడు. సత్రాజిత్తు పశ్చాత్తాపపడ్డాడు. మణితోపాటు తన పుత్రికామణి అయిన సత్యభామను కూడా అతడికే ఇచ్చాడు. 'నాకు నీ కన్యామణి చాలు' అంటూ శ్రీకృష్ణుడు సత్రాజిత్తుకే మణిని తిరిగి ఇచ్చేశాడు. ఇదిలా ఉండగా పాండవులు కుంతీదేవితోసహా లక్క ఇంట్లో కాలిపోయి మరణించారన్న వర్తమానం అందింది. వెంటనే శ్రీకృష్ణుడు బలరాముడితో హస్తినకు వెళ్ళి కృప విదుర గాంధారీ భీష్మ ద్రోణాదుల్ని పరామర్శించాడు.

ఈలోగా ఇక్కడో దారుణం జరిగిపోయింది. శతధన్వుడనేవాడు సత్రాజిత్తును చంపి శమంతకమణిని అపహరించాడు. దీనికో కారణం ఉంది. సత్రాజిత్తు తన కుమార్తె సత్యభామను శ్రీకృష్ణుడికి ఇచ్చి పెళ్ళిచేయటం కొంతమందికి కంటగింపు అయింది. వారిలో అక్రూరుడు, కృతవర్మ, శతధన్వుడూ ఉన్నారు.

అక్రూరుడు వృష్ణివంశానికే చెందిన శ్వఫల్కుడి కొడుకు, కుంతికి సోదరుడవుతాడు. శ్రీకృష్ణుడికి ఆత్మబంధువు. బంధువుగా కంటే శ్రీకృష్ణభక్తుడుగానే ఆయనకు గౌరవం. ఆయన ఎక్కడ ఉంటే అక్కడ వర్షాలు పడతాయనీ, కరువు కాటకాలు ఉండవనీ జనవిశ్వాసం.

అక్రూరుడూ కృతవర్మా శతధన్వుడిని రెచ్చగొట్టారు. అందుకే శతధన్వుడు ఇంతటి అఘాయిత్యానికి తలపడ్డాడు. ద్వారకకు తిరిగి వచ్చిన శ్రీకృష్ణుడు ఆలస్యం చెయ్యకుండా చక్రాయుధంతో శతధన్వుణ్ణి సంహరించాడు. తీరా చూస్తే అతడి దగ్గర మణి లేదు. అప్పుడు బలరాముడు - శ్రీకృష్ణా! నువ్వు ద్వారకకు వెళ్ళి ఆ మణికోసం అన్వేషించు. నేను మిథిలా నగరంలోని జనక మహారాజును చూసివస్తాను' అని వెళ్ళాడు. ఆ సమయంలోనే దుర్యోధనుడు మిథిలకు వచ్చి, బలరాముడి వద్ద గదాయుద్ధ విద్యను నేర్చుకొన్నాడు.

అక్రూరుడూ కృతవర్మ శ్రీకృష్ణుడికి భయపడి పారిపోయారు. అక్రూరుడు ద్వారకలో లేకపోవడంతో అనేక ఉపద్రవాలు కలిగాయి. వర్షాల్లేవు. ప్రజలు రోగాల బారినపడ్డారు. అందుకే వెంటనే శ్రీకృష్ణుడు అక్రూరుణ్ణి పిలిపించి-

'అక్రూరా! ఆ మణి నీ దగ్గరే ఉంది. ఉండనీ. కానీ ఒక్కసారి దాన్ని చూపించు. నువ్వు ఉన్నట్టుండి ఎడతెరిపి లేకుండా యజ్ఞాలు చేస్తున్నావు. అంత బంగారం నీకు ఎక్కణ్ణుంచి వస్తుంది?' అన్నాడు.

అక్రూరుడు వెంటనే తన దుస్తుల్లో దాచిన మణిని తీసి చూపించాడు. శ్రీకృష్ణుడు దాన్ని అందరికీ చూపించి అందరి సమక్షంలో అక్రూరుడికే ఇచ్చివేశాడు.

## ఇంద్రప్రస్థ ప్రయాణం

రాజా! ఒకసారి శ్రీకృష్ణుడు ఇంద్రప్రస్థ నగరానికి వెళ్ళి కొంతకాలం అక్కడే ఉన్నాడు.

ఒకరోజు శ్రీకృష్ణార్జునులు వేటాడారు. అలసిపోయారు. దాహం వేసింది. యమునానదిలో దాహం తీర్చుకొని అక్కడే విశ్రమించారు. అప్పుడు వాళ్ళకు ఒక సౌందర్యరాశి కనిపించింది. ఆమె సూర్యపుత్రిక. కాళింది ఆమె పేరు. ఆమె శ్రీకృష్ణుడినే భర్తగా పొందాలని తపస్సు చేస్తోందట. అందుకే ఆమెను తెచ్చి, కొన్నాళు ႇ ధర్మరాజు వద్ద ఉంచాడు శ్రీకృష్ణుడు.

తరువాత శ్రీకృష్ణార్జునులు అండగా ఉండగా అగ్నిదేవుడు ఖాండవవనాన్ని దహించాడు. అందుకు కృతజ్ఞతగా ఆయన వరుణుడి ద్వారా అర్జునుడికి అక్షయ తూణీరాలు, కవచం, గాండీవం, దివ్యరథం, తెల్ల గుర్రాలూ శ్రీకృష్ణుడికి చక్రాయుధమూ బహూకరించాడు. ఖాండవ వనంలో తాను దహించుకుపోకుండా కాపాడినందుకు శ్రీకృష్ణుడి ఆజ్ఞకు కట్టుబడి మయుడు – అర్జునుడికి (పాండవులకు) ఒక అద్భుతమైన సభను నిర్మించి బహూకరించాడు.

## అష్టమహిషీ కళ్యాణం

తరువాత శ్రీకృష్ణుడు ద్వారకకు తీసుకువచ్చి కాళిందిని పెళ్ళాడాడు. అవంతీ పాలకులైన విందానువిందులు తమ చెల్లెలు మిత్రవిందకు స్వయంవరాన్ని ప్రకటించారు. వీళ్ల తల్లి – రాజాధిదేవి శ్రీకృష్ణుడి మేనత్త. కుంతీదేవికి చెల్లెలు. శ్రీకృష్ణుడు ఆ స్వయంవరానికి వెళ్ళి తన పరాక్రమంతో ఆమెను చేపట్టాడు. కోసల దేశపు రాజు నగ్నజిత్తు. ఇతడి కుమార్తె నాగ్నజితి. ఈ రాజుదగ్గర ఏడు పొగరుబోతు ఆంబోతులు ఉన్నాయి. శ్రీకృష్ణుడు వెళ్ళి ఆ వృషభాలకు ముక్కుత్రాడు వేసి ఆమెను పరిగ్రహించాడు.

కేకయ దేశానికి రాజు శ్రుతకీర్తి. ఇతడి కుమార్తె భద్ర. శ్రీకృష్ణుడికి మరో మేనత్త కూతురు. ఆమెనూ పెళ్ళాడాడు. మద్ర రాజకుమార్తె లక్షణనూ పరిగ్రహించి అష్టమహిషీ ప్రాణనాథుడై ఒప్పారాడు శ్రీకృష్ణస్వామి. అంతేకాదు, నరకాసురుడిని సంహరించి, అతడి చెరలో ఉన్న పదహారు వేలమంది కన్యకామణుల్నీ చేపట్టాడు.

## నరకాసురవధ

రాజా! నరకుడు అనే రాక్షసుడు అదితి కుండలాలను, వరుణ దేవుడి ఛత్రాన్నీ, దేవతల మణిపర్వతాన్నీ అపహరించాడు. దేవేంద్రుడి అభ్యర్థనపై ఆ రాక్షసుణ్ణి వధించాలని శ్రీకృష్ణుడు గరుడ వాహనంపై బయలుదేరాడు. అప్పుడు సత్యభామ తానూ బయలుదేరింది.

నరకాసురుడి రాజధాని ప్రాగ్జ్యోతిషపురం. గరుడ వాహనంపై వెళ్తూ వెళ్తూనే శ్రీకృష్ణుడు తన ఆయుధాలతో దుర్గాల్నీ, పాశాల్నీ ఛేదించాడు. పాంచజన్యాన్ని పూరించి దిక్కుల్ని హోరెత్తించాడు. వాడియైన బాణాలతో అయిదు తలల మురాసురుణ్ణీ, నరకాసురుడి ఏడుగురు కొడుకుల్నీ సంహరించాడు. ఇక నరకుడే స్వయంగా రంగంలోకి దిగాడు. అతడితో యుద్ధం చేయాలని సత్యభామ సిద్ధపడింది.

ఆమెను శ్రీకృష్ణుడు ఆశ్చర్యంగా చూస్తూ 'సత్యా! ఏమిటీ తొందర? ఈ మాత్రం దనుజుల్ని మేం గెలవలేమా? యుద్ధం చేయాలని సరదాగా ఉందా? అయితే రా! ఇదుగో విల్లు' అంటూ అందించాడు.

సత్యభామ ఆ విల్లు అందుకొని, ప్రతాపంతో రాక్షస స్త్రీల మంగళసూత్రాలు తెగిపోయేలా ధనుష్టంకారం చేసింది. ఒకసారి నరకుణ్ణీ మరోసారి తన భర్త శ్రీకృష్ణుణ్ణీ చూస్తోంది. నరకుణ్ణి చూసేటప్పుడు కనుబొమ్మలు ముడిచి రోషంగా చూస్తోంది. శ్రీకృష్ణుడివైపు ప్రేమతో చూస్తోంది. కన్నుల్లో ఒకప్రక్క ఎర్రదనమూ, మరోప్రక్క చక్కదనమూ స్ఫురించేలా వీరశృంగారాల్ని నెరపుతోంది. రాక్షస సైన్యం ఒకటే హాహాకారాలు. అప్పుడు శ్రీకృష్ణుడు మెల్లగా ఆమె చేతి నుండి విల్లు అందుకున్నాడు.

నరకాసురుడు శ్రీకృష్ణుడితో తలపడ్డాడు. మరోప్రక్క అతడి సైన్యమూ ముట్టడిస్తోంది. శ్రీకృష్ణుడు వెంటనే తన శర పరంపరతో ఆ సైన్యాన్ని ఊచకోత కోశాడు. ఇక గరుత్మంతుడి ప్రతాపం చూడాలి! ముక్కుతో పొడుస్తూ, కాలి గోళ్ళతో రక్కుతూ

మత్తగజాల్ని సైతం మట్టి కరిపిస్తున్నాడు. నరకుడు శక్తి అనే ఆయుధం ప్రయోగించాడు. దానికి గరుడుడు అస్సలు చలించలేదు. ఈసారి త్రిశూలాన్ని అందుకొన్నాడు. దానికి ప్రతిగా తన చక్రాన్ని ప్రయోగించాడు శ్రీకృష్ణుడు. సుదర్శన చక్రం నరకాసురుడి శిరస్సు ఖండించింది. వాడి తల నేలపై బంతిలా పడింది.

నరకుడి తల్లి భూదేవి వచ్చి నరకుడు దొంగిలించిన వస్తువుల్ని తెచ్చి ఇచ్చింది. నరకుడి సౌధంలో ఉన్న పదహారువేలమంది స్త్రీలను విడిపించి శ్రీకృష్ణుడు వాళ్ళందరినీ ద్వారకకు పంపాడు.

తరవాత నేరుగా సత్యాసమేతుడై స్వర్గానికి వెళ్ళి భూదేవి ఇచ్చిన వస్తువులను అదితికి సమర్పించి, నందనవనంలోని పారిజాత వృక్షాన్ని పెకలించి తెచ్చి, సత్యభామాదేవి పెరటిచెట్టుగా నాటించాడు.

శ్రీకృష్ణుడికి రుక్మిణీదేవి వల్ల ప్రద్యుమ్నుడు, చారుధేష్ణువు మొదలైన పదిమంది పుత్రులు, తక్కిన పట్టమహిషులకు పదహారు వేలమందికీ కూడా ఒక్కొక్కరికి పదేసిమంది కుమారులు కలిగారు. ఆ పుత్రులకు పుత్రులు కలిగారు. ఈ విధంగా శ్రీకృష్ణుడి వంశం తామరతంపరగా విలసిల్లింది. యదు, వృష్ణి, భోజ, కుకుర, అంధక మొదలైన నూట ఒక్క పేర్లతో వర్ధిల్లింది. వారిలో ప్రద్యుమ్నుడికి రుక్మి కుమార్తె అయిన రుక్మవతి వల్ల అనిరుద్ధుడు జన్మించాడు.

## అనిరుద్ధుడి వివాహం

రుక్మి కొడుక్కి రుక్మలోచన అనే కుమార్తె ఉంది. ఈమెకూ అనిరుద్ధుడికీ వివాహం జరిగింది. పెళ్ళి అయ్యాక రుక్మి, బలరాముడు పాచికలాటకు కూర్చున్నారు.

ఆట మొదలైంది. పందాలు కడుతున్నారు. అన్ని పందాల్లో బలరాముడే ఓడుతున్నాడు. చివరికి బలరాముడు ఒక లక్ష పందెం గెలిచాడు. అయినా ఈ పందెంకూడా తనే గెలిచినట్లు వాదించాడు రుక్మి. ఈలోగా అశరీరవాణి బలరాముడే విజేత అని ప్రకటించింది. ఇక రుక్మి బలరాముడిపై వ్యక్తి దూషణకు దిగాడు. బలరాముడికి సహనం నశించింది. అసలే ముక్కోపి. ఒక పరిఘను తీసుకొని ఒకే ఒక్క దెబ్బతో రుక్మిని పైలోకాలకు పంపించేశాడు.

## బాణాసురుడు

పరీక్షిన్మహారాజా! బలిచక్రవర్తి నూర్గురు కుమారులలో బాణుడు పెద్దవాడు. గొప్ప శివభక్తుడు. శివుడు తాండవం చేస్తుంటే ఈ బాణుడు అద్భుతంగా వాద్యాలు వాయించి, మెప్పించి సాక్షాత్తు శివుణ్ణే తన నగరం శోణితపురానికి రక్షకుడిగా ఉండేలా వరం పొందాడు. అదనంగా శివుడు అతడికి వెయ్యి చేతుల్ని కూడా వరంగా ఇచ్చాడు. ఆ చేతులతో యుద్ధం చేయడానికి సరైన వీరుడే వాడికి కనబడలేదట. అందుకని శివుణ్ణే తనతో యుద్ధం చేయమన్నాడు. అంతటి తారాస్థాయికి చేరుకుంది అతడి అహంకారం.

ఈ బాణుడికి ఒక అందాల రాశియైన కుమార్తె ఉంది. ఆమె పేరు ఉష. ఆమెకు కలలో ఒక అందమైన యువకుడు కనిపించాడు. ఆమె అతడినే ఇష్టపడింది. ఈమె చెలికత్తెలలో చిత్రలేఖ అనే ఒకతె. ఆమె ఉషకు ఇష్టసఖి. ఈమె బాణుడి మంత్రి కుంభాండుడి కూతురు. చిత్రలేఖ చకచకా అందమైన యువకుల చిత్రాల్ని గీసి చూపించింది. ఉష వానిలో గుర్తుపట్టి అనిరుద్ధుణ్ణి చూపించింది. చిత్రలేఖ అనిరుద్ధుణ్ణి తన యోగశక్తితో ఉష దగ్గరకు తీసుకువచ్చింది.

ఈ విషయం బాణుడికి తెలిసింది. అనిరుద్ధుణ్ణి హతమార్చాలని భటుల్ని పంపాడు. అనిరుద్ధుడు తన మీదికి వచ్చిన భటులందరినీ చితక్కొట్టాడు. బాణుడు నాగపాశం వేసి అనిరుద్ధుణ్ణి బంధించాడు. అది చూసి ఉష తల్లడిల్లిపోయింది.

అనిరుద్ధుడి గురించి నారదుడి ద్వారా తెలుసుకున్న బలరామకృష్ణులు సైన్యంతో బయలుదేరారు. బాణుడి కోటను ముట్టడించారు. ఆ కోటకు రక్షకుడైన శివుడు యాదవులపై యుద్ధం ప్రకటించాడు.

ఆ యుద్ధంలో శ్రీకృష్ణుడిదే పైచేయి అయింది. అది చూసి బాణుడే స్వయంగా తలపడ్డాడు. శ్రీకృష్ణుడు బాణుడు ధరించిన అయిదువందల ధనువుల్నీ తుత్తునియలు చేసి బాణుడి సారథినీ, గుర్రాల్నీ సంహరించాడు. బాణుడు పారిపోయి ప్రాణాలు కాపాడుకొని, మరో రథంపై వచ్చాడు. శ్రీకృష్ణుడు తన చక్రాయుధాన్ని పంపాడు. అది బాణుడి చేతుల్ని తెగ నరికింది. అప్పుడు శంకరుడు – 'శ్రీకృష్ణా! నీ తేజస్సు ముందు ఎవరూ నిలవలేరు. ధర్మం కోసమే నువ్వు ఈ అవతారాన్ని ధరించావు. అయితే నాదో మాట! ఈ బాణుడు నా ప్రియ భక్తుడు. నేను ఇతడికి అభయమిచ్చాను.

నువ్వూ ఇతణ్ణి అనుగ్రహించు' అన్నాడు. శ్రీకృష్ణుడు అభయమిచ్చాడు.

బాణుడు శ్రీకృష్ణుడికి నమస్కరించాడు. బలరామకృష్ణులు ఉషా అనిరుద్ధుల్నీ, యాదవ వీరుల్నీ తీసుకొని ద్వారకకు తిరిగి వచ్చారు.

## నృగమహారాజు

రాజా! యాదవ వీరులైన సాంబుడు, ప్రద్యుమ్నుడు మొదలైనవాళ్ళు ఒక ఉద్యానవనంలో విహరిస్తూ ఒక బావిలో పెద్ద ఊసరవెల్లిని చూశారు. దాన్ని బయటకు తీయడం వాళ్ల వల్ల కాలేదు. శ్రీకృష్ణుడు వచ్చి అవలీలగా తన ఎడమచేత్తో దాన్ని బయటకు తీశాడు. ఆ పరమాత్ముడి కరస్పర్శతో ఆ ఊసరవెల్లి ఒక దివ్య పురుషుడిగా మారిపోయింది. అతడు శ్రీకృష్ణుడికి నమస్కరించి –

తే.గీ. **కృష్ణ! వాసుదేవ! కేశవ! పరమాత్మ!**
**యప్రమేయ! వరద! హరి! ముకుంద!**
**నిన్ను జూడఁగంటి నీ కృపఁ గనుఁగొంటి**
**నఖిలసౌఖ్యపదవు లందఁ గంటి.** (10-2-477)

శ్రీకృష్ణా! ఇన్నాళ్ళకు నిన్ను చూడగలిగాను. నీ దయను పొందాను. సమస్తమైన సౌఖ్యపదవుల్నీ పొందాను అంటూ తన వృత్తాంతం చెప్పడం ప్రారంభించాడు.

'ప్రభూ! నా పేరు నృగుడు. ఇక్ష్వాకు వంశంవాడిని. నేను లెక్కలేనన్ని దానాలు చేశాను. ఎన్నో ప్రజా సంక్షేమ కార్యక్రమాలూ చేశాను. కానీ నేను ఒక బ్రాహ్మణుడికి దానంగా ఇచ్చిన ఆవు తప్పించుకొని వచ్చి, తిరిగి నా ఆవులమందలో కలిసిపోయింది. నాకు తెలియక దానిని ఇంకో బ్రాహ్మణుడికి దానం చేశాను. వాళ్ళిద్దరూ ఆ ఆవు నాదంటే నాదని వాదులాడుకొంటూ నా దగ్గరకు వచ్చారు. మన్నించమని వేడుకొన్నాను. ప్రతిగా చెరో లక్ష గోవులు ఇస్తానన్నాను. అయినా వాళ్ళు ఒప్పుకోలేదు. ఒకసారి దానంగా ఒకరికి ఇచ్చిన గోవును (తెలిసిచేసినా, తెలియకచేసినా) మరొకరికి దానం చేయటం పాపం. ఆ పాపం కారణంగా ఇదుగో ఇలా ఊసరవెల్లిగా మారిపోయాను. ఇప్పుడు నీ స్పర్శతో మళ్ళీ మామూలువాణ్ణి అయ్యాను' అని స్వర్గానికి వెళ్ళిపోయాడు నృగుడు.

## పౌండ్రక వాసుదేవుడు

రాజా! కరూశ దేశానికి రాజు పౌండ్రక వాసుదేవుడు. ఇతడొక మూర్ఖుడు. అహంభావి. తానే వాసుదేవుణ్ణని విష్ణువులాగే శంఖచక్రాదులు ధరించి విర్రవీగిపోయేవాడు. అతడి పిచ్చి ముదిరి పాకాన పడింది. ఒక దూతను పంపి 'ఈ భూమ్మీద వాసుదేవుడనేవాడు ఒకడే ఉండాలి. నువ్వు నన్ను అనుకరిస్తున్నావు. అది చెల్లదు. తక్షణం పేరు మార్చుకో! లేదంటే యుద్ధానికి సిద్ధంగా ఉండు' అని శ్రీకృష్ణుడికి సందేశం పంపాడు.

శ్రీకృష్ణుడు యుద్ధానికి బయలుదేరాడు. పౌండ్రకుడు, అతడి మిత్రుడు కాశీరాజు ఐదు అక్షౌహిణుల సైన్యంతో శ్రీకృష్ణుణ్ణి ఎదుర్కొన్నారు. అచ్చం తనలాగే శంఖచక్రాదుల్ని ధరించి కృత్రిమంగా ఉన్న పౌండ్రక వాసుదేవుణ్ణి చూశాక నవ్వు ఆగలేదు శ్రీకృష్ణుడికి. పగటి వేషగాడిలా ఉన్నాడు అనుకొని తనమీదికి వచ్చిన సైన్యాన్ని చక్రాది ఆయుధాలు ప్రయోగించి అతలాకుతలం చేశాడు. చక్రాయుధంతో పౌండ్రక వాసుదేవుడి శిరస్సును ఖండించి, బాణంతో కాశీరాజు తలనూ త్రుంచివేశాడు.

రాజా! ఆ పౌండ్రక వాసుదేవుడికి పుణ్యలోకాలు ప్రాప్తించాయి. ఎందుకో తెలుసా? నిరంతరం వాసుదేవుడిలా వేషం వేసుకొని అతణ్ణే ధ్యానించడంవల్ల.

కాశీరాజు కొడుకు సుదక్షిణుడు. శ్రీకృష్ణుడిపై పగతో అభిచారహోమం చేశాడు. ఆ హోమకుండం నుంచి భీకరమైన 'కృత్య' అనే రాక్షసి పుట్టింది. దానిని శ్రీకృష్ణుడిపై ప్రయోగించాడు. మరణ శిక్ష వేయదగినవాడి మీద మాత్రమే దానిని ప్రయోగించాలి. తన తండ్రిని చంపాడన్న పగతో సుదక్షిణుడు దానిని శ్రీకృష్ణుడిపైకి పంపాడు. వెంటనే శ్రీకృష్ణుడు తన సుదర్శన చక్రాన్ని విసిరాడు. సుదర్శన తేజస్సు ముందు కృత్య నిలువలేక, తనను ప్రయోగించిన సుదక్షిణుణ్ణీ, ఋత్విజుల్నీ సంహరించింది.

## ద్వివిదుడు

రాజా! నరకాసురుడి స్నేహితుడైన ద్వివిదుడు అనే ఒక వానరుడు ద్వారకపై పడి విధ్వంసం సృష్టించాడు. బలరాముడు తన రోకలీ నాగలీ తీసుకొని ఆ వానరుణ్ణి సంహరించి రైవత పర్వతం పైకి విసిరేశాడు. వాడి బరువుకి ఆ పర్వతం వణకిపోయింది.

## బలరాముడి ప్రతాపం

రాజా! దుర్యోధనుడి పుత్రిక పేరు లక్షణ. శ్రీకృష్ణుడికీ జాంబవతికీ పుట్టిన కుమారుడు సాంబుడు. లక్షణకు పెళ్ళి జరుగుతుంటే ఆమెను సాంబుడు ఎత్తుకొచ్చేశాడు. కౌరవులు అధర్మయుద్ధం చేసి సాంబుణ్ణి బంధించారు. అప్పుడు బలరాముడే స్వయంగా బయలుదేరాడు. హస్తినకు సమీపంలో ఉన్న ఒక ఉద్యానవనంలో కూర్చొని కౌరవుల వద్దకు ఉద్ధవుణ్ణి పంపాడు. దుర్యోధనాదులు వచ్చారు.

సాంబుణ్ణి అప్పగించమన్నాడు బలరాముడు. దుర్యోధనుడు కుదరదని నోటికొచ్చినట్లు నిందించి వెళ్ళిపోయాడు. అతడి మాటలకు బలరాముడికి ఆగ్రహం కట్టలు తెంచుకుంది. తన నాగలి ఎత్తి, హస్తినాపురం కొసకు దాన్ని తగిలించి గంగలో కలపాలని విజృంభించాడు. గోపురాలు, సౌధాలూ ఒక ప్రక్కకి ఒరిగిపోయాయి. నగరం కొంచెం ముందుకు జరిగి, నీటిలో పడవలా తేలుతోంది. వెంటనే భీష్మద్రోణాదులందరూ పరుగు పరుగున వచ్చి అతణ్ణి స్తుతించి శాంతింపజేసి సాంబుణ్ణీ లక్షణనూ అప్పగించారు. వాళ్ళిద్దరినీ తీసుకొని బలరాముడు ద్వారకకు తిరిగి వచ్చాడు.

## శ్రీకృష్ణుడి మహిమ

రాజా! ఒకసారి నారదమహర్షి నేరుగా శ్రీకృష్ణుడి అంతఃపురంలోనికి వచ్చాడు. అక్కడ శ్రీకృష్ణుడు మంచంపై కూర్చొని కనిపించాడు. రుక్మిణీదేవి వింజామరలు వీస్తోంది. తక్కిన భార్యల మందిరాలకూ వెళ్ళాడు. అక్కడా శ్రీకృష్ణుడు దర్శనమిస్తూనే ఉన్నాడు. శ్రీకృష్ణుడి మహిమ అర్థమయ్యింది. నమస్కరించి వెళ్ళిపోయాడు.

## జరాసంధుడి వధ

పరీక్షిన్మహారాజా! తరువాత శ్రీకృష్ణుడు సపరివారంగా ఇంద్రప్రస్థం చేరుకున్నాడు. మయసభలో విడిది చేశాడు. ధర్మరాజు రాజసూయయాగం ప్రారంభించాడు. అతడి సోదరులు దిగ్విజయ యాత్రకు వెళ్ళి జరాసంధుణ్ణి తప్ప అందరినీ జయించి తిరిగి వచ్చారు.

అప్పుడు శ్రీకృష్ణుడు భీమార్జునులను తీసుకొని బ్రాహ్మణ వేషంలో జరాసంధుడి వద్దకు వెళ్ళి– 'రాజా! మాకో కోరిక ఉంది. తీరుస్తావా? నీకు మేలు జరుగుతుంది' అన్నాడు.

జరాసంధుడు అప్పుడే అనుష్ఠానాలు పూర్తిచేసుకొని వచ్చాడు. ఆ సమయంలో ఎవరు ఏది అడిగినా అతడు కాదనడు.

వీళ్ళు చూడడానికి బ్రాహ్మణుల్లా లేరు. ముఖంలో రాచకళ ఉట్టిపడుతోంది. **ఈ శరీరం ఎప్పటికైనా నశించేదే! ప్రాణం ఉన్నప్పుడే కీర్తి సంపాదించుకోవాలి.** అని నిశ్చయించుకొని సరేనన్నాడు.

అప్పుడు శ్రీకృష్ణుడు తామెవరో చెప్పి 'మాలో ఒకరితో నువ్వు ద్వంద్వయుద్ధం చేయాలి. ఎవరు కావాలో నువ్వే ఎంచుకో' అన్నాడు. జరాసంధుడు భీముడినే కోరుకున్నాడు.

యుద్ధం ప్రారంభమైంది. భీముడూ జరాసంధుడూ గదలతో కొట్టుకొన్నారు. అవి విరిగిపోయాయి. ముష్టియుద్ధం చేశారు. ఒకరినొకరు పిడిగుద్దులు గుద్దుకున్నారు. పడదోసుకున్నారు. పట్టుమీద పట్టు, దెబ్బమీద దెబ్బ. ఎవరూ తగ్గటంలేదు. ఎవరూ తీసిపోవటంలేదు. శ్రీకృష్ణుడికి జరాసంధుడి పుట్టుపూర్వోత్తరాలు తెలుసు. ఏంచేస్తే వాడు చస్తాడో కూడా తెలుసు. వాడి శరీరాన్ని రెండుగా చీల్చి చంపమని భీముడికి ఒక చెట్టు కొమ్మను రెండుగా చీల్చి సైగ చేశాడు. భీముడు అలాగే జరాసంధుడి కాలిని తన కాలితో నొక్కిపట్టి, అతడి రెండో కాలును చేత్తో పట్టుకొని, నిలువునా చీల్చి సంహరించాడు.

జరాసంధుడు బంధించిన రాజులందరినీ శ్రీకృష్ణుడు విడిపించి – 'ఓ రాజులారా! సజ్జనుల్నీ అమాయక ప్రజల్నీ హింసించడం వల్లనే వేనుడు, నహుషుడు, రావణుడు, కార్తవీర్యార్జునుడు, ఇదుగో! ఇప్పుడీ జరాసంధుడు నాశనమయ్యారు. ధర్మాన్ని పాటిస్తేనే కులం, బలం, ఆయువు, కీర్తి, ఔన్నత్యం వృద్ధి పొందుతాయి. కాబట్టి ఈ శరీరం శాశ్వతం కాదని గుర్తించండి. ధర్మమార్గంలో పరిపాలించి, మోక్షాన్ని పొందండి. అని వాళ్ళందర్నీ వాళ్లవాళ్ల రాజ్యాలకు సాగనంపాడు.

వాళ్ళు –

ఆ.వె. **వరద! పద్మనాభ! హరి! కృష్ణ! గోవింద!**
**దాసదుఃఖనాశ! వాసుదేవ!**
**యవ్యయాప్రమేయ! యనిశంబుఁ గావింతు**
**మిందిరేశ । నీకు వందనములు.** (10-2-749)

అంటూ నమస్కరించి వెళ్ళిపోయారు.

## శిశుపాల వధ

రాజసూయయాగం ప్రారంభమయింది. అందరూ వచ్చారు. ధర్మరాజే స్వయంగా అతిథి మర్యాదలు చూసుకొంటున్నాడు.

యజ్ఞానంతరం అగ్రపూజగా ధర్మరాజు శ్రీకృష్ణుడి కాళ్ళు కడిగి ఆ పవిత్ర జలాన్ని సకుటుంబంగా శిరస్సుపై జల్లుకున్నాడు. అందరూ అది చూసి ఆనందిస్తుంటే శిశుపాలుడు మాత్రం తప్పుబట్టాడు. శ్రీకృష్ణుణ్ణి తక్కువజేసి మాట్లాడటమేకాక తీవ్రంగా నిందించాడు. **మహాత్ములను నిందించే వారే కాక అలా నిందిస్తుంటే వినే వారు కూడా దోషులే.** కానీ శ్రీకృష్ణుడు వాడి మాటలు పట్టించుకోలేదు. వాణ్ణి కొంతసేపు వాగనిచ్చాడు. తరువాత సుదర్శన చక్రాన్ని పంపాడు. అది శిశు పాలుడి శిరస్సును మొండెం నుంచి వేరుచేసింది.

పరీక్షిన్మహారాజా! దుర్యోధనుడికి పాండవుల వైభవం కంటగింపుగా మారింది. మయసభను చూస్తే మరీను.

ఒక రోజు మయసభలో ధర్మరాజూ, అతడి సోదరులూ, శ్రీకృష్ణుడూ ఉన్నప్పుడు దుర్యోధనుడు అక్కడికి వచ్చాడు. మయసభలో ఉన్నవి లేనట్లూ, లేనివి ఉన్నట్లూ కనబడతాయి. దుర్యోధనుడు తడబడ్డాడు. అది చూసి పాండవులూ ద్రౌపది పకపకా నవ్వారు. దుర్యోధనుడు చిన్నబుచ్చుకున్నాడు. అప్పట్నుంచీ దుర్యోధనుడు మరింత రగిలిపోయాడు.

రాజా! శిశుపాలుడి మిత్రుడు సాల్వుడు అనేవాడు యాదవుల్ని సర్వనాశనం చేస్తానని ప్రతిజ్ఞ చేశాడు. ఈశ్వరుడి అనుగ్రహంతో ఆకాశంలో సంచరించే 'సౌభకం' అనే పురాన్ని వరంగా పొందాడు. దానిపై వచ్చి, ద్వారకను ముట్టడించాడు.

ప్రద్యుమ్నుడు సాళ్వుడి మాయలన్నింటినీ తిప్పికొడుతున్నాడు. ఇంతలో ఇంద్రప్రస్థం నుండి ద్వారకకు వస్తూ బలరామకృష్ణులు రంగప్రవేశం చేశారు. కృష్ణుడు వెంటనే తన సుదర్శన చక్రంతో వాడి శిరస్సు ఖండించాడు.

## దంతవక్త్రుడి వధ

ఈ సాళ్వుడికి మరో మిత్రుడు ఉన్నాడు. వాడే దంతవక్త్రుడు. కృష్ణుడిపై పగతో రగిలిపోతూ, యుద్ధానికివచ్చి తన గదతో శ్రీకృష్ణుడి తలపై మోదాడు. శ్రీకృష్ణుడూ తన గదతో వాడి వక్షఃస్థలాన్ని పగలగొట్టాడు. ఆ దెబ్బకు వాడు రక్తం కక్కుకుంటూ నేలకొరిగాడు.

## బలరాముడి తీర్థయాత్రలు

రాజా! కురుక్షేత్ర సంగ్రామంలో ఎవరికి మద్దతు ఇవ్వాలో తేల్చుకోలేక బలరాముడు తీర్థయాత్రలకు వెళ్ళిపోయాడు. మొదట ప్రభాస తీర్థంలో స్నానమాచరించి తరువాత నైమిశారణ్యానికి వెళ్ళాడు. అక్కడ సూత మహర్షి తనను చూసి లేవలేదని కోపించి తొందరపడి అతణ్ణి వధించాడు. దానివల్ల అతడికి బ్రహ్మహత్యా పాపం చుట్టుకొంది. మహర్షులు చెప్పినమీదట తప్పు తెలుసుకొని ప్రాయశ్చిత్తం చెప్పమన్నాడు. తన యోగశక్తితో సూతుణ్ణి బతికిస్తానంటూ– 'సూతుడే తన భార్యకు తానే పుత్రుడిగా పుట్టి ఉగ్రశ్రవసుడు అనే పేరుతో సకల పురాణాలనూ బోధిస్తాడు. అందువల్ల ఈ సూతుడు (రోమహర్షణుడు) ప్రత్యక్షంగా జీవించకపోయినా పుత్రుడి రూపంలో మీ మధ్య ఉంటాడు. మరి నాకు ప్రాయశ్చిత్తం సెలవియ్యండి' అన్నాడు.

దానికి ఋషులు 'బలరామా! ఇక్కడ పల్వలుడు అనే రాక్షసుడు అమావాస్య, పౌర్ణమి రోజుల్లో వచ్చి మా యాగాన్ని ఆటంకపరుస్తున్నాడు. వాణ్ణి సంహరించు. తరువాత పుణ్యతీర్థాల్లో స్నానం చెయ్యి. నీ పాపం పోతుంది' అన్నారు. బలరాముడు పల్వలుణ్ణి తన ముసలానికి బలి ఇచ్చి తీర్థయాత్రలకు వెళ్ళిపోయాడు.

కొంతకాలం తర్వాత మళ్ళీ ప్రభాస తీర్థానికి వచ్చాడు. అప్పటికి యుద్ధం పూర్తయింది. చివరిగా భీముడు, దుర్యోధనుడు గదాయుద్ధం చేస్తున్నారు. 'వాళ్ళిద్దరూ సమానమైన వీరులు. ఎప్పటికీ విజయం తేలదు. కాబట్టి యుద్ధం విరమించండి'. అని అక్కడికి వెళ్ళి సలహా ఇచ్చాడు. కానీ వాళ్ళు వినలేదు. వాళ్ళ కర్మ! అనుకొని తాను మళ్ళీ నైమిశారణ్యానికి వెళ్ళిపోయాడు.

## కుచేలోపాఖ్యానం

ఓ మహారాజా! కుచేలుడు శ్రీకృష్ణుడి సహాధ్యాయి. బ్రాహ్మణోత్తముడు, ఆత్మాభిమానం కలవాడు, జ్ఞాని, శాంతమూర్తి. ఒకప్రక్క కటిక దారిద్ర్యాన్ని అనుభవిస్తూ కూడా ఎవరినీ నోరు తెరిచి అడిగిన పాపాన పోలేదు. అతడి భార్య కూడా అంతే! కానీ ఆమె ఒకరోజు భర్తతో – **'స్వామీ! మీ మిత్రుడు శ్రీకృష్ణుడు కుశస్థలీపురంలో ఉన్నాడు. ఆపదలో తనను స్మరిస్తే దుర్మార్గుడినైనా సరే ఆదుకొంటాడు.** అంతటి మహనీయుడు నీలాంటి భక్తుణ్ణి ఆదరించడా!' అంది.

ఆమె మాటలు నిజమేననిపించాయి. ప్రయాణమయ్యాడు కుచేలుడు. భార్య కొన్ని అటుకుల్ని తెచ్చి, ఇతడి చినుగుల ఉత్తరీయంలో ముడివేసి పంపింది.

కుచేలుడి మనసులో ఏవేవో ఆలోచనలు. మొత్తానికి శ్రీకృష్ణుడి మణిసౌధానికి చేరుకొన్నాడు. లోపలికి వెళ్ళాడు. అక్కడ ఒకచోట ఒక వధూమణి వింజామరలు వీస్తుంటే హంసతూలికా తల్పంపై కూర్చొని శ్రీకృష్ణుడు ఆమెతో ముచ్చటిస్తున్నాడు. చూశాడు కుచేలుడు. అంతలో శ్రీకృష్ణుడి దృష్టి అలవోకగా కుచేలుడిపై పడింది. దిగ్గున లేచి, కుచేలుణ్ణి సాదరంగా ఆహ్వానించి, ఆప్యాయంగా కౌగిలించుకొన్నాడు. తన మంచంపై కూర్చోపెట్టి, కుశల ప్రశ్నలు వేస్తూ సపర్యలు మొదలుపెట్టాడు.

కుచేలుడి మనసు పులకించిపోయింది.

'బ్రాహ్మణోత్తమా! ఇంకా నీకు సంసారంపై దృష్టి ఉన్నట్లు లేదు. కొందరు మహానుభావులు ఇంతే. లోకశాంతి కోసమే తమ కర్మల్ని ఆచరిస్తారు. కర్తవ్య నిష్ఠతో జీవిస్తారు. నువ్వూ అంతే!

మనం మన గురుకులంలో ఎంత హాయిగా కాలక్షేపం చేసేవాళ్ళమో! **గురువు– అజ్ఞానం అనే చీకటిని పోగొట్టే దీపం.** గుర్తుందా! మనం గురుపత్ని ఆదేశంపై అడవికి వెళ్ళి కట్టెలు తెచ్చిన సంగతి. అప్పుడు పెద్ద వర్షం వచ్చింది. చీకటిపడింది. మనం దారితప్పి అడవిలో తెల్లవారేవరకూ ఉండిపోయాం. అప్పుడు మన గురువు సాందీపని మనల్ని వెతుక్కొంటూ వచ్చి మనకోసం కంగారుపడలేదూ!' అన్నాడు శ్రీకృష్ణుడు.

కుచేలుడు – 'శ్రీకృష్ణా! అన్నీ గుర్తున్నాయి. ముల్లోకాలకూ నువ్వే గురువ్వి. నీకు మళ్ళీ గురువుంటాడా! అంతా నీ లీల!' అన్నాడు.

శ్రీకృష్ణుడికి అతడి మాటల్లోని ఆంతర్యం అర్థమయింది. **'పుష్పం, పత్రం, ఫలం, తోయం ఏదైనా భక్తితో అర్పిస్తే అది నాకు పరమాన్నమే! ఇష్టంగా స్వీకరిస్తాను'** అన్నాడు. ఆ మాటలు కుచేలుడికి అమృతవాక్కుల్లా తోచాయి. కానీ తను తెచ్చిన అటుకుల్ని మాత్రం ఇవ్వలేకపోయాడు. మౌనం వహించాడు.

శ్రీకృష్ణుడే చనువుగా 'ఇదేమిటి కుచేలా?' అని అటుకుల ముడిని విప్పాడు. గుప్పెడు అటుకులు తీసుకున్నాడు. 'నాకు ఇవి చాలవా' అంటూ వాటినే ఆరగించాడు. మరో పిడికెడు అందుకున్నాడు. అప్పుడు రుక్మిణిదేవి– 'కుచేలుడిని అనుగ్రహించటానికి ఒక గుప్పెడు అటుకులు చాలవా స్వామీ! మరో గుప్పెడు ఎందుకు?' అని తీసుకోకుండా అడ్డుపడింది.

కుచేలుడికి ఆ రోజు గొప్ప ఆతిథ్యం లభించింది. మరునాడు ఉదయం తన నగరానికి బయలుదేరాడు. అతడి హృదయం ఆనందంతో తేలిపోతోంది.

'ఆగర్భ దరిద్రుణ్ణయిన నేనెక్కడ? లక్ష్మీనివాసుడైన శ్రీకృష్ణుడెక్కడ? ఆహా! నన్ను ఎంత ఆదరించాడు! ఎంత సత్కరించాడు! అరె! అతడి పట్టపురాణి రుక్మిణీదేవి కూడా నాకు వింజామరలు విసిరిందే! నా మిత్రుడు నా కాళ్ళు పట్టాడు. ఏమి నా భాగ్యం?' అనుకొంటూ తన నగరం చేరుకున్నాడు. చేరుకొని ఆశ్చర్యపోయాడు.

ఎక్కడ చూసినా పెద్ద పెద్ద భవనాలు, చక్కటి ఉద్యానవనాలు, ఎదురుగా ఒక సుందర భవనం. అంతలో ఆ భవనంలో నుంచి కొందరు సుందరీమణులు వచ్చారు. కుచేలుణ్ణి సాదరంగా లోపలికి తీసుకువెళ్ళారు. లోపలికి వెళ్ళగానే మానవ రూపం ధరించి లక్ష్మీదేవిలా ఉన్న ఒక స్త్రీ ఎదురువచ్చింది. ఆమెను చూసి ఆశ్చర్యపోయాడు కుచేలుడు. ఆమె ఎవరో కాదు. తన భార్యే.

'అయ్యో! నేను ధనం కోసమే శ్రీకృష్ణుడి వద్దకు వెళ్ళాను. నేను అడక్కపోయినా అది గ్రహించి, నాకు సకల సంపదలూ అనుగ్రహించాడు.' అని భక్తిప్రపత్తులతో శ్రీకృష్ణుడినే స్మరించాడు. అలా ధ్యానిస్తూనే కలకాలం జీవించాడు.

* * *

రాజా! కొన్నాళ్ళు బలరామకృష్ణులు ద్వారకలోనే సుఖంగా ఉన్నారు. ఒకసారి సూర్యగ్రహణం వచ్చింది. శమంతపంచకం అనే పవిత్ర క్షేత్రానికి చేరుకొని, పుణ్యస్నానాది విధుల్ని నిర్వహించి, దానాలు ఇచ్చి, భోజనాలు చేసి అక్కడే పొన్నచెట్ల నీడలో విశ్రమించారు. ఎందరో రాజులు ఆ క్షేత్రానికి వచ్చి శ్రీకృష్ణుణ్ణి సందర్శించారు. బలరామకృష్ణులు వాళ్ళందరినీ సత్కరించారు. అందరూ వినేలా ఆ రాజులు ఇలా అంటున్నారు–

'ఏ మహాత్ముడి పాదస్పర్శకు నోచుకున్న ప్రదేశమంతా ముక్తికి హేతువవుతుందో అటువంటి మహానుభావుడైన శ్రీకృష్ణుడు ఇప్పుడు మీ కళ్ళముందు ఇలా సాక్షాత్కరిస్తున్నాడు. కుంతీదేవి కూడా అక్కడకు వచ్చింది. తన అన్న వసుదేవుడితో కష్టం సుఖం మాట్లాడింది.

వచ్చిన రాజులందరినీ బలరామకృష్ణులు సత్కరించి పంపారు. ఈలోగా యశోదానందులు వచ్చారు. కౌగిలించుకున్నాడు. పాండవులూ వచ్చారు. ద్రౌపదీ శ్రీకృష్ణుడి భార్యలూ ఒకచోట చేరారు. కాస్సేపు కబుర్లు చెప్పుకొన్నారు.

## వసుదేవుడి యాగ నిర్వహణ

తరువాత కొంతకాలానికి వ్యాసకణ్వాది మహర్షులు వచ్చి 'శ్రీకృష్ణా! విశ్వమంతటా ఉన్నది నువ్వే. ఒకే మట్టి, ఎన్నో రూపాల్ని పొందుతుంది. వాస్తవానికి నీవు ఒక్కడివే. అయినా అనేకరూపాల్లో కనిపిస్తున్నావు. నీ దర్శనంవల్ల సకల పాపాలూ బంధాలూ తొలగిపోతాయి. మమ్మల్ని అనుగ్రహించు' అన్నారు.

అప్పుడు వసుదేవుడు ఆ మహర్షులను పుణ్యకర్మలు గురించి చెప్పమని అడిగాడు.

వసుదేవుడి అజ్ఞానానికి నవ్వుకున్నారు మహర్షులు. ఇతడింకా శ్రీకృష్ణుణ్ణి తన కొడుకే అనుకొంటున్నాడు. పెరటిచెట్టు వైద్యానికి పనికిరాదు అన్నట్లు, ఇతడు శ్రీకృష్ణుడిని గుర్తించలేదు. నిజమే, ఇది లోకసహజం. పుణ్యతీర్థాల కోసం ఎక్కడెక్కడి నుండో ప్రజలు తండోపతండాలుగా వచ్చి సేవించుకొంటూ ఉంటారు. నిత్యం అక్కడే ఉండేవాడికి దాని విలువ తెలియదు' అనుకొని–

'వసుదేవా! ప్రతి వ్యక్తికీ దేవ–ఋషి–పితృ ఋణాలు కొన్ని ఉంటాయి. యజ్ఞాలు

చేసి దేవఋణాన్నీ, అధ్యయనం ద్వారా ఋషిఋణాన్నీ, మంచి సంతానాన్ని పొందడం ద్వారా పితృఋణాన్నీ తీర్చుకోవాలి. కాబట్టి నువ్వు క్రతువు చేసి దేవఋణాన్ని తీర్చుకో!' అని సూచించారు.

వసుదేవుడు వెంటనే యజ్ఞం ప్రారంభించి వైభవంగా పూర్తిచేశాడు. కాలక్రమంగా వసుదేవుడికి శ్రీకృష్ణుడే పరమాత్మ అనే సత్యం బోధపడింది. ఇంతకాలం ఎంత అజ్ఞానంలో బతికానా! అని బాధపడ్డాడు.

దేవకీదేవి కోరికపై ఎప్పుడో చనిపోయిన ఆమె పుత్రుల్ని తీసుకువచ్చాడు శ్రీకృష్ణుడు. వాళ్ళను చూసి దేవకీదేవి సంతోషించింది. తరువాత వాళ్ళు తమ లోకాలకు వెళ్ళిపోయారు.

## సుభద్రాపరిణయం

రాజా! అర్జునుడు తీర్థయాత్రలు చేస్తూ యతివేషంలో ద్వారకకు వచ్చి అక్కడ సుభద్రను చూసి ఇష్టపడ్డాడు. సుభద్ర కూడా అతణ్ణి ఇష్టపడింది.

ఒకరోజు అక్కడ 'దేవయాత్ర' అనే ఉత్సవం జరుగుతోంది. సుభద్ర తన ఆంతరంగికులతో రథంపై బయటకు వచ్చింది. శ్రీకృష్ణుడి అనుమతితో అర్జునుడు ఆమెను తీసుకువెళ్ళిపోయాడు. ఈ వార్త విన్న బలరాముడు మొదట కోపగించినా అందరూ నచ్చచెప్పటంతో మెత్తపడ్డాడు. సాటిలేని మేటి కానుకల్ని అరణంగా ఇచ్చి తన చెల్లిని అర్జునుడితో పంపాడు.

## మిథిలానగర సందర్శనం

శ్రీకృష్ణుడు ఒకసారి మిథిలానగరానికి ఋషులతో కలిసి వెళ్ళాడు. బహుళాశ్వుడు అనే జనక వంశానికి చెందిన మహారాజు, శ్రుతదేవుడు అనే ఒక మహాపండితుడు అక్కడే ఉన్నారు.

శ్రీకృష్ణుడికి బహుళాశ్వుడూ ఒకటే శ్రుతదేవుడూ ఒకటే! ఇద్దరినీ ఒకేలా ఆదరించాడు. వాళ్ళ ఆహ్వానంమేరకూ తన మహిమవల్ల ఒకేసారి ఇద్దరి ఇళ్ళకూ ఋషుల్ని తీసుకొని వెళ్లాడు.

తే.గీ. **కృష్ణ! పరమాత్మ! యదుకులక్షీరవార్ధి**

**పూర్ణచంద్రమ! దేవకీపుత్ర! సుజన**
**వినుత! నారాయణాచ్యుత! వేదవేద్య!**
**భక్తజనపోషపరితోష! పరమపురుష!** (10-2-1187)

అని బహుళాశ్వుడు స్తుతించాడు.

శ్రుతదేవుడూ అత్యంత భక్తి శ్రద్ధలతో శ్రీకృష్ణుణ్ణి అర్చించాడు.

**'నా భక్తుల్ని పూజిస్తే నన్ను పూజించినట్లే! నా భక్తుల్ని నిర్లక్ష్యం చేసి నాకు ఎన్ని ఉపచారాలు చేసినా అవి నాకు పట్టవు'** అన్నాడు శ్రీకృష్ణుడు.

## శ్రుతిగీతలు - విష్ణుసేవ

'రాజా! భగవంతుడు సమస్త ప్రాణులకూ జ్ఞానప్రదాత. అందుకే వేదాలు అతణ్ణి కీర్తిస్తాయి. అలాంటి శ్రుతిస్తోత్రం ఒకటి ఉంది. అది ఉపనిషత్తులతో సమానమైనది' అంటూ శ్రుతిగీతను ఉపదేశించాడు. ఆ తరువాత విష్ణు సేవా ప్రాశస్త్యాన్ని చెప్తున్నాడు.

రాజా! ఒకప్పుడు శ్రీకృష్ణుడే ఇలా చెప్పాడు– **'నాకు ఏ ఉత్తముడిపై అనుగ్రహం కలుగుతుందో అతడి సమస్త సంపదలూ నేను హరిస్తాను. ధనం లేక అతడు ఏడుస్తాడు. బంధువులంతా వదలివేస్తారు. ఇలా నానాకష్టాలూ పడి చివరికి నా భక్తులతో స్నేహం చేస్తాడు. క్రమంగా విజ్ఞానాన్ని పొంది మోక్షాన్ని పొందుతాడు'** అని.

'రాజా! ఇదీ ముక్తిని పొందే పద్ధతి. అలాకాక కొందరు ఐశ్వర్యం కోసం దేవతలను ఆరాధిస్తారు. అక్కడివరకూ బాగానే ఉంది. ఐశ్వర్యం వచ్చాక దాన్ని ప్రసాదించిన దేవతల్ని కూడా మరిచిపోతారు. కృతఘ్నుల్లా ప్రవర్తిస్తారు.'

## వృకాసురుడు (భస్మాసురుడు)

పూర్వం వృకాసురుడు అనే రాక్షసుడు ఉండేవాడు. కేదారతీర్థంలో ఘోర తపస్సు చేసి శివుణ్ణి మెప్పించి 'స్వామీ! నా హస్తాన్ని ఎవరి శిరస్సుపై ఉంచుతానో వాడి శిరస్సు భస్మమైపోవాలి' అనే వరాన్ని పొందాడు. వరమిచ్చిన శివుడి తలపైనే ప్రయోగించాలని చూశాడు. శివుడు పరుగుతీశాడు. వీడు వెంటపడ్డాడు.

అప్పుడు వైకుంఠవాసుడు ఒక వటువు వేషంలో వచ్చి అడ్డుపడ్డాడు. స్నానం చేసి వస్తేగాని శివుణ్ణి తాకకూడదని చెప్పాడు. వృకాసురుడు స్నానం చేస్తూ తన నెత్తిమీద తానే చేయిపెట్టుకొని భస్మమైపోయాడు.

## భృగువు పరీక్ష

పరీక్షిన్మహారాజా! సత్రయాగం చేస్తున్నప్పుడు బ్రహ్మర్షులకు 'త్రిమూర్తులలో ఎవరు గొప్ప?' అన్న సందేహం కలిగింది. దాన్ని తీర్చే బాధ్యత భృగుమహర్షి తీసుకున్నాడు. నేరుగా బ్రహ్మసభకు వెళ్ళాడు. బ్రహ్మకు నమస్కరించాడు. స్తుతించకుండా నిలబడ్డాడు. బ్రహ్మకు కోపం వచ్చింది కానీ కొడుకు కదా అని ఏమీ అనలేదు, నిగ్రహించుకున్నాడు.

ఈసారి శివుడి దగ్గరకు వెళ్ళాడు. శివుడు భృగువును ఆదరించి, కౌగిలించుకోబోయాడు. అయితే భృగువు అతణ్ణి నిందించడం మొదలుపెట్టాడు. దానికి శివుడికి కోపం వచ్చింది. త్రిశూలం అందుకొని అతణ్ణి చంపబోయాడు. పార్వతీదేవివల్ల శాంతించాడు.

తరువాత భృగువు వైకుంఠానికి వెళ్ళాడు. అక్కడ లక్ష్మీదేవి ఒడిలో తలపెట్టుకొని పడుకున్న విష్ణువును గుండెలపై తన్నాడు. అయినా విష్ణువు భృగుమహర్షికి నమస్కరించాడు. అతడి రాకను గుర్తించనందుకు మన్నించుమని వేడుకొన్నాడు. 'నీ పాద స్పర్శవల్ల నా వక్షఃస్థలం పరిశుద్ధమయింది' అన్నాడు.

**'ఎంత పెద్ద తప్పుచేసినవారినైనా ఏ వికారమూ లేకుండా (ఎంతమాత్రం కలతపడకుండా) క్షమించడమే గొప్పతనం'** అని భృగువు ద్వారా తెలుసుకున్నారు బ్రహ్మర్షులు.

## బ్రాహ్మణ పుత్రులు

మహారాజా! ద్వారకానగరంలో ఒక సంఘటన జరిగింది. ఒక బ్రాహ్మణుడికి ఒక పుత్రుడు కలిగాడు. వాడు పురిట్లోనే కన్నుమూశాడు. బ్రాహ్మణుడు ఆ బాలుడి మృతకళేబరాన్ని రాజద్వారం వద్ద ఉంచి, రోదిస్తూ 'ఈ పాపం రాజుదే! సత్ప్రవర్తన లేని రాజువల్లే ఇలాంటి అనర్థాలు జరుగుతాయి' అన్నాడు. ఇది ఇక్కడితో ఆగలేదు. ఆ తరువాత కూడా అతడికి కొడుకులు పుడుతున్నారు. పురిట్లోనే కన్నుమూస్తున్నారు.

ప్రతిసారీ రాజద్వారం వద్ద మృతశిశువును ఉంచి రాజును నిందించేవాడు. తొమ్మిదోసారి అర్జునుడు అతడి మాటలు విని, తాను రక్షిస్తానని మాట ఇచ్చాడు. అప్పుడు పురిటింటి చుట్టూ బాణాలతో దుర్భేద్యమైన పంజరాన్ని నిర్మించాడు. అయినా ఆ బ్రాహ్మణుడికి కుమారుడు జన్మించి అందరూ చూస్తుండగానే ఆకాశంలోనికి వెళ్ళి మాయమైపోయాడు.

బ్రాహ్మణుడు గుండెలు బాదుకొంటూ వచ్చి, శ్రీకృష్ణుడితో 'ప్రభూ! ఈ అర్జునుడు చేతకానివాడని తెలియక ఇతడి మాటలు నమ్మాను. ఇతడొక వ్యర్థుడు. ఇతడి చేతిలో ఆ గాండీవమెందుకు?' అంటూ విరుచుకుపడ్డాడు.

అర్జునుడు యోగవిద్య ద్వారా యమపురికి వెళ్ళిచూశాడు. ఈ బాలుడు అక్కడ లేడు. ఇతర దిక్పాలకుల నగరాలకీ వెళ్ళాడు. అక్కడా లేడు. మాట నిలబెట్టుకోలేక పోయానన్న బాధతో అగ్నిప్రవేశానికి సిద్ధపడ్డాడు. అప్పుడు శ్రీకృష్ణుడు అతణ్ణి వారించి, రథంపై ఎక్కించుకొని, తీసుకువెళ్ళాడు. సప్తద్వీపాలు, సప్తసాగరాలు, లోకాలోక పర్వతం, చక్రవాళ పర్వతాన్ని కూడా దాటి ఒక సముద్రంలోనికి తీసుకువెళ్ళాడు. ఆ సముద్రంలో ఒక దివ్య భవనం. దానిలో వెయ్యి పడగల అనంతుడు. అతడిపై ఒక దివ్యతేజస్సు ప్రకాశిస్తోంది. ఆ జ్యోతిస్వరూపుడే శ్రీమన్నారాయణుడు. శ్రీకృష్ణార్జునులిద్దరూ ఆ దేవదేవుడికి నమస్కరించారు. వాళ్ళను చూసి వైకుంఠవాసుడు– 'గంభీరంగా మిమ్మల్ని చూడాలని మునీశ్వరులు కోరారు. అందుకే ఇలా రప్పించాను. మీరిద్దరూ నా అంశతో పుట్టినవాళ్ళే. ధర్మసంస్థాపన కోసం అవతరించిన నరనారాయణులు అనే ఋషులు మీరు' అన్నాడు.

శ్రీకృష్ణార్జునులు నమస్కరించారు. అప్పుడు శ్రీమన్నారాయణుడు ఆ బ్రాహ్మణ పుత్రులందరినీ తెచ్చి అప్పగించాడు. శ్రీకృష్ణుడు ఆ బ్రాహ్మణ బాలురను తీసుకొనివచ్చి వాళ్ళ వయస్సుకు తగిన రూపాలతో బ్రాహ్మణుడికి అప్పగించాడు.

# స్కంధం – 11

## మహర్షుల శాపం

**కొ**న్నాళ్ళ తర్వాత విశ్వామిత్రుడు, వసిష్ఠుడు, నారదుడు మొదలైన మహర్షులు ద్వారకకు వచ్చి శ్రీకృష్ణుడిని దర్శించుకొని అక్కణ్ణుంచి 'పిండారకం' అనే పుణ్యతీర్థానికి

వెళ్తున్నారు. అదేసమయంలో యాదవులు కొందరు, సాంబుడికి స్త్రీ వేషం వేసి –

'మహర్షులూ! ఇదుగో! ఈ అమ్మాయి కడుపుతో ఉంది. లోపల ఉన్నది ఆడుపిల్లా, మగపిల్లవాడా!' అని అడిగారు వెటకారంగా. మహర్షులకు కోపం వచ్చింది. 'ఈ బాలికకు యదువంశాన్ని నాశనం చేసే రోకలి పుడుతుంది' అని శపించారు.

యాదవుల మత్తు వదిలిపోయింది. వణికిపోయారు. సాంబుడికి కట్టిన చీరను విప్పుతూ ఉంటే ఒక రోకలి ఊడిపడింది. వెళ్ళి శ్రీకృష్ణుడికి జరిగిందంతా చెప్పారు.

ఆ శాపానికి తిరుగులేదు. 'సముద్రం ఒడ్డున బండమీద ఈ రోకలిని అరగదీసి సముద్రంలో కలపండి' అన్నాడు శ్రీకృష్ణుడు.

వాళ్ళు అలాగే చేశారు. రోకలి చివర ఉండే ఇనుప ముక్కను మాత్రం అరగదీయలేక అలాగే సముద్రంలోనికి విసిరేశారు. దాన్ని ఒక చేప మింగింది. ఆ చేప ఒక బోయవాడి వలలో చిక్కింది. దాని కడుపులో ఉన్న ఈ ఇనుపముక్కను తన బాణం చివర ములికిగా తగిలించుకొన్నాడు ఆ బోయవాడు.

## విదేహ మహారాజు

రాజా! నారదుడు ద్వారకకు వచ్చి శ్రీకృష్ణుడి కోరికపై మోక్షధర్మాల్ని చెప్పటం ప్రారంభించాడు.

'శ్రీకృష్ణా! ఋషభుడి పుత్రులు ఒకసారి 'విదేహుడు' అనే రాజు చేస్తున్న యజ్ఞవాటికకు వచ్చారు. యజ్ఞం ముగింపుకు వచ్చింది. విదేహుడు వాళ్ళను సత్కరించి 'మహాత్మా! తమరు శ్రీహరి భక్తులు. బ్రహ్మజ్ఞానులు. ఈ లోకంలో అల్పబుద్ధులూ, నీరసులూ తరించే మార్గం ఏదైనా ఉంటే సెలవియ్యండి' అని వినయంగా అడిగాడు. అప్పుడు వారిలో కవి అనే మహానుభావుడు–

**'రాజా! కామ క్రోధ లోభ మోహ మద మాత్సర్యాలలో చిక్కుకున్న మానవుడికి మాధవుణ్ణి సేవించాలన్న ఆలోచన ఎలా కలుగుతుంది? చేసే ప్రతి కర్మనూ 'కృష్ణార్పణం' అని చేయడమే అసలైన జ్ఞానం. ఇది మహర్షులమాట. దీనికోసం గురువునే దేవుడిగా భావించి అర్చించాలి. కానీ మానవుడు కోరికలు అనే కలలలో తేలిపోతుంటాడు. దానివల్ల ఏ ప్రయత్నమూ నిలబడదు. లోకానికి అంటీ అంటనట్టు**

**ఉంటూ స్వామిని కీర్తించాలి. ఈ సృష్టి అంతా విష్ణుమయం అని తెలుసుకోవాలి. భేదబుద్ధి ఏ మాత్రమూ పనికిరాదు'** అన్నాడు.

'హరి' అనే మహాముని భాగవతధర్మం గురించి ఇలా చెప్తున్నాడు–

**'శ్రీమన్నారాయణుడు నిత్యమూ మన ఆత్మలోనే ఉన్నాడని నమ్మేవాడే భాగవతుడు. వేటిలోనూ మునిగిపోకుండా కేవలం భక్తిమార్గాన్ని ఆశ్రయించి, శ్రీహరిని ధ్యానించేవాడే పరమ భాగవతోత్తముడు. ధ్యాని అతడే'** అన్నాడు.

తర్వాత అంతరిక్షుడు అనే మరో ముని **'రాజా! పరమపదం, పరమేశ్వరుడు, శ్రీకృష్ణుడు ఇలా ఎవరు ఏ పేరుతో పిలిచినా అతడే శ్రీమన్నారాయణుడు. విశ్వమంతా నిండి ఉన్న వెలుగు' అన్నాడు.** అప్పుడు ప్రబుద్ధుడు అనే ముని అందుకొని–

'రాజా! ఆయువు తరిగిపోతూ ఉంటుంది. అయినా మమకారం చావదు. వివేకం కలుగదు. చీకటిలో గుడ్లగూబలలాగా మానవులు– పుట్టుక, ముసలితనం, రోగాలు, ఆపదలు, మృత్యువూ కల శరీరాన్నే ప్రేమిస్తారు. ఇంద్రియ విషయాలపై ఆసక్తి పెంచుకుంటారు. తామెవరో తెలుసుకోలేరు. అటువంటి మూఢమానవుల్ని దగ్గరకు రానివ్వకూడదు. తానూ వారి దగ్గరకు వెళ్ళకూడదు. సద్గురువును ఆశ్రయించి ఉత్తమమైన భాగవత ధర్మాన్ని అనుష్ఠించాలి. 1. సత్త్వగుణం కలిగి ఉండటం, 2. భూతదయ, 3. హరికథ అనే అమృతాన్ని ఆస్వాదించడం, 4. ఇంద్రియ నిగ్రహం, 5. సాధుసంగమం, 6. సజ్జన సాంగత్యం, 7. బ్రహ్మచర్య వ్రతం, 8. వినయసంపద, 9. శుచిగా ఉండటం, 10. తపస్సు, 11. క్షమ, 12. మౌనవ్రతం, 13. వేదశాస్త్రాలను అధ్యయనం చేయడం, 14. అహింస, 15. సుఖదుఃఖాలపట్ల సహనం, 16. ఈశ్వరుడు అంతటా ఉన్నాడని విశ్వసించడం, 17. మోక్షం పొందాలనే కోరిక, 18. దుష్టులకు దూరంగా ఉండటం, 19. నారవస్త్రాలు ధరించడం, 20. లభించిన దానితోనే సంతృప్తిని పొందటం, 21. వేదాంత శ్రవణ కుతూహలం, 22. ఇతర దేవతలను నిందించకుండా ఉండటం, 23. త్రికరణశుద్ధి, 24. సత్యవ్రతం, 25. శమదమాది గుణాలు కలిగి ఉండటం, 26. ఐశ్వర్యాన్ని పరమేశ్వరార్పణంగా భావించడం, 27. భక్తులు కానివారిని ఆశ్రయించకుండా ఉండటం' ఇవే భాగవతుల ధర్మాలు.

దానికి ద్రమిళుడు అనే మహర్షి తన మాటలను జోడించి 'రాజా! ఆకాశంలోని చుక్కల్ని లెక్కపెట్టవచ్చు. కానీ బ్రహ్మాదులు సైతం నారాయణ లీలల్ని వర్ణించలేరు' అన్నాడు. వెంటనే 'చమసుడు' అనే మహర్షి 'రాజా! జీవహింస చేసేవారికి పాపం తప్పదు. స్త్రీలోలురకూ నరకబాధలు చుట్టుకొంటాయి. హరిని మరచినవాడు దుర్గతుల పాలవుతాడు. హరినామస్మరణ చేస్తే ఎంతటి జడుడైనా ముక్తిని పొందుతాడు' అన్నాడు.

ఆ తరువాత 'కరభాజనుడు' ఇలా అంటున్నాడు. 'ఆ స్వామికి ఎన్నో రూపాలు. ఎన్నో నామాలు. దుష్ట శిక్షణ, శిష్ట రక్షణ కోసమే ఆ స్వామి అవతరిస్తాడు. హరి రామ నారాయణ నృసింహ కంసారి నలినోదర' అంటూ మునీంద్రులు నుతిస్తారు.'

ఈ విధంగా ఋషభ కుమారులు ఆ విదేహరాజుకు భగవత్ స్వరూపాన్ని వివరించి అంతర్ధానమయ్యారు. తరువాత విదేహరాజు జ్ఞానయోగం ద్వారా ముక్తిని పొందాడు' అన్నాడు నారదమహర్షి.

## వైకుంఠానికి ఆహ్వానం

'ఓ పరంధామా! వైకుంఠవాసా! నువ్వు భూమిపై అవతరించిన సంకల్పం నెరవేరింది స్వామీ! తిరిగి నీ నిజస్థానానికి వేంచేయవయ్యా!' అని బ్రహ్మాది దేవతలు శ్రీహరిని ప్రార్థించారు. శ్రీకృష్ణుడు అవతరించి అప్పటికి 125 సంవత్సరాలు అయింది.

శ్రీకృష్ణుడు యాదవులందరినీ పిలిచి 'మీరు ఇంక ఇక్కడ ఉండటం మంచిది కాదు. వెంటనే ప్రభాస తీర్థానికి వెళ్ళండి' అని ఆజ్ఞాపించాడు. యాదవులు ద్వారకను విడిచిపెట్టారు.

## శ్రీకృష్ణుడి ఉపదేశం

శ్రీకృష్ణుడు 'ఉద్ధవా! నేటికి సరిగ్గా ఏడోరోజున ద్వారకా నగరం సముద్రంలో మునిగిపోతుంది. యదువంశం నశించిపోతుంది. తరువాత కలియుగం ప్రారంభమవుతుంది. నువ్వు పుణ్యతీర్థాల్ని సేవించు. ఇంద్రియాల్ని అదుపులో ఉంచుకో! ఈ విశ్వమే నన్నుగా భావించి ప్రవర్తించు' అన్నాడు.

ఉద్ధవుడు శ్రీకృష్ణుడికి నమస్కరించి 'మహాత్మా! సన్యాసాశ్రమం స్వీకరించి నిన్ను పొందాలనుకోవడం పామరులకు సాధ్యం కాని పని. పోనీ సంసారంలో

ఉంటూ ముక్తిని పొందాలంటే మాయను దాటడం కష్టం. నీ భక్తులు మాత్రమే ఆ మాయను దాటగలరు. కాబట్టి నేను నీ చరణాలనే ఆశ్రయిస్తాను. నన్ను అనుగ్రహించు' అని వేడుకొన్నాడు.

అప్పుడు శ్రీకృష్ణుడు 'ఉద్ధవా! మానవజన్మ శ్రేష్ఠమైనది. మానవుల్లో యోగీంద్రులు శ్రేష్ఠులు. వారిలో పరమ యోగీంద్రులు ఇంకా శ్రేష్ఠులు. ఎందుకంటే నన్ను తెలుసుకొంటారు. అందుకే వాళ్ళు పరమజ్ఞానులు. ప్రకృతిలోని ప్రతివస్తువు నుండి సద్గుణాలను గ్రహిస్తారు. శరీర పోషణ కోసం మాత్రమే ఆహారం స్వీకరిస్తూ ఇంద్రియాల్ని జయించి నాలో ఐక్యమౌతారు. ధనంపై ఆశగల మానవులు శరీరాన్ని కష్టపెట్టుకుంటారు. యోగీశ్వరులు విద్యగానీ అవిద్యగానీ నా మాయగానే భావిస్తారు. పశుమార్గంలో ఎన్నటికీ ప్రవర్తించరు. వాళ్ళు మాత్రమే ముక్తిని పొందుతారు.

**ఉద్ధవా! భక్తిభావంతో, దయార్ద్రహృదయంతో, మితభాషియై, సత్యవ్రతుడై, ఏ పనిచేసినా 'కృష్ణార్పణం' అనుకొంటూ మెలిగేవాడూ; నా కథల్ని వింటూ, నన్నే ధ్యానిస్తూ, స్తుతిస్తూ కాలంగడిపే నా భక్తులకు ఆతిథ్యం ఇస్తూ సేవించేవాడూ పరమభాగవతుడు. అటువంటి పుణ్యాత్ముడు బతికున్నంతకాలమూ నన్నే తలుస్తూ, మరణించాక నా స్థానాన్ని చేరుకొంటాడు. 'సర్వధర్మాన్ పరిత్యజ్య మామేకం శరణం వ్రజ'. అన్ని ధర్మాల్ని విడిచిపెట్టి నన్ను మాత్రమే శరణు వేడుకో!**

**మానవుడు జీవితం తొలిదశల్లోనే నన్ను తెలుసుకొంటే చరితార్థుడవుతాడు. వైకుంఠాన్ని పొందుతాడు. నేనూ అతణ్ణి విడిచిపెట్టకుండా అతడి వెనుక వెళ్తుంటాను.**

ధ్యానం చాలా కష్టం. ఒక దేవతా ప్రతిమను ఏర్పరచుకొని, శుచిగా నన్ను అర్చించవచ్చు. లేదా మానసిక పూజా పద్ధతుల ద్వారా కూడా నన్ను పూజించవచ్చు' అన్నాడు.

ఉద్ధవుడు బదరికాశ్రమానికి దారితీశాడు.

మహారాజా! తర్వాత యాదవులు తమలో తాము కొట్టుకొంటూ ఒకరినొకరు పొడుచుకొని చచ్చారు. ఇదంతా చూసి చిరునవ్వు చిందిస్తూ శ్రీకృష్ణుడూ బలరాముడూ బయలుదేరి కొంతదూరం వెళ్ళారు. బలరాముడు యోగమార్గంలో అనంతుడిలో కలిసిపోయాడు.

శ్రీకృష్ణుడు మరో మార్గంలో వెళ్ళి ఒక పొదచాటున విశ్రమించాడు. ఒక కాలుమీద ఇంకో కాలు పెట్టుకొని ఆడిస్తూ ఉన్నాడు.

పొదల మాటున కదులుతున్న పరమాత్ముడి పాదం ఒక జింక చెవిలా కనిపించింది ఒక బోయవాడికి. వెంటనే బాణం వేశాడు. అది నేరుగా వచ్చి శ్రీకృష్ణుడి పాదంలో గుచ్చుకుంది. తీరా దగ్గరకి వచ్చి చూస్తే అక్కడ ఉన్నది జింక కాదు, శ్రీకృష్ణుడు. భయంతో వణికిపోయాడు బోయవాడు. కాళ్ళపై పడ్డాడు. దానికి శ్రీకృష్ణుడు-

'ఇది నా కర్మఫలం. ఎంతటివాళ్ళైనా అనుభవించి తీరవలసిందే! నువ్వు నిమిత్తమాత్రుడివి' అన్నాడు. అయినా ఆ బోయవాడు అపరాధ భావంతో తిండి తినటం మానివేసి ప్రాణాలు వదిలిపెట్టాడు. వైకుంఠానికి చేరుకొన్నాడు.

అర్జునుడు శ్రీకృష్ణుడి ఆదేశంమేరకు ద్వారకలోని ప్రజలను హస్తినకు చేర్చాడు. ద్వారక పూర్తిగా నీటిలో మునిగిపోయింది.

తరువాత శ్రీకృష్ణుడు అవతారాన్ని చాలించి వైకుంఠానికి వెళ్ళిపోయాడు.

# స్కంధం-12

'రాజశేఖరా! అశ్వాలు, గజాలు మొదలైనవి నిజమైన సంపదలు కావు. అనునిత్యం శ్రీహరిని ప్రశాంత చిత్తంతో స్మరిస్తే చాలు. అలా స్మరించిన వాళ్ళు అతడిని చేరుకుంటారు' అంటూ భవిష్యద్రాజుల గురించి విపులంగా చెప్పాడు శుకమహర్షి.

'కలియుగంలో శ్రీమన్నారాయణుడు, దుష్టశిక్షణ కోసం, శిష్టరక్షణ కోసం 'విష్ణుయశుడు' అనే బ్రాహ్మణుడికి కుమారుడై శంబల గ్రామంలో జన్మిస్తాడు. అదే కల్కి అవతారం. దేవదత్తం అనే పేరుగల అశ్వాన్ని అధిరోహించి, దుష్టులను తన ఖడ్గంతో సంహరిస్తాడు.

రాజా! ఈ కాల ప్రవాహంలో రాజులూ రాజ్యాలూ వైభవాలూ అన్నీ కొట్టుకుపోతాయి. ఒక్క కీర్తిమాత్రమే శాశ్వతంగా నిలిచి ఉంటుంది. **కలియుగాంతంలో వాసుదేవుడి కరుణ ప్రసరిస్తుంది. ప్రజలందరూ హరిభక్తులై ముక్తిని పొందుతారు.**

ధర్మం, సత్యం, కీర్తి, దయ, విష్ణుభక్తి, సత్కర్మ, అహింసావ్రతం కలవాళ్ళే

పుణ్యాత్ములు. గర్వంతో మన్నూ మిన్నూ కానకుండా చెలరేగిపోయే రాజుల్ని చూసి భూదేవి నవ్వుకుంటుంది. భూమిని 'నాది' అనుకున్నవాళ్ళు నాశనమైపోయారు.

ఇది కలియుగం. ఇక్కడ జనులు ఎన్నో దుర్గుణాలకు నెలవై ఉంటారు. కాబట్టి ఈ కలియుగంలో ఒక్క **క్షణమైనా శ్రీనృసింహా! వాసుదేవా! సంకర్షణా! అంటూ భక్తితో శ్రీహరిని స్మరించాలి. అలా చేస్తే వంద యజ్ఞాలు చేసిన ఫలం వస్తుంది.**

రాజా! నువ్వు మరణిస్తావన్న భయం విడిచిపెట్టు. పుట్టిన ప్రతి వ్యక్తికీ మరణం ఒక శాశ్వత ధర్మం. కాబట్టి శ్రీమన్నారాయణుడిని ధ్యానించు. నీకు తప్పక వైకుంఠం లభిస్తుంది' అని బోధించి శుకమహర్షి వెళ్ళిపోయాడు.

## సర్పయాగం

'మహర్షులారా! శృంగి ప్రోత్సాహంవల్ల తక్షకుడు ఒక బ్రాహ్మణుడి రూపంలో వస్తున్నాడు. అతడికి దారిలో కాశ్యపుడు అనే ఒక బ్రాహ్మణుడు కలిశాడు. కాశ్యపుడు ఎలాంటి విషాన్నయినా హరించగల సమర్థుడు. పరీక్షిత్తును రక్షించడానికే అతడు వస్తున్నాడు. అది తెలుసుకున్న తక్షకుడు అతడికి ధనాన్ని ఇచ్చి వెనక్కి పంపివేశాడు.

తక్షకుడు నేరుగా పరీక్షిత్తు అంతఃపురానికి చేరుకొన్నాడు. ఒక ఫలాన్ని పరీక్షిత్తు సేవకులకు ఇచ్చి 'దీనిని మీ రాజుగారికి ఇవ్వండి' అని పంపాడు. వాళ్ళు దానిని తీసుకొని వెళ్ళారు. ఈలోగా తానే ఒక పురుగుగా మారి, ఆ పండులో దూరి, లోపలికి ప్రవేశించాడు. రాజు ఆ ఫలాన్ని తినబోయాడు. అందులో సూక్ష్మరూపంతో దాగిన తక్షకుడు వెలుపలికి వచ్చి, క్రమంగా పెరిగి మహాసర్పమై పరీక్షిత్తును కాటువేశాడు. పరీక్షిత్తు మరణించాడు.

పరీక్షిత్తు కుమారుడు జనమేజయుడు. అతడు తండ్రి మరణానికి కారణమైన తక్షకుడు, సర్పసముదాయం నశించటానికి ఒక సర్పయాగాన్ని ప్రారంభించాడు. వేలకొద్దీ సర్పాలు వచ్చి, ఆ యాగాగ్నిలో పడి భస్మమైపోతున్నాయి. తక్షకుడు ఇంకా రాలేదు. ఇంతలో ఆంగిరసుడు వచ్చి సర్పయాగాన్ని నిలువరించాడు. జనమేజయుడు తరువాత నగరానికి వెళ్ళి, శ్రీహరి పాదాలపైనే దృష్టి నిలిపి కాలం గడిపాడు.

## వేదపురాణాల వ్యాప్తి

మహర్షులారా! పైలుడు, సుమంతుడు, జైమిని, వైశంపాయనుడు అనే నలుగురు వేదవ్యాస మహర్షి శిష్యులు. వీళ్ళు నాలుగు వేదాలనూ లోకంలో ప్రచారం చేశారు.

ఇక త్రయ్యారుణి, కశ్యపుడు, సావర్ణి, అకృతవ్రణుడు, వైశంపాయనుడు, హారీతుడు అనే ఆరుగురూ పురాణ ప్రవక్తలుగా ప్రసిద్ధులయ్యారు. వీళ్ళు వ్యాసులవారి శిష్యుడూ, మా తండ్రిగారూ అయిన రోమహర్షణుడి వద్దనే విద్య నేర్చుకొన్నారు.

## మార్కండేయుడి కథ

'మహర్షులారా! అది కృతయుగం. మృకండు మహర్షి తపస్సుకు మెచ్చిన శివకేశవులు అతడికి ఒక మంచి పుత్రుణ్ణి అనుగ్రహించారు. అతడే మార్కండేయుడు.

ఈ బాలుడు నిత్యమూ తపస్సులో ఉండేవాడు. మృత్యువు అతణ్ణి కబళించబోయింది. మార్కండేయుడు మృత్యువును గడ్డిపోచలా తిరస్కరించి, మళ్ళీ తపస్సులో మునిగిపోయాడు. అతడి తపస్సును భంగం చేయడానికి ఇంద్రుడు అప్సరసలను పంపాడు. అయినా ఫలితం లేకపోయింది. సాక్షాత్తు విష్ణువే ప్రత్యక్షమయ్యాడు. అప్పుడా మార్కండేయుడు 'దేవదేవా! నిత్యం నీ నామస్మరణగావిస్తూ ఈ శరీరంతోనే అనేక యుగాలు జీవించే భాగ్యాన్ని నాకు ప్రసాదించు' అని వేడుకొన్నాడు. 'తథాస్తు' అని విష్ణుదేవుడు వైకుంఠానికి వెళ్ళిపోయాడు.

అప్పటివరకూ హరిహరులిద్దరినీ పూజించే మార్కండేయుడు తరువాత శివనామస్మరణ చేస్తూ హరినామస్మరణం మర్చిపోయాడు. నూరు సంవత్సరాలు గడిచాయి. ప్రళయం వచ్చింది. నీటి మధ్య ఒక వటపత్రంపై ఒక అందమైన బాలుడు కనిపించాడు. ఆ బాలుడి శరీరంలోనికి ప్రవేశించి చాలాకాలం అతడి ఉదరంలోనే ఉంటూ అతడి పాదపద్మాలనే స్మరించాడు మార్కండేయుడు. తర్వాత బయటకు వచ్చి కౌగిలించుకోబోయాడు. కానీ ఆ బాలుడు అంతర్ధానమైపోయాడు. ఇక మార్కండేయుడు యథాప్రకారంగా తన ఆశ్రమంలో ఉంటూ తపస్సు చేసుకుంటున్నాడు.

ఒకరోజు ఆకాశమార్గంలో పార్వతీపరమేశ్వరులు విహరిస్తూ ఈ మహర్షిని చూసి, ప్రత్యక్షమై కోటి కల్పాల ఆయుర్దాయాన్నీ, నారాయణుడి అనుగ్రహాన్నీ ప్రసాదించారు.

మహర్షులారా! ఈ మార్కండేయుడి వృత్తాంతాన్ని విన్నా, చదివినా, రచించినా మరణం దరిదాపులకు రాదు. హరిభక్తుడు హరినామస్మరణం చెయ్యాలి. ఆ పుణ్యంతో వైకుంఠం లభిస్తుంది' అని చివరిగా శౌనకుడి కోరికపై సూర్యభగవానుడి గురించి చెప్పడం ప్రారంభించాడు సూతమహర్షి.

'సూర్యుడు శ్రీమన్నారాయణుడి స్వరూపం. చైత్రం మొదలైన 12 నెలల్లో వరుసగా ధాత, అర్యముడు, మిత్రుడు, వరుణుడు, ఇంద్రుడు, వివస్వంతుడు, త్వష్ట, విష్ణువు, అర్యముడు, భగుడు, పూషుడు, క్రతువు అనే పేర్లతో లోకాన్ని పరిపాలిస్తాడు.'

## భాగవత మాహాత్మ్యం

'మహర్షులారా! ఈ భాగవత మహాపురాణం శ్రేష్ఠమైనది. దీనిని భక్తితో నిష్ఠతో చదివేవాళ్ళూ, శ్రవణం చేసేవాళ్ళూ, రాసేవాళ్ళూ, ఆయురారోగ్య ఐశ్వర్యాలతో విలసిల్లుతూ ముక్తిని పొందుతారు. ఈ పురాణంలో పద్దెనిమిది వేల శ్లోకాలు ఉ న్నాయి.

నదులలో గంగ, దేవతలలో బ్రహ్మ, నక్షత్రాలలో చంద్రుడు, సముద్రాలలో క్షీరసముద్రంలాగా పురాణాలలో భాగవతం శ్రేష్ఠమైనది. అటువంటి భాగవత పురాణాన్ని చెప్పిన మహనీయుడు శుకయోగీంద్రుడికి నమస్కారం.

శంఖ చక్ర గదా ఖడ్గాది ఆయుధాలను ధరించిన శ్రీమన్నారాయణుణ్ణే నేను నిత్యం స్మరిస్తాను. స్తుతిస్తాను" అంటూ ఆ స్వామికి భక్తితో నమస్కరించాడు సూతమహర్షి,

శౌనకాది మహర్షులు కూడా హరినామస్మరణ చేస్తూ తమ తమ నెలవులకు వెళ్ళిపోయారు.

**శ్రీకృష్ణార్పణమస్తు**

# అనుబంధం

## శ్రీ కృష్ణ శతకము

కం. **శ్రీరుక్మిణీశ! కేశవ!**
**నారదసంగీతలోల! నగధర! శౌరీ!**
**ద్వారకనిలయ! జనార్దన!**
**కారుణ్యముతోడ మమ్ము గావుము కృష్ణా!** 1

తాత్పర్యము : ఓ కృష్ణా! నీవు సంపత్ప్రదయైన రుక్మిణీదేవి భర్తవు. బ్రహ్మ, ఈశానులను గన్నవాడవు. దివ్యర్షియు, మహాభక్తుడైన నారదుని సంకీర్తన గానమందు ఆసక్తి కలవాడవు. గోవర్ధన పర్వతమునెత్తిన వాడవు. శూరుడనువాని వంశమున పుట్టినవాడవు (వసుదేవుని తండ్రి పేరు శూరుడు). ద్వారకా నగరంలో నివసించేవాడవు. జనుడనే రాక్షసుని పీడించినవాడవు. దయతో మమ్ములను రక్షింపుము.

కం. **నీవే తల్లివి తండ్రివి**
**నీవే నాతోడు నీడ నీవే సఖుడౌ**
**నీవే గురుడవు దైవము**
**నీవే నా పతియు గతియు నిజముగ కృష్ణా!** 2

తాత్పర్యము : ఓ కృష్ణా! సత్యముగా నాకు నీవు మాత్రమే తల్లివంటివాడవు. కన్నతండ్రివంటివాడవు. నాకు సహాయపడే సోదరుని వంటి వాడవు. నీడ వలె వెన్నంటి ఉండేవాడవు. నీవు స్నేహితుడవు. నీవు గురుడవు. దైవమును నీవే. నీవు మాత్రమే నాకు ప్రభుడవు. నాకు పొందదగిన వాడవు.

కం. **నారాయణ! పరమేశ్వర!**
**ధారాధరనీలదేహ! దానవవైరీ!**
**క్షీరాబ్ధిశయన! యదుకుల**
**వీరా! ననుఁ గావు కరుణ వెలయగ కృష్ణా!** 3

తాత్పర్యము : ఓ కృష్ణా! ఓ విష్ణుమూర్తీ, శ్రేష్ఠుడవైన ఓ ప్రభూ, మేఘము వంటి నల్లని శరీరం కలవాడా, రాక్షసులకు శత్రువైనవాడా, పాలసముద్రంలో శయనించినవాడా, యాదవ వంశంలో వీరుడైనవాడా! దయ అతిశయించగా నన్ను కాపాడుము.

కం. **హరియను రెండక్షరములు**
**హరియించును పాతకముల నంబుజనాభా!**
**హరి నీ నామమహత్త్వము**
**హరి హరి పొగడంగ వశమె హరి శ్రీకృష్ణా!** 4

తాత్పర్యము : శ్రీ కృష్ణా! హరి అనే రెండక్షరాలు కలిసి, పాపములను హరిస్తాయి. ఓ పద్మనాభా, కృష్ణ కృష్ణా, నీ పేరులోని గొప్పతనాన్ని స్తుతి చేయడం సాధ్యమా, (సాధ్యంకాదని భావం) ఓ విష్ణుమూర్తీ, శ్రీకృష్ణా.

కం. **వేదంబులు గననేరని**
**ఆది పరబ్రహ్మమూర్తి వనఘ మురారీ!**
**నా దిక్కు చూచి కావుము**
**నీ దిక్కే నమ్మినాడ నిజముగ కృష్ణా!** 5

తాత్పర్యము : ఓ కృష్ణా! మురాసురుని సంహరించినవాడా, వేదములకు కూడ అంతుపట్టని, ఈ జగత్తుకు ఆదియైన పరబ్రహ్మవు. నన్ను దయతో చూచి రక్షింపుము. నిజముగ నా దిక్కు నీవే అని నమ్ముకొన్నాను.

కం. **ఓ కారుణ్యపయోనిధి!**
**నా కాధారంబ వగుచు నయముగ బ్రోవన్**
**నాకేల యితరచింతలు**
**నాకాధిపవినుత! లోకనాయక! కృష్ణా!** 6

తాత్పర్యము : శ్రీ కృష్ణా! ఓ దయాసముద్రుడా, స్వర్గానికి అధిపతియైన దేవేంద్రునిచే స్తుతింపబడినవాడా, పదునాల్గు భువనాలకు అధిపతియైన శ్రీకృష్ణా, నీవు నాకు ఆధారంగా ఉండి శ్రద్ధతో కాపాడుతుండగా, ఇతరమైన విచారములు నాకెందుకు? ఇంక నేను దేనిని గూర్చి విచారించే అవసరం లేదని భావం.

కం. **నందుని ముద్దుల పట్టిని**
**మందరగిరిధరుని హరిని మాధవు విష్ణున్**
**సుందరరూపుని మునిగణ**
**వందితు నినుఁ దలతు భక్తవత్సల కృష్ణా!** 7

తాత్పర్యము : శ్రీ కృష్ణా! భక్తులపై వాత్సల్యము గలవాడా! నందుని గారాబు కుమారుడవు. మందర పర్వతాన్ని ధరించినవాడవు. పాపములను హరించువాడవు. లక్ష్మీదేవి భర్తవు. విష్ణుమూర్తివి, అందమైన స్వరూపం గలవాడివి. మునులందరు నీకు నమస్కరిస్తారు. అట్టి నిన్ను నేను తలచుకొంటాను.

కం. **కందర్పకోటి సుందర!**
**మందరధర! భానుతేజ! మంజులదేహా!**
**సుందరవిగ్రహా! మునిగణ**
**వందిత! మిముఁ దలతు భక్తవత్సల! కృష్ణా!** 8

తాత్పర్యము : శ్రీకృష్ణా! నీవు కోటి మన్మథుల సౌందర్యము గలవాడవు. మందర పర్వతాన్ని మోసినవాడవు. సూర్యునివంటి తేజస్సు గలవాడవు. సుందరమైన శరీరం గలవాడవు. అందమైన శరీరం గలవాడవు. మునులు (తపస్సంపన్నులు) నీకు నమస్కరిస్తారు. భక్తుల మీద ప్రేమ కలిగిన నిన్ను నేను తలుస్తాను.

కం. **దండమయా! విశ్వంభర!**
**దండమయా! పుండరీకదళనేత్ర! హరీ!**
**దండమయా! కరుణానిధి!**
**దండమయా! నీకు నెపుడు దండము కృష్ణా!** 9

తాత్పర్యము : శ్రీ కృష్ణా! స్వర్గలోకాలను భరించిన నీకు నమస్కారము. తెల్లని పద్మాలవంటి కన్నులు కలిగిన నీకు నమస్కారము. పాపాలను హరించే నీకు నమస్కారము. దయా సముద్రుడా! నీకు నమస్కారము. నీకు ఎల్లప్పుడు (దివారాత్రాలు) నమస్కారం చేస్తాను.

కం. **నారాయణ! లక్ష్మీపతి!**
**నారాయణ! వాసుదేవ! నందకుమారా!**
**నారాయణ! నిను నమ్మితి**
**నారాయణ! నన్నుఁ బ్రోవు నగధర! కృష్ణా!** 10

తాత్పర్యము : శ్రీ కృష్ణా! శ్రీమన్నారాయణా, లక్ష్మీనాథా, వసుదేవ కుమారా, నందగోపుని పుత్రా! నిన్ను నమ్ముకొన్నాను. నన్ను కాపాడుమయ్యా. (విష్ణుమూర్తిని

అనేక నామాలతో సంబోధించి వేడుకొన్నాడీ భక్తుడు.)

కం. **చుక్కల నెన్నగ వచ్చును**
**గ్రక్కున భూరేణువులను గణుతింప నగున్**
**చొక్కపు నీ గుణజాలము**
**నక్కజమగు లెక్క పెట్ట నజునకు కృష్ణా!** 11

తాత్పర్యము : శ్రీకృష్ణా! ఆకాశంలో కనిపించే అసంఖ్యాకమైన నక్షత్రాలను లెక్కించవచ్చును. భూమిలో ఉండే మట్టి కణాలను లెక్కగట్టవచ్చును. అనగా అసాధ్యమైన పనులు చేయవచ్చును. కాని, ఆశ్చర్యకరమైన నీ గుణగణములను బ్రహ్మకు కూడ లెక్కపెట్ట సాధ్యము కాదు. పరమాత్మ లోకాతీతుడు కదా.

కం. **విశ్వోత్పత్తికి బ్రహ్మవు**
**విశ్వము రక్షింపఁ దలచి విష్ణుడ వనఁగా**
**విశ్వము జెఱుపను హరుడవు**
**విశ్వాత్మక! నీవే యగుచు వెలయుదు కృష్ణా!** 12

తాత్పర్యము : శ్రీకృష్ణా! విశ్వాన్ని (సమస్తలోకాలను) సృష్టి చేసే బ్రహ్మవు నీవు. విశ్వాన్ని కాపాడుతున్న విష్ణుమూర్తివి నీవు. విశ్వాన్ని అంతంచేసి హరించే మహేశ్వరుడవు నీవు. అందుచేత నీవు విశ్వాత్మకుడవై వెలుగొందుచున్నావు. శ్రీకృష్ణుడు త్రిమూర్త్యాత్మకుడని భావం.

కం. **అగణితవైభవ! కేశవ!**
**నగధర! వనమాలి! యాదినారాయణ! యో**
**భగవంతుడ శ్రీమంతుడ**
**జగదీశ్వర! శరణు శరణు శరణము కృష్ణా!** 13

తాత్పర్యము : శ్రీ కృష్ణా! లెక్కింప శక్యముకాని ఐశ్వర్యం కలవాడా, బ్రహ్మమహేశ్వరులను ఇముడ్చుకొన్నవాడా (కేశవా!), కొండను ధరించినవాడా, వైజయంతి అనే వనమాలను ధరించినవాడా, ఆదిపురుషుడైన నారాయణా, ఐశ్వర్యవంతుడా, లోకాధీశ్వరా, నిన్ను శరణువేడుకొంటున్నాను.

కం. **దిక్కెవ్వరు ప్రహ్లాదుకు**
**దిక్కెవ్వరు పాండుసుతుల దీనుల కెపుడున్**
**దిక్కెవ్వ రయ్యహల్యకు**
**దిక్కెవ్వరు? నీవు నాకు దిక్కువు కృష్ణా!** 14

తాత్పర్యము : శ్రీ కృష్ణా! హిరణ్యకశిపుని కుమారుడైన ప్రహ్లాదునికి ఎవరు దిక్కు? పాండురాజు కుమారులైన ధర్మరాజాదులకు దిక్కెవ్వరు? ధనధాన్యములు లేని పేదవారికి ఎవరు దిక్కు? గౌతముని భార్య అహల్యకు ఎవరు దిక్కు? వీరందరికి నీవే దిక్కు కదా. ఇంక నీవు నాకు దిక్కువుకమ్ము – అనగా ఆధారం కావలసినది.

కం. **పురుషోత్తమ! లక్ష్మీపతి!**
**సరసిజగర్భాది మౌనిసన్నుత చరితా!**
**మురభంజన! సురరంజన!**
**వరదుడవగు నాకు భక్తవత్సల! కృష్ణా!** 15

తాత్పర్యము : శ్రీ కృష్ణా! పురుషులందరికంటె శ్రేష్ఠమైనవాడా, లక్ష్మీదేవికి భర్తవైనవాడా, బ్రహ్మచే, మునులచే స్తుతింపబడినవాడా, మురుడనే రాక్షసుణ్ణి సంహరించినవాడా, దేవతలను ఆనందపరచేవాడా, భక్తులపై వాత్సల్యం కలిగినవాడా, (ఇపుడు) నాకు వరములను ప్రసాదించుము.

కం. **గజరాజవరద! కేశవ!**
**త్రిజగత్కల్యాణమూర్తి! దేవ! మురారీ!**
**భుజగేంద్రశయన! మాధవ!**
**విజయాప్తుడ నన్ను గావు వేగమె కృష్ణా!** 16

తాత్పర్యము : శ్రీ కృష్ణా! గజేంద్రునికి వరములను ప్రసాదించినవాడా. (కాపాడినావు). త్రిమూర్తి స్వరూపం గలవాడా (కేశవా!), మూడు లోకాలకు శుభములనొసంగే స్వరూపం గలవాడా, క్రీడించువాడా (దేవా!), మురుడను రాక్షసుని సంహరించినవాడా, ఆదిశేషుని మీద పరున్నవాడా, లక్ష్మీనాథా! అర్జునుని ఆప్తబంధువైనవాడా, శీఘ్రమే నన్ను కాపాడుము!

కం. **హరి! నీవె దిక్కు నాకును**
**సిరితో నేతెంచి మకరి శిక్షించి దయన్**
**పరమేష్ఠి సురలు పొగడగ**
**కరి గాచిన రీతి నన్ను గావుము కృష్ణా!** 17

తాత్పర్యము : శ్రీకృష్ణా! పాపములను హరించేవాడా (హరీ!), నీవే నాకు దిక్కు. ఆనాడు నీవు లక్ష్మీదేవితో వచ్చి మొసలిని శిక్షించి, దయతో ఏనుగును కాపాడినావు కదా, బ్రహ్మ దేవతలు నిన్ను కొనియాడినారు కదా. ఆ విధంగానే నన్ను కాపాడుమా.

కం. **బలమెవ్వడు కరిఁ బ్రోవను**
**బలమెవ్వడు పాండుసుతుల భార్యను గావన్**
**బలమెవ్వడు సుగ్రీవుకు**
**బలమెవ్వడు నాకు నీవె బలమౌ కృష్ణా!** 18

తాత్పర్యము : శ్రీకృష్ణా! ఏనుగుల రాజును కాపాడడానికి శక్తిగా ఉన్నవాడు ఎవరు? పాండవుల భార్య ద్రౌపదీదేవిని రక్షించడంలో శక్తి ఎవరు? వానరరాజు సుగ్రీవునకు (అన్నను జయించడానికి) శక్తి ఎవరు? నాకు శక్తి ప్రసాదించేవారు ఎవరు? నీవే. అన్నింటికి నీవే బలం కదా!

కం. **కుంభీంద్రవరద! కేశవ!**
**జంభాసురవైరి! దివిజసన్నుత చరితా!**
**అంభోజనేత్ర! జలనిధి**
**గంభీరా! నన్ను గావు కరుణను కృష్ణా!** 19

తాత్పర్యము : శ్రీకృష్ణా! గజేంద్రునికి వరమునిచ్చి రక్షించినవాడా, కేశవా, జంభుడనే రాక్షసుని సంహరించినవాడా, దేవతలచేత స్తుతింపబడిన నడవడి గలవాడా, తామరపూవుల వంటి కన్నులు గలవాడా, సముద్రం లాంటి గంభీరమైన హృదయం గలవాడా, నన్ను దయతో రక్షింపుము.

కం. **దుర్వార చక్రధర కర!**
**శర్వాణీ భర్తృ వినుత! జగదాధారా!**
**నిర్వాణనాథ! మాధవ!**
**సర్వాత్మక! నన్నుఁగావు సరగున కృష్ణా!** 20

తాత్పర్యము : శ్రీకృష్ణా! నివారింప శక్యముకాని సుదర్శన చక్రాన్ని ధరించినవాడా, పార్వతీదేవి భర్తయైన మహేశ్వరుని మెప్పు పొందినవాడా, అన్ని లోకాలకు ఆధారమైన వాడా, నీవు మోక్షానికి అధిపతివి. లక్ష్మీదేవికి భర్తవు. సమస్త లోకాలకు ఆత్మవై ముఖ్యమైనవాడవు. వేగంగా (వచ్చి) నన్ను కాపాడుమయ్యా.

కం. **గోపాలకృష్ణ! మురహర!**
**పాపాలను పారదోలు ప్రభుఁడవు నీవే**
**గోపాలమూర్తి! దయతో**
**నా పాలిటఁ గలిగి ప్రోవు నమ్మితి కృష్ణా!** 21

తాత్పర్యము : శ్రీకృష్ణా! గోవులను పరిపాలించే కృష్ణా, మురాసురుని సంహరించినవాడా, లోకంలోని పాపాలను నిర్మూలించే అధికారివి నీవే. పసుల కాపరి ఆకారం కలవాడా! నీవు దయ వహించి, నాకు ఆధారమువై నన్ను రక్షింపుము. నిన్నే నమ్ముకొన్నాను.

కం. **యమునికి నిఁక నే వెఱవను**
**కమలాక్ష! జగన్నివాస! కామితఫలదా!**
**విమలమగు నీదు నామము**
**నమరగఁ దలఁచెదను వేగ ననిశము కృష్ణా!** 22

తాత్పర్యము : శ్రీకృష్ణా! కమలముల వంటి కన్నులు గలవాడా! లోకంలో వ్యాపించి నివసించేవాడా! కోర్కెలను తీర్చేవాడా! మృత్యురూపంలో వచ్చే యమధర్మ రాజుకు ఇంక నేను భయపడను. స్వచ్ఛమైన నీ పేరును, తగినట్లుగా ఎల్లప్పుడు భావిస్తూ ఉంటాను. (భగవన్నామము స్మరించేవారికి మృత్యుభయం ఉండదని భావం)

కం. **సర్వేశ్వర! చక్రాయుధ!**
**శర్వాణీవినుతనామ! జగదభిరామా!**
**నిర్వాణనాథ! మాధవ!**
**సర్వాత్మక! నన్ను గావు సదయత కృష్ణా!** 23

తాత్పర్యము : శ్రీకృష్ణా! సర్వలోకాధీశ్వరా, చక్రాయుధాన్ని ధరించినవాడా, పార్వతీదేవి స్తుతించిన నామం గలవాడా, లోకంలో సుందర స్వరూపం గలిగినవాడా, మోక్షానికి కర్తవైనవాడా, లక్ష్మీనాథా, అన్ని ఆత్మలు నీవే కదా, నన్ను దయతో కాపాడుమా!

కం. **శ్రీధర! మాధవ! అచ్యుత**
**భూధర! పురుహూతవినుత! పురుషోత్తమ! నీ**
**పాదయుగళంబు నెప్పుడు**
**మోదముతో నమ్మినాడ ముద్దులకృష్ణా!** 24

తాత్పర్యము : శ్రీకృష్ణా! నా ముద్దులకృష్ణా! లక్ష్మీదేవికి భర్త అయినవాడవు. నాశము లేనివాడవు. భూదేవిని భరించిన ఆమె భర్తవు. ఇంద్రుని చేత స్తుతింపబడినవాడవు. అన్ని లోకాల పురుషుల్లో ఉన్నతుడవు. నీ పాదాలనే సంతోషంతో నమ్ముకొన్నాను.

కం. **ఎటువలె కరిమొఱ వింటివి**
**ఎటువలె ప్రహ్లాదు కభయమిచ్చితి కరుణన్**
**అటువలె నను రక్షింపుము**
**కటకట నిను నమ్మినాడఁ గావుము కృష్ణా!** 25

తాత్పర్యము : శ్రీకృష్ణా! ఏ విధంగా గజేంద్రుని దీనాలాపాలను విన్నావో, ఏ విధంగా ప్రహ్లాదునికి భయం లేకుండా, దయతో ప్రవర్తించినావో అయ్యయ్యో నన్ను కూడ ఆ విధంగానే కాపాడుమయ్యా నిన్ను నేను (వారివలెనే) నమ్ముకొన్నాను.

## సుమతి శతకము

కం. **శ్రీరాముని దయచేతను**
**నారూఢిగ సకలజనులు నౌరా యనగా**
**ధారాళమైన నీతులు**
**నోరూరఁగఁ జవులు పుట్ట నుడివెద సుమతీ.** 1

తాత్పర్యము : సుమతీ! కొన్ని అడ్డుపాటులేని నీతులు చెపుతాను. విను. అవి నేను చెపుతున్నానంటే, అందుకు నాయిష్టదైవమైన శ్రీరాముని అనుగ్రహమే కారణం. నా పాండిత్యాదులు కాదు. అవి సకలదేశాలలోనూ రానున్న కాలంలోనూ బహుప్రసిద్ధము లవుతాయి. అవి తగనివని ఎవరూ అడ్డుచెప్పలేని ఉత్తమమైనవి. ఒకటి వింటే మరొకటి వినాలనిపించేటట్టు ఉంటాయి. అవి "ఎంతచక్కగా ఉన్నాయి. ఎంత ఉపయోగకరమైనవి, చెప్పిన తీరు ఎంత బాగున్నది" అని వినినవారు ఆశ్చర్యపోతారు.

కం. **అప్పిచ్చువాఁడు, వైద్యుఁడు,**
**నెప్పుడు నెడతెగక పాఱు నేఱును, ద్విజుఁడున్**
**జొప్పడిన యూర నుండుము**
**చొప్పడకున్నట్టి యూరు సొరకుము సుమతీ.** 2

తాత్పర్యము : సుమతీ! అవసరమైనపుడు అప్పిచ్చేవాడు, జబ్బుచేయకుండా చూచి, జబ్బుచేసినపుడు చికిత్స చేసేవాడు, త్రాగటానికి నీటినిచ్చే జీవనది, వివాహాది సంస్కారాలు చేయించే బ్రాహ్మణుడు, వీరు లభించే ఊళ్ళో నివసించాలి. వీరు దొరకని ఊళ్ళో ప్రవేశించవద్దు.

కం. **ఉడుముండదె నూఱేండ్లును**
**బడియుండదె పేర్మిఁ బాము పదినూఱేండ్లున్**
**మడువునఁ గొక్కెర యుండదె**
**కడు నిలఁ బురుషార్థపరుఁడు కావలె సుమతీ.** 3

తాత్పర్యము : సుమతీ! ఈ లోకంలో జన్మించిన తరువాత మనిషి పురుషార్థాలైన ధర్మార్థకామమోక్షాలు సాధించటానికి బాగా ప్రయత్నించాలి. అలా ప్రయత్నించనివాని

బ్రతుకు నిరర్థకం. ఉడుము నూరేళ్ళూ, పాము వెయ్యేళ్ళూ, చెరువులో కొంగ చాలా కాలమూ, బ్రతుకుతున్నాయి. కాని ఆ బ్రతుకువల్ల ఏమి ప్రయోజనం? పురుషార్థసాధకుడు కానివాని బ్రతుకూ వాటి బ్రతుకువంటిదే అవుతుంది.

కం. **ఎప్పుడు తప్పులు వెదకెడు**
**నప్పురుషునిఁ గొల్వఁ గూడ దది యెట్లన్నన్**
**సర్పంబు పడగనీడను**
**గప్ప వసించినవిధంబు గదరా సుమతీ.** 4

తాత్పర్యము : సుమతీ! తనను సేవించే వారిలో ఏ తప్పు దొరకుతుందా అని ఎల్లప్పుడూ అన్వేషిస్తూ ఉండే మానవుని సేవించగూడదు. అట్టి వానిని సేవించటం పాముపడగనీడలో కప్ప నివాసం ఉండటం వంటిది కదయ్యా.

కం. **కనకపు సింహాసనమున**
**శునకముఁ గూర్చుండఁ బెట్టి శుభలగ్నమునం**
**దొనరఁగఁ బట్టము గట్టిన**
**వెనుకటి గుణమేల మాను వినురా సుమతీ.** 5

తాత్పర్యము : సుమతీ! ఒక మంచి ముహూర్తంలో ఒక కుక్కను తీసుకొని పోయి, ఒక సింహాసనం మీద కూర్చుండబెట్టి, రాజుగా చేయవచ్చును. కాని అది దాని స్వభావలక్షణమైన పిచ్చిపనులు మానుకోలేదు. ఈ నీతి శ్రద్ధతో వినవయ్యా, ఏమి చేసినప్పటికిని నీచుని నీచబుద్ధి పోదు.

కం. **కప్పకు నొరగాలైనను,**
**సర్పమునకు రోగమైన, సతి తులువైనన్**
**ముప్పున దరిద్రుఁడైనను**
**తప్పదు మఱి దుఃఖమగుట తథ్యము సుమతీ.** 6

తాత్పర్యము : సుమతీ! కప్పకాలు కుంటిదైనా, పాముకు జబ్బు చేసినా, భార్య తుంటరి అయినా, ముసలితనంలో పేదరికం వచ్చినా, దుఃఖం కలుగక మానదు. ఇది ఖాయం.

కం. **కమలములు నీటఁబాసినఁ**
**గమలాప్తునిరశ్మి సోఁకి కమలినభంగిన్**
**దమ తమ నెలవులు దప్పినఁ**
**దమమిత్రులు శత్రులగుట తథ్యము సుమతీ.** 7

తాత్పర్యము : సుమతీ! పద్మాలు నీటిలో పుట్టి నీటిలో పెరిగాయి. నీళ్ళు వాటి నివాసం. నీటినుంచి బయటపడితే కమలాలకు ఆప్తుడు అని పేరందిన సూర్యునికాంతి (ఎండ) తగిలేసరికి అవి కాస్తా కంది వాడిపోతాయి. అలాగే సొంతచోట్లు విడిచిపెట్టినవారికి వారి మిత్రులే శత్రువులవుతారు.

కం. **కులకాంతతోడ నెప్పుడుఁ**
**గలహింపకు వట్టి తప్పు ఘటియింపకుమీ**
**కలకంఠకంఠి కన్నీ**
**రొలికిన సిరి యింటనుండ నొల్లదు సుమతీ.** 8

తాత్పర్యము : సుమతీ! భార్యతో ఏనాడూ జగడమాడవద్దు. ఆమెలో లేని దోషం ఉన్నదని ఎన్నడూ ఆరోపించవద్దు. ఏ యింటిలో స్త్రీ దుఃఖంతో కన్నీరు కార్చవలసి వస్తుందో, ఆ యింటిలో సంపద ఉండదు.

కం. **కూరిమి గల దినములలో**
**నేరము లెన్నఁడును గలుగనేరవు మఱి యా**
**కూరిమి విరసంబైనను**
**నేరములే తోఁచుచుండు నిక్కము సుమతీ.** 9

తాత్పర్యము : సుమతీ! ఇరువురి మధ్య స్నేహం, ప్రేమ కల రోజులలో, ఒకరికి మరొకరిలో అపరాధాలేమీ కనిపించవు, కాని, ఆ స్నేహం, ప్రేమ ఏ కారణంవల్లనైనా ద్వేషంగా మారితే మాత్రం, వారిలో అపరాధాలు మాత్రమే కనిపిస్తూ ఉంటాయి. ఇది నిజం.

కం. **చేతులకుఁ దొడవు దానము**
**భూతలనాథులకుఁ దొడవు బొంకమి ధరలో**
**నీతియ తొడ వెవ్వారికి**
**నాతికి మానంబు తొడవు నయముగ సుమతీ.** 10

తాత్పర్యము : సుమతీ! భూలోకంలో దానం చేయటం చేతులకు అలంకారం, అబద్ధమాడక పోవటం పరిపాలకులకు అలంకారం, నీతి ఎవరికైనా అలంకారం. స్త్రీకి గౌరవం అలంకారం.

కం. **తన కోపమె తన శత్రువు**
**తన శాంతమె తనకు రక్ష దయ చుట్టంబౌఁ**
**దన సంతోషమె స్వర్గము**
**తన దుఃఖమె నరకమండ్రు తథ్యము సుమతీ.** 11

తాత్పర్యము : సుమతీ! తనకు కల కోపమే తనకు అపకారం చేసే శత్రువు. తనకున్న శాంతగుణమే తనకు రక్షణ మిస్తుంది. ఇతరుల కష్టాలను పోగొట్టటానికి తాను చేసే పనియే తన బంధువు. తనకు కల తృప్తియే సుఖం కలిగించే చోటు. తనకు కల బాధయే దుఃఖం కలిగించే చోటు అని జ్ఞానులు చెపుతుంటారు.

కం. **తన కలిమి యింద్రభోగము**
**తన లేమియె సర్వలోకదారిద్ర్యంబున్**
**తన చావు జగత్ప్రళయము**
**తన వలచినయదియె రంభ తథ్యము సుమతీ.** 12

తాత్పర్యము : సుమతీ! కొందరిదృష్టిలో, తమ సంపద ఇంద్రుని ఐశ్వర్యంతో సమానం. తమకు దారిద్ర్యం వస్తే, సకలలోకాలకూ దారిద్ర్యం వచ్చినట్లే. తమకు మరణం సంభవిస్తే సకల లోకాలూ నాశనం చెందినట్లే. తమకు ఎవతెమీద మోజు కలిగితే ఆమె మాత్రమే, అందరికంటే అందగత్తె అనిపిస్తుంటుంది. ఇది నిజం.

కం. **తలనుండు విషము ఫణికిని**
**వెలయంగాఁ దోఁకనుండు వృశ్చికమునకున్**
**తల తోక యనక యుండును**
**ఖలునకు నిలువెల్ల విషము గదరా సుమతీ.** 13

తాత్పర్యము : సుమతీ! విషం పాముకి శిరస్సులోని నోట్లో మాత్రమే ఉంటుంది. తేలుకి తోకచివర మాత్రమే ఉంటుంది. దుష్టునికి నోట్లోనూ, తోకచివరా మాత్రమే అనే హద్దు లేకుండా శరీరం అంతటా విషం ఉంటుంది.

కం. **ధనపతి సఖుఁడై యుండియు**
**నెనయంగా శివుఁడు-భిక్షమెత్తగ వలసెన్**
**దనవారి కెంత గలిగినఁ**
**దన భాగ్యమె తనకుఁగాక తథ్యము సుమతీ.** 14

తాత్పర్యము : సుమతీ! కుబేరుడు సృష్టిలోని ధనానికి అంతటికీ అధికారి. అతడు శివుని స్నేహితుడు. అయినప్పటికీ శివుడు బిచ్చమెత్తుకుంటున్నాడు. దీనినిబట్టి తనకు సంబంధించినవారికి ఎంత ఐశ్వర్యము ఉన్నప్పటికీ, తన అదృష్టాన్నిబట్టి మాత్రమే తనకు లభిస్తుంది అని తెలుస్తుంది. ఇది సత్యం.

కం. **నీరే ప్రాణాధారము**
**నోరే రసభరితమైన నుడువులకెల్లన్**
**నారియె నరులకు రత్నము**
**చీరయె శృంగారమండ్రు సిద్ధము సుమతీ.** 15

తాత్పర్యము : సుమతీ! నరుల ప్రాణాలకు ఆధారం జలమే. రసవంతములైన మాటలకన్నింటికీ ఆధారం నోరే. నరులలో శ్రేష్ఠమైనది స్త్రీయే. అలంకారాదులలో శ్రేష్ఠమైనది వస్త్రమే ఇది శాస్త్రజ్ఞానం వల్లనూ అనుభవం వల్లనూ తేలిన విషయం.

కం. **పతి కడకుఁ, దన్నుఁ గూర్చిన**
**సతి కడకును, వేల్పు కడకు, సద్గురు కడకున్**
**సుతుకడకు, రిత్తచేతుల**
**మతిమంతులు చనరు నీతిమార్గము సుమతీ.** 16

తాత్పర్యము : సుమతీ! బుద్ధిమంతులైనవారు రాజునూ, భార్యనూ, దేవునీ, ఉపాధ్యాయునీ, కుమారునీ, వట్టిచేతులతో సమీపించరు.

కం. **పరనారీసోదరుఁడై**
**పరధనముల కాసపడక పరులకు హితుఁడై**
**పరులు దనుఁ బొగడ నెగడియుఁ**
**బరుల లిగిన నలుగ నతఁడు పరముఁడు సుమతీ.** 17

తాత్పర్యము : సుమతీ! మనుష్యుడు, తన భార్య కాక ఇతరకాంతలందరూ తన సోదరీమణులని భావించాలి. ఇతరుల ద్రవ్యాలు తనకు కావాలని ఆశించగూడదు. ఇతరులు తనను మిత్రుడనుకొనేటట్లుగా మెలగుతూ ఉండాలి. తనను ఇతరులు ప్రశంసించేటట్లుగా ప్రవర్తిస్తూ ఉండాలి. తనమీద ఇతరులు కోపపడినా, తాను వారిమీద కోపపడకుండా ఉండాలి. ఇట్టివాడు అందరికంటె గొప్పవాడు.

కం. **పరసతుల గోష్ఠినుండిన**
**పురుషుఁడు గాంగేయుఁడైన భువి నిందపడున్**
**బరసతి సుశీల యైనను**
**బరు సంగతినున్న నిందపాలగు సుమతీ.** 18

తాత్పర్యము : సుమతీ! అన్యకాంతలతో మాటాడుతూ ఉంటే, ఆ మాటాడే మగవాడు, ఆజన్మ బ్రహ్మచారి అయిన భీష్ముడైనప్పటికీ, పరకాంతాసక్తుడనే అపనింద వచ్చి పడుతుంది. అలాగే, పరపురుషునితో స్నేహం మాత్రమే చేసే వనిత అయినా, మంచి ప్రవర్తన కలది అయినప్పటికీ, పరపురుషుని మరగింది అనే నిందకు గురి అవుతుంది.

కం. **పాలసునకైన యాపద**
**జాలింబడి తీర్పఁ దగదు సర్వజ్ఞునకున్**
**దేలగ్నిఁ బడఁగ బట్టిన**
**మేలెఱుఁగునె మీటుఁగాక మేదిని సుమతీ.** 19

తాత్పర్యము : సుమతీ! దుర్జనుడు ఏదైనా కష్టంలో చిక్కుకొన్నపుడు, అన్నీ తెలిసినవాడు జాలిపడి, ఆ కష్టం తప్పించటానికి ప్రయత్నించగూడదు. తేలు నిప్పులలో పడినపుడు, జాలిపడి, చేతితో పైకి తీద్దామని పట్టుకొంటే, అది కుడుతుంది కాని, ఇతడు ఉపకారం చేసినవాడు కనుక కుట్టకూడదని మానదు.

కం. **పుత్రోత్సాహము తండ్రికిఁ**
**బుత్రుండు జన్మించినపుడె పుట్టదు; జనులా**
**పుత్రునిఁ గనుఁగొని పొగడఁగఁ**
**బుత్రోత్సాహంబు నాఁడు పొందుర సుమతీ.** 20

తాత్పర్యము : సుమతీ! తండ్రికి కుమారుడు పుట్టినవెంటనే కుమారునివల్ల కలుగవలసిన సంతోషం కలుగదు. ప్రజలు ఆ కుమారుని చూచి ప్రశంసించిననాడు, అతడు పుత్రోత్సాహం పొందుతాడు.

కం. **పెట్టినదినముల లోపల**
**నట్టడవులకైన వచ్చు నానార్థములున్**
**పెట్టనిదినములఁ గనకపు**
**గట్టెక్కిన నేమి లేదు గదరా సుమతీ.** 21

తాత్పర్యము : సుమతీ! పూర్వ జన్మలో దానాలు చేసి, ఆ ఫలితం అంది వచ్చే రోజులలో, ఆ మనిషి అరణ్యమధ్యభాగాలలో ఉన్నప్పటికీ అక్కడ అతనికి సమస్త ద్రవ్యాలూ లభిస్తాయి. అలా దానం చేయని రోజులలో బంగారు కొండమీద ఉన్నప్పటికీ అనుభవించ దగినదేదీ లభించదుగదా! కనుక ఉన్నంతలో దానం చేసుకోవాలి.

కం. **బలవంతుఁడ నాకేమని**
**పలువురతో నిగ్రహించి పలుకుట మేలా**
**బలవంతమైన సర్పము**
**చలిచీమలచేతఁ జిక్కి చావదె సుమతీ.** 22

తాత్పర్యము : సుమతీ! తనకు శక్తి ఉన్నది కనుక, తననెవ్వరూ ఏమీ చేయలేరని ఎక్కువమందిని తీసిపారవేసి మాటాడినందువల్ల మంచి కలుగదు. ఎంతో బలం

కల పాము, అత్యల్పశక్తికల చిన్ని నల్ల చీమలకు దొరికిపోయి, ప్రాణాలు కోల్పోతున్నది.

కం. **మాటకుఁ బ్రాణము సత్యము**
**కోటకుఁ బ్రాణంబు సుభటకోటి ధరిత్రిన్**
**బోటికిఁ బ్రాణము మానము**
**చీటికిఁ బ్రాణంబు వ్రాలు సిద్ధము సుమతీ.** 23

తాత్పర్యము : సుమతీ! మాటకు నిజం ప్రాణం వంటిది. కోటకు కాలిబంట్లు ప్రాణంవంటి వారు, మహిళకు గౌరవం ప్రాణం వంటిది. పత్రానికి సంతకం ప్రాణం వంటిది. వీటికీ ప్రాధాన్యం ఎవరో తెచ్చిపెట్టినదో, కల్పించినదో కాదు, వాస్తవమైనది.

కం. **సిరి దా వచ్చిన వచ్చును**
**సరసంబుగ నారికేళ సలిలము భంగిన్**
**సిరిదాఁ బోయినఁ బోవును**
**కరి మ్రింగిన వెలగపండు కరణిని సుమతీ.** 24

తాత్పర్యము : సుమతీ! సంపద రాదలచినపుడు కొబ్బరికాయలోనికి రుచి కల నీరు వచ్చినట్లు తనంతతానే ఎలా వచ్చిందో తెలియకుండా ఆనందంతో వస్తుంది. వెళ్లిపోయేటప్పుడు వెలగపండులోనికి వెళ్ళినట్లు తెలియకుండా ప్రవేశించి, గుజ్జును కరి అనే పురుగు తినివేస్తే గుజ్జుపోయినట్లు తనంత తానుగా వెళ్ళిపోతుంది. కనుక సంపద విషయంలో గర్వపడతగదు.

కం. **వినదగు నెవ్వరు చెప్పిన**
**వినినంతన వేగపడక వివరింపఁదగున్**
**గని కల్ల నిజము తెలిసిన**
**మనుజుఁడె పో నీతిపరుఁడు మహిలో సుమతీ.** 25

తాత్పర్యము : సుమతీ! ఎవరు ఏమి చెప్పినా ఆలకించవచ్చు. కాని ఆలకించిన వెంటనే తొందరపడి ఒక నిర్ధారణకు రాగూడదు. బాగా ఆలోచించి, ఆ చెప్పినది అసత్యమో, సత్యమో, తెలుసుకొన్నవాడే నిజంగా నీతి తెలిసిన వాడు.